ఈనాడు

విజయవాడ 22-7-2025 మంగళవారం సిటీ సంపుటి 51 . సంచిక 343

THE LARGEST CIRCULATED TELUGU DAILY

రూ. 6-50 పేజీలు 14

www.eenadu.net

Vijayawada, Visakhapatnam, Hyderabad, Tirupati, Ananthapuramu, Karimnagar, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam, Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru

ఛాంపియన్



బుమ్రా

బుమ్రా.. ఆడక తప్పదు

మాంచెస్టర్

ఫిట్‌నెస్ ఇబ్బందులున్న నేపథ్యంలో ఇంగ్లాండ్‌తో అయిదు టెస్టుల సిరీస్‌లో పేస్‌బౌలర్ జస్‌ప్రీత్ బుమ్రా మూడు మ్యాచ్‌లు మాత్రమే ఆడతాడని సిరీస్ ఆరంభానికి ముందే ప్రకటించింది జట్టు యాజమాన్యం. తొలి టెస్టు ఆడాక, రెండో మ్యాచ్‌కు విశ్రాంతి తీసుకున్న అతను.. మూడో మ్యాచ్‌లో ఆడాడు. లెక్క ప్రకారం చూస్తే నాలుగో టెస్టుకు దూరంగా ఉండి, చివరి మ్యాచ్‌లో ఆడాలి. కానీ జట్టు అవసరాల దృష్ట్యా అతను నాలుగో టెస్టులో ఆడక తప్పని పరిస్థితి తలెత్తింది. 3, 4 టెస్టుల మధ్య 9 రోజుల విరామం కూడా రావడంతో బుమ్రా మాంచెస్టర్‌లో బుధవారం మొదలయ్యే ఈ మ్యాచ్‌లో బరిలోకి దిగేందుకు సిద్ధమయ్యాడు. బుమ్రా ఆడనున్న విషయాన్ని సహచర పేసర్ మహ్మద్ సిరాజ్ ధ్రువీకరించాడు కూడా. "నాకు తెలిసినంత వరకు బుమ్రా ఈ మ్యాచ్‌లో ఆడతాడు. కూర్పు రోజు రోజుకూ మారిపోతోంది" అని సోమవారం సిరాజ్ తెలిపాడు. బుమ్రాకు విశ్రాంతినిచ్చే పరిస్థితిలో టీమ్‌ఇండియా ప్రస్తుతం లేదు. గత రెండు మ్యాచ్‌ల్లో ఆడిన ఆకాశ్ దీప్ గజ్జల్లో గాయంతో బాధ పడుతున్నాడు. అతడి ఫిట్‌నెస్‌పై అనిశ్చితి నెలకొంది. నాలుగో టెస్టులో ఆడడం అనుమానమే. సిరీస్‌లో తొలి అవకాశం కోసం చూస్తున్న అర్ష్‌దీప్ ప్రాక్టీస్ సందర్భంగా గాయపడి ఈ మ్యాచ్‌కు అందుబాటులో లేకుండా పోయాడు. పేస్ ఆల్‌రౌండర్ నితీశ్ కుమార్ రెడ్డి గాయంతో మొత్తం పర్యటనకే దూరమయ్యాడు. తొలి టెస్టులో ప్రదర్శన చూశాక శార్దూల్‌ను తిరిగి తుది జట్టులోకి తీసుకునే సాహసం భారత్ చేయకపోవచ్చు. మరోవైపు ప్రసిద్ధ్ కృష్ణ తొలి రెండు టెస్టుల్లో సాధారణ ప్రదర్శనతో తర్వాతి మ్యాచ్‌కు చోటు కోల్పోయాడు. ఆకాశ్‌దీప్, అర్ష్‌దీప్, నితీశ్ గాయాల నేపథ్యంలో అన్షుల్ కాంబోజ్‌ను అత్యవసరంగా ఇంగ్లాండ్‌కు రప్పించారు. కానీ అంతర్జాతీయ అనుభవం లేని కాంబోజ్‌ను ఇంత కీలకమైన సిరీస్‌లో నేరుగా తుది జట్టులో ఆడిస్తారా అన్నది సందేహం. ఇలా బౌలింగ్ విభాగం విషయంలో ఎటు చూసినా సమస్యలే కనిపిస్తున్నాయి. ఫామ్, ఫిట్‌నెస్ పరంగా ప్రస్తుతం మెరుగైన స్థితిలో ఉన్నది ఒక్క సిరాజ్ మాత్రమే. ఈ పరిస్థితుల్లో బుమ్రాను నాలుగో టెస్టుకు పక్కన పెట్టలేని స్థితి. అందుకే అతణ్ని ఆడించక తప్పని స్థితిలో ఉంది భారత్. ఇక ఈ మ్యాచ్‌కు బుమ్రా, సిరాజ్‌లకు తోడుగా పేస్ విభాగంలో ఎవరుంటారన్నది ప్రశ్నార్థకంగా ఉంది. ప్రసిద్ధ్, కాంబోజ్, శార్దూల్ నుంచి ఎవరిని ఎంచుకుంటారో చూడాలి. పిచ్ పేస్‌కు ఎక్కువ అనుకూలం అంటే.. స్పిన్ ఆల్‌రౌండర్ సుందర్‌ను పక్కన పెట్టి అదనపు పేసర్‌ను ఎంచుకోవడం మంచిదనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. మరోవైపు తొలి మూడు మ్యాచ్‌ల్లో ఆడినా ఆశించిన స్థాయిలో రాణించలేకపోయిన కరుణ్ నాయర్ స్థానంలో సుదర్శన్‌ను ఆడించాలన్న డిమాండ్లు వినిపిస్తున్నాయి. మరి జట్టు యాజమాన్యం ఏం చేస్తుందో? ఇంగ్లాండ్ ఎప్పట్లాగే మ్యాచ్‌కు రెండు రోజుల ముందే తుది జట్టును ప్రకటించగా.. భారత్‌కు ఈ విషయంలో తలనొప్పి తప్పేలా లేదు.



అర్ష్‌దీప్

నాలుగో టెస్టుకు అర్ష్‌దీప్ దూరం

● నితీశ్ ఇంటికి

మాంచెస్టర్: ఇంగ్లాండ్‌తో టెస్టు సిరీస్‌ను సమం చేయాలనే పట్టుదలతో ఉన్న టీమ్‌ఇండియాకు గాయాలు పెద్ద సమస్యగా మారాయి. ఆల్‌రౌండర్ నితీశ్ కుమార్‌రెడ్డి మోకాలి గాయం కారణంగా మిగతా రెండు టెస్టులకు దూరమయ్యాడు. పేస్‌బౌలర్ అర్ష్‌దీప్ సింగ్‌ మాంచెస్టర్ టెస్టుకు సెలక్షన్‌కు అందుబాటులో ఉండడని బీసీసీఐ సోమవారం ఓ ప్రకటనలో తెలిపింది. నితీశ్ ఆదివారం జిమ్‌లో గాయపడ్డాడు. "మోకాలి గాయం కారణంగా సిరీస్‌లో మిగతా రెండు టెస్టులకు నితీశ్ దూరమయ్యాడు. అతను ఇంటికి వెళ్లిపోతాడు. నితీశ్ త్వరగా కోలుకోవాలని జట్టు కోరుకుంటోంది" అని బోర్డు చెప్పింది. సిరీస్‌లో ఇప్పటివరకు ఒక్క మ్యాచ్ కూడా ఆడని అర్ష్‌దీప్.. గత వారం నెట్ సెషన్లో బౌలింగ్ చేస్తుండగా గాయపడ్డాడు. అతడి ఎడమ బొటనవేలి గాయం ఇంకా తగ్గలేదు. "బీసీసీఐ వైద్య బృందం అతడి పురోగతిని పర్యవేక్షిస్తోంది" అని బీసీసీఐ చెప్పింది. ఆకాశ్‌దీప్ కూడా గాయంతో ఇబ్బంది పడుతుండడంతో ముందు జాగ్రత్త చర్యగా సెలక్టర్లు ఎంపిక చేసిన పేస్‌బౌలర్ అన్షుల్ కాంబోజ్ ఇప్పటికే జట్టుతో చేరిపోయాడు. మూడో టెస్టు సందర్భంగా వైస్ కెప్టెన్ రిషభ్ పంత్ బొటన వేలికి గాయమైన సంగతి తెలిసిందే. గాయం నుంచి కోలుకుంటున్న పంత్ కేవలం స్పెషలిస్ట్ బ్యాటర్‌గా ఆడితే ధ్రువ్ జురెల్ వికెట్ కీపర్‌గా విధులు నిర్వర్తిస్తాడు. నాలుగో టెస్టు బుధవారం మొదలవుతుంది. సిరీస్‌లో ఇంగ్లాండ్ 2-1తో ఆధిక్యంలో ఉన్న సంగతి తెలిసిందే. ఇంగ్లాండ్ తొలి, మూడో టెస్టుల్లో నెగ్గగా.. టీమ్‌ఇండియా రెండో టెస్టులో గెలిచింది.



దివ్య

సెమీస్‌లో దివ్య

మహిళల చెస్ ప్రపంచకప్

బటుమి (జార్జియా): ఫిడే మహిళల చెస్ ప్రపంచకప్‌లో భారత ఇంటర్నేషనల్ మాస్టర్ దివ్య దేశ్‌ముఖ్ సెమీఫైనల్‌కు దూసుకెళ్లింది. సోమవారం క్వార్టర్‌ఫైనల్ ర్యాపిడ్ టైబ్రేక్‌లో ఆమె 2-0తో గ్రాండ్‌మాస్టర్ ద్రోణవల్లి హారికపై పైచేయి సాధించింది. ఈ ఇద్దరు క్రీడాకారిణుల మధ్య రెండు క్లాసికల్ గేమ్స్ డ్రాగా ముగియడంతో టైబ్రేక్స్ తప్పలేదు. తొలి టైబ్రేక్ ఎండ్ గేమ్‌లో హారిక తప్పు చేయగా.. అవకాశాన్ని దివ్య అందిపుచ్చుకుంది. రెండో గేమ్‌లో గెలవడానికి అవకాశాలు లభించినా హారిక ఉపయోగించుకోలేకపోయింది. కోనేరు హంపి తర్వాత మహిళల ప్రపంచకప్‌లో సెమీస్ చేరిన భారత రెండో క్రీడాకారిణిగా దివ్య ఘనత సాధించింది. విజయం అనంతరం ఆమె తీవ్ర భావోద్వేగానికి గురైంది. భారత్, చైనా మధ్య సెమీఫైనల్ సమరాలు జరగనున్నాయి. లీ టింజీతో హంపి, తాన్ జోంగ్యీతో దివ్య తలపడతారు. ఈ టోర్నీలో టాప్-3లో నిలిచిన వారు క్యాండిడేట్స్ టోర్నమెంట్‌కు అర్హత సాధిస్తారు. కనీసం ఒక భారత క్రీడాకారిణికి ఆ టోర్నీలో చోటు దక్కడం ఖాయమైంది.

భారత్‌లో చెస్ ప్రపంచకప్

దిల్లీ: చెస్ ప్రపంచకప్‌నకు భారత్ ఆతిథ్యమివ్వనుంది. ఈ టోర్నమెంట్ అక్టోబరు 30 నుంచి నవంబరు 27 వరకు భారత్‌లో జరుగుతుందని అంతర్జాతీయ చెస్ సమాఖ్య సోమవారం ప్రకటించింది. ఈ టోర్నీలో మొత్తం 206 మంది ప్లేయర్లు పోటీపడతారు. నాకౌట్ ఫార్మాట్లో టోర్నీ జరుగుతుంది. "ప్రతి రౌండ్ మూడు రోజులు ఉంటుంది. తొలి రెండు రోజుల్లో రెండు క్లాసికల్ గేమ్స్ జరుగుతాయి. అవసరమైతే మూడో రోజు టైబ్రేక్స్ నిర్వహిస్తారు" అని ఫిడే తెలిపింది. టాప్-50 క్రీడాకారులకు తొలి రౌండ్లో బై లభిస్తుంది. ఈ ప్రపంచకప్‌లో టాప్-3లో నిలిచిన వాళ్లకు క్యాండిడేట్స్ టోర్నీకి నేరుగా అర్హత లభిస్తుంది. ప్రపంచ ఛాంపియన్ గుకేశ్, ప్రజ్ఞానంద, అర్జున్ వంటి భారత స్టార్లు చెస్ ప్రపంచకప్‌లో పోటీపడనున్నారు. భారత్ చివరిసారి 2002లో చెస్ ప్రపంచకప్‌నకు ఆతిథ్యమిచ్చింది. అప్పుడు టోర్నమెంట్ హైదరాబాద్‌లో జరగగా.. విశ్వనాథన్ ఆనంద్ టైటిల్ గెలుచుకున్నాడు.

సాత్విక్ జోడీ సత్తాచాటేనా

చైనా ఓపెన్ నేటి నుంచే



చిరాగ్, సాత్విక్


చాంగ్‌జౌ: చైనా ఓపెన్ ప్రపంచ టూర్ సూపర్ 1000 టోర్నీలో భారత స్టార్ డబుల్స్ జోడీ సాత్విక్ సాయిరాజ్- చిరాగ్‌శెట్టి తన అదృష్టం పరీక్షించుకోనుంది. ప్రపంచ ఛాంపియన్‌షిప్‌కు ముందు ఇదే చివరి ప్రధాన టోర్నీ కావడంతో చైనా ఓపెన్‌లో సత్తాచాటాలని సాత్విక్- చిరాగ్ జోడీ భావిస్తోంది. మంగళవారం ప్రారంభమయ్యే ఈ టోర్నీలో పురుషుల డబుల్స్ తొలి రౌండ్లో కెన్యా మిత్సుహాషి- హిరోకి ఒకమురా (జపాన్) జంటతో సాత్విక్- చిరాగ్ జోడీ తలపడనుంది. పురుషుల సింగిల్స్‌లో షై ఫెంగ్ (చైనా)తో లక్ష్యసేన్, కొకి వతనబె (జపాన్)తో హెచ్.ఎస్.ప్రణయ్.. తొమొక మియజాకి (జపాన్)తో పి.వి.సింధు, క్రిస్టీ గిల్మోర్ (స్కాట్లాండ్)తో ఉన్నతి హుడా, లిన్ సియాంగ్ (చైనీస్ తైపీ)తో అనుపమ ఉపాధ్యాయ తమ పోరాటాన్ని ప్రారంభించనున్నారు. మహిళల డబుల్స్‌లో కవిప్రియ సెల్వం- సిమ్రన్ సింఘి, అమృత- సోనాలి, రుతుపర్ణ- శ్వేతపర్ణ.. మిక్స్‌డ్ డబుల్స్‌లో రోహన్ కపూర్- గద్దె రుత్విక శివాని, అశిత్ సూర్య- అమృత జోడీలు బరిలో దిగనున్నాయి.

భారత్ నిష్క్రమణ

సోలో (ఇండోనేసియా): ఆసియా జూనియర్ మిక్స్‌డ్ టీమ్ బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్ నుంచి భారత్ నిష్క్రమించింది. సోమవారం జరిగిన క్వార్టర్‌ఫైనల్లో భారత్ 104-110తో మాజీ ఛాంపియన్స్ జపాన్ చేతిలో పరాజయం చవిచూసింది. మొదటి మ్యాచ్‌లో ఓడిన భారత్.. తర్వాతి నాల్గింట్లో పైచేయి సాధించింది. డబుల్స్ జోడీలు భార్గవ రామ్ అరిగెల- విశ్వతేజ గొబ్బూరు, వెన్నె కలగొట్ల- రేషిక సత్తాచాటడంతో అయిదు మ్యాచ్‌ల తర్వాత భారత్ 55-51తో ఆధిక్యం సంపాదించింది. అయితే తర్వాతి అయిదు మ్యాచ్‌ల్లో సత్తాచాటిన జపాన్ ఆరు పాయింట్ల తేడాతో భారత్‌ను ఓడించి సెమీస్‌లో అడుగుపెట్టింది. టీమ్ విభాగంలో భారత్ పోరాటం ముగియగా.. బుధవారం వ్యక్తిగత ఛాంపియన్‌షిప్ మ్యాచ్‌లు ప్రారంభంకానున్నాయి.

నెదర్లాండ్స్ చేతిలో ఇండియా-ఎ ఓటమి

ఐండ్‌హోవెన్ (నెదర్లాండ్స్): ఐరోపా పర్యటనను ఇండియా-ఎ పురుషుల హాకీ జట్టు ఓటమితో ముగించింది. ఆదివారం జరిగిన చివరి మ్యాచ్‌లో ఇండియా-ఎ 2-8తో ప్రపంచ నంబర్‌వన్ నెదర్లాండ్స్ చేతిలో పరాజయం చవిచూసింది. ఇండియా-ఎ తరపున రాజిందర్ సింగ్, సెల్వం కార్తి ఒక్కో గోల్ సాధించారు. ఈనెల 8న ప్రారంభమైన ఐరోపా పర్యటనలో ఇండియా-ఎ.. అయిదు జట్లతో ఎనిమిది మ్యాచ్‌లు ఆడింది. ఐర్లాండ్, ఫ్రాన్స్, ఇంగ్లాండ్, బెల్జియం, నెదర్లాండ్స్‌తో తలపడిన ఇండియా-ఎ మూడు మ్యాచ్‌ల్లో గెలిచింది. "ఐరోపా పర్యటనలో విజయాల కంటే ఓటములే ఎక్కువ ఉండొచ్చు. జట్టుగా అనుభవం సంపాదించడం, నేర్చుకోవడం గురించే ఈ పర్యటన. ఫలితాల కోసం కాదు. జట్టులో సీనియర్, జూనియర్ ఆటగాళ్లు ఉన్నారు. గత రెండు వారాలుగా ఎంతో విలువైన అనుభవం సంపాదించారు" అని ఇండియా-ఎ కోచ్ శివేంద్ర సింగ్ తెలిపాడు.



డాసన్

ఇంగ్లాండ్ తుది జట్టులో డాసన్

మాంచెస్టర్: ఇంగ్లాండ్ జట్టు ఆనవాయితీని కొనసాగించింది. భారత్‌తో టెస్టు సిరీస్‌లో వరుసగా నాలుగో మ్యాచ్‌కూ రెండు రోజుల ముందే తుది జట్టును ప్రకటించింది. మూడో టెస్టులో గాయపడి ఈ మ్యాచ్‌కు అందుబాటులో లేకుండా పోయిన స్పిన్నర్ షోయబ్ బషీర్ స్థానంలో లయామ్ డాసన్‌ను తుది జట్టులోకి తీసుకుంది. ఇది తప్ప ఇంగ్లాండ్ తుది జట్టులో మార్పులేమీ లేవు. లెఫ్టార్మ్ స్పిన్నరైన డాసన్ ఎనిమిదేళ్ల ముందు టెస్టు మ్యాచ్ ఆడాడు. ఇంగ్లాండ్ జట్టు: క్రాలీ, డకెట్, పోప్, రూట్, బ్రూక్, స్టోక్స్ (కెప్టెన్), జేమీ స్మిత్, డాసన్, వోక్స్, కార్స్, ఆర్చర్.

టెస్టు క్రికెట్ రెండు స్థాయిల్లో..!



సాధ్యతపై ఐసీసీ కమిటీ

లండన్: టెస్టు క్రికెట్‌ను రెండు స్థాయిల వ్యవస్థగా పునర్నిర్మించే అవకాశాలను పరిశీలించేందుకు ఐసీసీ ఎనిమిది మంది సభ్యుల వర్కింగ్ కమిటీని ఏర్పాటు చేసింది. సింగపూర్‌లో ఐసీసీ వార్షిక సర్వసభ్య సమావేశం సందర్భంగా ఈ నిర్ణయం తీసుకున్నారు. ఐసీసీ కొత్త కార్యనిర్వహణాధికారి సంజోగ్ గుప్తా ఈ కమిటీకి నాయకత్వం వహిస్తాడు. "ప్రస్తుత విధానంలో ఏవైనా మార్పులు చేస్తే.. వచ్చే ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్ (2027-29) చక్రం నుంచి అమలు చేస్తారు. ఇప్పుడున్న 9 జట్లను 12 జట్లకు పెంచి, రెండు గ్రూప్‌లుగా విభజిస్తారు" అని 'ద గార్డియన్' పత్రిక పేర్కొంది. వర్కింగ్ కమిటీ ఈ ఏడాది చివరికల్లా సూచనలు చేయాల్సివుంటుంది. రెండు స్థాయిల వ్యవస్థకు భారత్‌తో పాటు ఇంగ్లాండ్, ఆస్ట్రేలియా గట్టిగా మద్దతు పలుకుతున్నట్లు తెలుస్తోంది. ప్రతిపాదిత వ్యవస్థలో డివిజన్‌కు ఆరు జట్ల చొప్పున రెండు డివిజన్లు ఉంటాయి. జట్లు ప్రదర్శన ఆధారంగా ఓ డివిజన్ నుంచి మరో డివిజన్‌కు వెళ్తాయి.

మళ్లీ ఛాంపియన్స్ లీగ్?: క్లబ్ స్థాయిలో జరిగే అంతర్జాతీయ టీ20 టోర్నీ.. ఛాంపియన్స్ లీగ్ టీ20 (సీఎల్ టీ20)ని వచ్చే ఏడాది పునఃప్రారంభమయ్యే అవకాశముంది. దీని పునరుద్ధరణపై ఐసీసీ సీరియస్‌గా దృష్టి పెట్టింది. భారత్, ఆస్ట్రేలియా, ఇంగ్లాండ్ బోర్డులు చర్చల్లో కీలక పాత్ర పోషిస్తున్నాయి. సీఎల్‌టీ20ని చివరగా 2014లో ఆడారు. అప్పుడు ఫైనల్లో కోల్‌కతాను ఓడించి చెన్నై సూపర్‌కింగ్స్ టైటిల్‌ను గెలుచుకుంది. ఆ టోర్నీలో భారత్ నుంచి మూడు జట్లు, ఆస్ట్రేలియా, దక్షిణాఫ్రికా నుంచి నుంచి రెండేసి జట్లు, పాకిస్థాన్, వెస్టిండీస్, న్యూజిలాండ్ నుంచి ఒక్కో జట్టు పోటీపడ్డాయి. మొత్తంగా ఆరు సార్లు సీఎల్‌టీ20 జరిగింది. ఈ టోర్నీకి నాలుగుసార్లు భారత్, రెండు సార్లు దక్షిణాఫ్రికా ఆతిథ్యమిచ్చాయి. చెన్నై, ముంబయి ఇండియన్స్ చెరో రెండు సార్లు.. న్యూసౌత్ వేల్స్, సిడ్నీ సిక్సెస్ ఒక్కోసారి విజేతగా నిలిచాయి.

అర్జున్ 6.. ప్రజ్ఞానంద 7



అర్జున్

లాస్ వేగాస్: ఫ్రీస్టైల్ చెస్ గ్రాండ్ స్లామ్‌లో భారత గ్రాండ్ మాస్టర్లు అర్జున్ ఇరిగేశి, ఆర్.ప్రజ్ఞానంద ప్రభావం చూపలేకపోయారు. ఈ టోర్నీలో అర్జున్ 6, ప్రజ్ఞానంద 7 స్థానాల్లో నిలిచారు. ఫైనల్స్‌లో అర్జున్ 0-2తో ఫాబియానో కరువానా (అమెరికా) చేతిలో ఓడగా.. ప్రజ్ఞానంద 1.5-0.5తో వెస్లీ సో (అమెరికా)పై విజయం సాధించాడు. లెవోన్ అరోనియన్ (అమెరికా) 1.5-0.5తో హెకె నీమన్ (అమెరికా)పై నెగ్గి విజేతగా నిలిచాడు. ప్రపంచ నంబర్‌వన్ మాగ్నస్ కార్ల్‌సన్ (నార్వే) 1.5-0.5తో హికరు నకమురా (అమెరికా)పై గెలిచి మూడో స్థానం సాధించాడు.

నాకౌట్స్‌లో ఆదిత్య

మనమా (బహ్రెయిన్): భారత ఆటగాడు ఆదిత్య మెహతా.. ఐబీఎస్ఎఫ్ వరల్డ్ 6-రెడ్ స్నూకర్ ఛాంపియన్‌షిప్స్ నాకౌట్స్‌లోకి ప్రవేశించాడు. గ్రూప్-ఎన్ మ్యాచ్‌లో సోమవారం అతడు 43-5, 40-22, 48-0, 67-0తో ఐర్లాండ్‌కు చెందిన జై చోప్రాపై విజయం సాధించాడు. ఆదిత్య ఈ టోర్నీలో నాకౌట్స్ చేరిన ఆరో భారతీయుడు. కమల్ చావ్లా, మనన్ చంద్ర, బ్రిజేశ్ దామిని, పరాస్ గుప్తా, పంకజ్ అడ్వాణీ ఇప్పటికే నాకౌట్ దశకు చేరుకున్నారు.

ఘర్షణ వల్లే మెరుగయ్యాం



బ్రూక్

మాంచెస్టర్: భారత్‌తో మూడో టెస్టులో తాము గెలవడానికి ప్రత్యర్థి ఆటగాళ్లతో జరిగిన ఘర్షణ కూడా ఓ కారణమని ఇంగ్లాండ్ బ్యాటర్ హ్యారీ బ్రూక్ అన్నాడు. ఈ సిరీస్‌ను స్నేహపూర్వక వాతావరణంలోనే ఆడాలని తాము అనుకున్నామని, కానీ భారత ఆటగాళ్లు తమను కవ్వించడంతో తాము కూడా వారికి దీటుగా బదులిచ్చే ప్రయత్నం చేశామని అతనన్నాడు. లార్డ్స్ టెస్టు మూడో రోజు ఆటలో ఇంగ్లాండ్ ఓపెనర్ జాక్ క్రాలీ సమయం వృథా చేయడానికి ప్రయత్నించడంతో బుమ్రా కోపం తెచ్చుకున్నాడు. అతడిని చూస్తూ వ్యంగ్యంగా చప్పట్లు కొట్టాడు. ఈ పరిణామం తమలో కసి పెంచిందని బ్రూక్ చెప్పాడు. "మేం క్రీడా స్ఫూర్తితోనే మ్యాచ్ ఆడాలని అనుకుంటాం. అయితే ఆ రోజు బుమ్రా ఒక ఓవర్ బౌలింగ్ చేసి క్రాలీ, డకెట్‌ల వైపు చూస్తూ చప్పట్లు చరచడం చూశాక.. మా శైలిపై పునరాలోచించాం. భారత్‌కు దీటుగా బదులివ్వాలని అనుకున్నాం. అక్కడి నుంచి మా ఆధిపత్యం మొదలైంది. మేం వారిని ఒత్తిడిలోకి నెట్టగలిగాం. కఠిన పిచ్ మీద చిన్న స్కోరే అయినా ఛేదించడానికి ఇబ్బంది పడేలా చేశాం. విజయం సాధించాం" అని బ్రూక్ అన్నాడు.

ఇంకో సిరీస్ సాధిస్తారా?

ఇంగ్లాండ్‌తో భారత్ నిర్ణయాత్మక మూడో వన్డే నేడు



స్మృతి మంధాన

సాయంత్రం 5.30 నుంచి

చెస్టర్‌-లీ-స్ట్రీట్: ఇంగ్లాండ్‌పై తొలిసారి టీ20 సిరీస్ సాధించిన భారత మహిళల జట్టు.. అదే ఊపులో వన్డే సిరీస్ సాధించాలన్న లక్ష్యంతో మంగళవారం నిర్ణయాత్మక మూడో మ్యాచ్‌కు సిద్ధమైంది. సిరీస్ ప్రస్తుతం 1-1తో సమంగా ఉంది. తొలి వన్డేలో భారత్ గెలవగా.. రెండో మ్యాచ్‌ను ఇంగ్లాండ్ సొంతం చేసుకుంది. వర్ష ప్రభావిత రెండో వన్డేలో భారత మహిళలు బ్యాటింగ్, బౌలింగ్ రెండింట్లోనూ విఫలమయ్యారు. ఫామ్‌లో ఉన్న స్మృతి మంధాన మరో కీలక ఇన్నింగ్స్ ఆడినా.. ఇంకెవరూ చెప్పుకోదగ్గ స్కోర్లు చేయలేదు. కెప్టెన్ హర్మన్‌ప్రీత్ ఘోర వైఫల్యం జట్టును దెబ్బ తీస్తోంది. ప్రతీక రావల్ కూడా ఆశించిన ప్రదర్శన చేయట్లేదు. మూడో వన్డేలో బ్యాటర్లు సమష్టిగా సత్తా చాటి పెద్ద స్కోర్లు చేయకపోతే సిరీస్‌పై ఆశలు నిలవడం కష్టమే. బౌలింగ్ కూడా భారత్ మెరుగు పడాల్సి ఉంది. టీ20 సిరీస్‌లో అదరగొట్టిన తెలుగమ్మాయిలు శ్రీ చరణి, అరుంధతి రెడ్డి వన్డేల్లో సత్తా చాటలేకపోతున్నారు. ఏ బౌలరూ నిలకడగా వికెట్లు తీయట్లేదు. మరోవైపు బ్యాటింగ్, బౌలింగ్ రెండింట్లోనూ జోరందుకున్న ఇంగ్లాండ్.. ఆత్మవిశ్వాసంతో మూడో వన్డేలో బరిలోకి దిగుతోంది. ఆ జట్టులో బ్యాటుతో ఎమీ జోన్స్, టామీ బ్యూమాంట్, నాట్ సీవర్.. బంతితో సోఫీ ఎకిల్‌స్టోన్, చార్లీ డీన్, ఎమ్ అర్లాట్ సత్తా చాటుతున్నారు.



మిచెల్ ఓవెన్

అరంగేట్రంలోనే అదుర్స్

● మిచెల్ ఓవెన్ మెరుపులు


● తొలి టీ20లో వెస్టిండీస్‌పై ఆసీస్ విజయం

కింగ్‌స్టన్: వెస్టిండీస్‌తో అయిదు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌లో ఆస్ట్రేలియా శుభారంభం చేసింది. అరంగేట్ర ఆటగాడు మిచెల్ ఓవెన్ బ్యాటుతో, బంతితో సత్తా చాటడంతో తొలి టీ20లో ఆసీస్ 3 వికెట్ల తేడాతో విజయం సాధించింది. ఓవెన్ మెరుపు అర్ధశతకం చేయడంతో పాటు ఓ వికెట్ పడగొట్టాడు. రోస్టన్ చేజ్ (60; 32 బంతుల్లో 9×4, 2×6), షై హోప్ (55; 39 బంతుల్లో 4×4, 3×6), హెట్‌మయర్ (38; 19 బంతుల్లో 2×4, 3×6) చెలరేగడంతో మొదట విండీస్ 8 వికెట్ల నష్టానికి 189 పరుగులు చేసింది. డ్వార్షుయిస్ (4/36) బంతితో రాణించాడు. ఓవెన్, ఎలిస్, కనోలీ, అబాట్ తలో వికెట్ చేజిక్కించుకున్నారు. గ్రీన్ (51; 26 బంతుల్లో 2×4, 5×6), ఓవెన్ (50; 27 బంతుల్లో 6×4) మెరవడంతో లక్ష్యాన్ని ఆస్ట్రేలియా 18.5 ఓవర్లలో 7 వికెట్లు కోల్పోయి ఛేదించింది. హోల్డర్, అల్జారి జోసెఫ్, గుడకేశ్ మోటీ తలో రెండు వికెట్లు పడగొట్టారు.

ఈనాడు

విజయవాడ 22-7-2025 మంగళవారం సిటీ సంపుటి 51 . సంచిక 343
THE LARGEST CIRCULATED TELUGU DAILY
రూ. 6-50 పేజీలు 14 www.eenadu.net
Vijayawada, Visakhapatnam, Hyderabad, Tirupati, Ananthapuramu, Karimnagar, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam, Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru

ధన్‌ఖడ్ అనూహ్య రాజీనామా



పార్లమెంటు సమావేశాల వేళ ఉప రాష్ట్రపతి పదవికి గుడ్‌బై

- అనారోగ్య కారణాలని వెల్లడి
- ఇంకా రెండేళ్ల పదవీకాలం ఉన్నా వైదొలగిన రాజ్యసభ ఛైర్మన్
- స్వతంత్ర భారత చరిత్రలో ఇది మూడోసారి

ఈనాడు, దిల్లీ: ఉప రాష్ట్రపతి పదవికి జగదీప్ ధన్‌ఖడ్ సోమవారం రాత్రి రాజీనామా చేశారు. రాజ్యసభ ఛైర్మన్ హోదాలో పార్లమెంటు వర్షాకాల సమావేశాల తొలి రోజున కార్యక్రమాలను సజావుగా నిర్వహించిన ఆయన రాత్రికల్లా అనూహ్యంగా రాజీనామా లేఖను రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ముకు పంపారు. అనారోగ్య కారణాలవల్లే తాను పదవి నుంచి వైదొలగుతున్నట్లు అందులో పేర్కొన్నారు. ఆయన రాజీనామాతో రాజ్యసభ సమావేశాలను ప్రస్తుతానికి డిప్యూటీ ఛైర్మన్‌గా ఉన్న జేడీయూ నేత హరివంశ్ నడిపించనున్నారు. 2022 ఆగస్టు 11న ఉప రాష్ట్రపతిగా బాధ్యతలు చేపట్టిన ధన్‌ఖడ్‌కు 2027 ఆగస్టు వరకూ పదవీకాలం ఉంది. అయితే 2 ఏళ్ల 344 రోజులకే ఆయన వైదొలగాలని నిర్ణయించుకున్నారు. 74 ఏళ్ల ధన్‌ఖడ్ తర్వాత ఉప రాష్ట్రపతిగా ఎవరిని ఎన్నుకుంటారనే అంశంపై ఆసక్తి నెలకొంది. హరివంశ్‌కు అవకాశం ఇస్తారా అనే చర్చ జరుగుతోంది.

'వైద్యుల సూచనల మేరకు ఆరోగ్యానికి ప్రాధాన్యమిస్తూ.. రాజ్యాంగంలోని ఆర్టికల్ 67(ఎ)కు అనుగుణంగా (మిగతా 3లో)



పహల్గాం ఉగ్రదాడి, అహ్మదాబాద్ విమానదుర్ఘటన మృతులకు లోక్‌సభలో సోమవారం నివాళులర్పిస్తున్న ప్రధాని మోదీ, కేంద్రమంత్రులు, ఎంపీలు

జస్టిస్ వర్మ అభిశంసన ప్రక్రియ మొదలు

తీర్మానాలపై 152 మంది లోక్‌సభ సభ్యులు, 63 మంది రాజ్యసభ సభ్యుల సంతకాలు

ఆపరేషన్ సిందూర్‌పై ప్రత్యేక చర్చకు లోక్‌సభలో 16 గంటలు 2లో

మొదలైన వర్షాకాల సమావేశాలు ● తొలిరోజే అంతరాయాలతో వాయిదా


ముడుపుల ముఠాతో జగన్ సన్నిహితుల భేటీలు

డెన్‌ల ఇన్‌ఛార్జులతోనూ నిత్యం సంప్రదింపులు ● మిథున్‌రెడ్డి, విజయసాయిరెడ్డి, గోవిందప్ప బాలాజీల గుట్టు రట్టు

వీరి ద్వారానే జగన్‌కు ముడుపులు చేరినట్లు ఇప్పటికే వెలుగులోకి ● రాజ్ కెసిరెడ్డి, చాణక్య, సైఫ్, ప్రణోయ్ ప్రకాశ్, వెంకటేశ్ నాయుడుల సమావేశాలు

- హైదరాబాద్, తాడేపల్లిలో కలిసేవారు
- సెల్ టవర్ లొకేషన్ల ఆధారంగా నిగ్గు తేల్చిన సిట్
- అక్షాంశాలు, రేఖాంశాల ఆధారంగా నిరూపించిన అధికారులు
- ప్రాథమిక అభియోగపత్రంలో సమగ్ర వివరాలు

ఈనాడు - అమరావతి



వైకాపా అధినేత, మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి అత్యంత సన్నిహితులు, నిత్యం తలలో నాలుకలా ఉండే వైకాపా ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి (ఏ-4), విజయసాయిరెడ్డి (ఏ-5), గోవిందప్ప బాలాజీ (ఏ-33), సీఎంవో మాజీ కార్యదర్శి కె.ధనుంజయరెడ్డి (ఏ-31), ఓఎస్డీ పి.కృష్ణమోహన్‌రెడ్డిలు (ఏ-32) మద్యం కుంభకోణంలో ముడుపులు వసూలు చేసే ముఠా సభ్యులతో ఎప్పటికప్పుడు భేటీ అయ్యేవారని సిట్ నిగ్గు తేల్చింది. హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లోని పెద్దమ్మగుడి సమీపంలో, అపోలో ఆసుపత్రి దగ్గర, జర్నలిస్ట్ కాలనీలోనూ, గుంటూరు జిల్లా తాడేపల్లి ప్యాలెస్ సమీపంలోని డెన్ వద్ద వీరు తరచూ సమావేశమయ్యేవారని సాంకేతిక, శాస్త్రీయ ఆధారాలతో నిర్ధారించింది. ఏయే తేదీల్లో, ఎవరెవరు, ఎక్కడెక్కడ కలిశారో.. అక్షాంశాలు, రేఖాంశాలతో సహా తేల్చింది. ఈ వివరాల్ని ప్రాథమిక అభియోగపత్రంలో పొందుపరిచింది. సాధారణంగా టెలికం సర్వీసు ప్రొవైడర్లు రెండేళ్లకు మించి సీడీఆర్‌లు (కాల్ డీటెయిల్ రికార్డులు) భద్రపరచరు. దీంతో పాత డేటా అందుబాటులో లేకుండాపోయింది. 2023 నుంచి వివరాలు మాత్రమే లభ్యమయ్యాయి. వాటిని విశ్లేషించిన దర్యాప్తు అధికారులు.. సెల్‌టవర్ లొకేషన్ల వివరాల ఆధారంగా భేటీల గుట్టు రట్టు చేశారు. ఆ వివరాలివీ..

ఈ భేటీలు అందుకే!

మద్యం డిస్టిలరీలు, సరఫరా కంపెనీల నుంచి రాజ్ కెసిరెడ్డి (ఏ1), ఆయన అనుచరగణం ప్రతి నెలా రూ.50-60 కోట్లు వసూలు చేసి.. ఎంపీ మిథున్‌రెడ్డి, విజయసాయిరెడ్డి, గోవిందప్ప బాలాజీలకు అందజేసేవారని, వారు ఈ సొత్తు అప్పటి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి చేర్చేవారని సిట్ అభియోగపత్రంలో వెల్లడించింది. అందులో భాగంగానే మిథున్‌రెడ్డి, విజయసాయిరెడ్డి, గోవిందప్ప బాలాజీలు.. (మిగతా 3లో)

అనుభవించు రాజా..!

మద్యం కుంభకోణం సొమ్ముతో మాఫియా ముఠా జల్సా 8లో

భారీగా భూములు, ఆస్తుల కొనుగోలు

విదేశాల్లో పెట్టుబడులు.. విలాసాలు

కమ్యూనిస్టు యోధుడు అచ్యుతానందన్ కన్నుమూత



- నెల రోజులుగా చికిత్స పొందుతున్న 101 ఏళ్ల వీఎస్
- నిరుపేద కుటుంబంలో జన్మించి కేరళ ముఖ్యమంత్రి పదవిని చేపట్టిన శ్రమజీవి
- సీపీఎం వ్యవస్థాపక సభ్యుల్లో ఒకరు
- రాష్ట్రపతి ముర్ము, ప్రధాని మోదీ సహా పలువురు ప్రముఖుల సంతాపం 3లో

పాఠశాలపై కూలిన శిక్షణ యుద్ధవిమానం

- ఢాకాలో 20 మంది మృత్యువాత
- 171 మందికి గాయాలు
- మృతుల్లో అత్యధికులు విద్యార్థులే 11లో



బంగ్లాదేశ్ రాజధాని ఢాకాలో పాఠశాలపై యుద్ధవిమానం కూలిపోవడంతో సహాయకచర్యల్లో సైనికులు

వివేకా హత్యకేసులో... తదుపరి దర్యాప్తు అవసరమా? కాదా?



- మీ అభిప్రాయం చెప్పండి
- సీబీఐకి సుప్రీంకోర్టు ఆదేశం
- దాని ఆధారంగా నిందితుల బెయిళ్లపై నిర్ణయం వెలువరిస్తామని స్పష్టీకరణ

ఈనాడు, దిల్లీ: మాజీ మంత్రి వివేకా హత్య కేసులో తదుపరి దర్యాప్తు అవసరమా? లేదా? చెప్పాలంటూ సీబీఐని సుప్రీంకోర్టు ఆదేశించింది. దాని ఆధారంగా నిందితుల బెయిళ్ల రద్దు, మంజూరు పిటిషన్లపై విచారణను చేపడతామంది. కేసులో నిందితులైన అవినాష్‌రెడ్డి, శివశంకర్‌రెడ్డి, భాస్కరరెడ్డిల బెయిళ్లు రద్దు చేయాలని, ఎర్ర గంగిరెడ్డికి బెయిల్ ఇవ్వొద్దని, అంతిమ కుట్రదారును తేల్చేలా దర్యాప్తును కొనసాగించాలని, తమను ఇరికించడానికి పెట్టిన కేసులను రద్దుచేయాలంటూ వివేకా కుమార్తె సునీత, ఆమె భర్త రాజశేఖర్‌రెడ్డి పిటిషన్ వేశారు. సునీల్‌యాదవ్, ఉదయ్‌కుమార్‌రెడ్డి, భాస్కరరెడ్డి బెయిళ్లను రద్దు పరచాలని సీబీఐ పిటిషన్ దాఖలు చేసింది. తనకు బెయిల్ మంజూరు చేయాలని ఎర్ర గంగిరెడ్డి పిటిషన్ వేశారు. వీటితో కలిపి మొత్తం 11 పిటిషన్లపై జస్టిస్ ఎంఎం సుందరేష్, జస్టిస్ ఎన్.కోటీశ్వర్‌సింగ్‌లతో కూడిన ధర్మాసనం సోమవారం విచారణ చేపట్టింది. 'కేసు ప్రస్తుత పరిస్థితి ఏమిటి? సీబీఐ ఎలా ముందుకు వెళ్లాలనుకుంటోందో తెలుసుకోవాలనుకుంటున్నాం. ఆ ప్రకారం తదుపరి ఉత్తర్వులిస్తాం' అని జస్టిస్ సుందరేష్ ఈ సందర్భంగా అన్నారు.

ఆ నివేదికను కోర్టు తిరస్కరిస్తోంది

తొలుత సునీత తరఫున సీనియర్ న్యాయవాది సిద్ధార్థ లూథ్రా వాదనలు వినిపించారు. 'వివేకా కుమార్తె, అల్లుడిపై ఉన్న కేసులను మూసేస్తున్నట్లు రాష్ట్ర పోలీసులు క్లోజర్ రిపోర్టు ఇచ్చారు. ప్రధానకేసు సుప్రీంకోర్టులో ఉందంటూ ఆ రిపోర్ట్‌ను (మిగతా 3లో)

ఎలక్ట్రానిక్స్ రంగంలో రూ.8 లక్షల కోట్ల పెట్టుబడులను ఆకర్షించాలి

ఇందుకు ప్రణాళిక సిద్ధం చేయాలి

అధికారులకు సీఎం చంద్రబాబు ఆదేశం



ఎలక్ట్రానిక్స్ కాంపోనెంట్ మాన్యుఫ్యాక్చరింగ్ పాలసీపై అధికారులతో సమీక్షిస్తున్న సీఎం చంద్రబాబు. చిత్రంలో ఐటీ శాఖ కార్యదర్శి కె.భాస్కర్, ముఖ్యమంత్రి కార్యదర్శి కార్తికేయ మిశ్ర

ఈనాడు, అమరావతి: రాష్ట్రంలో ఎలక్ట్రానిక్స్ విడిభాగాల తయారీ రంగంలో రూ.8 లక్షల కోట్ల పెట్టుబడులను ఆకర్షించేలా ప్రణాళిక సిద్ధం చేయాలని సీఎం చంద్రబాబు అధికారులను ఆదేశించారు. పరిశ్రమల ఏర్పాటుతో పాటు ఉత్పత్తికి అనువైన పరిస్థితులను కల్పించాలని పేర్కొన్నారు. 'ఎలక్ట్రానిక్స్ కాంపోనెంట్స్ మాన్యుఫాక్చరింగ్ పాలసీ 4.0'పై సచివాలయంలో అధికారులతో సీఎం సోమవారం సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. '2025-30 మధ్య ఎలక్ట్రానిక్స్ పరిశ్రమల పెట్టుబడులు ఆకర్షించడమే పాలసీ లక్ష్యం. తిరుపతి సమీపంలోని శ్రీసిటీ, హిందూపురం, కొప్పర్తి, కర్నూలు సమీపంలోని ఓర్వకల్లు ప్రాంతాల్లో ఎలక్ట్రానిక్స్ పరికరాల తయారీ యూనిట్ల ఏర్పాటుకు విస్తృత అవకాశాలు ఉన్నాయి. బెంగళూరు, చెన్నై నగరాల్లో పరిశ్రమల ఏర్పాటుకు భూములు కొరత ఉంది. దీన్ని రాష్ట్రం అవకాశంగా మార్చుకుని పెట్టుబడులను ఆకర్షించాలి. ఎలక్ట్రానిక్స్ ఉత్పత్తుల రంగంలో స్వయం సమృద్ధి.. మేడ్ ఇన్ ఇండియా లక్ష్యాలకు అనుగుణంగా మనం పనిచేయాలి. ఉత్పత్తులకు బ్రాండింగ్ కల్పించడం కీలకం' అని సీఎం పేర్కొన్నారు. గత ఏడాది రూ.6 లక్షల కోట్ల విలువైన ఎలక్ట్రానిక్ సర్క్యూట్ బోర్డులను దేశం దిగుమతి చేసుకుందని.. వాటికి భారీగా డిమాండ్ ఉందని అధికారులు సీఎంకు వివరించారు.

విశాఖ, అమరావతి, తిరుపతి నగరాల్లో ఐటీ కంపెనీల ఏర్పాటుకు విస్తృత అవకాశాలున్నాయని చంద్రబాబు తెలిపారు. 'ఈ ప్రాంతాల్లో 500 ఐటీ కంపెనీల ఏర్పాటుకు ప్రయత్నించాలి. విశాఖలో ఐటీ సంస్థలతో పాటు లేపాక్షి నుంచి ఓర్వకల్లు వరకు తయారీ పరిశ్రమల ఏర్పాటుకు అవకాశం ఉంది. విశాఖ, విజయవాడ సహా రాష్ట్రంలోని మిగతా నగరాల్లోనూ ఉద్యోగ అవకాశాలు పెరిగేలా చూడాలి. కో-వర్కింగ్ స్పేస్‌లు ఏర్పాటు చేయాలి. నైపుణ్యాభివృద్ధి కోసం స్కిల్ పోర్టల్‌కు.. ఇతర పోర్టల్స్‌నూ అనుసంధానం చేయాలి. భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా యువతలో నైపుణ్యాలను పెంచాలి. నాలెడ్జి ఎకానమీలో రాష్ట్రం మొదటి స్థానంలో ఉండాలి' అని సీఎం వివరించారు.

లోపలి పేజీల్లో

12 మందీ నిర్దోషులే

7/11 ముంబయి రైలు పేలుళ్ల కేసులో బాంబే హైకోర్టు సంచలన తీర్పు

ఈడీ అన్ని పరిమితులూ దాటుతోంది

న్యాయవాదులకు సమన్లలా జారీ చేస్తుంది..

సుప్రీం కోర్టు ఆగ్రహం

బెట్టింగ్ యాప్‌ల ప్రచారం కేసులో

విచారణకు రండి

సినీ ప్రముఖులకు ఈడీ నోటీసులు



లోపలి పేజీల్లో

- **రాష్ట్రంలో విస్తారంగా వర్షాలు** — అన్నదాతలకు ఊరట
- **పుర ఇంజినీరింగ్ కార్మికుల జీతాల పెంపు** — ఒక్కొక్కరికి రూ.3,000 నుంచి రూ.3,500 వరకు పెరుగుదల
- **20 ఏళ్లుగా.. 150కి పైగా లగ్జరీ కార్ల చోరీ** — ఎట్టకేలకు చెన్నై పోలీసులకు చిక్కిన నిందితుడు
- **ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు 'జీరో ఫేర్ టికెట్' జారీ** — రాయితీ వివరాలు ఉండాలి: ముఖ్యమంత్రి
- **గ్రీన్ హైడ్రోజన్ వ్యాలీగా రాష్ట్రం!** — పరిశోధనకు రూ.500 కోట్ల కేటాయింపు — డిక్లరేషన్‌ను ప్రకటించిన సీఎం చంద్రబాబు


ఇదీ సంగతి!



ఇప్పటిదాకా ఎవరి పేరుపై ఎన్ని ప్లాట్లున్నాయో, అవి ఎక్కడెక్కడ ఉన్నాయో గుర్తేలేదట.. మనకి థాంక్స్ చెబుతున్నాడు!

మొక్కలు పెంచారు.. మరణం తర్వాత జీవించారు!

బతికుండగా మనం నాటిన మొక్క.. భవిష్యత్తు తరాలకు మన గొప్పదనాన్ని గర్వంగా చెబుతుందన్నదానికి ఈ ఘటనే ఒక ఉదాహరణ. ఓపిక ఉన్నప్పుడు వందల మొక్కలను నాటి, వాటి ఎదుగుదలను మనసారా ఆస్వాదించి, ఆనందించారు.. ప్రకాశం జిల్లా తాళ్లూరు మండలం నాగంబొట్లపాలెం గ్రామానికి చెందిన దారం వెంకటరెడ్డి. ఇప్పుడు ఆయన భౌతికంగా లేకపోయినా.. ఆ చెట్ల నుంచి వీచే చిరుగాలులు వెంకటరెడ్డి శ్రమను, ఆశయాన్ని ఎప్పటికప్పుడు గుర్తుచేస్తూనే ఉన్నాయి. 1990, 1991 సంవత్సరాల మధ్యకాలంలో వెంకటరెడ్డి.. దర్శి-చీమకుర్తి రోడ్డులోని తాళ్లూరు అడ్డరోడ్డు నుంచి గంగవాగు వరకు సుమారు కి.మీ. దూరం మేర 200 మర్రి మొక్కలు నాటారు. నాటి వదిలేయకుండా రోజూ సమీపంలోని దేవాలయం నుంచి బిందెతో నీరు తీసుకెళ్లి పోసేవారు. ఆ మొక్కలే నేడు మహావృక్షాలై చల్లటి గాలులు వీస్తూ తమ చెంతకొచ్చిన వారిని సేద తీరుస్తున్నాయి. ఇక్కడే కాకుండా ఇంకా వివిధ చోట్ల ఆయన 1,000కి పైగా మొక్కలు నాటారని వెంకటరెడ్డి సమకాలికులు చెబుతున్నారు.



తాళ్లూరు అడ్డరోడ్డులో కి.మీ. మేర రోడ్డుకిరువైపులా మర్రిచెట్లు

2014లో కన్నుమూసే సమయానికి ఆయన వయసు 77 సంవత్సరాలు. చివరి వరకూ బ్రహ్మచారిగానే ఉండిపోయారు.

– ఈనాడు, ఒంగోలు; న్యూస్‌టుడే, తాళ్లూరు



దారం వెంకటరెడ్డి

రాష్ట్రంలో మరోసారి బీపీఎస్, ఎల్ఆర్ఎస్

- అనుమతుల్లేని ఇళ్లు, స్థలాల క్రమబద్ధీకరణకు అవకాశం
- ప్రతిపాదనలకు మంత్రివర్గం ఆమోదం తరువాత మార్గదర్శకాలు

ఈనాడు, అమరావతి: అనుమతులకు విరుద్ధంగా చేపట్టిన భవన నిర్మాణాలు, అనుమతులు లేకుండా వేసిన లేఅవుట్‌ల క్రమబద్ధీకరణ కోసం ప్రభుత్వం మరోసారి బిల్డింగ్ పీనలైజేషన్ స్కీం (బీపీఎస్), లేఅవుట్ రెగ్యులరైజేషన్ స్కీం (ఎల్ఆర్ఎస్) తీసుకురానుంది. ఇందుకు సంబంధించిన ప్రతిపాదనలకు మంత్రివర్గం ఆమోదం తరువాత ఉత్తర్వులు జారీ చేయనున్నారు. దీంతో అనేక ఏళ్లుగా ఎదురు చూస్తున్న నగర, పట్టణ ప్రజలకు ఆయా పథకాల ద్వారా వివిధ నిర్మాణాలు, లేఅవుట్‌లలోని ప్లాట్లను క్రమబద్ధీకరించుకొనే అవకాశం కలుగుతుంది. 2014-19 మధ్య తెదేపా ప్రభుత్వ హయాంలో ఈ పథకాలు తీసుకొచ్చి, గడువు ముగియడంతో నిలిపివేశారు. అప్పటి దరఖాస్తుల్లో బీపీఎస్‌కు సంబంధించి 90%, ఎల్ఆర్ఎస్‌లో 65% వరకు పరిష్కారమయ్యాయి. గత వైకాపా ప్రభుత్వంలో అనుమతులు తీసుకోని భవన నిర్మాణాలు, లేఅవుట్‌లు భారీగా వెలిశాయి. వీటికి ఆ పార్టీ నేతలు అండ ఉండడంతో అధికారులు చూసీచూడనట్లు వ్యవహరించారు. ఇటీవల నిర్వహించిన ఇంటింటి సర్వేలో 123 పుర, నగరపాలక సంస్థల్లో 30,065 ఇళ్లు, భవనాలకు ఆస్తిపన్ను విధించలేదని తేలింది. దీన్నిబట్టి వైకాపా నేతలు అధికారులను ఎంతగా ఒత్తిడి చేశారో స్పష్టమవుతుంది. అనుమతులు తీసుకోకుండా వేసిన లేఅవుట్‌ల సంఖ్య 20 వేలకు పైగా ఉంటుందని అంచనా. నెల్లూరు, చిత్తూరు, వైఎస్సార్ కడప, కృష్ణా, ప్రకాశం, గుంటూరు, తూర్పుగోదావరి, అనకాపల్లి జిల్లాల్లో అనుమతులు లేని లేఅవుట్‌లు భారీగా ఉన్నాయి. ఎల్ఆర్ఎస్ ద్వారా వాటిల్లో ప్లాట్లు కొన్న వారు వాటిని క్రమబద్ధీకరించుకోవచ్చు. ఇలాంటి ప్లాట్లు 50 వేలకు పైగా ఉంటాయని అంచనా.

జస్టిస్ వర్మ అభిశంసన ప్రక్రియ మొదలు

- మొదలైన పార్లమెంటు వర్షాకాల సమావేశాలు
- తొలిరోజే అంతరాయాలతో వాయిదా

దిల్లీ: అధికారిక నివాసంలో కాలిన నోట్లకట్టలు పెద్దఎత్తున లభ్యమైన నేపథ్యంలో అలహాబాద్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ యశ్వంత్ వర్మను అభిశంసించే తీర్మానాన్ని ప్రవేశపెట్టాలని కోరుతూ పార్లమెంటు ఉభయసభల్లో ఎంపీలు నోటీసులు ఇచ్చారు. సోమవారం వర్షాకాల సమావేశాలు మొదలుకాగానే లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాకు 152 మంది ఎంపీలు తమ సంతకాలతో నోటీసు సమర్పించారు. రాజ్యసభలో 63 మంది సభ్యులు ఇలాంటిదానిని ఛైర్మన్ జగదీప్ ధన్‌ఖడ్‌కు సమర్పించారు. లోక్‌సభ సభ్యులూ నోటీసు ఇచ్చిన విషయాన్ని న్యాయశాఖ మంత్రి అర్జున్‌రామ్ మేఘ్‌వాల్ ధ్రువీకరించిన తర్వాత ధన్‌ఖడ్ స్పందిస్తూ- జడ్జి అభిశంసనకు ఉభయసభల్లో ఒకేరోజు నోటీసులు వచ్చినప్పుడు సభాపతులిద్దరూ కలిసి ఒక కమిటీని నియమించాల్సి ఉంటుందని, ఆ మేరకు తదుపరి చర్యల్ని సెక్రటరీ జనరల్ చేపడతారని చెప్పారు. అలహాబాద్ హైకోర్టుకు చెందిన జస్టిస్ శేఖర్ యాదవ్ తొలగింపునకు ఎంపీలు గత డిసెంబరులో ఇచ్చిన నోటీసుపై ఒక సభ్యుడి సంతకం రెండుసార్లు ఉందని పరిశీలనలో తేలినట్లు తెలిపారు. రెండోసారి సంతకం చేయలేదని ఆ సభ్యుడు చెప్పినందువల్ల అన్ని సంతకాల వాస్తవికతను ధ్రువీకరించే ప్రక్రియ కొనసాగుతోందని, అది తేలాక సభకు విషయాన్ని తెలియజేస్తానని చెప్పారు.

ట్రంప్ మాటలు.. దేశానికి అవమానం: ఖర్గే

భారత్-పాక్ ఘర్షణను నిలువరించేందుకు మధ్యవర్తిత్వం వహించినట్లు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ పదే పదే చెబుతుండటం దేశానికి అవమానకరమని రాజ్యసభలో విపక్షనేత మల్లికార్జున ఖర్గే అన్నారు. దానిపై ప్రభుత్వం వివరణ ఇవ్వాలని డిమాండ్ చేశారు. శూన్య గంటలో విపక్షాల నిరసన తర్వాత సభ కొంతసేపు వాయిదా పడింది. ప్రశ్నోత్తరాల కోసం తిరిగి సమావేశమైనప్పుడు ఖర్గే, మరికొందరు సభ్యులు వాయిదా తీర్మాన నోటీసులు ఇచ్చారు. మిగతా వ్యవహారాలను పక్కనపెట్టి ఆపరేషన్ సిందూర్‌పై చర్చించాలని పట్టుబట్టారు. భద్రత వైఫల్యాలు, విదేశాంగ విధానంపై చర్చకు రెండ్రోజులు కేటాయించాలన్నారు. ఈ డిమాండుపై ఇతర ఎంపీలు గళమెత్తారు. పూర్తిస్థాయి చర్చకు అవకాశమిస్తానని ధన్‌ఖడ్ భరోసా ఇచ్చారు. ఆ తర్వాత కాంగ్రెస్ సభ్యులు వాకౌట్ చేశారు.

భిన్న పక్షాల నుంచి మద్దతు

తాజా నోటీసుపై కాంగ్రెస్, తెదేపా, జేడీయూ, జేడీఎస్, ఎన్సీపీ-ఎస్పీ, డీఎంకే, ఆర్ఎస్పీ, జనసేన, ఏజీపీ, ఎల్‌జేఎస్పీ, ఎస్‌కేపీ, సీపీఎం తదితర పార్టీల ఎంపీలు సంతకాలు చేశారు. లోక్‌సభ విపక్ష నేత రాహుల్ గాంధీ, వివిధ పార్టీల ఎంపీలు- అనురాగ్ సింగ్ ఠాకుర్, రవిశంకర్ ప్రసాద్, రాజీవ్ ప్రతాప్ రూడీ, పీపీ చౌధరీ, సుప్రియా సూలె, కె.సి. వేణుగోపాల్, టి.ఆర్.బాలు తదితరులు జడ్జి అభిశంసన తీర్మానం కోసం సంతకాలు చేసినట్లు సమాచారం. న్యాయవ్యవస్థలో అవినీతి అనేది అతి సున్నితమైన, తీవ్రమైన అంశమని పార్లమెంటరీ వ్యవహారాలశాఖ మంత్రి కిరణ్ రిజిజు అన్నారు. అందువల్లనే జస్టిస్ వర్మను తొలగించే విషయంలో అన్ని పార్టీలు ఏకాభిప్రాయంతో ఉన్నాయని చెప్పారు. భాజపా చొరవ తీసుకుని ఎన్డీయే కూటమి పక్షాల ఎంపీల నుంచి సంతకాల సేకరణను సోమవారం వేగవంతం చేసి తగిన బలాన్ని కూడగట్టింది. ఈ సంతకాలకు పార్లమెంటులో రక్షణమంత్రి కార్యాలయం వేదికగా నిలిచింది.

అన్ని అంశాలకూ అనుమతిస్తా: స్పీకర్

లోక్‌సభలోనూ ఇదే అంశంపై ప్రతిష్టంభన నెలకొంది. స్వల్ప విరామాలతో నాలుగుసార్లు సభను వాయిదా వేయాల్సి వచ్చింది. ప్రశ్నోత్తరాల సమయం తర్వాత అన్ని అంశాలు లేవనెత్తేందుకు అనుమతిస్తానని, నిబంధనల ప్రకారమే సభ నడుస్తుందని స్పీకర్ చెప్పారు. నోటీసు ఇస్తే అన్ని అంశాలూ లేవనెత్తేందుకు అనుమతిస్తానన్నారు. నినాదాలు ఇవ్వాలనుకుంటే సభ వెలుపల ఆ పని చేసుకోవాలని సూచించారు. సుదీర్ఘ చర్చకు ప్రభుత్వం సిద్ధమేనని రక్షణమంత్రి రాజ్‌నాథ్ సింగ్ చెప్పారు. ఆపరేషన్ సిందూర్, పహల్గాం దాడిపై లోక్‌సభలో ప్రత్యేక చర్చకు 16 గంటల సమయాన్ని కేటాయించాలని సభా వ్యవహారాల సంఘం సమావేశంలో నిర్ణయించారు. ఈ వారంలో ప్రధాని విదేశాలకు వెళ్లనుండటంతో ఆయన వచ్చాక వచ్చే వారం ఈ చర్చ సాధ్యం కానుందని తెలుస్తోంది.

మృతులకు నివాళి

పహల్గాం ఉగ్రదాడి, ఎయిరిండియా విమాన ప్రమాదాల్లో మృతులకు, ఇటీవలి కాలంలో చనిపోయిన మాజీ సభ్యులకు పార్లమెంటు నివాళులర్పించింది. రాజ్యసభకు కొత్తగా ఎంపికైన నలుగురు సభ్యులు ప్రమాణం చేశారు. నౌకాయాన పత్రాలను సరళతరం చేసే లాడింగ్ బిల్లు-2025ని రాజ్యసభ ఆమోదించింది. మార్చిలోనే లోక్‌సభ దీనిని ఆమోదించింది. ఉభయసభలూ మంగళవారానికి వాయిదా పడ్డాయి.

రష్యాలో ఇద్దరు తమిళ యువకులకు చిత్రహింసలు

యుద్ధంలో పాల్గొనాలని పోలీసుల ఒత్తిడి



కిశోర్

చెన్నై(ప్యారిస్), న్యూస్‌టుడే: రష్యాలో తమకు తెలియకుండానే ఓ కేసులో ఇరుక్కుపోయిన ఇద్దరు తమిళనాడు యువకులను అక్కడి పోలీసులు నరకం చూపిస్తున్నారు. యుద్ధంలో పాల్గొనాలని చిత్రహింసలు పెడుతున్నారు. బాధితుల కుటుంబ సభ్యులు తెలిపిన ప్రకారం.. కడలూరు జిల్లా పాళ్లెయంకోట ప్రాంతానికి చెందిన కిశోర్ (23) 2021లో వైద్య విద్య చదవడానికి రష్యా వెళ్లారు. అక్కడే ఏర్పాడికి చెందిన నితీష్(25)తో పరిచయం ఏర్పడింది. ఇద్దరూ కలిసి ఖర్చుల కోసం ఓ కొరియర్ సంస్థలో పార్ట్‌టైం పనికి చేరారు. 2023లో కొరియర్ ద్వారా వచ్చిన ఓ పార్శిలును డెలివరీ చేసే సమయంలో అందులో నిషేధిత మత్తు పదార్థాలు ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. వెంటనే ఇద్దరినీ అరెస్టు చేశారు. కిశోర్ తల్లిదండ్రులకు ఈ విషయం తెలియడంతో కుమారుడిని పూచీకత్తుపై విడుదల చేయించి భారత్ తీసుకొచ్చేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ క్రమంలో ఉక్రెయిన్‌తో జరుగుతున్న యుద్ధంలో పాల్గొనాలని రష్యా పోలీసులు తమను గదిలో బంధించి చిత్రహింసలకు గురి చేస్తున్నారని, కొన్ని డాక్యుమెంట్లపై సంతకాలు తీసుకున్నారని కిశోర్ తన తల్లిదండ్రులకు ఓ ఆడియో పంపారు. దీంతో తమ కుమారుడిని కాపాడాలని ప్రధాని మోదీ, రాష్ట్ర ముఖ్యమంత్రి స్టాలిన్‌లను కిశోర్ తల్లిదండ్రులు వేడుకుంటున్నారు.

రాజకీయాల్లో మీరెందుకు పావులుగా మారుతున్నారు?

ఈడీని ఉద్దేశించి సుప్రీంకోర్టు వ్యాఖ్యలు

బెంగళూరు గ్రామీణం, న్యూస్‌టుడే: మైసూరు నగరాభివృద్ధి సంస్థలో ఇంటి పట్టాల కేటాయింపునకు సంబంధించిన విషయంలో కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య భార్య పార్వతి, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి భైరతి సురేశ్‌కు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) ఇచ్చిన నోటీసులను ఆ రాష్ట్ర హైకోర్టు రద్దు చేయడాన్ని సుప్రీంకోర్టు సోమవారం సమర్థించింది. కర్ణాటక హైకోర్టు ఇచ్చిన ఆదేశాలను రద్దు చేయాలని కోరుతూ ఈడీ దాఖలు చేసిన పిటిషన్‌ను సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్, జస్టిస్ కె.వినోద్ చంద్రలతో కూడిన ధర్మాసనం తోసిపుచ్చింది. ఈ సందర్భంగా ఈడీ పనితీరుపై అసంతృప్తి వ్యక్తం చేసింది. 'రాజకీయాల్లో పోరాటాలు ఉంటాయి. అందులో మీరెందుకు పావులుగా మారుతున్నారు? దురదృష్టవశాత్తు మహారాష్ట్రలోనూ నాకు కొన్ని అనుభవాలు ఎదురయ్యాయి. ఇంకా ఎక్కువ చేస్తే, మేము నోరు విప్పి అన్నీ చెప్పాల్సి ఉంటుంది. దేశంలో ఎక్కడా ఈ తరహాలో మీ పనితీరు లేకుండా చూసుకోండి' అంటూ ఈడీనీ ఉద్దేశించి ప్రధాన న్యాయమూర్తి వ్యాఖ్యానించారు. మరోవైపు సర్వోన్నత న్యాయస్థానం ఇచ్చిన తీర్పుపై ముఖ్యమంత్రి సిద్ధరామయ్య హర్షం వ్యక్తం చేశారు.



చెట్టుకో కౌగిలి.. మనసుకు ఎంతో హాయి!

శ్రీసత్యసాయి జిల్లా ముదిగుబ్బలోని శాంతి ఆనంద ఎడ్యుకేషనల్ సొసైటీ పాఠశాలలో సోమవారం 'ట్రీ హగ్గింగ్' నిర్వహించారు. సంస్థ డైరెక్టర్ హెల్గాశాంతి, ఉపాధ్యాయులు, విద్యార్థులు 2 నిమిషాల పాటు చెట్లను కౌగిలించుకుని ప్రశాంతతను ఆస్వాదించారు. ఈ ప్రక్రియతో మనలోని ఒత్తిడి తగ్గి ఆక్సిటోసిన్ హార్మోన్ విడుదల అవుతుందని ప్రధానోపాధ్యాయుడు రాజశేఖర్ తెలిపారు. ప్రతి వారం ట్రీ హగ్గింగ్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు వివరించారు. – ఈనాడు, పుట్టపర్తి

పుర ఇంజినీరింగ్ కార్మికుల జీతాల పెంపు

ఈనాడు, అమరావతి: పట్టణ స్థానిక సంస్థల్లో పొరుగు సేవల కింద పని చేస్తున్న ఇంజినీరింగ్ కార్మికుల జీతాలను ప్రభుత్వం పెంచింది. 14 వేల మందికి పైగా కార్మికులకు ప్రస్తుతం చెల్లిస్తున్న జీతాల్లో ఒక్కొక్కరికి రూ.3,000 నుంచి రూ.3,500 వరకు పెంపు ఉంటుందని పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. వేతనాలు పెంచాలని రాష్ట్రంలో పలు చోట్ల ఇంజినీరింగ్ కార్మికులు సమ్మె చేస్తున్నారు. ఈ నేపథ్యంలో మంత్రుల కమిటీ సిఫార్సుల మేరకు కేటగిరీ-1 పరిధిలోని కార్మికులకు ప్రస్తుతం చెల్లిస్తున్న వేతనం రూ.21,500 నుంచి రూ.24,500కి, కేటగిరీలో-2లో రూ.18,500 నుంచి రూ.21,500, కేటగిరీ-3లో రూ.15,000 నుంచి రూ.18,500కి పెంచుతున్నట్లు పురపాలక శాఖ ముఖ్య కార్యదర్శి సురేశ్‌కుమార్ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

వీఐపీలు వెళ్లేటప్పుడు సైరన్లు వద్దు

పోలీసులకు కర్ణాటక ప్రభుత్వం ఆదేశం

బెంగళూరు (హలసూరు), న్యూస్‌టుడే: కర్ణాటకలో వీఐపీలు వెళ్లే సమయంలో పోలీసులు సైరన్ మోగించ వద్దని కర్ణాటక ప్రభుత్వం సోమవారం ఆదేశించింది. ప్రజల సురక్షిత అంశం, శబ్ద కాలుష్యాన్ని దృష్టిలో ఉంచుకుని ఈ నిర్ణయం తీసుకున్నట్లు తన ఆదేశాల్లో పేర్కొంది. అత్యవసరంగా వెళ్లవలసి ఉంటే, సిగ్నల్ రహిత మార్గాలను ఏర్పాటు చేసుకోవాలని సూచించింది.

విభజన హామీల అమలుకు కేంద్రం చర్యలు తీసుకోవాలి

ఏపీ భవన్‌లో కాంగ్రెస్ ధర్నా

ఈనాడు, దిల్లీ: విభజన చట్టంలో ఇచ్చిన హామీల మేరకు ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం అన్నిరకాల చర్యలూ తీసుకోవాలని కాంగ్రెస్ నాయకురాలు సుంకర పద్మశ్రీ ఆధ్వర్యంలో పార్టీ కార్యకర్తలు సోమవారం ఇక్కడి ఏపీభవన్‌లోని అంబేడ్కర్ విగ్రహం వద్ద ధర్నా నిర్వహించారు. పోలవరం ప్రాజెక్టును వేగంగా పూర్తిచేసేలా నిధులు అందించాలని, విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటీకరణ చేయకూడదని, విశాఖ రైల్వే జోన్ ఏర్పాటుచేస్తూ గెజిట్ నోటిఫికేషన్ జారీచేయాలని, కడపలో స్టీల్‌ప్లాంట్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని, అమరావతి నిర్మాణాన్ని అన్ని హంగులతో పూర్తిచేసేలా కేంద్రం గ్రాంట్లు మంజూరు చేయాలని కోరుతూ ప్లకార్డులు ప్రదర్శించారు. రాష్ట్రంలో బలవంతపు భూసేకరణ ఆపేయాలని డిమాండ్ చేశారు. అభివృద్ధిలో రైతులను భాగస్వాములను చేయాలని, వారి భూములను లాక్కొని కార్పొరేట్ సంస్థలకు అప్పగించడం మానుకోవాలని నినాదాలు చేశారు.

రాష్ట్రంలో విస్తారంగా వర్షాలు

ఈనాడు, విశాఖపట్నం: నైరుతి రుతుపవనాలు, బంగాళాఖాతంలో ఏర్పడిన ఉపరితల ఆవర్తనం ప్రభావంతో రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. ఇప్పటివరకు సరైన వానలు లేక ఆవేదనలో ఉన్న అన్నదాతలు కొంత ఊరట పొందారు. ఆదివారం ఉదయం నుంచి సోమవారం ఉదయం వరకు అత్యధికంగా అద్దంకి (బాపట్ల జిల్లా), ఎస్.కోట (విజయనగరం), మందస (శ్రీకాకుళం), విజయవాడలో 9 సెంటీమీటర్ల చొప్పున, చీమకుర్తి (ప్రకాశం), గుంటూరు, నంద్యాలలో 8 సెంటీమీటర్ల మేర వర్షపాతం నమోదైంది. పశ్చిమ మధ్య, వాయవ్య బంగాళాఖాతంలో దక్షిణ ఒడిశా, ఉత్తర కోస్తా (ఏపీ) తీరాలకు సమీపంలో ఉపరితల ఆవర్తనం కొనసాగుతోంది. దీని ప్రభావంతో గురువారం నాటికి ఉత్తర బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడే అవకాశముందని అమరావతి వాతావరణ కేంద్రం తెలిపింది. దీని ప్రభావంతో రాబోయే నాలుగు రోజుల్లో రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో భారీ వర్షాలకు అవకాశముందని పేర్కొంది. సముద్రంలో గంటకు గరిష్ఠంగా 60 కిలోమీటర్ల వేగంతో ఈదురు గాలులు వీస్తున్నాయని, మత్స్యకారులు వేటకు వెళ్లరాదని హెచ్చరించింది. వర్షాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, చెట్లు, శిథిలావస్థలో ఉన్న గోడలు, భవనాలకు సమీపంలో నిల్చోరాదని విపత్తుల నిర్వహణ సంస్థ ఎండీ ప్రఖర్ జైన్ తెలిపారు.

రాబోయే 4 రోజుల్లో వర్షాలు కురిసే జిల్లాలు..

- మంగళవారం: అల్లూరి సీతారామరాజు, తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి, ఏలూరు, కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు, బాపట్ల, పల్నాడు, ప్రకాశం జిల్లాల్లో కొన్ని చోట్ల ఓ మోస్తరు నుంచి భారీ వర్షాలు, మిగిలిన జిల్లాల్లో తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షాలకు అవకాశం.
- బుధవారం: అల్లూరి సీతారామరాజు, పశ్చిమగోదావరి, ఏలూరు, కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాల్లో ఓ మోస్తరు నుంచి భారీ వర్షాలకు అవకాశం.
- గురువారం: అల్లూరి సీతారామరాజు, విశాఖపట్నం, అనకాపల్లి, డా.బీఆర్ అంబేడ్కర్ కోనసీమ, కాకినాడ, తూర్పుగోదావరి, పశ్చిమ గోదావరి, ఏలూరు జిల్లాల్లో ఓ మోస్తరు నుంచి భారీ వర్షాలకు అవకాశం.
- శుక్రవారం: శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు, విశాఖపట్నం, అనకాపల్లి, కాకినాడ జిల్లాల్లో ఓ మోస్తరు నుంచి భారీ వర్షాలకు అవకాశం.

30న జీఎస్ఎల్‌వీ-ఎఫ్16 ప్రయోగం

కక్ష్యలోకి ఇస్రో, నాసా ఉమ్మడి ఉపగ్రహం నిసార్



ఉష్ణకవచం అమరిక దశలో నిసార్ ఉపగ్రహం

శ్రీహరికోట, న్యూస్‌టుడే: ఇస్రో, నాసాల ఉమ్మడి ఉపగ్రహమైన నాసా, ఇస్రో సింథటిక్ ఎపర్చర్ రాడార్(నిసార్)ను జీఎస్ఎల్‌వీ-ఎఫ్16 వాహకనౌక ద్వారా తిరుపతి జిల్లాలోని షార్(శ్రీహరికోట) నుంచి ఈ నెల 30న సాయంత్రం 5.40 గంటలకు ప్రయోగించనున్నట్లు ఇస్రో పేర్కొంది. ఈ క్రమంలో షార్‌లోని శాటిలైట్ ప్రిపరేషన్ బిల్డింగ్ నుంచి నిసార్ ఉపగ్రహాన్ని రెండో ప్రయోగ వేదిక సమీపంలోని వాహన అనుసంధాన భవనం(వ్యాబ్)కు తరలించారు. అక్కడ జీఎస్ఎల్‌వీ శిఖర భాగాన అనుసంధానం చేయనున్నారు. ప్రత్యేకమైన భూపరిశీలన ఉపగ్రహమైన నిసార్ బరువు 2,392 కిలోలు. ఇది డ్యూయల్ ఫ్రీక్వెన్సీ సింథటిక్ ఎపర్చర్ రాడార్(నాసా ఎల్‌బ్యాండ్, ఇస్రో ఎస్‌బ్యాండ్)తో భూమిని పరిశీలించనుంది. ఈ ఉపగ్రహం భూగోళం మొత్తాన్ని అన్ని వాతావరణ పరిస్థితుల్లో(పగలు, రాత్రి) స్కాన్ చేసి, 12 రోజుల వ్యవధిలో డేటాను అందించనుంది.

శ్రీశైలం జలాశయానికి కొనసాగుతున్న వరద

సున్నిపెంట సర్కిల్– న్యూస్‌టుడే: శ్రీశైలం జలాశయానికి వరద ప్రవాహం కొనసాగుతోంది. జూరాల నుంచి 63,270 క్యూసెక్కులు, సుంకేసుల నుంచి 39,105 క్యూసెక్కులు వస్తోంది. వరదతోపాటు ఎగువ నుంచి కొట్టుకొచ్చిన గుర్రపుడెక్క శ్రీశైలం జలాశయం గేట్ల వద్ద భారీగా పేరుకుపోయింది. జలాశయం నీటిమట్టం సోమవారం సాయంత్రం 6 గంటల సమయానికి 883.40 అడుగులు, నీటినిల్వ 206.9734 టీఎంసీలుగా నమోదైంది.



శ్రీశైలం జలాశయం గేట్ల వద్ద నీటిపై గుర్రపుడెక్క

గ్రహం అనుగ్రహం

22–7–2025 మంగళవారం

శ్రీ విశ్వావసు నామ సంవత్సరం; దక్షిణాయనం; గ్రీష్మ రుతువు, ఆషాఢ మాసం, బహుళపక్షం

ద్వాదశి: ఉ.6-15 తదుపరి త్రయోదశి తె.4-17 తదుపరి చతుర్దశి
మృగశిర: రా.7-44 తదుపరి ఆర్ద్ర; **వర్జ్యం:** తె. 3-45 నుంచి 5-16 వరకు
అమృత ఘడియలు: మ. 11-26 నుంచి 12-57 వరకు
దుర్ముహూర్తం: ఉ.8-13 నుంచి 9-05 వరకు తిరిగి రా.10-59 నుంచి 11-43 వరకు; **రాహుకాలం:** సా.3-00 నుంచి 4-30 వరకు
సూర్యోదయం: ఉ.5.39; **సూర్యాస్తమయం:** సా.6.33

వాతావరణం

ప్రాంతం	గరిష్ఠ	కనిష్ఠ
రాజమహేంద్రవరం	33.5	26.5
శ్రీకాకుళం	33.0	26.0
విశాఖపట్నం	32.8	26.4
తిరుపతి	31.8	27.5
విజయవాడ	31.4	24.2
గుంటూరు	31.0	26.0
కర్నూలు	30.8	23.5
అనంతపురం	30.7	24.4
కడప	30.0	26.0



బాధ తీరుస్తాం.. భోజనమూ వడ్డిస్తాం!

అర్జీదారులకు భోజనం వడ్డిస్తున్న పోలీసులు

అర్జీదారుల సమస్యలు పరిష్కరించడమే కాదు.. వారి ఆకలినీ తీరుస్తామని ముందుకొచ్చారు పల్నాడు పోలీసులు. ప్రతి సోమవారం నరసరావుపేటలోని జిల్లా పోలీసు కార్యాలయంలో జరిగే ప్రజా సమస్యల పరిష్కార వేదికకు పెద్ద సంఖ్యలో అర్జీదారులు వస్తుంటారు. వీరికి గతంలో దాతలు అన్నదానం చేసేవారు. కానీ 2 వారాల నుంచి ఎస్పీ కార్యాలయ సిబ్బందే భోజనాల నిర్వహణను చూసుకుంటున్నారు. మొక్కుబడిగా కాకుండా వెజ్ బిర్యానీ, బంగాళదుంప కూర, పెరుగు పచ్చడి తదితర వెరైటీలను పెడుతున్నారు. స్వయంగా వండి వడ్డిస్తున్నారు. – ఈనాడు డిజిటల్, నరసరావుపేట

'రాజ్యాంగం-జవాబుదారీతనం'పై 27న విజయవాడలో సదస్సు

ఈనాడు, అమరావతి: ప్రజాస్వామ్య విలువలు, బాధ్యతలపై ప్రజల్లో అవగాహన పెంచేందుకు సిటిజన్స్ ఫర్ డెమోక్రసీ (సీఎఫ్‌డీ) 'రాజ్యాంగం- జవాబుదారీతనం' అనే అంశంపై ఈ నెల 27న విజయవాడలోని సిద్ధార్థ ఆడిటోరియంలో సదస్సు నిర్వహించనుంది. ఈ సమావేశంలో ముఖ్యవక్తగా సుప్రీంకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ లావు నాగేశ్వరరావు పాల్గొంటారని, మాజీ అడ్వకేట్ జనరల్ డి.వి.సీతారామమూర్తితో కలిసి ప్రజలతో తమ అభిప్రాయాలు పంచుకుంటారని సీఎఫ్‌డీ కార్యదర్శి, విశ్రాంత ఐఏఎస్ అధికారి డాక్టర్ ఎన్.రమేష్‌కుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. సమాజం మేలు కోరుతూ ఈ తరహా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. గతంలో చేపట్టిన ఓటు హక్కు ఉద్యమంతో దేశంలో అత్యధికంగా 81 శాతం ఓటింగ్ రాష్ట్రంలో నమోదైన విషయాన్ని గుర్తుచేశారు.

హైదరాబాద్ యశోదలో చేరిన ముద్రగడ

కిర్లంపూడి, సామర్లకోట గ్రామీణం, న్యూస్‌టుడే: అనారోగ్యంతో బాధపడుతున్న వైకాపా సీనియర్ నేత ముద్రగడ పద్మనాభరెడ్డి హైదరాబాద్‌లోని యశోద ఆసుపత్రిలో చేరారు. తొలుత సోమవారం ఆయనకు కాకినాడలోని ఓ ఆసుపత్రిలో చికిత్స అందించారు. కొంత మెరుగుపడటంతో కిర్లంపూడి నివాసానికి తీసుకొచ్చారు. తర్వాత గంటకే ఆయనను హైదరాబాద్ తరలించారు.

ముడుపుల ముఠాతో జగన్ సన్నిహితుల భేటీలు

(మొదటి పేజీ తరువాయి)

రాజ్ కెసిరెడ్డితోనూ, ఆయన నిర్వహించే ముడుపుల వసూళ్ల నెట్‌వర్క్ సభ్యులతోనూ భేటీ అయ్యేవారని స్పష్టమైంది. 'మద్యం కుంభకోణంతో మాకేంటి సంబంధం? మమ్మల్ని తప్పుడు కేసుల్లో ఇరికిస్తున్నారు? ఇది నిలబడే కేసు కాదు.' అంటూ మిథున్ రెడ్డి సహా పలువురు నిందితులు, వైకాపా నాయకులు చేస్తున్న ప్రకటనలన్నీ డొల్లేనని తేలిపోయింది.

మిథున్‌రెడ్డి భేటీలు..

■ జగన్‌కు అత్యంత సన్నిహితుడైన పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి ప్రతి నెలా ఒకటి, రెండుసార్లు వసూళ్ల ముఠాలోని సభ్యులను కలిసేవారు. ఉదాహరణకు 2023 మే నుంచి అక్టోబరు మధ్య ఐదుసార్లు వీరి భేటీలు జరిగినట్లు సిట్ గుర్తించింది. ముడుపుల సొమ్ము తాడేపల్లి ప్యాలెస్ (జగన్ నివాసం) సమీపంలో ల్యాండ్ మార్క్ అపార్ట్‌మెంట్‌లోని ఓ డెన్‌తో పాటు హైదరాబాద్‌లోని పలు డెన్‌లలో భద్రపరిచారు. తాడేపల్లి డెన్‌కు ఇన్‌ఛార్జిగా, ఆ సొత్తుకు హ్యాండ్లర్‌గా వ్యవహరించిన ప్రణోయ్ ప్రకాశ్ అనే వ్యక్తితో 2023 జూన్ 10న మిథున్‌రెడ్డి భేటీ అయ్యారు. అది కూడా ఆ డెన్ వద్దే కలిశారు.

■ వైకాపా నేత చెవిరెడ్డి భాస్కరరెడ్డి స్నేహితుడు, ఈ కేసులో నిందితుడైన వెంకటేశ్‌నాయుడు హైదరాబాద్‌లోని ఓ డెన్‌కు ఇన్‌ఛార్జిగా వ్యవహరించారు. అక్కడి నుంచి ఏపీకి సొమ్ము తరలింపులోనూ ఆయన కీలకంగా ఉన్నారు. ఆయనతో హైదరాబాద్‌లోని అపోలో ఆసుపత్రి, పెద్దమ్మగుడి సమీపంలో మిథున్‌రెడ్డి మూడుసార్లు భేటీ అయ్యారు.

■ ఏపీఎస్‌బీసీఎల్‌లోని ఎంఐఎస్ సెక్షన్‌లో పనిచేసే అనూష ద్వారా రియల్‌టైమ్‌లో మద్యం విక్రయాల డేటా తెప్పించుకుని.. దాని ఆధారంగా ఎవరెవరి నుంచి ఎంతెంత వసూలు చేయాలో లెక్కలు తేల్చటంలో సైఫ్ అహ్మద్‌ది (ఏ-10) ప్రధాన పాత్ర. వసూళ్లలోనూ అతనే కీలకం. అతడితోనూ మిథున్ రెడ్డి భేటీ అయ్యారు.

■ మద్యం డిస్టిలరీలు, సరఫరా కంపెనీల నుంచి ముడుపుల కోసం నెట్‌వర్క్ నిర్వహించిన ప్రధాన నిందితుడు రాజ్ కెసిరెడ్డిని హైదరాబాద్‌లోని వన్ వెస్ట్ బిల్డింగ్‌లో కలిశారు.

■ వీటిని బట్టి ఈ మద్యం ముడుపులు, వాటిని భద్రపరిచిన డెన్‌లతో మిథున్‌రెడ్డి సంబంధమేంటనేది తేటతెల్లమవుతోంది.

ఎవరెవరితో	భేటీ తేదీ	ప్రదేశం
1. రాజ్ కెసిరెడ్డి (ఏ1)	21.05.2023	వన్ వెస్ట్ బిల్డింగ్, హైదరాబాద్
2. ప్రణోయ్ ప్రకాశ్ (తాడేపల్లి డెన్ ఇన్‌ఛార్జ్)	10.06.2023	తాడేపల్లి, జగన్ ప్యాలెస్‌కు సమీపం
3. సైఫ్ అహ్మద్ (ఏ-10), వెంకటేశ్‌నాయుడు (ఏ-34)	18.06.2023	అపోలో ఆసుపత్రి సమీపం, హైదరాబాద్
4. వెంకటేశ్‌నాయుడు (ఏ-34)	27.07.2023	జూబ్లీహిల్స్, హైదరాబాద్
5. వెంకటేశ్‌నాయుడు (ఏ-34)	1.10.2023	పెద్దమ్మగుడి సమీపం, జూబ్లీహిల్స్, హైదరాబాద్

గోవిందప్ప బాలాజీ, ధనుంజయరెడ్డిలతో కలిసి.. ముడుపుల ముఠాలతో విజయసాయిరెడ్డి భేటీ

అప్పట్లో వైకాపా ఎంపీగా ఉన్న మరో కీలక నేత విజయసాయిరెడ్డి.. ఈ వసూళ్ల ముఠాతో అనేకసార్లు భేటీ అయ్యారు. ఉదాహరణకు 2023 జూన్ నుంచి సెప్టెంబరు మధ్య ఆయన ఎనిమిదిసార్లు వారితో సమావేశమైనట్లు వెల్లడైంది. వసూళ్లలో కీలకంగా వ్యవహరించే బూనేటి చాణక్య, పైలా దిలీప్, సైఫ్ అహ్మద్, ముప్పిడి అవినాశ్‌రెడ్డి, ఆ సొమ్మును డొల్ల కంపెనీల ద్వారా, హవాలా మార్గాల్లో రూటింగ్ చేసే కిరణ్‌కుమార్‌రెడ్డి, హైదరాబాద్‌లోని డెన్‌కు ఇన్‌ఛార్జిగా వ్యవహరించిన వెంకటేశ్‌నాయుడు, రాజ్ కెసిరెడ్డి తరఫున లీలా డిస్టిలరీస్‌కు ఏపీ ఇన్‌ఛార్జిగా వ్యవహరించి.. దోపిడీలో సహకరించిన పురుషోత్తం వరుణ్‌కుమార్‌లను హైదరాబాద్‌లో కలిశారు. సొమ్ము రూటింగ్‌లో కీలకంగా వ్యవహరించిన భారతి సిమెంట్స్ డైరెక్టర్ గోవిందప్ప బాలాజీ, సీఎంవో అప్పటి కార్యదర్శి కె.ధనుంజయరెడ్డితో కలిసి విజయసాయిరెడ్డి పలుమార్లు ఈ ముడుపుల నెట్‌వర్క్‌లోని సభ్యులతో భేటీ అయినట్లు తేలింది.

విజయసాయి భేటీలు ఇలా..	తేదీ	ప్రదేశం
1. బూనేటి చాణక్య (ఏ-8), వెంకటేశ్‌నాయుడు (ఏ-34)	06.06.2023	జర్నలిస్ట్ కాలనీ, హైదరాబాద్
2. సైఫ్ అహ్మద్ (ఏ-10)	28.06.2023	ఫిల్మ్‌నగర్, హైదరాబాద్
3. ముప్పిడి అవినాశ్‌రెడ్డి (ఏ-7)	28.06.2023	రాజీవ్‌గాంధీనగర్, హైదరాబాద్
4. పురుషోత్తం వరుణ్‌కుమార్ (ఏ-40), కె.ధనుంజయరెడ్డి (ఏ-31), పైలా దిలీప్ (ఏ-30), ముప్పిడి అవినాశ్‌రెడ్డి (ఏ-7), చాణక్య (ఏ-8)	1.07.2023	జూబ్లీ ఇంటర్నేషనల్ సెంటర్, హైదరాబాద్
5. శ్రీకాంత్ (సాక్షి)	7.09.2023	ఎన్‌బీటీ నగర్, బంజారాహిల్స్
6. పైలా దిలీప్ (ఏ-30)	10.09.2023	పార్క్ హయత్ హోటల్, హైదరాబాద్
7. కిరణ్‌కుమార్ రెడ్డి (ఏ-9), వెంకటేశ్‌నాయుడు (ఏ-34) వరుణ్ పురుషోత్తం (ఏ-40), శ్రీకాంత్ (సాక్షి)	11.09.2023	పెద్దమ్మగుడి సమీపం, జూబ్లీహిల్స్, హైదరాబాద్
8. గోవిందప్ప బాలాజీ (ఏ-33), ముప్పిడి అవినాశ్‌రెడ్డి (ఏ-7)	14.09.2023	పెద్దమ్మగుడి సమీపం, జూబ్లీహిల్స్, హైదరాబాద్

గోవిందప్ప కలిసింది ఎక్కడెక్కడ

■ భారతి సిమెంట్స్ డైరెక్టర్, జగన్ సతీమణి భారతి తరఫున ఆర్థిక వ్యవహారాలన్నీ పర్యవేక్షించే గోవిందప్ప బాలాజీ, జగన్‌కు అత్యంత సన్నిహితులు, నిత్యం ఆయన వెన్నంటే ఉండే సీఎంవో మాజీ కార్యదర్శి, విశ్రాంత ఐఏఎస్ అధికారి కె.ధనుంజయరెడ్డి, జగన్ ఓఎస్డీ పి.కృష్ణమోహన్‌రెడ్డిలు ఈ ముడుపుల వసూళ్ల ముఠా సభ్యులతో పలుమార్లు భేటీ అయ్యారు. సాయిరెడ్డితో కలిసి కొన్నిసార్లు, విడిగా కొన్నిసార్లు వీరు బూనేటి చాణక్య, వెంకటేశ్‌నాయుడు, ముప్పిడి అవినాశ్‌రెడ్డి తదితరులతో సమావేశమయ్యారు.

ఎవరెవరితో	తేదీ	ప్రదేశం
1. విజయసాయిరెడ్డి (ఏ-5), బూనేటి చాణక్య (ఏ-8), వెంకటేశ్‌నాయుడు	06.06.2023	జర్నలిస్ట్ కాలనీ, హైదరాబాద్
2. విజయసాయిరెడ్డి (ఏ-5), ముప్పిడి అవినాశ్‌రెడ్డి (ఏ-7)	14.09.2023	పెద్దమ్మగుడి సమీపం, జూబ్లీహిల్స్, హైదరాబాద్

కె.ధనుంజయరెడ్డి సమావేశాలు

■ ధనుంజయరెడ్డి.. పురుషోత్తం వరుణ్‌కుమార్, అవినాశ్‌రెడ్డి, పైలా దిలీప్, ప్రణోయ్ ప్రకాశ్, సైమన్‌లతో భేటీ అయ్యారు. ముడుపుల సొమ్ముతో, మద్యం కుంభకోణంతో ఆయనకు సంబంధం ఉందనేందుకు ఇంతకంటే ఆధారాలేం కావాలి!

ఎవరెవరితో	తేదీ	ప్రదేశం
1. విజయసాయిరెడ్డి (ఏ-5), పురుషోత్తం వరుణ్‌కుమార్ (ఏ-40) పైలా దిలీప్ (ఏ-30), ముప్పిడి అవినాశ్‌రెడ్డి (ఏ-7), చాణక్య (ఏ-8)	1.07.2023	జూబ్లీ ఇంటర్నేషనల్ సెంటర్, హైదరాబాద్
2. ప్రణోయ్ ప్రకాశ్ (సాక్షి), సైమన్ (ఏ-41), పురుషోత్తం వరుణ్ (ఏ-40) కిరణ్‌కుమార్ రెడ్డి (ఏ-8), పైలా దిలీప్ (ఏ-30)	1.07.2023	రోడ్డు నంబర్ 56, జూబ్లీహిల్స్, హైదరాబాద్

పి.కృష్ణమోహన్‌రెడ్డి కలిసింది ఇలా..

ఎవరెవరితో	తేదీ	ప్రదేశం
1. వెంకటేశ్‌నాయుడు (ఏ-34)	6.08.2023	ఆసిఫ్‌నగర్, మెహిదీపట్నం, హైదరాబాద్
2. బూనేటి చాణక్య (ఏ-8)	6.08.2023	రేతిబౌలి, హైదరాబాద్

ధన్‌ఖడ్ అనూహ్య రాజీనామా

(మొదటి పేజీ తరువాయి)

నేను ఉప రాష్ట్రపతి పదవికి రాజీనామా చేస్తున్నా. బాధ్యతల నిర్వహణలో నాకు మద్దతుగా నిలిచిన రాష్ట్రపతికి కృతజ్ఞతలు. పదవీ కాలంలో మేం చాలా ప్రశాంతమైన, అద్భుతమైన వర్కింగ్ రిలేషన్‌ను కొనసాగించాం. ప్రధాన మంత్రి, మంత్రి మండలికీ హృదయపూర్వక ధన్యవాదాలు. ప్రధాని సహకారం, మద్దతు అమూల్యం. విధి నిర్వహణలో నేను ఎంతో నేర్చుకున్నా. పార్లమెంటు సభ్యుల నుంచి లభించిన గౌరవ మర్యాదలు, అభిమానం చిరకాలం గుర్తుంటాయి. భారత్ సాధించిన అద్భుతమైన ఆర్థిక పురోగతికి సాక్షిగా ఉండటం ఎంతో సంతృప్తినిచ్చింది. దాన్ని గొప్ప గౌరవంగా భావిస్తున్నా. పూర్తి గౌరవం, కృతజ్ఞతలతో రాజీనామా సమర్పిస్తున్నా' అని తన రాజీనామా లేఖలో ధన్‌ఖడ్ పేర్కొన్నారు. దేశ 14వ ఉప రాష్ట్రపతిగా బాధ్యతలు నిర్వర్తిస్తున్న ఆయన సోమవారం సాయంత్రం వరకూ ఆరోగ్యంగా కనిపించినప్పటికీ రాత్రికి అదే కారణంతో రాజీనామా చేయడం అందర్నీ ఆశ్చర్యపరుస్తోంది.

పలు అంశాలపై నిర్మొహమాట స్పందన

గుండె సంబంధ సమస్యతో మార్చిలో దిల్లీలోని ఎయిమ్స్‌లో చికిత్స చేయించుకున్న ధన్‌ఖడ్.. ఆ తర్వాత కోలుకుని పార్లమెంటు బడ్జెట్ సమావేశాలు నిర్వహించారు. దేశవ్యాప్తంగా వివిధ సభలు, సమావేశాల్లో పాల్గొని పలు అంశాలపై విస్తృతంగా ప్రసంగాలు చేశారు. జస్టిస్ యశ్వంత్ వర్మ ఇంట్లో నోట్లకట్టలు బయటపడినట్లుగా వచ్చిన ఆరోపణలు, న్యాయ వ్యవస్థ వ్యవహార శైలిపై ఆయన నిర్మొహమాటంగా అభిప్రాయాలను వ్యక్తం చేశారు. సోమవారం సాయంత్రం 4.08 గంటలకు జస్టిస్ యశ్వంత్ వర్మ అభిశంసన తీర్మాన నోటీసు గురించి ఆయన సభలో వివరించారు. మరోవైపు గత డిసెంబరులో అలహాబాద్ హైకోర్టు న్యాయమూర్తి (జస్టిస్ శేఖర్ యాదవ్) అభిశంసన కోసం తన ముందుకు వచ్చిన లేఖ గురించీ ఆయన మాట్లాడారు. ఇలా ప్రభుత్వం ప్రతిపాదించిన జస్టిస్ యశ్వంత్ వర్మ అభిశంసన తీర్మానంతోపాటు ప్రతిపక్షాలు ప్రతిపాదించిన జస్టిస్ శేఖర్ యాదవ్ అభిశంసన తీర్మానాన్ని సభ ముందుంచి.. దానికి 50 మంది సభ్యుల మద్దతుంటే ముందుకు తీసుకెళ్తానని ప్రకటించడం ఆయనకు ఇబ్బందిగా మారిందన్న వాదన వినిపిస్తోంది. ఆ రెండు తీర్మానాల గురించి ప్రకటించిన తర్వాత ఆయన సభ నుంచి వెళ్లిపోయారు. ఇవే ఆయన చివరి మాటలు. ఆ తర్వాత రాత్రికి రాజీనామా లేఖ బయటికొచ్చింది. ఈ మధ్యకాలంలో ఏం జరిగిందన్నది ప్రధానం.

ప్రతిపక్షాలతో తొలి నుంచీ పెడమొహమే

జగదీప్ ధన్‌ఖడ్ సభా నిర్వహణ శైలిపై తొలి నుంచీ ప్రతిపక్షాలు వ్యతిరేకత వ్యక్తంచేస్తూ వచ్చాయి. దానివల్లే ఆయనపై గతంలో అవిశ్వాస తీర్మానం ప్రతిపాదించాయి. ఉప రాష్ట్రపతిపై ఈ అస్త్రాన్ని ప్రయోగించడం తొలిసారిగా ఆయనపైనే జరిగింది. అయితే ఆ తీర్మానాన్ని డిప్యూటీ ఛైర్మన్ హరివంశ్ తిరస్కరించారు. పశ్చిమ బెంగాల్ గవర్నర్‌గా ఉన్నప్పుడు అక్కడి మమతా బెనర్జీ సర్కారుపై వివిధ విషయాల్లో విరుచుకుపడి వార్తల్లోకెక్కారు. ఆ పేరుతోనే ఆయన అనూహ్యంగా ఉప రాష్ట్రపతి పదవిని చేజిక్కించుకున్నారు. వృత్తి రీత్యా న్యాయవాది అయిన ఆయన ఇటీవల న్యాయవ్యవస్థ పని తీరుపై చేసిన వ్యాఖ్యలు మీడియాలో పతాక శీర్షికలకెక్కాయి. ఇంతలోనే అనూహ్యంగా పదవి నుంచి వైదొలిగారు.

మూడో వ్యక్తి..

స్వతంత్ర భారత చరిత్రలో ఉప రాష్ట్రపతి పదవిలో ఉండి పదవీకాలం ముగియకముందే రాజీనామా చేసిన వారిలో ధన్‌ఖడ్ మూడోవారు. అంతకుముందు ఇద్దరు రాజీనామా చేశారు. వారిలో వి.వి.గిరి రాష్ట్రపతి పదవికి పోటీ చేయడం కోసం రాజీనామా చేశారు. రాష్ట్రపతి ఎన్నికల్లో పోటీ చేసి ఓడిపోయిన భైరాన్‌సింగ్ శెకావత్ తన పదవీ కాలానికి నెల ముందుగా రాజీనామా చేశారు. అధ్యక్షులుగా ఎన్నికయ్యాక ఆర్.వెంకట్రామన్, శంకర్ దయాళ్ శర్మ, కె.ఆర్.నారాయణన్ ఉప రాష్ట్రపతి పదవికి రాజీనామా చేశారు. మరో ఉప రాష్ట్రపతి కృష్ణకాంత్ పదవిలో ఉండగా మరణించారు.

ఊహించనిది: కాంగ్రెస్

ధన్‌ఖడ్ రాజీనామా ఊహించని పరిణామమని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ వ్యాఖ్యానించారు. ఆరోగ్య అంశం కంటికి కనిపిస్తున్నా కనిపించనివి ఏవో దీని వెనుక ఉండి ఉంటాయని అభిప్రాయపడ్డారు. సాయంత్రం 5 గంటల వరకూ ఆయనతో ఉన్నానని, రాత్రి 7.30 గంటలకు ఆయనతో మాట్లాడానని, ఆ తర్వాత రాజీనామా నిర్ణయం అనూహ్యంగా వెలువడిందని పేర్కొన్నారు. రాజీనామాను ఆయన ఉపసంహరించుకోవాలని, ప్రధాని ఆయనను ఒప్పించాలని కోరారు.

సిద్ధమవుతున్న ఫ్రీ బస్సులు

● కడప జోన్‌లో 150 వాహనాల్లో మార్పులు చేస్తున్న ఆర్టీసీ

కూటమి ఎన్నికల హామీల్లో ఒకటైన మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ పథకాన్ని అమలు చేసేందుకు ప్రభుత్వం సిద్ధమవుతోంది. ఆగస్టు 15న ప్రారంభమయ్యే ఈ పథకానికి అనుగుణంగా మహిళా ప్రయాణికులను దృష్టిలో ఉంచుకుని బస్సుల్లో ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ మేరకు కడప ఆర్టీసీ జోన్ పరిధిలోని ఎనిమిది జిల్లాల (వైఎస్సార్ కడప, అన్నమయ్య, తిరుపతి, చిత్తూరు, కర్నూలు, నంద్యాల, శ్రీసత్యసాయి, అనంతపురం)కు సంబంధించి కడప ఆర్టీసీ జోనల్ వర్క్‌షాపులో తొలుత 150 బస్సులలో మార్పులు చేస్తున్నారు. అందుకు బిహార్, తమిళనాడు నుంచి వచ్చిన ప్రత్యేక సిబ్బందితో పాటు ఇక్కడి కార్మికులనూ ఉపయోగించి వర్క్‌షాపులో పనులు చేయిస్తున్నారు. ఉచిత బస్సు ప్రయాణం అమలు తేదీ దగ్గర పడుతుండటంతో మరింత వేగం పెంచారు. మహిళల సౌకర్యార్థం బస్సు మధ్యలో తలుపు ఏర్పాటు చేస్తున్నారు. అలానే ఎక్కువ శాతం సీట్లను వనితలకు కేటాయించేలా ప్రత్యేకంగా కొన్నింటికి పసుపు రంగు వేస్తున్నారు. వాటిలో పూర్తిగా మహిళలే కూర్చుంటారు. ఇలాంటి మార్పులతో ఇప్పటికే 90 బస్సులు సిద్ధమయ్యాయి. ఈ పథకం అమలులో ఇతర రాష్ట్రాల్లో ఎదురవుతున్న ఇబ్బందులు ఇక్కడ చోటుచేసుకోకుండా ప్రభుత్వం జాగ్రత్తలు తీసుకుంటోంది.

– ఈనాడు, కడప, న్యూస్‌టుడే, కడప చిన్నచౌకు



వివిధ మార్పులతో సిద్ధమైన బస్సు

మహిళల కోసం ఏర్పాటు చేస్తున్న పసుపు రంగు సీట్లు

కమ్యూనిస్టు యోధుడు అచ్యుతానందన్ కన్నుమూత



తిరువనంతపురం: స్వాతంత్ర్యానికి ముందు, ఆ తర్వాతా ప్రజాపోరాటాల్లో ఆరితేరిన కమ్యూనిస్టు యోధుడు, జీవితాంతం శ్రామికజనుల పక్షపాతిగా నిలిచిన కేరళ మాజీ ముఖ్యమంత్రి వి.ఎస్.అచ్యుతానందన్(101) కన్నుమూశారు. గత నెల 23న గుండెపోటు రాగా తిరువనంతపురంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ సోమవారం మధ్యాహ్నం 3.20 గంటలకు తుదిశ్వాస విడిచారు. భూసంస్కరణలు, సామాజిక న్యాయంతో పాటు సమాజంలోని వివిధ అసమానతల నిర్మూలన కోసం నిరంతరం పోరాడిన వామపక్ష నేత ఆయన. ఐదేళ్లపాటు కేరళ ముఖ్యమంత్రి పదవిలో ఉన్నారు. ఆ రాష్ట్ర అసెంబ్లీకి ఏడుసార్లు ఎన్నికయ్యారు. రెండు దఫాలు శాసనసభలో విపక్ష నేతగా కొనసాగారు. 1964లో భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ)లో చీలిక రాగా సీపీఎంను స్థాపించిన 32 మంది కీలక నేతల్లో అచ్యుతానందన్ ఒకరు. కేరళలో ఆ పార్టీకి బలమైన ప్రజాపునాదిని నిర్మించడంలో ముఖ్య భూమికను పోషించారు. 1923 అక్టోబరు 20న కేరళలో ఓ నిరుపేద కుటుంబంలో జన్మించిన అచ్యుతానందన్... ప్రపంచ కమ్యూనిస్టు చరిత్రలో అనేక కీలక ఘట్టాలను చూసిన అత్యంత అరుదైన నేత. నిరాడంబర జీవితం గడిపిన ఆయన నీతి, నిజాయతీలకు మారుపేరుగా నిలిచారు. సమాజంలోని అక్రమాలనే కాదు సొంత పార్టీలో అపసవ్య పోకడలనూ నిర్మొహమాటంగా నిలదీశారు. అచ్యుతానందన్‌కు భార్య వసుమతి, కుమారుడు అరుణ్‌కుమార్, కుమార్తె ఆశా ఉన్నారు. వీఎస్ మృతి పట్ల సీపీఎం తీవ్ర విచారం వ్యక్తంచేసింది. పార్టీ వ్యవస్థాపకుల్లో చిట్టచివరి నేతను కోల్పోయామని పేర్కొంది. కమ్యూనిస్టు ఉద్యమాలతో ఎనిమిదిన్నర దశాబ్దాల సుదీర్ఘ అనుబంధం ఆయనకుందని తెలిపింది. గౌరవ సూచికంగా పార్టీ పతాకాన్ని అవనతం చేస్తున్నట్లు తెలిపింది. వీఎస్ కుటుంబ సభ్యులకు సంతాపం చెబుతూ సీపీఎం పొలిట్‌బ్యూరో ప్రకటన వెలువరించింది. అచ్యుతానందన్ మృతి పట్ల రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము, ప్రధాని మోదీ, కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, సీపీఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా తదితరులు సంతాపం తెలిపారు.

ఉద్యమాలే ఊపిరి...

వి.ఎస్.అచ్యుతానందన్ జీవితం ఆద్యంతం పోరాటాలే కనిపిస్తాయి. బాల్యంలో పేదరికంతో, యుక్త వయసులో ఆంగ్లేయ పాలకులతో, స్వాతంత్ర్యం అనంతరం భూసంస్కరణల కోసం, అవినీతికి వ్యతిరేకంగా సమరం సాగించారు. వందేళ్ల వయసులోనూ శరీరంలో సత్తువ ఉన్నంత వరకూ కార్మిక హక్కుల పరిరక్షణ, సామాజిక న్యాయం కోసం గొంతెత్తి నినదించారు. ముక్కుసూటి తనం వల్ల సొంత పార్టీలోనూ ఇబ్బందులెదురైనా వెనకడుగు వేయలేదు. రాజకీయాలా, ప్రజాప్రయోజనమా... అనే ప్రశ్న తలెత్తినప్పుడు ప్రజల పక్షపాతిగా నిలిచేందుకే ఇష్టపడ్డారు. పార్టీలోనూ, తెలిసిన వారు ఆయనను ఆప్యాయంగా వీఎస్ అని పిలుచుకుంటారు.

పేదరికం వల్ల ఏడో తరగతి వరకే అచ్యుతానందన్ విద్యాభ్యాసం కొనసాగింది. దర్జీ దుకాణంలో సహాయకుడిగా, కొబ్బరి పీచు కార్మికుడిగా జీవనం సాగించారు. దేశ స్వాతంత్ర్య పోరాటంలోనూ పాల్గొన్నారు. 16ఏళ్ల వయసు (1939)లో స్టేట్ కాంగ్రెస్‌లో చేరారు. ఆ మరుసటి ఏడాదే కమ్యూనిస్టు పార్టీ సభ్యుడయ్యారు. ట్రావెన్‌కోర్ సంస్థానంలో కొనసాగిన భూ పోరాటాల్లో చురుగ్గా పాల్గొన్నారు. ఆ క్రమంలో ఐదున్నరేళ్ల పాటు జైలు జీవితం గడపాల్సి వచ్చింది.

సీపీఎం బలోపేతానికి కృషి

1964లో ఏర్పాటైన సీపీఎం కేరళలో గట్టి పునాదులతో నిలదొక్కుకునేలా చేసేందుకు వీఎస్ కృషి చేశారు. 1967 నుంచి ఏడుసార్లు కేరళ అసెంబ్లీకి ఎన్నికయ్యారు. 2006 అసెంబ్లీ ఎన్నికల్లో రాష్ట్రమంతటా సీపీఎం నేతృత్వంలోని ఎల్‌డీఎఫ్ విజయ బావుటా ఎగుర వేసినా...మరారికుళం స్థానంలో అచ్యుతానందన్‌కు పరాజయం ఎదురైంది. కంచుకోటలాంటి నియోజకవర్గంలో వీఎస్ ఓటమి అందరినీ నివ్వెరపరిచింది. సొంత పార్టీలోని ఓ వర్గం ద్రోహానికి పాల్పడిందనే అభిప్రాయం వ్యక్తమైంది. ఆయన రాజకీయ జీవితం ముగిసిపోతుందని భావించారు. అయితే, ప్రజలు, పార్టీ శ్రేణుల ఒత్తిడితో సీఎం పదవి అచ్యుతానందన్‌ను వరించింది. 2011 వరకూ ఆ పదవిలో కొనసాగారు.

ఆ నాలుగు వైద్య వర్సిటీల్లో చేరొద్దు

● విదేశాలకు వెళ్లేవారికి ఎన్ఎంసీ హెచ్చరిక

ఈనాడు, అమరావతి: విదేశాల్లో వైద్య విద్య అభ్యసించాలనుకునే విద్యార్థులు ఆయా కళాశాలలు జాతీయ వైద్య మండలి (ఎన్ఎంసీ) ప్రమాణాలకు అనుగుణంగా ఉన్నాయో లేదో సరిచూసుకోకపోతే నష్టపోతారని ఆ సంస్థ సోమవారం విడుదల చేసిన 'అలర్ట్ నోటీసు'లో హెచ్చరించింది. ముఖ్యంగా బలీజ్ దేశంలోని సెంట్రల్ అమెరికన్ హెల్త్ అండ్ సైన్సెస్ యూనివర్సిటీ, కొలంబస్ సెంట్రల్ యూనివర్సిటీ, వాషింగ్టన్ యూనివర్సిటీ ఆఫ్ హెల్త్ అండ్ సైన్సెస్‌తోపాటు.. ఉజ్బెకిస్థాన్‌లోని చిర్చిక్ బ్రాంచ్ ఆఫ్ తాష్కెంట్ స్టేట్ మెడికల్ యూనివర్సిటీల్లో చేరవద్దని సూచించింది. ప్రమాణాలకు అనుగుణంగా లేని విశ్వవిద్యాలయాల్లో ఎంబీబీఎస్ చదివితే భారతదేశంలో వైద్యుడిగా రిజిస్ట్రేషన్ పొందే అర్హతను కోల్పోతారని ఎన్ఎంసీ హెచ్చరించింది.

వివేకా హత్యకేసులో.. తదుపరి దర్యాప్తు అవసరమా? కాదా?

(మొదటి పేజీ తరువాయి)

పులివెందులలోని మేజిస్ట్రేట్ కోర్టు తిరస్కరిస్తోంది. అవినాష్‌రెడ్డికి హైకోర్టు ఇచ్చిన ముందస్తు బెయిల్‌ను రద్దు చేయాలని కోరుతున్నాం. ఏ-5 శివశంకర్‌రెడ్డి కుమారుడు జైలుకు వెళ్లి అప్రూవర్ దస్తగిరిని బెదిరించారు. దీనిని తెలంగాణ హైకోర్టుకు నివేదించి శివశంకర్‌రెడ్డికి బెయిల్ ఇవ్వొద్దని కోరాం. మా వాదనలను పరిగణనలోకి తీసుకోకుండా అతనికి హైకోర్టు బెయిల్ ఇచ్చింది. ఆ బెయిల్‌ను రద్దుచేయాలని కోరుతూ మేం ఇక్కడికొచ్చాం' అని సిద్ధార్థ లూథ్రా చెప్పారు. జస్టిస్ సుందరేష్ స్పందిస్తూ... బెయిల్, ముందస్తు బెయిల్ అప్లికేషన్లపై విచారణను పరిగణనలోకి తీసుకుంటామని, అంతకంటే ముందు ఈ కేసు ప్రస్తుతం ఏ పరిస్థితుల్లో ఉందో చెప్పాలని సీబీఐ తరఫున హాజరైన అదనపు సొలిసిటర్ జనరల్(ఏఎస్‌జీ) రాజ్‌కుమార్ భాస్కర్‌ఠాక్రేను అడిగారు. ఆయన బదులిస్తూ.. ట్రయల్‌కోర్టు(హైదరాబాద్‌లోని సీబీఐ ప్రత్యేక కోర్టు)లో ప్రస్తుతం ఈ కేసు సీఆర్‌పీసీ 207 స్టేజ్(అభియోగాల నమోదు)లో ఉందన్నారు. లూథ్రా జోక్యం చేసుకుంటూ నాలుగేళ్ల నుంచీ అక్కడే ఉందని, అంగుళమైనా ముందుకు కదలలేదన్నారు. అందుకు కారణలేమిటని జస్టిస్ సుందరేష్ ఆరా తీశారు. శివశంకర్‌రెడ్డి, మరికొందరు ప్రతివాదుల తరఫున హాజరైన సీనియర్ న్యాయవాది నాగముత్తు స్పందిస్తూ... దర్యాప్తు చేయాల్సి ఉన్నట్లు సీబీఐ చెబుతూ వస్తోందన్నారు. 'తదుపరి దర్యాప్తు చేయాలనుకుంటున్నారా?' అని ఏఎస్‌జీని జస్టిస్ సుందరేష్ ప్రశ్నించారు. ట్రయల్‌కోర్టులో అభియోగాల నమోదుతో సంబంధం లేకుండా దర్యాప్తును స్వతంత్రంగా కొనసాగించవచ్చని ఏఎస్‌జీ చెప్పారు.

ఆ ప్రొసీడింగ్స్‌ను క్రియాశీలకం చేయాలి.. 'మనం ఇప్పుడు ట్రయల్‌కోర్టు ప్రొసీడింగ్స్‌ను క్రియాశీలకం చేయాలి. లేదంటే కేసు అనిశ్చితిలో కొనసాగుతుంది. అందువల్ల 207 స్టేజ్ నుంచి ప్రొసీడింగ్స్‌ను ముందుకు తీసుకెళ్లొచ్చని సంకేతం ఇస్తాం. తదుపరి దర్యాప్తు కోరుతూ తాము దాఖలుచేసిన పిటిషన్ పెండింగ్‌లో ఉన్నట్లు పిటిషనర్ సునీత చెబుతున్నందున, దర్యాప్తు కావాలనుకుంటున్నారా? లేదా? అన్నదానిపై మీరు స్పష్టత ఇవ్వండి? ఆ ప్రకారం పిటిషనర్ అప్లికేషన్‌ను పరిగణనలోకి తీసుకొని మెరిట్స్ ఆధారంగా నిర్ణయం తీసుకోవాలని ట్రయల్ కోర్టుకు చెబుతాం. దర్యాప్తు ఏజెన్సీగా మీ అభిప్రాయం కావాలి' అని సీబీఐ న్యాయవాదిని ఉద్దేశించి జస్టిస్ సుందరేష్ అన్నారు. ఏఎస్‌జీ స్పందిస్తూ దర్యాప్తు సంస్థ అభిప్రాయం తెలుసుకొని చెబుతానని ధర్మాసనానికి విన్నవించారు.

ప్రధాన కారణం అదే... నాగముత్తు వాదనలు వినిపిస్తూ... ట్రయల్ కోర్టులో కేసు 207 స్టేజ్‌ను దాటకపోవడానికి ప్రధాన కారణం సీబీఐ 4,77,800 సాఫ్ట్ ఫైల్స్ కాపీలను దాఖలు చేయడమేనన్నారు. ఒక్కో ఫైల్‌లో 2 పేజీలున్నాయనుకున్నా 10 లక్షల పేజీలవుతాయని, వాటిని చదవడానికి ట్రయల్‌కోర్టు ఇబ్బంది పడుతోందన్నారు. జస్టిస్ సుందరేష్ జోక్యం చేసుకుంటూ... అందుకే దర్యాప్తుపై సీబీఐ అభిప్రాయాన్ని కోరామన్నారు. తదుపరి విచారణను సుప్రీంకోర్టు ఆగస్టు 8న చేపట్టనుంది.

కొత్త పరుపు.. దిండ్లు.. మంచం.. దోమతెర

● ఇంటి భోజనం.. కిన్లే వాటర్ బాటిళ్లు

● జైల్లో ప్రత్యేక వసతుల కోసం మిథున్‌రెడ్డి పిటిషన్లు

ఈనాడు, అమరావతి: అల్పాహారం సహా మూడు పూటలా ఇంటి భోజనం.. కిన్లే వాటర్ బాటిళ్లు.. కొత్త పరుపుతో కూడిన మంచం.. కొత్త దిండ్లు.. వెస్టన్ కమోడ్ కలిగిన ప్రత్యేక గది.. అందులో ఓ టీవీ, సేవలందించేందుకు సహాయకుడు.. దినపత్రికలు.. దోమ తెర, వాకింగ్ షూలు.. ఇవీ మద్యం కుంభకోణం కేసులో అరెస్టయి, జైల్లో రిమాండ్ ఖైదీగా ఉన్న ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి అడిగిన సదుపాయాలు. జైల్లో తనకు ఈ ప్రత్యేక వసతులు కల్పించాలంటూ విజయవాడ ఏసీబీ కోర్టులో రెండు వేర్వేరు పిటిషన్లు దాఖలు చేశారు. వీటితో పాటు ప్రొటీన్ పౌడర్, ఓ టేబుల్, దానిపై తెల్లకాగితాలు, పెన్ను ఏర్పాటు చేయాలని, యోగా మ్యాట్ ఇప్పించాలని కోరారు. ఈ పిటిషన్లపై విజయవాడ ఏసీబీ న్యాయస్థానం సోమవారం విచారణ జరిపింది. వాటిపై అభ్యంతరాలుంటే చెప్పాలని రాజమహేంద్రవరం కేంద్ర కారాగారం సూపరింటెండెంట్‌ను ఆదేశించింది. మంగళవారం ఉదయం నేరుగా కోర్టులో హాజరై అభ్యంతరాలు చెప్పాలని నిర్దేశించింది.

క్వార్ట్జ్ అక్రమ రవాణా కేసులో మాజీ మంత్రికి బిగుస్తున్న ఉచ్చు!

● పోలీసుల అదుపులో ఆయన అనుచరుడు బిరదవోలు శ్రీకాంత్‌రెడ్డి

ఈనాడు, నెల్లూరు: క్వార్ట్జ్ అక్రమ తవ్వకాలు, రవాణా కేసులో శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాకు చెందిన మరో మాజీ మంత్రి చుట్టూ ఉచ్చు బిగుస్తోంది. వైకాపా ప్రభుత్వ హయాంలో అధికారం అండగా రూ.కోట్ల విలువైన క్వార్ట్జ్ అక్రమ మైనింగ్, రవాణా, నిబంధనలకు విరుద్ధంగా పేలుడు పదార్థాలను వినియోగించడంపై పొదలకూరు పోలీసు స్టేషన్‌లో కేసు నమోదైంది. ఇందులో మాజీ మంత్రి అనుచరుడు బిరదవోలు శ్రీకాంత్‌రెడ్డిని పోలీసులు సోమవారం హైదరాబాద్‌లో అదుపులోకి తీసుకుని నెల్లూరుకు తీసుకువస్తున్నారు. ఈయన నాటి మంత్రితో సన్నిహితంగా ఉండటంతో పాటు ఆయన ఆర్థికపరమైన విషయాల్లో కీలకంగా వ్యవహరించినట్లు సమాచారం. దాంతో క్వార్ట్జ్ కేసులో ఆ నాయకుడి పాత్ర బయటకు రానుందనే ప్రచారం జరుగుతోంది. ఈ కేసులో మాజీమంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి అరెస్టు అయి రిమాండ్ ఖైదీగా ఉన్న విషయం తెలిసిందే.


ఈనాడు

ఈయూ ద్వంద్వ ప్రమాణాలు

గాజాలో జాతిహననానికి పాల్పడుతున్న ఇజ్రాయెల్‌ను అమెరికా, ఐరోపా యూనియన్ (ఈయూ) గట్టిగా వారించట్లేదు సరికదా, భారీగా ఆయుధ సాయంచేస్తూ వెన్నుతడుతున్నాయి. టెల్‌అవీవ్ అకృత్యాలపై ఎన్నో కథనాలు వెలువడుతున్నప్పటికీ వేచిచూసే ధోరణినే అవలంబిద్దామని ఇటీవల విదేశాంగ మంత్రుల సదస్సులో ఈయూ దేశాలు తీర్మానించాయి. అలా ఇజ్రాయెల్‌ను చంకనెక్కించుకుంటున్న పాశ్చాత్య రాజ్యాలు రష్యా మీద రుసరుసలాడుతూ- వినాశకర యుద్ధాలను నిరసించడంలో తమ ద్వంద్వ ప్రమాణాలను బయటపెట్టుకుంటున్నాయి. మాస్కోతో వ్యాపారం చేసే దేశాలపై వందశాతం సుంకాలు వడ్డిస్తామన్న అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఇటీవలి హెచ్చరిక ఆ కోవలోదే. ఆయన ఒత్తిడితోనే రక్షణ బడ్జెట్‌ను అమాంతం పెంచడానికి ఇటీవల నాటో దేశాలు తలూపాయి. అదే క్రమంలో రష్యాపై ఈయూ దేశాలు తాజాగా మరోసారి ఆంక్షల కొరడా ఝుళిపించాయి. ఆ ప్రభావం భారత్‌పైనా పడనుంది. దేశీయంగా రెండో అతిపెద్దదైన నయారా ఎనర్జీ రిఫైనరీ నుంచి శుద్ధి చేసిన పెట్రోల్, డీజిల్ వంటివి కొనకూడదని ఈయూ నిశ్చయించింది. రష్యా ఇంధన దిగ్గజం రాస్‌నెఫ్ట్‌కు 49శాతం వాటా ఉన్న ఈ సంస్థపై పాశ్చాత్య దేశాల నిషేధాజ్ఞల మూలంగా ఇండియా చమురు ఎగుమతులు భారీగా ప్రభావితం కానున్నాయి!

మాస్కో యుద్ధపిపాసను ఖండిస్తూ 2022లో జీ7 దేశాలు దాని చమురు ఎగుమతి ధరలపై పరిమితి విధించాయి. పాశ్చాత్య దేశాలు అక్కసు వెళ్లగక్కుతున్నా స్వదేశీ అవసరాల నిమిత్తం రష్యా నుంచి పెద్దయెత్తున చమురును చవగ్గా ఇండియా కొనుగోలు చేసింది. తద్వారా స్వీయ ప్రయోజనాల విషయంలో ఎవరి ఒత్తిళ్లకూ తలొగ్గేది లేదని తేల్చిచెప్పింది. రష్యా నుంచి తెప్పించుకుని శుద్ధిచేస్తున్న ఇంధనాన్ని మన దగ్గరి నుంచి భారీగా దిగుమతి చేసుకుంటున్న వాటిలో ఈయూ దేశాలూ ఉన్నాయి. 2023-24 ఆర్థిక సంవత్సరంలో 1,920 కోట్ల డాలర్ల విలువైన పెట్రోలియం ఉత్పత్తులను ఈయూకి ఇండియా ఎగుమతి చేసింది. తరవాతి ఏడాది అవి 1,500 కోట్ల డాలర్లకు తగ్గాయి. అమెరికా, యూకే, కెనడా వంటివి మినహా మిగిలిన దేశాల నుంచి చమురు తీసుకోవద్దన్నది ఈయూ నేటి పంతం. దానివల్ల సరఫరాలు సన్నగిల్లి ఆ కూటమి దేశాలకే ఇక్కట్లు తప్పవన్నది ఒక అంచనా. అయినా ఆంక్షల కత్తికి పదునుపెట్టడానికే అవి తీర్మానించుకున్న నేపథ్యంలో ఇంధన ఉత్పత్తుల ఎగుమతులకు కొత్త మార్కెట్లను అన్వేషించడం ఇండియాకు అనివార్యం!

భారత్‌కు అతిపెద్ద వాణిజ్య భాగస్వాముల్లో ఈయూ ఒకటి. మనం తెచ్చుకుంటున్న వాటితో పోలిస్తే- ఆయా దేశాలకు ఎగుమతి చేస్తున్న సరకుల విలువే ఎక్కువ. గత ఆర్థిక సంవత్సరం ద్వైపాక్షిక వస్తు వాణిజ్య విలువ దాదాపు 13,600 కోట్ల డాలర్లు. దీన్ని మరింత బలోపేతం చేసుకోవడానికి ఈ ఏడాది చివరికల్లా స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాన్ని (ఎఫ్‌టీఏ) పట్టాలకెక్కించాలని ఉభయ పక్షాలు భావిస్తున్నాయి అందుకోసం చర్చల ప్రక్రియను వేగవంతం చేశాయి. ఈ ఒప్పందం ఒక కొలిక్కి వస్తే ఆధునిక సాంకేతికతలు, హరిత ఇంధనాలు, పరిశోధన, రక్షణ, అంతరిక్ష రంగాల్లో పరస్పర శ్రేయోదాయకమైన స్నేహబంధం కొత్త చివుళ్లు తొడుక్కుంటుంది. ఇరుపక్షాలకూ లాభసాటి కాగలిగిన ఎఫ్‌టీఏపై అడుగులు ముందుకు పడుతున్న తరుణంలో న్యూదిల్లీని విశ్వాసంలోకి తీసుకోకుండా ఈయూ ఏకపక్షంగా ఆంక్షలు విధించడమే విస్మయపరుస్తోంది. వాటిని సమ్మతించేది లేదని స్పష్టంగా ప్రకటించిన ఇండియా ఇప్పుడు తన ప్రయోజనాల పరిరక్షణకు ఎలాంటి దౌత్యవ్యూహం అనుసరిస్తుందో చూడాలి!



మనకు ఇప్పుడు మానవీయ విలువలను నేర్పే విద్య కావాలి. సాటి మనుషుల పట్ల సహానుభూతితో మెలగడం నేర్పాలి. ఉత్పత్తి ఆధార ఆర్థిక వ్యవస్థలో భాగమై జీవనాధారాన్ని కల్పించుకోగల నైపుణ్యాలను విద్యార్థి దశలోనే అలవరచాలి.

– సందీప్ పాండే, సామాజికవేత్త

అంతా భ్రాంతియేనా!

అనుబంధాలూ అనుభవాలూ అనుభూతులూ... అన్నీ మన భ్రమలేనా? నిద్రలో కలగంటున్నామా? మేల్కొన్నాక ఈ బంధాలన్నీ మాయ అని తెలుస్తుందా? మన భావాలు, భావనలన్నీ భ్రాంతి మాత్రమేనా? చీకటిలో కాళ్లకు ఏదో చుట్టుకుంటుంది. పాము అనుకుని కేకలు వేస్తాం. ఎవరో దీపం వెలిగించి చూస్తారు. కాలికి చుట్టుకున్నది తాడని తెలిసి... ఒక్కసారిగా ఊపిరి పీల్చుకుంటాం. జీవితమూ ఇంతేనా... ఆదిశంకరులు అన్నట్లు ఈ లోకంలో మన అవస్థ కేవలం రజ్జు సర్పభ్రాంతేనా?

మన చుట్టూ ఉన్న బంధాలన్నీ భ్రాంతి అంటే నమ్మలేం. అవన్నీ అవసరాలు, సందర్భోచితాలు అనుకుంటాం. ఎవరూ శాశ్వతం కాదని అర్థమయ్యాక, ఒక్కొక్కరు కళ్లముందు నుంచి మాయమవుతుంటే అప్పుడు... ఈ జీవితమే మాయ, భ్రాంతి అని తెలిసొస్తుంది. మండుతున్న కట్టెను గాలిలో గిర్రున తిప్పితే అగ్ని వలయంలా ఏర్పడుతుంది. తిప్పడం ఆపితే వలయం మాయమవుతుంది. ఆ వలయంలాగే మనసు నిలకడ చేసి చూస్తే ఇదంతా భ్రాంతి అని తెలుస్తుంది. మన పేరు, ప్రతిష్ఠ అన్నీ భ్రాంతి అంటే నమ్మ బుద్ధి కాకపోయినా వాస్తవం ఇదే.



అంతర్యామి

పొలంలో పనిచేస్తున్న రైతు దగ్గరికి ఒక వ్యక్తి వచ్చి 'మీ అబ్బాయి పాము కరిచి చనిపోయాడు' అని చెబుతాడు. రైతు నిర్వికారంగా 'రాత్రి కలలో నేనొక మహారాజును. నా కొడుకు వేటకు వెళ్లి సింహం దాడిలో చనిపోయాడు. కళ్లు తెరిచి చూస్తే కొడుకు లేడు. సింహం లేదు. కలలో పోగొట్టుకున్న కొడుకు గురించి బాధపడాలా? ఇప్పుడు మరణించిన కొడుకు గురించి ఏడవాలా...' అంటాడు. కలలో జరిగేవి నిజం కాదని మనకు తెలుసు. అందుకే అక్కడ ఎంత భయానక దృశ్యాన్ని చూసినా మేల్కొన్నాక భయపడం. కానీ ఆ రైతు- జీవితాన్ని కూడా కలగా, భ్రాంతిగా భావించి నిర్వికారంగా అంతిమ సంస్కారం చేస్తాడు. ఇంత స్థితప్రజ్ఞత, మానసిక స్థిరత్వం.. వాస్తవం తెలుసుకుంటేనే సాధ్యం.

మట్టిలో కలిసిపోయే మాయబొమ్మకు తోడుగా చివరికి మిగిలేది ధనధాన్యాలు కావు, ధర్మం మాత్రమేనంటూ ప్రబోధించే తత్వగీతాలు ఒకప్పుడు బాగా వినపడుతుండేవి. మూణ్నాళ్ల ముచ్చటకు మురిసి మైకంలో పడకు అంటూ హెచ్చరించేవి. అలా ఈ లోకపు అసలు స్వరూపాన్ని తెలియజేస్తూ యథార్థ దర్శనం చేయించేవి. ఆ తత్వాల అంతరార్థాలను అవగతం చేసుకుంటే- జరిగే ప్రతి సంఘటనకు ఉద్వేగపడటం కాకుండా నిర్వికల్పంగా ఉండే స్థితి సిద్ధిస్తుంది.

నిజ జీవితంలో కూడా అనేక దృశ్యాలు.. అనేక సంఘటనలు. అవన్నీ వారి వారి మానసిక పరిస్థితిని బట్టి నిజాలుగా కనిపించే భ్రాంతులు. ఇది అర్థం చేసుకుంటే ఎవరి పైనా మితిమీరిన వ్యామోహం, పగ, కోపం, అసూయ, ద్వేషం ఉండవు. గుర్తింపు కోసం ఆరాటం ఉండదు. ఇవన్నీ మనసు తెరపై కదలాడే చిత్త వృత్తులు మాత్రమే. యోగసాధన, భగవదారాధన మాత్రమే మనసుకు ప్రశాంతతనిచ్చి, ప్రపంచపు వాస్తవ స్వరూపాన్ని మనకు చూపించగలవు.

– శివలెంక ప్రసాదరావు

సామాన్యుల కవితా స్వరం

సురవరం ప్రతాపరెడ్డి 1944లో వరంగల్ కోటలో చలువ పందిళ్లు వేయించి కవి సమ్మేళనం ఏర్పాటు చేశారు. ఆ పందిళ్లను రజాకార్ల మూక తగలబెట్టింది. అప్పుడు ఆ బూడిద కుప్ప మీద చెప్పులు లేని కాళ్లతో నిలబడి ధైర్యంగా కవిత్వం వినిపించాడొక యువకుడు. ఆయనే దాశరథి కృష్ణమాచార్య. ప్రజాపక్షం వహిస్తూ నిరంకుశత్వంపై కవితాగ్నిధారలు కురిపించిన దాశరథి శతజయంతి నేడు.

తెలుగు సాహిత్యం గర్వించే మహాకవి దాశరథి కృష్ణమాచార్య. ఇప్పటి మహబూబాబాద్ జిల్లా చిన్న గూడూరు గ్రామంలో 1925 జులై 22న ఆయన జన్మించారు. పుట్టిన ఊరితో పాటు ఖమ్మంలో విద్యాభ్యాసం చేశారు. ఏడో తరగతి చదువుతున్నప్పుడే తోటి విద్యార్థులకు ఇంగ్లీషు వ్యాకరణం, ఉర్దూ ట్యూషన్ చెప్పారు. అలా వచ్చిన డబ్బుతో తన అవసరాలు తీర్చుకునేవారు. ఇక్బాల్ కవిత్వం బాల దాశరథిలో ధిక్కార బీజాలు నాటింది. ఆ చైతన్యపూరిత విత్తనాలే భవిష్యత్తులో అగ్నిధారగా మారాయి. నిజాం వ్యతిరేకంగా సాగిన తొలి సాయుధ రైతాంగ పోరాటంలో దాశరథి భాగస్వామి అయ్యారు. 'ఓ నిజాం రాజ పిశాచమా కానరాడు నిన్నుబోలిన రాజు మాకెన్నడేని.. తీగలను తెంపి అగ్నిలోన దింపినావు.. నా తెలంగాణ కోటి రతనాల వీణ' అంటూ నాటి రాచరిక పాలనపై సూటిగా తన పద్యాల కాగడాలతో అక్షరాల నిప్పులు కురిపించారు. నాటి జమీందారులు భూస్వాముల అరాచకాలూ అన్యాయాలూ అక్రమాలను తన పద్యాల్లో ఎండగట్టారు. అద్భుత ఉపన్యాస ప్రావీణ్యంతో ప్రజల్లో చైతన్యం నింపారు.



ఆలోచింపజేసే అక్షరాలు...

తెలుగు, ఉర్దూ, ఆంగ్ల సాహిత్యాల్లో గొప్ప కవిత్వ మెలకువలు ఎరిగిన లాక్షణికుడు దాశరథి. ఆయన ఆశయవాది మాత్రమే కాదు ఆచరణశీలి కూడా. అందుకే తెలంగాణ రైతాంగ పోరాటంలో ప్రత్యక్షంగా పాల్గొన్నారు. నిజాం ప్రభుత్వం జైలు శిక్ష వేస్తే, దాశరథిని నిజామాబాద్ కోటలో ఖైదు చేశారు. అక్కడ పళ్లు తోముకునే బొగ్గు ముక్కతో జైలు గోడలపై పద్యాలు రాసి తన తెగువ చాటుకున్నారు. ఆంధ్ర మహాసభలోనూ గణనీయమైన పాత్ర పోషించారు. తెలంగాణ మట్టి స్వభావాన్ని తన కవితాక్షరాలలో పొదిగి, ప్రజలతో మమేకమయ్యారు. కవిగా దాశరథి అనేక నూతన పోకడలు పోయారు. తాను చదివిన ఉర్దూ ఆంగ్లం తెలుగు భాషల్లోని సాహిత్య సౌందర్యాన్ని తన కవిత్వంలో అద్భుతంగా చిత్రీకరించారు. మీర్జా గాలిబ్ గీతాలను తెలుగులోకి అనువదించారు. పర్షియన్ భాషలో నాలుగు పాదాలతో కూడిన రసాత్మకమైన రుబాయత్‌లను 'రుబాయిలు'గా తెలుగులో ప్రయోగాత్మకంగా రాశారు. నిజాంపై వ్యతిరేకతే కాకుండా అనంతరం ఏర్పడిన స్వతంత్ర భారత ప్రభుత్వ నాయకత్వంపై వ్యంగ్యాత్మకంగా రాసిన రుబాయి ఇది- 'కళ్లెం ఉన్నది చేతిలో.. గుర్రం మాత్రం పడ్డది గోతిలో'! 'స్వర్గమును గూర్చి నాకు సర్వమ్ము తెలియు.. మనసు సంతపడుటకు మంచి ఊహ; ప్రతిది సులభమ్ముగా సాధ్యపడదు లెమ్ము.. నరుడు నరుడౌట యెంతొ దుష్కరము సుమ్ము' అంటూ దాశరథి కలం ద్వారా తెలుగులోకి వచ్చిన గాలిబ్ గీతాలు ఆలోచింపజేస్తాయి.

తెలంగాణతనాన్ని పుణికిపుచ్చుకుని మొదట పద్యం, ఆ తరవాత వచన కవిత్వం మహోన్నతంగా రాశారు దాశరథి. వందలాది సినిమా పాటలతో ప్రజలను రసడోలికలలో ఓలలాడించారు. అగ్నిధార, రుద్రవీణ, మహాంధ్రోదయం వంటి ఖండకావ్యాలను వెలువరించారు. దాశరథి 'కవితా పుష్పకం' ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ ఉత్తమ కవితా పురస్కారం అందుకుంది. 'తిమిరంతో సమరం' కవితా సంపుటిని కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు వరించింది. తన కవితలతో సామాన్యులను సైతం కదిలించారు. హైదరాబాద్‌లోని నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో ఏర్పాటు చేసిన తెలుగు ఉర్దూ కవుల ముషాయిరాకు అధ్యక్షత వహించేందుకు ఒకసారి దాశరథి సికింద్రాబాద్‌లో రైలు దిగారు. గ్రౌండ్ వరకు ఒక రిక్షా మాట్లాడుకున్నారు. కార్యక్రమంలో ఒక ఉర్దూ కవి వేదికపైకి వచ్చి కవిత వినిపిస్తుంటే, అతణ్ని ఎక్కడో చూసినట్లు అనిపించింది. అంతకు ముందు అతడి రిక్షాలోనే అక్కడికి వచ్చినట్లు గుర్తించి సంభ్రమాశ్చర్యానికి లోనయ్యారు. వెంటనే తన శాలువాను ఆ కవికి కప్పి సన్మానించారు. ఈ మధుర జ్ఞాపకాన్ని తన ఆత్మకథలో రాసుకున్నారు. కవిత్వంపై దాశరథికి ఉన్న ఎనలేని ఆరాధనా భావానికి అదో నిదర్శనం.

ప్రతి మాటలో నిజాయతీ...

దాశరథిని 1977లో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రాష్ట్ర ఆస్థాన కవిగా నియమించింది. తెలుగు కవిత్వంలో దాశరథి ముద్ర అజరామరమైంది. ఎవరి వైపు నిలబడి కవిత్వం రాయాలన్నదానిపై ఆయనకు పూర్తి స్పష్టత ఉంది. 'లేదు లేదు చల్లారగా లేదు పేదదాని గుండియలోని శ్మశాన వహ్ని.. కాల్చివేయును, బంగారు గద్దెలెక్కి పేదలను సిగరెట్లుగా పీల్చువారి; ఊరి ఊరి పొలిమేరలు మారీ.. దేశ దేశ సహవాసం కోరీ.. జాతిమతాలను పాతరవేసీ..; పచ్చనోట్లతో కొందరు.. కత్తిపోట్లతో కొందరు.. ప్రజల వోట్ల విలువను.. పడగొట్టాలని చూస్తున్నారు; వెనక్కి పోతూ.. ముందుకు పోతున్నామనుకునే.. వెర్రి వెంగళాయల.. 'విజ్ఞాన జ్యోతులు' అజ్ఞానపు రీతులు..' వంటి పంక్తులు అందుకు చక్కని ఉదాహరణలు. అందుకే, దాశరథి కవిత్వానికి ప్రాసంగికత ఎప్పటికీ ఉంటుంది. పద్యం రాసినా, కవిత్వం, రేడియో నాటకాలు రచించినా, యాత్రా స్మృతి (ఆత్మకథ) వెలువరించినా.. ప్రతి వాక్యంలో ఆయన నిజాయతీ నిబద్ధత నిక్కచ్చితనం కనిపిస్తాయి. ప్రజాకవిత్వంతో పాటు ఎల్లకాలం ప్రజల హృదయాల్లో నిలిచిపోయే గొప్ప సినిమా పాటలూ రాశారు దాశరథి. 'ఖుషీఖుషీగా నవ్వుతూ చలాకి మాటలు రువ్వుతూ; నీవు రావు నిదుర రాదు..' వంటివి ఆ కోవలోవే! 'ఆ చల్లని సముద్ర గర్భం దాచిన బడబానలమెంతో.. ఆ నల్లని ఆకాశంలో కానరాని భాస్కరులెందరో' లాంటి గేయాలైతే దాశరథి రచనలోని పదునును పట్టిచూపుతాయి. 1987లో దాశరథి కలం పూర్తిగా మూగబోయింది. అయితే, ఆయన పాటించిన విలువలు, నడిచిన అడుగుజాడలు తెలుగు సాహిత్యం ఉన్నంతవరకూ చిరంజీవిగా నిలుస్తాయి.



జూకంటి జగన్నాథం
ప్రముఖ కవి, రచయిత,
దాశరథి పురస్కార గ్రహీత

రెండేళ్ల క్రితం జేసన్ ఆర్డేకి కేంబ్రిడ్జి యూనివర్సిటీలో సోషియాలజీ ప్రొఫెసరుగా ఉద్యోగం వచ్చింది. ఆ వార్త పేపర్లో రాగానే అతణ్ని అభినందిస్తూ ఏకంగా రెండు లక్షల ఈ-మెయిల్స్ వచ్చాయి. ఆయనేమీ ప్రధానో, ప్రెసిడెంటో కాలేదు, మామూలు ప్రొఫెసరేగా అయింది... ఆ మాత్రానికే ఎందుకింతగా అభినందనల వెల్లువ అంటే- జేసన్‌కి చాలా ప్రత్యేకతలున్నాయి మరి. అతడు ఆ యూనివర్సిటీలో ప్రొఫెసరుగా చేరిన అత్యంత పిన్నవయస్కుడు(37 ఏళ్లు), నల్లజాతికి చెందినవాడు. వర్ణ, జాతి వివక్షలనే కాదు మరో రకమైన వివక్షనూ అధిగమించాడు జేసన్. అతడికి ఆటిజం ఉంది. అవును... కరెక్టుగానే చదివారు. అతడు ఇప్పుడు ప్రొఫెసరుగా పీహెచ్‌డీ విద్యార్థులకు మార్గదర్శకత్వం

మనసు పెట్టాలే కానీ...



వహిస్తున్నాడు. పలు అంశాలపై పరిశోధన చేస్తున్నాడు. చారిటీకి నిధుల సేకరణ కార్యక్రమాలు చేపడుతుంటాడు. ఉన్నత విద్యలో జేసన్ సాధించిన విజయాలకుగాను నాలుగు పదులన్నా నిండకుండానే అయిదు గౌరవ డాక్టరేట్లు అందుకున్నాడు. ఆటిజంతో పెరిగేవారు తమ పనులు తాము చేసుకోవడమే గొప్ప. అలాంటిది ఇదంతా ఎలా సాధ్యమైందీ... 'మనలో సంకల్పముంటే- నైపుణ్యాలదేముంది, అవే వచ్చేస్తాయి' అంటాడు జేసన్ నవ్వుతూ.

జేసన్ తండ్రి షెఫ్. తల్లి నర్సుగా పనిచేస్తూనే జాతివివక్షకు వ్యతిరేకంగా పోరాడేది. జేసన్‌కి ఆటిజం ఉందని తెలిసినప్పటినుంచి పిల్లాణ్ని తనవెంటే ఉంచుకునేది. పదకొండేళ్లవరకూ జేసన్‌కి మాటలే రాలేదు. గంటల తరబడి స్పీచ్ థెరపీలు ఇప్పించడమే కాకుండా పాటల రూపంలో పదాలు చెప్పడానికి ప్రయత్నించేది తల్లి. వ్యర్థప్రయత్నం వద్దనీ పునరావాస కేంద్రంలో చేర్పించమనీ సలహాలిచ్చేవారు అందరూ. ఆమె మాత్రం పట్టువదల్లేదు, పదకొండో ఏట జేసన్‌కి మాటలు వచ్చాయి. పద్దెనిమిదేళ్లకి చదవడం మొదలెట్టాడు. ఆ తరవాత ఇక వెనుదిరిగి చూడలేదు. కష్టపడి చదివి ఎంఏ, ఎంఈడీ, పీహెచ్‌డీ పూర్తిచేశాడు. ఫీజుల కోసం బాత్రూములు కడగడం సహా అతడు చేయని పని లేదు. 'ఒకటే అనుకునేవాణ్ని. ఇదేదీ శాశ్వతం కాదని' అంటాడు ప్రొఫెసర్ జేసన్.

అతడికి పాఠశాల విద్య, సిలబస్ రూపకల్పన, మానసిక ఆరోగ్యం లాంటివి ఇష్టమైన విషయాలు. ఆ రంగాల్లోనే ఎన్నో పరిశోధనాపత్రాలను సమర్పించాడు. పుస్తకాలు రాశాడు. తల్లి దగ్గర్నుంచీ సంఘసేవను అందిపుచ్చుకున్న జేసన్ పలు స్వచ్ఛంద సేవాసంస్థలకు ఆర్థికసాయం చేస్తున్నాడు. 'అందరూ నిరుత్సాహపరుస్తున్న సమయంలో ఒక ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్ అండగా నిలిచి నన్ను సానబట్టారు. అదే నా జీవితంలో మేలిమలుపైంది. అందుకు ఆయన ఎలాంటి ప్రతిఫలమూ తీసుకోలేదు. తాను నాకు చేసినట్లే నేను మరెందరికో చేయగలననేవారు. అదెప్పటికీ మరచిపోను' అంటాడు జేసన్. పుస్తకాల్లో కూరుకుపోవడం వల్ల లాభమేమీ లేదు, నువ్వు చేసేది ఏదైనా మనుషుల్ని ప్రభావితం చేయాలని గుర్తుంచుకోమన్న తండ్రి మాటనీ ఆచరణలో పెడుతున్నాడు. మనసుంటే మార్గముంటుంది అని పెద్దలు చెప్పింది ఇలాంటి వారి గురించే కదా!

– విస్మయ



సాగురంగమే ఆధారం

ఇండియాలో ఎక్కువ మందికి వ్యవసాయమే జీవనాధారం. 2013లో దేశీయంగా మొత్తం శ్రామిక శక్తిలో సాగురంగంపై ఆధారపడిన వారు 46.2శాతం ఉంటే, 2019 నాటికి 40శాతానికి తగ్గింది. కొవిడ్ మహమ్మారి విజృంభణతో వ్యాపారం, నిర్మాణ కార్యకలాపాలు వంటివి దెబ్బతినడంతో పట్టణాల నుంచి పెద్దసంఖ్యలో ప్రజలు స్వస్థలాలకు తరలివెళ్లారు. దాంతో వ్యవసాయంపై ఆధారపడి జీవించేవారి సంఖ్య మళ్లీ పెరిగింది. కరోనా పరిస్థితులు కుదుటపడిన తరవాతా పరిస్థితిలో మార్పు రాలేదు. 2004-18 మధ్య వ్యవసాయ శ్రామికుల సంఖ్య 6.6 కోట్లు తగ్గితే, 2017-24 మధ్య అది మళ్లీ 6.8 కోట్లకు పెరిగింది. గడిచిన నాలుగేళ్లలో శ్రామిక శక్తిలో సాగురంగంపై ఆధారపడినవారు...

(శాతాల్లో)



(ఆధారం: స్టాటిస్టా)

నాటి చీకటిని మరవలేం కానీ...


ప్రభుత్వంపై పెరిగిన రాజకీయ, ఆర్థిక ఒత్తిళ్లకు కోర్టు తీర్పు తోడై యాభై ఏళ్ల క్రితం ఇందిరాగాంధీ గద్దెదిగాల్సిన సమయమొచ్చింది. ఎన్నికల ప్రచారానికి ప్రభుత్వ యంత్రాంగాన్ని ఇందిర దుర్వినియోగం చేశారని ప్రతిపక్ష నాయకుడు రాజ్ నారాయణ్ వేసిన పిటిషన్ కోర్టులో నెగ్గడంతో ఆమె రాజీనామా చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. పదవిని కాపాడుకోవడానికి ఆమె ఎమర్జెన్సీ మార్గాన్ని ఎంచుకున్నారు. ఆ చీకటి కాలంలో ముందస్తు నిర్బంధాలు, లాకప్ మరణాలు, ఆకస్మిక అదృశ్యాలు, జైళ్లలో చిత్రహింసలు సర్వసాధారణమయ్యాయి. ఎమర్జెన్సీ రోజులను ప్రత్యక్షంగా అనుభవించిన తరంలో చాలామంది మరణించారు, మరెంతోమంది అవసాన దశలో ఉన్నారు. వారితోపాటే ఎమర్జెన్సీ చేదు స్మృతులు కాలగర్భంలో కలిసిపోకుండా జాగ్రత్త పడటం ఈతరం విధి. కానీ, ఆనాటి పాఠాలను మనం నేర్చుకోలేదని స్పష్టమవుతూనే ఉంది.

అధికార దుర్వినియోగానికి అడ్డుకట్ట

అధికార దుర్వినియోగానికి పాల్పడ్డారనే ఆరోపణపై ఇందిర గెలుపును నాడు న్యాయవ్యవస్థ రద్దుచేసింది. నేటి రాజకీయ నాయకులూ అలాగే విచ్చలవిడిగా అధికార దుర్వినియోగానికి పాల్పడుతున్నారు. ప్రధాని ఇందిర ప్రచార సభకు వేదికను నిర్మించడానికి అధికారులు ప్రభుత్వ ధనాన్ని వెచ్చించారనీ, ఆమె ఎన్నికల ప్రచారానికి సర్కారీ జీపులను వాడుకున్నారనీ, ఆమె సభలకు అధికారులు జనసమీకరణ చేశారనీ ఆరోపణలు వచ్చాయి. దాంతో రాయ్‌బరేలీ నుంచి ఇందిర ఎన్నికను అలహాబాద్ హైకోర్టు రద్దుచేసింది. ఆరేళ్లపాటు ఆమె ఏ ఎన్నికలోనూ పోటీచేయకూడదని తీర్పు చెప్పింది. ప్రస్తుత నాయకులు యథేచ్ఛగా అవే పనులు చేస్తున్నారు. వాటిని ఎవరు అడ్డుకోగలుగుతున్నారు?

ఎమర్జెన్సీ కాలంలో ప్రభుత్వ ఆగడాలను అడ్డుకోవడానికి చాలామంది ముందుకు రాలేదు. హైకోర్టులకు, సుప్రీంకోర్టుకు రాజ్యాంగం స్వతంత్రంగా న్యాయ సమీక్ష జరిపే అధికారాన్ని ఇచ్చింది. దాన్ని వినియోగించుకుంటూ తొమ్మిది హైకోర్టుల్లోని 16మంది న్యాయమూర్తులు అప్పట్లో ప్రజల తరఫున జోక్యం చేసుకున్నారు. పోలీసులు అక్రమంగా నిర్బంధించినవారిని కోర్టుల ముందు హాజరుపరచాలని కోరే హెబియస్ కార్పస్ పిటిషన్లను వారు స్వీకరించారు. జిల్లా కోర్టులలోనూ వందలాది న్యాయమూర్తులు ఎమర్జెన్సీ రోజుల్లో రాజకీయ నిందితులు జైలుపాలు కాకుండా రకరకాల ఉపాయాలతో అడ్డుకున్నారు. ఉదాహరణకు రాజకీయ నిందితులను చిన్నపాటి ఆరోపణలపై జ్యుడీషియల్ కస్టడీకి పంపడం ద్వారా వారు పోలీసు కస్టడీలోకి వెళ్లకుండా నివారించగలిగారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నేరాలకు పాల్పడ్డారనే ఆరోపణతో రాజకీయ పార్టీల కార్యకర్తలను, నాయకులను పోలీసు కస్టడీలోకి తీసుకుని చావబాదడం అప్పట్లో పరిపాటి. దీన్ని దిగువ కోర్టుల న్యాయమూర్తులు సాధ్యమైనంత వరకు నివారించగలిగారు. ఎమర్జెన్సీ రోజుల్లో జరిగిన పొరపాట్లు పునరావృతం కాకుండా చూడటానికి తదుపరి కాలంలో పలు చర్యలు తీసుకున్నారు. ప్రజాహిత వ్యాజ్యాలకు కోర్టులు అమిత ప్రాధాన్యమివ్వడం దీనికి ఉదాహరణ.

పార్లమెంట్ వర్షాకాల సమావేశాల్లో 'యాభై ఏళ్ల ఎమర్జెన్సీ'పై చర్చ చేపట్టాలని అధికారపక్షం భావిస్తోంది. అంతర్గత కల్లోల పరిస్థితుల కారణంగా ఎమర్జెన్సీ విధించాల్సి వచ్చిందని ఇందిర సర్కారు అప్పట్లో చెప్పినా, అసలు సంగతి అది కాదు. ఆనాటి అరాచకాల రోజులు మళ్లీ రాకూడదంటే మనం నేర్చుకోవాల్సిన పాఠాలెన్నో ఉన్నాయి.



దేశం మళ్లీ ఎమర్జెన్సీలోకి జారిపోకుండా పౌరులు నిరంతరం అప్రమత్తంగా ఉండాలి. ఇదే ఆత్యయిక స్థితి నేర్పిన మొదటి పాఠం. ఎన్నికలను అయిదేళ్లకు ఒకసారి నగదు బహుమతులు, ఇతర కానుకలను కట్టబెట్టే ఆర్థిక కార్యకలాపంగా చూడటాన్ని ఓటర్లు కట్టిపెట్టాలి. తమకు, తమ సంతానానికీ సుస్థిర భవిష్యత్తు కావాలంటే నిజాయతీపరులైన, సమర్థులైనవారిని ఎన్నుకోవాలనే గ్రహింపు వారిలో కలగాలి. ఎన్నికల్లో పోటీచేసే రాజకీయ పార్టీలు, వాటి అభ్యర్థుల నుంచి జవాబుదారీతనాన్ని డిమాండ్ చేయాలి. అలసత్వాన్ని వదిలించుకుని ఎన్నికల ప్రక్రియలో చురుకైన భాగస్వాములు కావాలి. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ధర్మపన్నాలు వల్లించే రాజకీయ నాయకులు అధికారంలోకి రాగానే వాటిని తుంగలో తొక్కుతారు. ఓటర్లు ఇలాంటివారి ఆటలను సాగనివ్వకూడదు. ఇదే ఎమర్జెన్సీ నేర్పిన రెండో పాఠం.

ప్రమాదకర భావజాలం


భారతదేశంలో ప్రజాస్వామ్యం మరీ ఎక్కువై పోయిందని నమ్మేవారు చాలామంది ఉన్నారు. ఇలాంటి భావజాలమే నియంతృత్వానికి దారితీస్తుంది. ఇది ప్రజాస్వామ్య మనుగడకే ప్రమాదమని గ్రహించడం ఎమర్జెన్సీ నేర్పిన మూడో పాఠమవుతుంది. నిరుద్యోగం, ధరల పెరుగుదల, అవినీతి, పెరుగుతున్న రుణభారం వంటి సమస్యలను ఎదుర్కొంటున్న మధ్యతరగతి ఈ సమస్యలకు నియంతృత్వమే పరిష్కారమనే భ్రమలోకి జారిపోవచ్చు. దీన్ని ఎట్టిపరిస్థితుల్లోనూ నివారించాలి. ప్రభుత్వ ఉద్యోగులు నిజాయతీగా పనిచేయాలన్నా, రైళ్లు సకాలంలో నడవాలన్నా నియంతలే అవసరం లేదనీ, పౌరులు చైతన్యవంతులైనప్పుడు అవన్నీ సాధ్యమేనని గ్రహించాలి. బాధ్యతలను తలకెత్తుకోకుండా హక్కుల కోసం డిమాండ్ చేయడం ప్రజాస్వామ్యానికి కాకుండా బానిసత్వానికి బాటలువేస్తుంది.



డాక్టర్ ఎస్.అనంత్
న్యాయవాది, ఆర్థిక సామాజిక విశ్లేషకులు

అనుభవమూ అవసరమే!

తన పుట్టినరోజు సందర్భంగా అడవిలో రకరకాల పోటీలు పెట్టింది మృగరాజు. కోతుల కోసం గెంతులు వేసే పోటీ నిర్వహించింది. 'ఏ కోతి అయితే ఎక్కువ దూరంగా ఉన్న చెట్టు మీదకు దూకుతుందో.. అది గెలిచినట్టు' అని చెప్పింది. దాంతో చాలా కోతులు పోటీలో పాల్గొనడానికి సిద్ధమయ్యాయి. వాటితో పాటూ ఒక ముసలి కోతి కూడా వచ్చింది. దాన్ని చూసి సింహం తప్ప, అక్కడున్న జంతువులన్నీ నవ్వసాగాయి. 'నువ్వు ఈ పోటీలో పాల్గొంటావా? ఈ వయసులో అంత సాహసం అవసరమా? పొరపాటున జారిపడితే, ఆహారం వెతుక్కోవడానికి కూడా వెళ్లలేవు' అంటూ ఎగతాళి చేశాయి పిల్ల కోతులు. అయినా ఆ ముసలి కోతి ఏమీ మాట్లాడలేదు. పిల్లకోతులు మాత్రం.. ఆపకుండా అలా ఏదో ఒకటి అంటూనే ఉన్నాయి. దాంతో మృగరాజు.. 'మీరంతా అలా మాట్లాడటం పద్ధతి కాదు. బుద్ధిగా ఉండండి. మీలాగే తనూ పాల్గొంటుంది. ఎవరి ప్రదర్శన వాళ్లది' అని గద్దించింది. కాసేపటికి పోటీ మొదలైంది. ముందుగా పిల్లకోతులన్నీ పోటీలో పాల్గొన్నాయి. కానీ మృగరాజును మెప్పించలేకపోయాయి. ఇక చివరగా ముసలి కోతి తన విన్యాసాలను



మొదలుపెట్టింది. అవలీలగా ఒక చెట్టు మీద నుంచి మరో చెట్టు మీదికి దూకసాగింది. అది చూసి.. అడవిలోని మిగతా జంతువులతో పాటు కోతులు కూడా ఆశ్చర్యపోయాయి. చివరికి ఆ ముసలి కోతే విజేతగా నిలిచింది. అప్పుడు పిల్ల కోతులన్నీ వచ్చి.. దాన్ని క్షమించమని అడిగాయి. అక్కడే ఉన్న మృగరాజు.. 'చేసే ప్రతి పనికీ వయసుతో సంబంధం లేదు. కొన్నిసార్లు అనుభవం కూడా కావాలి. వయసు, అనుభవం ఆ కోతికి అదును చూసి అడుగేయడం నేర్పాయి. మీరు దూకేస్తే చాలు అనుకుంటారు.. కానీ ఎంత దూరం దూకడానికి ఎంత బలం ఉపయోగించాలో, దెబ్బలు తగలకుండా శరీరాన్ని ఎలా బ్యాలన్స్ చేసుకోవాలో దానికి తెలుసు' అంది. ఆ మాటలు విని సరేనన్నట్లు మౌనంగా ఉన్నాయి పిల్ల కోతులు.

– నంద త్రినాథ రావు

నేనెవర్ని?

1. నేనో మూడక్షరాల పదాన్ని. 'గుడి'లో ఉంటాను కానీ 'బడి'లో లేను. 'రుణం'లో ఉంటాను కానీ 'కణం'లో లేను. 'ఆవు'లో ఉంటాను కానీ 'ఆశ'లో లేను. నేనెవరో తెలిసిందా?
2. నాలుగక్షరాల పదాన్ని నేను. 'నాచు'లో ఉంటాను కానీ 'పీచు'లో లేను. 'మాయ'లో ఉంటాను కానీ 'మాసం'లో లేను. 'కత్తి'లో ఉంటాను కానీ 'పత్తి'లో లేను. 'కవిత్వం'లో ఉంటాను కానీ 'కవిత'లో లేను. నేనెవర్ని?

జవాబులు: 1. గురువు 2. నాయకత్వం

ప్రకాశం బ్యారేజీ గేట్ల ఎత్తివేత



ఎన్టీఆర్ కలెక్టరేట్, న్యూస్‌టుడే : భారీ వర్షాల నేపథ్యంలో కృష్ణా నదిలోకి స్థానిక వరద నీరు వస్తోంది. సోమవారం ఉదయం 4.30 గంటలకు నగరంలోని ప్రకాశం బ్యారేజీ వద్ద 5 గేట్లను ఒక అడుగు మేర ఎత్తారు. 3,625 క్యూసెక్కులు సముద్రంలోకి విడుదల చేశారు. ఉదయం 9 గంటలకు మరింత పెరగడంతో 17 గేట్లను ఒక అడుగు మేర ఎత్తారు. సముద్రంలోకి 12,325 క్యూసెక్కులు విడుదల చేశారు. సాయంత్రానికి వరద క్రమేపీ తగ్గడంతో.. నాలుగు గేట్లను ఒక అడుగు మేర ఎత్తారు. సముద్రంలోకి 2,900 క్యూసెక్కులు విడుదల చేశారు. వజినేపల్లి నుంచి 1589, కీసర (మునేరు) నుంచి 214, వెలగలేరు నుంచి 3,499 క్యూసెక్కుల మేర బ్యారేజీకి వస్తోంది. వర్షాల కారణంగా కాలువలకు సాగునీటిని బాగా తగ్గించారు. కృష్ణా తూర్పు ప్రధాన కాలువకు 3,006, కృష్ణా పశ్చిమ ప్రధాన కాలువకు 516 క్యూసెక్కులు ఇస్తున్నారు.

రాజధానిలో మంత్రి నారాయణ పర్యటన

తుళ్లూరు, న్యూస్‌టుడే: పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పి.నారాయణ సోమవారం రాజధాని ప్రాంతంలో పర్యటించారు. పలు భవన సముదాయాల నిర్మాణ పనుల ప్రగతిని పరిశీలించారు. నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ నిర్ణీత గడువులోగా పనులు పూర్తి చేయాలని సదరు గుత్తేదారు సంస్థలకు సూచించారు.



జడ్జిల బంగ్లాల వద్ద పనులు పరిశీలిస్తున్న మంత్రి నారాయణ

ఎక్స్‌ప్రెస్ రైలుకు అదనపు బోగీలు



విజయవాడ(రైల్వేస్టేషన్), న్యూస్‌టుడే: ప్రయాణికుల సౌకర్యార్థం రైలు నెంబరు 12795/12796 విజయవాడ, లింగంపల్లి ఎక్స్‌ప్రెస్ రైలుకు ఈ నెల 26వ తేదీ నుంచి అదనంగా ఒక థర్డ్ ఏసీ బోగీని ఏర్పాటు చేస్తున్నట్లు విజయవాడ రైల్వే అధికారులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.

పలు రైళ్లకు అదనపు హాల్టులు

ప్రయాణికుల సౌకర్యార్థం పలు రైళ్లకు విజయవాడ డివిజన్‌లోని వివిధ రైల్వేస్టేషన్లలో అదనపు హాల్టు సౌకర్యాన్ని కల్పిస్తున్నట్లు రైల్వే అధికారులు తెలిపారు. **ఆగస్టు 2 నుంచి..** ★ **17243** గుంటూరు, రాయగడ ఎక్స్‌ప్రెస్‌కు భీమడోలులో హాల్టు. ★ **17281** గుంటూరు, నర్సాపూర్ ఎక్స్‌ప్రెస్‌కు పుట్లచెరువులో హాల్టు. ★ **20833/ 20834** విశాఖపట్నం,సికింద్రాబాద్ ఎక్స్‌ప్రెస్‌కు సామర్లకోటలో హాల్టు **ఆగస్టు 5 నుంచి..** ★ **17481** బిలాస్‌పూర్, తిరుపతి, 17479 పూరి,తిరుపతి, 17249 తిరుపతి, కాకినాడ టౌన్ ఎక్స్‌ప్రెస్‌లకు చిన్నగంజామ్‌లో హాల్టు. **ఆగస్టు 8 నుంచి..** ★ **12522** ఎర్నాకుళం, భరౌని ఎక్స్‌ప్రెస్‌కు చీరాలలో హాల్టు. **ఆగస్టు 24 నుంచి..** ★ **20707/ 20708** సికింద్రాబాద్, విశాఖపట్నం ఎక్స్‌ప్రెస్‌కు ఏలూరులో హాల్టు.

పోటెత్తే వరద.. పాలకా కనబడదా?

అసంపూర్తి డ్రెయిన్లపై ఒక్క ప్రజాప్రతినిధికీ పట్టదు

2017 ఏప్రిల్

విజయవాడ నగరం మొత్తం రూ.461 కోట్లతో 444 కి.మీ పొడవైన వాన నీటి కాలువల నిర్మాణానికి పనులు ఆరంభించారు. 2019 చివరి వరకూ ఇవి సజావుగా సాగాయి. రూ.172 కోట్లు వెచ్చించి 252.22 కి.మీ పొడవైన కాలువ పనులు పూర్తి చేశారు. మిగతా రూ.289కోట్లతో 191 కి.మీ పూర్తి చేయాల్సి ఉంది.



ఆదివారం కురిసిన వర్షానికి విజయవాడ మొగల్రాజపురంలో రహదారే చెరువులా..

2025 జులై

ఆరేళ్ల కిందట పనులు ఎక్కడ ఆగిపోయాయో ఇప్పటికీ అదే పరిస్థితి. కట్టిన కాలువల్లో పిచ్చి మొక్కలు పెరిగాయి. గత ఐదేళ్లలో వైకాపా ప్రభుత్వం వీటి ఊసే వదిలేసింది. ఏడాదిగా కూటమి ప్రభుత్వం వచ్చాక కూడా ఈ కాలువల పనులు ఆరంభించింది లేదు.

ఈనాడు, అమరావతి

విజయవాడ నగరంలో కురుస్తున్న వర్షాలకు అన్ని ప్రాంతాల్లోనూ రహదారులు పూర్తిగా మునిగిపోతూ చెరువుల్లా మారుతున్నాయి. ఆదివారం రాత్రి పడిన వర్షంతో.. పటమట, మొగల్రాజపురం, బెంజిసర్కిల్ సహా అన్ని ప్రాంతాల్లోని రహదారులు పూర్తిగా జలదిగ్బంధమయ్యాయి. ఈ నీళ్లు ఎటూ వెళ్లే మార్గం లేక ఎక్కడివక్కడే సోమవారం ఉదయం వరకూ అలాగే ఉన్నాయి. పారిశుద్ధ్య సిబ్బంది వచ్చి నీటిని మోటార్లతో తోడుతూ, మ్యాన్‌హోళ్లలోకి పంపే ప్రయత్నం చేశారు. రోడ్లపై గుంతలు కనిపించక వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు.

రూ.289 కోట్లు ఎక్కడున్నాయ్..

దశాబ్దాలుగా విజయవాడలో ఎదురయ్యే వాన నీటి సమస్య గురించి బాగా తెలిసిన మాజీ ఉపరాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు కేంద్ర పట్టణాభివృద్ధిశాఖ మంత్రిగా ఉన్న సమయంలోనే ఒకేసారి రూ.461కోట్లు విడుదల చేశారు. ఇక్కడి పాలకుల నిర్లక్ష్యం వల్ల ఆ నిధులు నేటికీ సక్రమంగా వాడుకున్నది లేదు. తెదేపా ప్రభుత్వంలో ఖర్చు చేసినవి తప్ప మిగతా రూ.289 కోట్లు ఏం చేశారనేది ఇప్పటికీ తెలియని పరిస్థితి. ఆ నిధులను వెంటనే రాష్ట్ర ప్రభుత్వం నుంచి విజయవాడ నగరపాలక సంస్థకు బదిలీ చేయాలి. వాటితో ఈ మిగులు కాలువలను పూర్తి చేస్తే నగర భవిష్యత్తుకు భరోసా ఏర్పడుతుంది.

పాలకుల్లో చిత్తశుద్ధి కరవైంది..

నగరంలోని వర్షపు నీటి సమస్యను శాశ్వతంగా పరిష్కరించే మార్గం కళ్ల ముందే కనిపిస్తున్నా పాలకుల్లో చిత్తశుద్ధి కొరవడింది. ఏటా వానాకాలంలో మునగడం.. ప్రజాప్రతినిధులు, అధికారులొచ్చి హడావుడి చేయడం.. మళ్లీ వచ్చే ఏడాది చూసుకుందామంటూ వెళ్లిపోవడం.. ఇదే జరుగుతోంది. నగరంలోని 64 డివిజన్లలోనూ 60 శాతం మేజర్, మైనర్ కాలువల పనులు ఇప్పటికే పూర్తయ్యాయి. మిగతా 40 శాతం పూర్తి చేస్తే వరద ముంపు సమస్యే ఉండదు.

కానూరు దారిలో 50 గుంతలు..

తాడిగడప మున్సిపాలిటీ పరిధిలోని కానూరు ప్రధాన రహదారి అత్యంత దారుణంగా ఉంది. కామయ్యతోపు ఆర్చి నుంచి కానూరు వరకూ రెండు కి.మీ రోడ్డులో కనీసం ఓ 50 భారీ గుంతలు పడ్డాయి. వాన పడితే గుంత ఎక్కడుందో తెలియదు. ఈ రోడ్డుపై గుంతలో పడి ఓ యువకుడు ఇటీవల చనిపోయాడు. అయినా స్పందించకపోవడం దారుణం.

గుట్టుగా జట్టు.. మత్తులో చిత్తు

ఈనాడు, అమరావతి

గంజాయి వినియోగదారులు పోలీసులకు దొరక్కుండా సామాజిక మాధ్యమాలను వాడుతున్నారు. ఫోన్లు ఉపయోగించకుండా జాగ్రత్త పడుతున్నారు. ఇన్‌స్టాగ్రామ్, స్నాప్‌చాట్ ద్వారా సంభాషణలు సాగిస్తున్నారు. పోలీసులు సీడీఆర్‌లు తీసినా గుట్టు బయటపడకుండా ఇదంతా చేస్తున్నారు. మత్తుకు బానిసలైన వారంతా ప్రత్యేక గ్రూప్‌లుగా ఏర్పడి సమాచారం ఇచ్చిపుచ్చుకుంటున్నారు. గంజాయి తీసుకొస్తే ఎవరు తెచ్చారు? ధర ఎంత? తదితర వివరాలు సామాజిక మాధ్యమాల్లోని గ్రూపుల్లో షేర్ చేసుకుంటున్నారు.

సామాజిక మాధ్యమాల వేదికగా గంజాయి సరఫరా



చోరీ చేసిన బైక్‌లు అమ్మి..

విలాసాలు, మత్తుకు అలవాటు పడి ద్విచక్ర వాహనాలు, మొబైళ్లను అమ్మి గంజాయి కొంటున్న ముఠాలు నగరంలో ఎక్కువయ్యాయి. ఆంధ్ర- ఒడిశా సరిహద్దు నుంచి తెచ్చి విజయవాడలో విక్రయిస్తున్నారు. దొంగిలించిన బైక్‌ల నంబరు ప్లేట్లు తొలగించి మరీ చట్టవ్యతిరేక కార్యకలాపాలకు వినియోగిస్తున్నారు. ఇటీవలి కాలంలో నగరంలోని వివిధ ప్రాంతాల్లో సరకు పెద్ద పరిమాణంలోనే పట్టుబడుతోంది.

★ తెలంగాణ రాష్ట్రం కొత్తగూడెంకి చెందిన నలుగురు యువకులకు ఇన్‌స్టాలో ఎన్టీఆర్ జిల్లా జగ్గయ్యపేట, కీసరకు ఇద్దరు పరిచయం అయ్యారు. గంజాయి వినియోగిస్తున్న వీరంతా ఒడిశా వెళ్లి సరకు తీసుకురావాలని ప్రణాళిక రచించారు. కొంత డబ్బు సమకూర్చుకుని మిగిలిన సొమ్ము కోసం ఇబ్రహీంపట్నం స్టేషన్ పరిధిలోని కేతనకొండలో బైక్‌ను చోరీ చేశారు. దానిపై ఒడిశా సరిహద్దుకు వెళ్లి బైక్, నగదు ఇచ్చి 35 కిలోల గంజాయి తీసుకొచ్చారు. వీరిలో కీసరకు చెందిన పాత నేరస్థుడు పోలీసులకు దొరికాడు.

బెంగళూరు నుంచి ఎండీఎంఏ తెస్తున్నారు

బెంగళూరులోని పలు ముఠాల నుంచి ఎండీఎంఏ బస్సులు, రైళ్ల ద్వారా నగరానికి తీసుకొచ్చి విక్రయాలు సాగిస్తున్నా నిఘా కొరవడింది. ముందస్తు సమాచారం ఉంటేనే పట్టుకుంటున్నారు. విజయవాడ నుంచి తీసుకెళ్లిన గంజాయి బెంగళూరులో ఇచ్చి ఎండీఎంఏ కొంటున్నట్లు గుర్తించారు. బెంగళూరులో అసలు సూత్రధారుల జాడ దొరకడం లేదు.

★ ఏజెన్సీలో గంజాయి సాగు గణనీయంగా తగ్గడంతో ఒడిశా సరిహద్దులోనే దొరుకుతోంది. దీనికి బెంగళూరులో డిమాండ్ పెరిగింది. దీనిని సొమ్ము చేసుకునేందుకు నరేంద్ర అనే పాత నేరస్థుడు.. నెలకు రూ.11 వేలు వేతనం ఇచ్చి ప్రత్యేకంగా ముగ్గురిని నియమించుకున్నాడు. విజయవాడ నుంచి గంజాయిని బెంగళూరు తీసుకెళ్లి అక్కడి నుంచి ఎండీఎంఏను తీసుకురావడం వీరి పని. ఇలా తీసుకొచ్చిన డ్రగ్‌ను నగరంలో విక్రయిస్తున్నాడు. గత నెల రోజులుగా పోలీసులకు దొరక్కుండా తప్పించుకు తిరుగుతున్నాడు.

సోషల్ మీడియా ఖాతాలపై నిఘా

సోషల్ మీడియా ద్వారా మత్తు పదార్థాలకు సంబంధించి వ్యవహారాలు సాగుతుండడంతో పోలీసులు అప్రమత్తమయ్యారు. దీంతో ఇన్‌స్టాగ్రామ్, స్నాప్‌చాట్, తదితర సామాజిక మాధ్యమ ఖాతాలపై నిఘా పెట్టారు. అనుమానిత గ్రూపుల్లోని చాట్లను స్కాన్ చేస్తున్నారు. వీటిల్లో గంజాయి రవాణా చేసే వారి ఐడీలను షేర్ చేసుకుంటున్నట్లు గుర్తించారు. ఈ తరహా గ్రూపుల్లో ఎవరెవరు సభ్యులుగా ఉంటున్నారు? వీరి కార్యకలాపాలు? నేరచరిత్ర, తదితర అంశాలను క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు.

అమరావతి నిర్మాణంపై అవగాహన

గవర్నర్‌పేట, న్యూస్‌టుడే : గవర్నర్‌పేటలోని ఏపీ సీఆర్‌డీఏ కార్యాలయాన్ని శిక్షణ ఐపీఎస్‌ల బృందం సందర్శించింది. సీఆర్‌డీఏ అదనపు కమిషనర్ మల్లారపు నవీన్, సీఆర్‌డీఏ ఎకనమిక్ డెవలప్‌మెంట్ జాయింట్ డైరెక్టర్ బి.వినీష.. రాజధాని అమరావతి నిర్మాణంలో అమలైన భూసమీకరణ పథకం గురించి పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వారికి వివరించారు. భూములిచ్చిన రైతులకు, అమరావతి ప్రాంత ప్రజలకు సీఆర్‌డీఏ అమలు చేస్తున్న సామాజిక, సంక్షేమ పథకాల గురించి తెలియజేశారు. అమరావతి గవర్నమెంట్ కాంప్లెక్స్‌తో పాటు హరితయుత విధానాల ద్వారా నిర్మిస్తున్న సీఆర్‌డీఏ ప్రాజెక్టు కార్యాలయం ప్రాధాన్యత తెలిపారు. పర్యావరణాన్ని పరిరక్షించేలా ఎక్సలెన్స్ ఇన్ డిజైన్ ఫర్ గ్రేటర్ ఎఫీషియన్సీ (ఎడ్జ్) గ్రీన్ సర్టిఫికేషన్ ప్రమాణాలకు అనుగుణంగా భవనాలు నిర్మిస్తున్నట్లు వివరించారు. ప్రముఖ విద్య, వైద్య సంస్థల గురించి తెలియజేసి.. అవి త్వరలో కార్యకలాపాలు ప్రారంభిస్తాయన్నారు. అలాగే క్వాంటం వ్యాలీ, క్వాంటం సాంకేతికత విశిష్టతపై అవగాహన కల్పించారు. భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా విస్తృత మౌలిక వసతులతో అమరావతి నగరాన్ని నిర్మిస్తున్నామని వెల్లడించారు. అనంతరం శిక్షణ ఐపీఎస్‌లకు, సంబంధిత అధికారులకు అదనపు కమిషనర్ జ్ఞాపికలు అందించారు. ఐపీఎస్‌లుగా త్వరలో బాధ్యతలు స్వీకరించనున్న నేపథ్యంలో వారిని అభినందించి ఉన్నతంగా రాణించాలని ఆకాంక్షించారు.



శిక్షణ ఐపీఎస్‌లతో అదనపు కమిషనర్ నవీన్, వినీష

చిగురిస్తున్న ఆశలు

- ప్రభుత్వం చొరవతో ముక్త్యాల ఎత్తిపోతలకు రూ.489.28 కోట్లు
- 38 వేల ఎకరాల ఆయకట్టుకు తీరనున్న సమస్యలు



2019లో శిలాఫలకం ఆవిష్కరణలో ప్రజాప్రతినిధులు

జగ్గయ్యపేట, న్యూస్‌టుడే: పశ్చిమ కృష్ణాలోని జగ్గయ్యపేట, నందిగామ నియోజకవర్గాల అన్నదాతల చిరకాల స్వప్నం సాకారమయ్యే దిశగా ఆశలు చిగురిస్తున్నాయి. 38 వేల ఎకరాల ఆయకట్టుకు సాగునీటి భరోసా నివ్వడం కోసం రూపొందించిన ముక్త్యాల ఎత్తిపోతలకు మంచి రోజులు కనిపిస్తున్నాయి. గత వైకాపా ప్రభుత్వం పేరు మార్చి, మూలన పడేసినా పథకం నిర్మాణాన్ని మరుగున పడనివ్వకుండా శంకుస్థాపన జరిగిన ఆరేళ్ల తర్వాత మళ్లీ కూటమి ప్రభుత్వం చూపుతున్న చొరవ రైతులకు గుండె ధైర్యాన్నిస్తుంది. తాజాగా ముక్త్యాల ఎత్తిపోతల పథకం నిర్మాణానికి ప్రభుత్వం రూ.489.28 కోట్లను మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ చేయడంతో రైతుల్లో ఆనందోత్సాహాలు వెల్లివిరుస్తున్నాయి.

జగ్గయ్యపేట, నందిగామ నియోజకవర్గాల్లోని 33 గ్రామాలకు చెందిన 38,627 ఎకరాల ఎన్ఎస్‌పీ ఆయకట్టుకు దశాబ్దాలుగా నీరందని దయనీయ స్థితిని అధిగమించేందుకు రూపొందించిన ముక్త్యాల ఎత్తిపోతల పథకానికి 2019, ఫిబ్రవరి 16న అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు (వర్చువల్‌గా) శంకుస్థాపన చేశారు. తర్వాత ప్రభుత్వం మారడంతో వైకాపా హయాంలో దీని పేరును వేదాద్రి ఎత్తిపోతలగా మార్చి మరోసారి శంకుస్థాపన చేసి అట్టహాసంగా పనులు కూడా మొదలుపెట్టారు. కానీ వైకాపా ప్రభుత్వంలో నిధులివ్వని దుస్థితి కారణంగా పనులు మొదలుపెట్టిన గుత్తేదారు సంస్థ ఆరంభంలోనే సామగ్రి సర్దేసింది. దీంతో ఈ పథకం నిర్మాణంపై రైతుల ఆశలు ఆవిరైపోయాయి.

నాయకుల సమష్టి కృషితో సాకారం

కూటమి ప్రభుత్వం ఏర్పడిన ఏడాదిలోనే ఎమ్మెల్యే శ్రీరాంతాతయ్య మొదలుకొని నాయకులు నెట్టెం రఘురాం, టీడీ జనార్దన్, ఎంపీ కేశినేని శివనాథ్, మంత్రి నిమ్మల రామానాయుడు వరకు అందరూ కసరత్తు చేసి మళ్లీ ఈ పథకాన్ని తెరపైకి తీసుకురావడమే కాక నిధులు మంజూరు చేయించడంతో 31 వేల మంది ఎన్ఎస్‌పీ ఆయకట్టు అన్నదాతల ఆశలు చిగురించాయి. వేదాద్రి వద్ద కృష్ణానది నుంచి 386.27 క్యూసెక్కుల నీటిని డీవీఆర్ (16వ) బ్రాంచి కెనాల్ ద్వారా రెండు దశల్లో మొత్తం ఎన్ఎస్‌పీ ఆయకట్టుకు నీరందించేలా ఈ పథకం రూపొందించారు. గండ్రాయి, ముక్కపేటల వద్ద డీవీఆర్ బ్రాంచి కెనాల్‌కి అందించే నీరు జగ్గయ్యపేట, వత్సవాయి, పెనుగంచిప్రోలు, నందిగామ మండలాల ఆయకట్టుకు అందాలన్నది పథకం ఉద్దేశం. గతంలోనే ఇందుకు సంబంధించిన ప్రణాళికలన్నీ పూర్తిచేసి ఉండటంతో సమీప భవిష్యత్తులోనే నిర్మాణ పనుల ప్రారంభం కావొచ్చని రైతులు ఆకాంక్షిస్తున్నారు. వేదాద్రి వద్ద ఇన్‌టేక్‌వెల్, పంపింగ్ హౌస్‌ల నిర్మాణంతో పాటు సుమారు 15 కి.మీ.ల మేర నిర్మించాల్సిన పైపులైన్లకు భూసేకరణ ప్రక్రియ ఇంకా పూర్తి కావాల్సి ఉంది.

ఉచిత ప్రయాణానికి రైట్‌రైట్

ఈనాడు, అమరావతి

మహిళల ఉచిత బస్సు ప్రయాణం ఆగస్టు 15 నుంచి ప్రారంభమవుతోంది. ఈ నేపథ్యంలో ఉమ్మడి కృష్ణా జిల్లాలో ఆర్టీసీ అధికారులు ముమ్మరంగా ఏర్పాట్లు చేస్తున్నారు. కొత్త బస్సులకు ప్రతిపాదనలు పంపడంతో పాటు ఉన్న వాటికి మరమ్మతులు చేయిస్తున్నారు. బస్సు స్టేషన్లలో మౌలిక సదుపాయాలు మెరుగుపరుస్తున్నారు. రెండు జిల్లాల్లో ఉచిత ప్రయాణానికి సంబంధించి 90 శాతం పనులు పూర్తి చేశారు.

82 కొత్త బస్సులకు ప్రతిపాదనలు



126 వాహనాలకు కొత్త రూపు

మహిళల ఉచిత బస్సు ప్రయాణం ప్రవేశపెట్టిన రాష్ట్రాల్లో ముందస్తు సన్నద్ధత లేక నరకం చూశారు. ఈ ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని అధికారులు అన్ని విధాలా సిద్ధమవుతున్నారు. చినిగిన సీట్లు, పగిలిన కిటికీలు కనిపించకుండా మరమ్మతులు చేస్తున్నారు. రంగులు వేసి బస్సుల కండీషన్ చెక్ చేసి సమస్యలు ఉంటే పరిష్కరిస్తున్నారు. పూర్తిగా గుల్లయిన బస్సుల బాడీలు మార్చేస్తున్నారు. ఎన్టీఆర్ జిల్లాలో 75, కృష్ణాలో 34 బస్సులకు బాడీలు మార్చారు. ఇంకా 17 బస్సులను మార్చాల్సి ఉంది. ఇవి కాకుండా ఎక్కువ మందికి సదుపాయం కల్పించేందుకు ఎన్టీఆర్‌లో 50, కృష్ణాలో 32 కొత్త బస్సులకు ప్రతిపాదనలు పంపారు. విజయవాడ సిటీలో విద్యాధరపురం డిపోలో 100 విద్యుత్తు బస్సులు అందుబాటులోకి తెచ్చే ప్రక్రియ సైతం వేగవంతం చేశారు. మహిళల తాకిడి ఎక్కువగా ఉండే ఉదయం 8-11, సాయంత్రం 4-7 గంటల మధ్య సర్వీసులు పెంచాలన్న అంశంపైనా కసరత్తు చేస్తున్నారు. ప్రస్తుతం ప్రయాణిస్తున్న మహిళల సంఖ్య రెండు రెట్లు పెరిగినా ఇబ్బంది పడకుండా అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

అంశం	ఎన్టీఆర్	కృష్ణా
డిపోలు	8	5
మొత్తం బస్సులు	800	416
రోజులో ప్రయాణికులు	1,50,000	80,200
మహిళా ప్రయాణికులు	70,000	38,000
రోజుకు తిరిగే దూరం(కి.మీ)	2,74,000	1,40,000

మౌలిక సదుపాయాలు సిద్ధం..

రెండు జిల్లాల్లో డిపోల్లోని బస్సు స్టేషన్లలో సౌకర్యాల కల్పన దాదాపు పూర్తి చేశారు. అన్ని స్టేషన్లలో తాగునీరు, విద్యుత్తు, సౌకర్యాలు అందుబాటులోకి తెచ్చారు. మరమ్మతులకు గురైన ట్యాంకులు, విద్యుత్తు బల్బులు మార్చారు. ప్రయాణికులు వేచి ఉండేందుకు 235 కుర్చీలు, 215 బెంచీలు కొత్తవి వేశారు. దోమలు, ఉక్కపోత లేకుండా 180 కొత్త ఫ్యాన్లు అమర్చారు. కృష్ణాలో మరుగుదొడ్లలో అసౌకర్యాలు నిర్మూలించారు. కొత్త కుళాయిలు, సీట్లు, సింకులు ఏర్పాటు చేశారు. ఎన్టీఆర్ జిల్లాలో ఇంకా మరుగుదొడ్లలో మరమ్మతులు మొదలుకాలేదు. బస్సుల్లో మహిళల సీట్లు పెంచే అంశంపైనా అధికారులు సాధ్యాసాధ్యాలను ఆలోచిస్తున్నారు. దీనిపై ఎన్టీఆర్, కృష్ణా జిల్లా ఆర్ఎంలు దానం, వెంకటేశ్వరరావు మాట్లాడుతూ.. ప్రభుత్వం ప్రకటించిన గడువు నాటికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేస్తామని తెలిపారు.

నగరం, పరిసరాల్లో అధిక వర్షం

ఎన్టీఆర్ కలెక్టరేట్, న్యూస్‌టుడే : జిల్లాలోని పలు మండలాల్లో తేలికపాటి నుంచి భారీ వర్షాలు కురిశాయి. విజయవాడ గ్రామీణ మండలం, విజయవాడలో అధిక వర్షపాతం నమోదైంది. ఆదివారం సాయంత్రం నుంచి సోమవారం ఉదయం వరకు నమోదైన వివరాలు ఇలా ఉన్నాయి. విజయవాడ గ్రామీణ మండలం 68.8, అజిత్‌సింగ్‌నగర్ 51.2, పటమట 51, గాంధీనగర్, భవానీపురంలో 50.8 మిల్లీ మీటర్ల మేర వర్షం పడింది. కంచికచర్ల 48.6, వీరులపాడు 29.4, ఇబ్రహీంపట్నం 18.6, చందర్లపాడు 12.6, జగ్గయ్యపేట 10.4, జి.కొండూరు 8.8, పెనుగంచిప్రోలు 6.8, రెడ్డిగూడెం 5.6, నందిగామ 3.4, వత్సవాయి 2.6, విస్సన్నపేటలో అత్యల్పంగా 1.4 మి.మీ. మేర నమోదైంది. సగటు వర్షపాతం 21.04 మి.మీ.గా ఉంది.

రాజధాని రైతులకు ఈ-లాటరీ నేడు

గవర్నర్‌పేట, న్యూస్‌టుడే : ప్రజా రాజధాని అమరావతి నిర్మాణానికి భూములిచ్చిన పెనుమాక జరీబు రైతులకు రిటర్నబుల్ ప్లాట్లు కేటాయించేందుకు ఈ నెల 22వ తేదీ మంగళవారం ఈ-లాటరీ నిర్వహిస్తున్నట్లు ఏపీ సీఆర్‌డీఏ కమిషనర్ ఒక ప్రకటనలో తెలిపారు. విజయవాడ లెనిన్ కూడలిలోని సీఆర్‌డీఏ ప్రధాన కార్యాలయంలో ఉదయం 10 గంటలకు ఆన్‌లైన్ ర్యాండమ్ సిస్టం ద్వారా ఈ-లాటరీ నిర్వహిస్తారు. మొత్తం 800 మంది రైతులకు 1,848 ప్లాట్లు కేటాయిస్తారు. వీటిలో 1,082 రెసిడెన్షియల్ ప్లాట్లు, 766 కమర్షియల్ ప్లాట్లు ఉన్నాయని తెలిపారు. సంబంధిత రైతులు హాజరుకావాలని కోరారు. ఏ కారణంతోనైనా హాజరుకాలేని వారు.. సంబంధిత ప్లాట్ల ప్రొవిజనల్ సర్టిఫికెట్లను పెనుమాకలోని కాంపిటెంట్ అథారిటీ కార్యాలయంలో తీసుకోవచ్చని కమిషనర్ పేర్కొన్నారు.



2022లో గూడవల్లి వద్ద ఎండిపోయి కళావిహీనంగా..




ప్రస్తుతం క్రమపద్ధతిలో పచ్చదనం పెంచుతూ..

నాడు చెట్లంటే కక్ష.. నేడు పర్యావరణ రక్ష

గత వైకాపా పాలనలో చెట్లంటే కక్ష. జగన్ ఎక్కడ పర్యటనలకు వెళ్లినా చెట్లు విపరీతంగా కొట్టేయడం చూశాం. జాతీయ రహదారి డివైడర్లపై మొక్కలను పట్టించుకోకపోవడంతో ఎండిపోయి కళావిహీనంగా కనిపించేవి. కూటమి ప్రభుత్వం వచ్చాక రాజధాని నిర్మాణ పనులు వేగవంతం చేసింది. ప్రముఖులు దేశవిదేశాల నుంచి వస్తున్నారు. దీంతో అమరావతి బ్రాండ్ కనిపించేలా పచ్చదనాన్ని అభివృద్ధి చేస్తున్నారు. ఇటీవలే విమానాశ్రయం ఎదురుగా ఎన్టీఆర్ వెటర్నరీ యూనివర్సిటీ వద్ద మొక్కలు నాటారు. విమానాశ్రయం గోడను ఆనుకొని అందమైన కుండీలను ఏర్పాటు చేసి చెట్లు పెంచుతుండడంతో ఆహ్లాద వాతావరణం నెలకొంది. -ఈనాడు, కృష్ణా



అప్పుడు.. డివైడర్లపై కుండీల్లో ఎండిన మొక్కలు



ఇప్పుడు.. అందమైన కుండీల్లో పెంపకం

వైకాపా హయాంలో కేసులు విత్‌డ్రా

విజయవాడ నేరవార్తలు, న్యూస్‌టుడే : వైకాపా ప్రభుత్వ హయాంలో నమోదైన రెండు వేర్వేరు కేసులను విత్‌డ్రా చేసుకుంటూ ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. వివరాల్లోకి వెళితే... ఏపీ సీపీఎస్ ఉద్యోగులు తమ సమస్యల పరిష్కారం నిమిత్తం అప్పటి ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఇంటిని ముట్టడించేందుకు 2022, సెప్టెంబరు 1న మిలీనియం మార్చ్‌కు పిలుపునిచ్చారు. ఇందులో భాగంగా పోలీసులు ముందస్తు సమాచారంతో పలు ప్రాంతాల్లో నిఘా ఉంచారు. ఆగస్టు 29న తెల్లవారుజామున 5.30 గంటల సమయంలో సత్యనారాయణపురం పోలీసులు గస్తీ తిరుగుతుండగా.. ఏలూరు లాకుల కూడలిలో ఆరుగురు వ్యక్తులు గుమిగూడి ఉన్నారు. పోలీసుల రాకను చూసి.. వారు అక్కడి నుంచి జారుకోగా.. బేతల సతీష్ అనే వ్యక్తిని పోలీసులు నిలువరించారు. విచారణలో అతను ఉప ఖజానా శాఖలో పనిచేస్తున్నట్లు తేలింది. సీపీఎస్‌ను రద్దు చేయాలని కోరుతూ సీపీఎస్ ఉద్యోగుల సంఘం మిలీనియం మార్చ్‌కు పిలుపునిచ్చిందని, దీనిపై చర్చిస్తున్నట్లు సతీష్ వివరించారు. మిలీనియం మార్చ్‌కు ప్రభుత్వం అనుమతి ఇవ్వకపోవడంతో బేతల సతీష్‌పై సత్యనారాయణపురం పోలీసులు పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు.

★ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ లెనిన్ సెంటరులో 2023, సెప్టెంబరు 25న అంగన్‌వాడీలు ధర్నా చేపట్టారు. వీరికి సంఘీభావం ప్రకటించేందుకు రాఘవయ్యపార్కు కూడలిలోని సీపీఎం రాష్ట్ర కార్యాలయం నుంచి పలువురు నాయకులు ప్రదర్శనగా బయలుదేరారు. దీనికి అనుమతి లేకపోవడంతో పోలీసులు అడ్డుకున్నారు. పోలీసుల ఆదేశాలను ధిక్కరించి ముందుకు దూసుకువెళుతున్న సీపీఎం నాయకులను గవర్నర్‌పేట పోలీసులు రాఘవయ్యపార్కు కూడలిలోనే అరెస్టు చేశారు. సి.హెచ్.బాబూరావుతో పాటు మరో 13 మందిపై పలు సెక్షన్ల కింద కేసులు నమోదు చేశారు. తాజాగా ఈ రెండు కేసుల్లో ప్రాసిక్యూషన్ అవసరం లేదంటూ జిల్లా కలెక్టర్ ప్రభుత్వానికి లేఖలు రాశారు. దీంతో వాటిని విత్‌డ్రా చేసుకుంటూ ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది.

సీపీ కార్యాలయంలో 72 ఫిర్యాదులు

విజయవాడ నేరవార్తలు: నగరంలోని పోలీస్ కమిషనర్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 72 ఫిర్యాదులు వచ్చాయి. డీసీపీ ఉదయరాణి ఉదయం 10నుంచి మధ్యాహ్నం 1వరకు ఫిర్యాదులు స్వీకరించారు. నడవలేని వృద్ధుల వద్దకు వెళ్లి వివరాలు అడిగి తెలుసుకున్నారు. సంబంధిత పోలీస్‌స్టేషన్ల అధికారులతో మాట్లాడి, ఆయా సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఆమె ఆదేశించారు.

జాతీయ జెండా ప్రదర్శనలో విద్యార్థులు



మువ్వన్నెల స్ఫూర్తి.. ఉప్పొంగె భక్తి

ప్రతి ఒక్కరూ దేశభక్తిని పెంపొందించుకోవాలని పశ్చిమ ఏసీపీ దుర్గారావు, ఆర్యవైశ్య కార్పొరేషన్ ఛైర్మన్ డూండి రాకేష్ పేర్కొన్నారు. వాసవీ క్లబ్ ఇంటర్నేషనల్ ఆధ్వర్యంలో భవానీపురంలో పర్ణశాల సెంటర్ వద్ద నుంచి స్వాతి సెంటర్ వరకు 3600 అడుగుల జాతీయ జెండాతో సోమవారం ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా వారిద్దరూ మాట్లాడుతూ.. జాతీయ భావం, సమైక్యత పెంపొందించే ఉద్దేశంతో ఈ కార్యక్రమం నిర్వహించడం సంతోషకరమని తెలిపారు. వాసవీ క్లబ్ ఇంటర్నేషనల్ అధ్యక్షుడు ఎ.రామకృష్ణ మాట్లాడుతూ.. భారీ జెండాను దేశ వ్యాప్తంగా తొమ్మిది ప్రాంతాల్లో స్థానిక ప్రజలు, విద్యార్థులను భాగస్వాములను చేస్తూ ప్రదర్శిస్తామని తెలిపారు. మొదటి సారిగా భవానీపురంలో నిర్వహించామని చెప్పారు.



జెండాతో ఏసీపీ దుర్గారావు, డూండి రాకేష్, క్లబ్ సభ్యులు

కార్యక్రమంలో ట్రాఫిక్ ఏసీపీ రామచంద్రరావు, భవానీపురం స్టేషన్ సీఐ ఉమామహేశ్వరరావు, వాసవీ క్లబ్ ఇంటర్నేషనల్ మాజీ అధ్యక్షుడు వేమూల హజరత్తయ్య గుప్తా, వాసుదేవరావు, జిల్లా గవర్నర్ టి.శ్రీధర్, క్లబ్ సభ్యులు పాల్గొన్నారు. **- న్యూస్‌టుడే, భవానీపురం**

ఇదే సమయం ఇంకిస్తే నయం..



ఇంకుడు గుంతలో నిలిచిన నీరు

సత్యనారాయణపురం రైల్వేకాలనీలో భూగర్భ జలాలు పెంపొందుకు ఏర్పాటు చేసిన ఇంకుడు గుంతలు మరమ్మతులు కోసం ఎదురు చూస్తున్నాయి. రైల్వే అధికారులు మూడు సంవత్సరాల క్రితం ఇక్కడి ప్రధాన రహదారి వెంబడి ఉన్న ఖాళీస్థలంలో ఇంకుడు గుంతలు తవ్వారు. వాన నీరు భూమిలోకి ఇంకిపోకుండా నిలిచిపోతున్నాయి. గుంతలపై మేటవేసిన మట్టిని తొలగించి ఇసుక వేసి, చిన్న పాటి మరమ్మతులు చేస్తే వినియోగంలోకి వస్తాయి. పూర్తి స్థాయిలో నీరు భూమిలోకి ఇంకుతుంది. తద్వారా భూగర్భజలాలు పెరుగుతాయి. అలాగే.. పరిసర ప్రాంతాల్లో పడిన వాన నీరు.. వీటిలోకి వచ్చేలా కాలువలు ఏర్పాటు చేస్తే.. నిల్వ సమస్య ఉండదు. రైల్వే అధికారులు దీనిపై దృష్టి పెట్టాలని ప్రజలు కోరుతున్నారు. **- న్యూస్‌టుడే, మధురానగర్**

జగన్మాతకు మంగళ సూత్రాలు బహూకరణ



దాత కుమారస్వామికి అమ్మవారి చిత్రపటం అందజేస్తున్న సూపరింటెండెంట్ జగదీష్

ఇంద్రకీలాద్రి, న్యూస్‌టుడే: ఇంద్రకీలాద్రిపై కొలువైన జగన్మాత దుర్గమ్మకు విజయవాడ రామలింగేశ్వరపేటకు చెందిన బండ్లా కుమారస్వామి రూ.5 లక్షలు విలువ చేసే బంగారు మంగళ సూత్రాలు, గొలుసును అలంకరణ నిమిత్తం సోమవారం అందజేశారు. దాత కుటుంబానికి దేవస్థాన సిబ్బంది ఆలయ మర్యాదలతో అమ్మవారి దర్శనం చేయించారు. ఆశీర్వచన మండపంలో వేదపండితులు ఆశీర్వచనం చేశారు. దేవస్థాన సూపరింటెండెంట్ జగదీష్ దాతకి విరాళం రశీదుతోపాటు అమ్మవారి చిత్రపటం, శేషవస్త్రాలు, ప్రసాదాలు అందజేశారు.

ముక్త్యాల ఎత్తిపోతలకు నిధులు సంతోషకరం: ఎంపీ

పటమట, న్యూస్‌టుడే: ముక్త్యాల ఎత్తిపోతల పథకం ఆ ప్రాంత రైతుల చిరకాల స్వప్నమని, దానికి రాష్ట్ర ప్రభుత్వం రూ.489.28 కోట్ల నిధులు మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ చేయడం సంతోషకరమని విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్(చిన్ని) ఓ ప్రకటనలో తెలిపారు. ఈ పథకంతో 38,627 ఎకరాల వ్యవసాయ భూమికి సాగునీరు అందుతుందని పేర్కొన్నారు. ఎన్నికల ప్రచారంలో పథకాన్ని పూర్తి చేస్తామని హామీ ఇచ్చినట్లు గుర్తు చేశారు. అందులో భాగంలో జగ్గయ్యపేట ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య, ఎన్టీఆర్ జిల్లా తెదేపా అధ్యక్షుడు నెట్టెం రఘురామ్‌తో సమన్వయం చేసుకుంటూ పలుమార్లు సీఎం చంద్రబాబు, జలవనరుల శాఖ మంత్రి రామానాయుడిని కలిసి పథకానికి నిధులు మంజూరు చేయాలని కోరినట్లు పేర్కొన్నారు. తమ విజ్ఞప్తికి స్పందించి నిధులు మంజూరు చేసిన సీఎం చంద్రబాబు, మంత్రి రామానాయుడికి ఎంపీ కృతజ్ఞతలు తెలిపారు.

ఆర్టీసీ స్థలాన్ని షాపింగ్ మాల్‌కు ఇవ్వొద్దు

ఎంప్లాయీస్ యూనియన్

ఈనాడు, అమరావతి: విజయవాడలోని గవర్నర్‌పేట-2 డిపోని షాపింగ్ మాల్‌కు ఇవ్వాలనే ప్రభుత్వ ఆలోచన విరమించుకోవాలని ఎంప్లాయీస్ యూనియన్ (ఈయూ) కోరింది. నగరం నడిబొడ్డున ఉన్న స్థలాన్ని ప్రైవేటు సంస్థలకు కేటాయించి, నగర శివార్లలో ఆర్టీసీకి స్థలం ఇస్తామనడాన్ని వ్యతిరేకిస్తున్నట్లు తెలిపింది. ఈ మేరకు సంస్థ ఛైర్మన్, ఎండీకి లేఖలు అందజేసినట్లు ఈయూ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పలిశెట్టి దామోదరరావు, జీవీ నరసయ్య సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. విద్యుత్తు బస్ ఆపరేటర్లకు రాష్ట్రంలో వివిధ డిపోల స్థలాలను అతి తక్కువ ధరతో ఇచ్చే ఆలోచన చేస్తున్నారని, ఇది సంస్థను ప్రైవేటుపరం చేసే ప్రయత్నమేనని పేర్కొన్నారు. సంస్థను అన్ని విధాలా బలోపేతంగా మార్చాలని, అంతేగానీ ఉద్యోగులు ఉద్యమబాట పట్టే పరిస్థితి తీసుకురావద్దని లేఖలో కోరినట్లు పేర్కొన్నారు.

ఆచూకీ లేని ధార్ ముఠా

చాకచక్యంగా నేరాలు

మధురానగర్, న్యూస్‌టుడే

గుణదల గేటెడ్ కమ్యూనిటీలో ఈ నెల 5న భారీ దోపిడీకి పాల్పడిన ధార్ ముఠా ఆచూకీ ఇంకా లభ్యం కాలేదు. చాకచక్యంగా వెనుక వైపు నుంచి ఇళ్లలోకి ప్రవేశించి నేరాలు చేసే ఈ ముఠా.. కిందిస్థాయి ఆధారాలు లేకుండా జాగ్రత్తలు తీసుకుంటూ పోలీసులకు సవాలు విసురుతున్నారు. ఆంధ్రప్రదేశ్ పోలీసులతో పాటు తెలంగాణ, కర్ణాటక పోలీసులు విస్తృతంగా గాలిస్తున్నారు. ఈ ముఠా కదలికలు, నేరాలు చేయటంలో అక్కడి పోలీసులను నిందితుల ఆచూకీ కోసం సంప్రదిస్తూ వెళ్లారు.

ఫోన్ వాడరు.. వేలిముద్రలు పడనివ్వరు.. ధార్ ముఠా నేరాల తీరు వినూత్నంగా ఉంటుందని పోలీసులు చెబుతున్నారు. వారు చదువుకోకపోయినా పోలీసుల దర్యాప్తునకు దొరకకుండా తగిన జాగ్రత్తలు తీసుకుంటున్నారు. ఫోన్ వాడరు. వేలిముద్రలు పడకుండా గ్లౌజ్‌లు వేసుకుంటారు. సీసీ కెమెరాలకు చిక్కకుండా ముసుగులు వేసుకుంటారు.

తాజాగా వీరి గురించి మరో ఆసక్తికరమైన అంశాన్ని పోలీసులు గుర్తించారు. నేరం జరిగిన ప్రదేశంలో పోలీసులు సాధారణంగా వేలిముద్రలు సేకరిస్తారు. ఆపై అక్కడి పాదముద్రల కోసం వెతుకుతారు. ఇవి కూడా దొరకకుండా గ్లౌజ్‌లు వేసుకున్నారు. బొటనవేలితో పాటు 3 వేళ్ల మీదే నడుస్తారని పోలీసులు గుర్తించారు. దొంగల కోసం మూడు రాష్ట్రాల పోలీసులు జల్లెడ పడుతున్నారు.

టవర్ డంప్ సేకరణ.. నేరం జరిగిన తర్వాత నిందితుల కోసం పోలీసులు పలు సాంకేతిక అంశాలపై దృష్టి పెట్టారు. చరవాణి టవర్ డేటా (టవర్ డంప్)ను సేకరించారు. కామన్ నంబరు కోసం పూర్తి స్థాయిలో విశ్లేషించినా.. చిన్నపాటి క్లూ కూడా దొరకలేదు. జాతీయస్థాయిలో నిందితుల వివరాలను భద్రపరిచే న్యాట్‌గ్రిడ్‌ను ఆశ్రయించారు. క్లూ దొరికితే దాన్ని ఆధారంగా నిందితులను పట్టుకోవచ్చని భావిస్తున్నారు. ఏదో ఒక చోట చిన్న తప్పు చేస్తారని.. దాని ద్వారా వారిని పట్టుకునేందుకు పోలీసులు సిద్ధంగా ఉన్నారు.

ప్రిస్క్రిప్షన్ లేకుండా మందులు ఇవ్వకండి



మాట్లాడుతున్న ఈగల్ ఐజీ రవికృష్ణ

విజయవాడ(గాంధీనగర్), న్యూస్‌టుడే : విద్యాసంస్థల దగ్గర ఉన్న మందుల దుకాణాల నిర్వాహకులు.. వైద్యుల ప్రిస్క్రిప్షన్ లేకుండా మందులు ఇవ్వొద్దని ఈగల్ ఐజీ ఆర్.కె.రవికృష్ణ సూచించారు. ఆంధ్రప్రదేశ్ డ్రగ్స్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్, ఆంధ్రప్రదేశ్ కెమిస్ట్స్ అండ్ డ్రగ్గిస్ట్స్ అసోసియేషన్, ఎలైట్ యాంటీ నార్కోటిక్స్ గ్రూప్ ఫర్ లా ఎన్‌ఫోర్స్‌మెంట్(ఈగల్) సంయుక్త ఆధ్వర్యంలో సోమవారం హనుమాన్‌పేటలోని ఓ ఫంక్షన్ హాల్‌లో కార్యశాల నిర్వహించారు. దీనికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడారు. మందుల దుకాణాల నిర్వాహకులు ఇచ్చే మందుల వల్ల ఏ ఒక్కరూ నష్టపోకూడదని చెప్పారు. పదో తరగతిలో ఓ విద్యార్థి ఫస్ట్ క్లాస్‌లో పాసయ్యాడు. ఉన్నత చదువుల కోసం కళాశాలకు వెళ్లగా.. అక్కడ డ్రగ్స్‌కు బానిసయ్యాడని చెప్పారు. దానికి పూర్తిగా ఎడిక్ట్ అయి చదువు మానేశాడని, ఇప్పుడు అతని తల్లికి ఎవరు సమాధానం చెబుతారని ఐజీ ప్రశ్నించారు. సమాజం నష్టపోకుండా ప్రతి ఒక్కరూ మంచి ఆలోచనా ధోరణితో ముందుకు వెళ్లాలని సూచించారు. ఎవరైనా మత్తు పదార్థాలు విక్రయిస్తే వెంటనే డ్రగ్ కంట్రోల్‌తో పాటు ఈగల్ కాల్ సెంటర్ 1972కి సమాచారం అందించాలని కోరారు. ప్రభుత్వం కఠినంగా వ్యవహరిస్తుండడంతో రాష్ట్రంలో గంజాయి సాగు లేదన్నారు. ఒడిశాలోని ఐదు జిల్లాల నుంచి మాత్రమే గంజాయి వస్తుందని... ఏపీలో ఎక్కడా లేదని స్పష్టం చేశారు. ఏపీలోని 11 మండలాల్లో సుమారు 375 గ్రామాలను గుర్తించి.. డ్రోన్స్ సర్వేలెన్స్, అవగాహన కార్యక్రమాల ద్వారా ఎన్‌డీపీఎస్ చట్టం గురించి ప్రచారం చేస్తున్నట్లు తెలిపారు. విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్, ఈగల్, మెడికల్ అసోసియేషన్ కలిసి సంయుక్తంగా పని చేయాలని కోరారు. డీసీపీ సరిత మాట్లాడుతూ.. మెడికల్ దుకాణాల నిర్వాహకులు తప్పనిసరిగా రికార్డులు మెయిన్‌టైన్ చేయాలని, ప్రిస్క్రిప్షన్‌లో ఉన్న మందులు మాత్రమే విక్రయించాలని సూచించారు. ఈగల్ ఎస్పీ కె.నాగేష్‌బాబు మాట్లాడుతూ.. ఈగల్ ఏర్పాటైన తర్వాత రాష్ట్ర వ్యాప్తంగా అనేక విజయాలు సాధించినట్లు చెప్పారు. డ్రగ్స్ పక్కదారి పట్టకుండా.. తమ సంఘం కట్టుబడి పని చేస్తుందని ఆంధ్రప్రదేశ్ కెమిస్ట్స్ అండ్ డ్రగ్గిస్ట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు పి.వి.రత్నం తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘం ప్రధాన కార్యదర్శి కె.కరుణకుమార్ గుప్తా, కె.ఎస్.ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

మద్యం కుంభకోణంలో జగన్ పాపాల చిట్టా బద్దలైంది

మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు

గొల్లపూడి, న్యూస్‌టుడే: మద్యం కుంభకోణంలో జగన్ రెడ్డి పాపాల చిట్టా బద్దలైందని మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు అన్నారు. విజయవాడ శివారు గొల్లపూడిలోని కార్యాలయంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. దేశంలోనే అతి పెద్ద మద్యం కుంభకోణం గత వైకాపా ప్రభుత్వ హయాంలోనే జరిగిందన్నారు. దిల్లీ మద్యం కుంభకోణం కంటే పదిరెట్లు పెద్ద కుంభకోణం ఏపీలో చోటుచేసుకుందన్నారు. మద్యం ద్వారా దోచుకున్న వేల కోట్లను బంగారు బిస్కెట్ల రూపంలోకి మార్చారని, స్థిరాస్తి వ్యాపారాల్లో పెట్టుబడులు పెట్టారని, సినిమాలు తీశారని, విదేశాల్లో భూములు కొన్నారని, ఆఫ్రికా దేశాల్లో మైనింగ్ చేశారని ఆరోపించారు. దుబాయ్‌లో గోల్డ్ వీసాలు తీసుకుని ప్లాట్‌లు, విల్లాలు కొనుగోలు చేశారని ఆరోపించారు. అప్పటి పోలీసు యంత్రాంగాన్ని అడ్డం పెట్టుకుని దోపిడీకి పాల్పడ్డారని.. దోచుకున్న డబ్బులను ఎన్నికల్లో రూ.వందల కోట్లు జగన్ ఖర్చు పెట్టారని, ఒక్కో సిద్ధం సభకు రూ.30 కోట్లు ఖర్చు చేశారన్నారు. జగన్ చేసిన పాపాలన్నీ ఇప్పుడు బయటకు వచ్చాయని, వాటిపై అసెంబ్లీకి వచ్చి సమాధానం చెప్పాలన్నారు. సజ్జల రామకృష్ణారెడ్డి, వైవీ సుబ్బారెడ్డి, రాజ్ కెసిరెడ్డి, మిథున్‌రెడ్డి తదితరులు రూ.వేల కోట్ల కుంభకోణంలో భాగస్వాములు అయ్యారన్నారు. జగన్, వైకాపా నాయకులు దోచుకున్న రూ.వేల కోట్లను రెవెన్యూ రికవరీ చట్టం కింద స్వాధీనం చేసుకోవాలని దేవినేని ఉమామహేశ్వరరావు డిమాండ్ చేశారు. మద్యం కుంభకోణంలో జగన్ సహా బాధ్యులైన వారిని అరెస్టు చేయాలని ఈ సందర్భంగా ఆయన డిమాండ్ చేశారు.

నగరంలో కలెక్టర్ సుడిగాలి పర్యటన



పిన్నమనేని పాలీక్లినిక్ రోడ్డులో నీటిని తోడే పనులు పరిశీలిస్తున్న కలెక్టర్ లక్ష్మీశ

ఎన్టీఆర్ కలెక్టరేట్, న్యూస్‌టుడే : భారీ వర్షాల నేపథ్యంలో తీసుకోవాల్సిన చర్యలపై నగరంలోని వివిధ ప్రాంతాల్లో కలెక్టర్ జి.లక్ష్మీశ సోమవారం సుడిగాలి పర్యటన చేశారు. కలెక్టరేట్‌లో పీజీఆర్ఎస్ కార్యక్రమానికి హాజరయ్యే ముందు పిన్నమనేని పాలీక్లినిక్ రోడ్డు, నిర్మలా కాన్వెంట్ రోడ్డు, వన్‌టౌన్‌లోని లో బ్రిడ్జి, పీజీఆర్ఎస్ ముగిశాక దేవినగర్, న్యూరాజరాజేశ్వరీపేట తదితర ప్రాంతాల్లో పరిశీలించారు. వర్ష ప్రభావిత ప్రాంతాల్లో తీసుకోవాల్సిన చర్యలపై అధికారులను ఆదేశించారు. డ్రైనేజీ వ్యవస్థ నిర్వహణపై దృష్టి సారించాలన్నారు. రోడ్లపై నీరు నిల్వ ఉండకుండా, మురుగు నీరు పారుదలపై నిరంతర పర్యవేక్షణ ఉండాలని సూచించారు. నిర్వహణ పరంగా.. నగర రహదారుల్లో ఇంజినీరింగ్ లోపాలు లేకుండా చూడాలని, స్వచ్ఛత, సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు.

డ్రైనేజీ సమస్యా... ఫోన్ చేయండి

నంబరు: 91549 70454

వర్షాకాలం నేపథ్యంలో నగరంలో ఎక్కడైనా నీళ్లు నిలిచినా, డ్రైనేజీ సమస్య ఉన్నా 91549 70454 నంబరుకు ఫోన్ చేయాలని కలెక్టర్ సూచించారు. చెత్తాచెదారాలను, ప్లాస్టిక్ వస్తువులు వంటి వాటిని కాలువల్లో వేస్తే తిరిగి ఆ చెత్తే అంతులేని అనారోగ్యాల రూపంలో మనలను కాటేస్తున్నాయని పేర్కొన్నారు. వ్యర్థాలను వేరు చేసి, పారిశుద్ధ్య సిబ్బందికి ఇవ్వాలని ప్రజలకు సూచించారు. సామాజిక స్పృహ, క్రమశిక్షణ పాటించాలని కోరారు. వీఎంసీ సీఈ ఆర్.శ్రీనాథ్ రెడ్డి, ఈఈ జి.సామ్రాజ్యం, సహాయ వైద్యాధికారిణి అన్నపూర్ణ తదితరులు పాల్గొన్నారు.

కాలకృత్యాలకు వెళ్లి యువకుడి గల్లంతు



మధుసూదన్ (పాత చిత్రం)



గాలిస్తున్న ఎన్డీఆర్ఎఫ్ బృందాలు, నున్న పోలీసులు

పాయకాపురం, న్యూస్‌టుడే : కాలకృత్యాలకు వెళ్లిన ఓ యువకుడు ప్రమాదవశాత్తు పోలవరం కుడి కాలువలో జారి పడి గల్లంతైన ఘటన నున్న స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. పాయకాపురం- ప్రకాష్‌నగర్‌కు చెందిన పతివాడ రామకృష్ణ పెద్ద కుమారుడు మధుసూదన్ (26) ఓ ప్రైవేటు కంపెనీలో రూట్‌మ్యాన్‌గా ఉద్యోగం చేస్తున్నారు. ఆదివారం సాయంత్రం కాలకృత్యాల నిమిత్తం నున్న గ్రామీణం, గువ్వలగుట్ట ప్రాంతానికి వెళ్లారు. ఈ క్రమంలో పోలవరం కుడి కాలువలో జారిపడిపోయారు. కాలువ అంతా వెతికినా ఫలితం లేదని, తమ కుమారుడిని వెతికి పెట్టాలని తండ్రి నున్న పోలీసులకు సోమవారం ఫిర్యాదు చేశారు. ఈ మేరకు వారు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. గల్లంతైన వ్యక్తి ఆచూకీ కోసం ఎన్డీఆర్ఎఫ్ బృందాలు విస్తృతంగా గాలిస్తున్నాయి. మధుసూదన్‌కు భార్య ఉన్నారు.

రూ.2.36 లక్షల విలువైన బంగారం చోరీ

అద్దెకు దిగిన అమ్మాయే నిందితురాలు

మధురానగర్, న్యూస్‌టుడే : గుణదల హనుమాన్‌నగర్ రైల్వేగేటు వద్ద ఉండే ఒక ఇంట్లో రూ.2.36 లక్షల విలువైన 31.5 గ్రాముల బంగారు ఆభరణాలు చోరీకి గురైనట్లు గుణదల పోలీసులు ఆదివారం రాత్రి కేసు నమోదు చేశారు. అన్నవరపు రాణి (50) అనే మహిళ టైలరింగ్ చేస్తుంటారు. గత నెల 23న బంధువుల ఇంటికి వెళ్లి.. 27వ తేదీ రాత్రి 7 గంటలకు తిరిగి వచ్చారు. ఇంట్లోని కప్‌బోర్డులో ఉంచిన గొలుసు, చెవిదిద్దులు, ఉంగరాలు, పాపిడి బిళ్ల, చెవి రింగులు కనిపించలేదు. మొత్తం 31.5 గ్రాముల బంగారు నగలు చోరీకి గురైనట్లు గుర్తించారు. వీరి ఇంట్లో పక్క పోర్షన్‌లో గత నెలలో పాయకాపురానికి చెందిన ఆమని అనే మహిళ అద్దెకు దిగారు. పెట్రోల్ బంక్‌లో పనిచేస్తుంటుంది. నేరం జరిగిన రోజు నుంచి కనిపించకపోవడంతో ఆమెపై అనుమానం వచ్చింది. ఆదివారం సాయంత్రం గుణదల పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో సీఐ వాసిరెడ్డి శ్రీనివాస్ నిందితురాలి కోసం గాలించారు. ఆమనిని పట్టుకుని విచారించగా.. నేరం అంగీకరించింది. చోరీ చేసిన బంగారు ఆభరణాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

స్నేహితులమని వచ్చి కిడ్నాప్

గవర్నర్‌పేట, న్యూస్‌టుడే : ఎలక్ట్రానిక్స్ దుకాణంలో పనిచేసే ఓ యువకుడిని గుర్తు తెలియని అయిదుగురు వ్యక్తులు వచ్చి కిడ్నాప్ చేసినట్లు గవర్నర్‌పేట పోలీసులు కేసు నమోదు చేశారు. ప్రకాశ్‌కుమార్ (30) అయిదు సంవత్సరాలుగా గవర్నర్‌పేట అలీబేగ్ వీధిలోని సన్‌రైజ్ ఎలక్ట్రానిక్స్‌లో పనిచేస్తున్నారు. ఈ నెల 19వ తేదీ మధ్యాహ్నం ఇద్దరు యువకులు దుకాణం వద్దకు వచ్చారు. తాము ప్రకాశ్‌కుమార్ స్నేహితులమని దుకాణ యజమాని ఆశిష్ ప్రకాశ్ జైన్‌కు చెప్పారు. ఆ సమయంలో రెండో అంతస్తులో ఉన్న ప్రకాశ్ కుమార్ కిందకు వచ్చాడు. అతనితో మాట్లాడుతూ వారు బయటకు తీసుకువెళ్లారు. ఎంతసేపైనా తిరిగి రాకపోవడంతో యజమాని బయటకు వెళ్లి ఆరా తీశారు. అయిదుగురు వ్యక్తులు ప్రకాశ్‌కుమార్‌ను ఆటోలోకి బలవంతంగా ఎక్కించుకుని తీసుకువెళ్లారని తెలుసుకున్నారు. దీంతో ఆశిష్ ప్రకాశ్ జైన్.. పోలీసులకు ఫిర్యాదు చేయగా, కిడ్నాప్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సమస్యల పరిష్కారంలో జాప్యం చేస్తే చర్యలు

ఎన్టీఆర్ కలెక్టరేట్, న్యూస్‌టుడే : ప్రజలు సమర్పించే అర్జీలకు సంబంధించిన సమస్యల పరిష్కారంలో సరైన కారణం లేకుండా జాప్యం జరిగితే చర్యలు తప్పవని కలెక్టర్ జి.లక్ష్మీశ హెచ్చరించారు. పరిష్కారంలో నాణ్యత లేకున్నా సహించేది లేదన్నారు. నగరంలోని కలెక్టరేట్ పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమం సోమవారం నిర్వహించారు. కలెక్టర్ నేతృత్వంలో వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన అధికారులనుద్దేశించి మాట్లాడారు. మొత్తం 169 అర్జీలు స్వీకరించారు. వీటిలో రెవెన్యూ శాఖకు అధికంగా 46, పోలీస్ 26, విద్య 23, ఏపీఎస్‌డబ్ల్యూఆర్ఈఐఎస్ 12, పంచాయతీరాజ్ 9, ఏపీసీపీ డీసీఎల్ 8, పౌరసరఫరాలు, విభిన్న ప్రతిభావంతులు, డీఆర్డీఏ, దేవాదాయ శాఖలకు 5 చొప్పున వచ్చాయి. రిజిస్ట్రేషన్, ఆర్ఐవో, ఆర్‌డబ్ల్యూఎస్‌లకు మూడేసి, సాంఘిక సంక్షేమం, సర్వే శాఖలకు రెండేసి, వ్యవసాయ, పశు సంవర్ధక, లీడ్ బ్యాంకు మేనేజర్, నైపుణ్యాభివృద్ధి, జీఎస్‌డబ్ల్యూఎస్, గృహనిర్మాణ సంస్థ, నీటి వనరులు తదితర శాఖలకు ఒక్కోటి చొప్పున వినతులు అందాయి. జేసీ ఎస్.ఇలక్కియా, డీఆర్వో ఎం.లక్ష్మీనరసింహం తదితరులు పాల్గొన్నారు.

బ్రాయిలర్ ధరలు (కిలో ఒక్కింటికి రూ.లలో)

వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -112 రిటైల్ ధర 134 చికెన్ విత్ స్కిన్ - 194, చికెన్ స్కిన్‌లెస్ - 221.
అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 120, 129, 140 చికెన్ విత్ స్కిన్ - 228 చికెన్ స్కిన్‌లెస్ - 298.


నెక్ సూచించిన కోడిగ్రుడ్ల ధర

ఈరోజు నెక్ విజయవాడ జోన్ సూచించే ప్లాస్టిక్ ట్రే ఫారం- గేటు గుడ్ల ధర 100 గుడ్లకు రూ. 510 (వాణిజ్య & పరిశ్రమల సమాచారం కోసం) ★ నెక్ విజయవాడ. ఈరోజు ఫారం కోడి ధర కిలో రూ.92/-.

విశ్రాంత ఏఎస్సైపై వేధింపుల కేసు

మధురానగర్, న్యూస్‌టుడే : భర్త, అత్త మామలు తనను ఇంట్లోంచి అక్రమంగా బయటకు పంపేశారని ఓ యువతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు విశ్రాంత ఏఎస్సై, అతని కుటుంబ సభ్యులపై వేధింపుల కేసు నమోదు చేశారు. స్థానిక నేతాజీ కాలనీకి చెందిన శరాబందీరావు ఏఎస్సైగా పనిచేసి వీఆర్ఎస్ తీసుకున్నారు. ఆయన భార్య రమణ, కుమారుడు ప్రసాద్, కోడలు కావ్యతో కలిసి ఉంటున్నారు. కొద్ది రోజులుగా కుటుంబంలో గొడవలు జరుగుతున్నాయి. తన భర్త నెల రోజులుగా ఇంటికి రావడం లేదని కావ్య చెబుతున్నారు. అత్తమామలు తనను అర్ధరాత్రి సమయంలో ఇంట్లో నుంచి తరిమేసి, ఇంటికి తాళం వేసుకుని వెళ్లిపోయారని గుణదల పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఇంట్లో ఉండే హక్కు తనకు ఉందంటూ.. తాళం పగలకొట్టి ఇంట్లోకి వెళ్లారు. దీన్ని శరబందీరావు తదితరులు అభ్యంతరం వ్యక్తం చేశారు. పోలీసుల సహకారంతో ఆమె ఇంట్లోకి వెళ్లిందని ఆరోపిస్తున్నారు. కావ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు భర్త, అత్త మామలపై పోలీసులు కేసు నమోదు చేశారు. కాగా శరబందీరావు తనను కోడలు కొట్టిందని చెబుతున్నారు. తనకు పోలీసులు అన్యాయం చేస్తున్నారని ఆయన ఆరోపించారు. దీనిపై గుణదల సీఐ వాసిరెడ్డి శ్రీనివాసరావు స్పందిస్తూ.. కోడలు దాడి చేసిన విషయమై ఫిర్యాదు చేస్తే కేసు నమోదు చేస్తామని తెలిపారు. వారి కుటుంబ ఆస్తి వ్యవహారాల్లో తాము జోక్యం చేసుకోమని వెల్లడించారు.

రైల్వే సిబ్బందికి జీఎం అవార్డులు



జీఎం నుంచి అవార్డులు అందుకుంటున్న సిబ్బంది

రైల్వేస్టేషన్, న్యూస్‌టుడే: విధి నిర్వహణలో ప్రతిభ కనబర్చిన విజయవాడ డివిజన్‌కు చెందిన ఇద్దరు రైల్వే సిబ్బందికి ఎంప్లాయీస్ ఆఫ్ ది మంత్ అవార్డులు అందజేశారు. సోమవారం సికింద్రాబాద్‌లోని రైల్ నిలయంలో నిర్వహించిన కార్యక్రమంలో డివిజన్‌కు చెందిన టీటీఈ డీకేవీపీఎస్ చైతన్య, ట్రైన్ మేనేజరు కె.పాపారావు జీఎం సంజయ్‌కుమార్ శ్రీవాస్తవ చేతుల మీదుగా అవార్డులు అందుకున్నారు. నిత్యం అప్రమత్తంగా ఉంటూ రైల్వే శాఖ ఆదాయం పెంపునకు కృషి చేయాలని ఆయన సూచించారు. అవార్డులు అందుకున్న ఇద్దరు ఉద్యోగులను డీఆర్ఎం నరేంద్ర ఆనందరావు పాటిల్ అభినందించారు.

ధర వరలు

వంకాయలు-20/22, టమాటా-37, బెండ-18, పచ్చిమిర్చి-72, కాకర-28, బీర-20/26, క్యాబేజీ-22, క్యారెట్-32/44, దొండ-20, బంగాళదుంప-28, ఉల్లిపాయలు-25, గోరు చిక్కుళ్లు-34, దోస-15, సొర-8/10, పొట్ల-20, చామదుంప-30, అల్లం-60, మునగ-5/6, బీట్‌రూట్-30, కీరదోస-50, బీన్స్-80, నిమ్మ (డజను)-18/24, కొత్తిమీర-7/14, పుదీనా-5/15, (నిన్నటివి). నగరంలోని రైతుబజార్లలో ఈ ధరలు (రూ.ల్లో) వర్తిస్తాయి. **- ఎన్టీఆర్ కలెక్టరేట్, విజయవాడ**

తిరువూరు

• తిరువూరు • మైలవరం

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

కొండపల్లి: 8008574656, జి.కొండూరు 9063144762



? విజయవాడ రోడ్డులోని వాటర్ ట్యాంకు పక్కన ఖాళీ స్థలాల్లో మురుగునీరు నిలిచిపోతోంది. నివాసాల నుంచి వస్తున్న వాడుక నీరు పోవడానికి కాలువలు లేక గోతుల్లో నిలిచి, దోమలకు వృద్ధి చెందుతున్నాయి. - వెంకటేశ్వరరావు, మైలవరం ✔ ఖాళీ ప్లాట్లలో నీరు తొలగించేలా వాటి యజమానులకు సూచిస్తాం. మురుగు కాలువలు పారకుండా అడ్డుకట్ట వేయటంతో ఇబ్బందిగా ఉంది, తొలగిస్తాం. - ఉమామహేశ్వరరావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ – న్యూస్‌టుడే, మైలవరం

? స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వెళ్లే సీసీ రోడ్డులోని వివేకానంద పాఠశాల సమీపంలో కృష్ణా జలాల పైపులైన్ లీకై నీరు వృథాగా పోతోంది. పాదచారులు, వాహనదారులు రాకపోకలకు అవస్థలు పడుతున్నారు. - వి.రమేష్ స్థానికుడు ✔ తక్షణమే సిబ్బందిని పంపి పైపులైన్ మరమ్మతులు చేపట్టి నీటి వృథాను అరికడతాం. - బసవలింగేశ్వరరావు, పంచాయతీ కార్యదర్శి – న్యూస్‌టుడే, జి.కొండూరు



◆ స్థానిక పంచాయతీ పరిధి ఎస్సీవాడలోని డ్రెయినేజీల్లో పూడిక, చెత్త పేరుకుపోయి మురుగు పారుదల సక్రమంగా లేదని స్థానికులు 'మేమున్నాం..మీకు తోడుగాకు' తెలిపిన సమస్యను పంచాయతీ కార్యదర్శి ఎస్.రామారావుకు తెలుపగా స్పందించారు. సోమవారం పంచాయతీ సిబ్బందిని పంపి శుభ్రం చేయించారు. – న్యూస్‌టుడే, రెడ్డిగూడెం



◆ పట్టణంలోని 7వ సచివాలయం పరిధిలోని రాజుపేటలో రహదారి పక్కన డ్రెయినేజీలో మురుగునిలిచి దుర్వాసన వెదజల్లుతోందని స్థానికులు మేమున్నాం..మీకు తోడుగాకు చేసిన ఫిర్యాదును ఇన్‌ఛార్జి శానిటరీ ఇన్‌స్పెక్టర్ బుర్రి జగదీష్ దృష్టికి తీసుకెళ్లగా ఆయన స్పందించారు. పురపాలిక సిబ్బందిని పంపి శుభ్రం చేయించారు.

◆ పట్టణంలోని తంగెళ్లబీడులో డ్రెయినేజీ పూడుకుపోయిందని స్థానికులు చేసిన ఫిర్యాదుపై శానిటరీ అధికారి స్పందించి పురపాలిక కార్మికులతో మురుగు తొలగింపజేశారు.

◆ పట్టణంలోని 2వ వార్డులోని కాలువల్లో తీసిన వ్యర్థాలు, పిచ్చిమొక్కలు తొలగించకపోవడంతో ఇబ్బందిగా ఉందని స్థానికులు చేస్తున్న ఫిర్యాదులను పారిశుద్ధ్య అధికారులకు తెలుపగా స్పందించారు. కార్మికులతో వాటిని తొలగింపజేసి బ్లీచింగ్ చల్లించారు. – న్యూస్‌టుడే, తిరువూరు

అత్తింటి వేధింపులపై కేసు

భవానీపురం, న్యూస్‌టుడే: భర్త, అత్త వేధిస్తున్నారని కోడలు భవానీపురం పోలీసులకు ఫిర్యాదు చేశారు. వివరాలిలా ఉన్నాయి... విద్యాధరపురం నాలుగు స్తంభాల సెంటర్ వద్ద లక్ష్మీ తిరుపతమ్మ తల్లిదండ్రులతో కలిసి నివాసం ఉంటున్నారు. అదనపు కట్నం తీసుకు వస్తేనే కాపురానికి రావాలంటూ అత్త, భర్త వేధిస్తున్నట్లు పోలీసులకు తెలిపింది. ఈ క్రమంలో రెండేళ్లుగా పుట్టింటిలోనే ఉంటున్నానని.. వారి వేధింపులు తాళలేక గతంలో ఆత్మహత్యాయత్నం కూడా చేసినట్లు పోలీసులకు ఫిర్యాదు చేయగా.. ఈ మేరకు కేసు నమోదు చేశారు.

నెమలి ఆలయానికి రూ.2.45 లక్షల ఆదాయం



వేలంలో పాల్గొన్న పాటదారులు

నెమలి(గంపలగూడెం), న్యూస్‌టుడే: మండలంలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన నెమలి వేణుగోపాలస్వామి ఆలయంలో భక్తులు సమర్పించే కొబ్బరి చిప్పలను సేకరించేందుకు సోమవారం వేలం నిర్వహించినట్లు ఆలయ అధికారి ఎన్.సంధ్య తెలిపారు. ఈ ఏడాది ఆగస్టు 1 నుంచి 12 నెలల పాటు కొబ్బరి చిప్పలు సేకరించుకునేందుకు నిర్వహించిన వేలం ద్వారా ఆలయానికి రూ.2.45 లక్షలు ఆదాయం లభించినట్లు వివరించారు. పాలకవర్గ అధ్యక్షురాలు కె.శశిరేఖ, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

మల్లికార్జున ఖర్గే జన్మదిన వేడుకలు

తిరువూరు, న్యూస్‌టుడే: అఖిలభారత కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఎం.మల్లికార్జున ఖర్గే జన్మదిన వేడుకలు స్థానిక రాజీవ్‌భవన్‌లో సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ కార్యాలయంలో పార్టీ నాయకులు కేకులు కోసి, మిఠాయిలు పంచిపెటారు. కార్యక్రమంలో ఎ.జీవన్‌బాబు, బి.ప్రకాష్‌రావు, జి.కృష్ణమోహన్, సీహెచ్.హరిబాబు తదితరులు పాల్గొన్నారు.

కొండపల్లి, న్యూస్‌టుడే: కొండపల్లి పార్టీ కార్యాలయంలో ఖర్గే జన్మదిన వేడుకలను నిర్వహించారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు కిరణ్, అక్కల ప్రసాద్, రాము, ఆనందరావు, లింగరాజు తదితరులు పాల్గొన్నారు.

బడికి దూరం.. భత్యమే ఆధారం

విద్యార్థులకు రవాణా ఖర్చుతో ఆసరా

మైలవరం, న్యూస్‌టుడే



వాహనం కోసం బస్టాపులో పిల్లల ఎదురుచూపులు

ఇళ్లకు దూరంగా ఉండే ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు రవాణా భత్యం చెల్లిస్తామన్న ప్రభుత్వ నిర్ణయం మరింత జీవం పోస్తోంది. గ్రామీణ ప్రాంతాల్లో కనీస రవాణా సౌకర్యం లేని గ్రామాల నుంచి వచ్చే విద్యార్థులు ప్రయివేటు వాహనాల్లో రావడం ఇబ్బంది నేపథ్యంలో ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం నియోజకవర్గ వ్యాప్తంగా వందలాది మంది విద్యార్థులకు ఉపయుక్తంగా మారనుంది. మారుమూల గ్రామాల నుంచి ఉన్నత పాఠశాలలకు వచ్చేందుకు ఎదురవుతున్న ఇబ్బందులతో చాలా మంది మధ్యలోనే బడులు మానేస్తుండగా ప్రయివేటు పాఠశాల వాహనాలు ఆయా గ్రామాల్లోకి సైతం చొచ్చుకొస్తున్నాయి. దాంతో ప్రభుత్వ హైస్కూళ్లకు వెళ్లే పిల్లలతో పాటు, వారిని బడికి పంపడం పెద్దలకు సైతం సమస్యగా మారింది. వీలుంటే వారిని ద్విచక్ర వాహనాలపై దింపడం, లేదంటే ఇతర వాహనాలను ఆశ్రయించక తప్పడంలేదు. ఇది పేద విద్యార్థులకు భారంగా మారింది. ఈ నేపథ్యంలో ఇప్పటికే మండలాల నుంచి ప్రతిపాదనలను సిద్ధం చేస్తున్నారు. ఎంపికైన ఒక్కో విద్యార్థికి నెలకు రూ.600 చొప్పున భత్యంగా చెల్లించనున్నారు.

వీరికే ఎక్కువ అవసరం

నియోజకవర్గంలోని ఈ ఏడాది దాదాపు 10 అదనపు హైస్కూళ్లను ఏర్పాటు చేసినా, కొన్ని చోట్ల నుంచి బయటకు వెళ్లాల్సి వస్తోంది.

ఈ ప్రాంతాలకు బస్సులేవీ?

ఇప్పటికీ నియోజకవర్గ వ్యాప్తంగా చాలా గ్రామాలకు బస్సు సౌకర్యం లేదు. మైలవరం మండలం పోరాటనగర్, కనిమెర్ల గ్రామాల నుంచి బయట, తోలుకోడు, కొత్త మంగాపురం గ్రామాల నుంచి రావడం ఇబ్బందిగానే ఉంది. జి.కొండూరు మండలంలోని లోయ గ్రామాలకూ బస్సు సౌకర్యం మిథ్యగా మారింది. ఈ నేపథ్యంలో రవాణా సౌకర్యం లేక విద్యార్థులు పడుతున్న ఇబ్బందులకు రవాణా భత్యం ఆదరువుగా ఉంటుందని చెబుతున్నారు.

మరోవైపు 3, 4, 5 తరగతులను ఉన్నత పాఠశాలల్లోకి విలీనం చేసిన పలు ప్రాంతాల్లోనూ రవాణా తప్పని పరిస్థితి. ◆ మైలవరం మండలం తోలుకోడు యూపీ పాఠశాల తొలగించడంతో వారంతా వెల్వడం రావాల్సి వస్తోంది. ◆ లక్ష్మీనరసాపురం నుంచి ఉన్నత పాఠశాలకు తరగతులను తరలింపగా, కిలోమీటర్లకు పైగా నుంచి రావడం ఇబ్బంది నేపథ్యంలో వారికి రవాణా భత్యం ఇవ్వాలని కోరుతున్నారు. ◆ జి.కొండూరు మండలంలోని గంగినేనిపాలెం హైస్కూల్‌కు పథకం వర్తింపనుంది. ◆ ఇబ్రహీంపట్నం మండలం కొండపల్లి శాంతినగర్ ప్రాంతాల పిల్లలకు పాఠశాల దూరంగానే ఉంది. ◆ కేతనకొండలో విద్యార్థులది ఇదే పరిస్థితి కాగా, ప్రత్యేక పాఠశాల డిమాండ్ చేస్తున్నారు.

ప్రతిపాదనలు సిద్ధం

ఇప్పటికే ప్రభుత్వ ఆదేశాల మేరకు దూరం నుంచి వచ్చే విద్యార్థుల గుర్తింపు జరిగింది. దానిపై కొంత ప్రతిపాదనలు సిద్ధం చేశాం. ఈ ఏడాది మండలాల్లో హైస్కూళ్లను పెంచడంతో కొన్ని ఇబ్బందులు తగ్గాయి. - ఎల్.బాబు, పి.నరసింహారావు, ఎంఈవోలు

సచివాలయ ఉద్యోగులకు సన్మానం

గొల్లపూడి, న్యూస్‌టుడే: బదిలీపై వెళ్తున్న రాయనపాడు గ్రామ సచివాలయ సిబ్బందికి సర్పంచ్ కాటూరి కల్యాణి సోమవారం సన్మానం చేశారు. కొన్నేళ్లుగా గ్రామ ప్రజలకు చక్కటి సేవలు అందించారని కొనియాడారు. ఎక్కడికి వెళ్లినా ప్రజలకు అంతరాయం లేని సేవలు అందించాలన్నారు. తెదేపా నాయకులు కాటూరి పూర్ణచంద్రరావు, శీలంనేని సాంబశివరావు పాల్గొన్నారు.

కూటమి పాలనలో రహదారులకు మహర్దశ

జి.కొండూరు, న్యూస్‌టుడే: కూటమి పాలనతో పల్లెల్లో రహదారులకు మహర్దశ సంతరించుకుందని మైలవరం ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ అన్నారు. కుంటముక్కల గ్రామంలో వెళ్లే ప్రధాన అనుసంధాన రహదారి పనులను సోమవారం ఆయన శంకుస్థాపన చేసి ప్రారంభించారు. జాతీయరహదారి-30 నుంచి కుంటముక్కల గ్రామానికి చేరే ప్రధాన అనుసంధాన రహదారి అభివృద్ధి పనులకు రూ.1.32 కోట్ల నాబార్డు నిధులు మంజూరు అయ్యాయని తెలిపారు. నియోజకవర్గంలో గుంతలు లేని రహదారులు, శిథిలావస్థకు చేరిన వంతెనలను పునర్నిర్మించేందుకు కూటమి ప్రభుత్వం ప్రాధాన్యమిస్తోందన్నారు. కార్యక్రమంలో మైలవరం నియోజకవర్గం జనసేన ఇన్‌ఛార్జి అక్కల రామ్మోహనరావు(గాంధీ), కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సీఎం సహాయనిధి చెక్కుల అందజేత

గొల్లపూడి, న్యూస్‌టుడే: అనారోగ్యంతో ఆసుపత్రిలో చికిత్స పొందిన బాధితులకు ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా మంజూరైన రూ.10లక్షల 13వేల విలువైన చెక్కులను ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ గొల్లపూడిలోని కార్యాలయంలో సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..పేద ప్రజలకు ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో మార్కెట్‌యార్డు ఛైర్మన్ నర్రా వాసు, గ్రామ తెదేపా అధ్యక్షుడు నారద తదితరులు పాల్గొన్నారు.

నగర పంచాయతీ అత్యవసర సమావేశం నేడు

తిరువూరు, న్యూస్‌టుడే: నగర పంచాయతీ అత్యవసర సమావేశం మంగళవారం ఉదయం 11 గంటలకు పురపాలిక సమావేశ మందిరంలో నిర్వహిస్తున్నట్లు ఛైర్‌పర్సన్ కె.నిర్మల తెలిపారు. వార్డు కౌన్సిలర్లు, అధికారులు పాల్గొనాలని ఆమె కోరారు.

రెడ్డిగూడెం, న్యూస్‌టుడే: స్థానిక మండల పరిషత్తు సర్వసభ్య సమావేశం మంగళవారం మధ్యాహ్నం 2.30 గంటలకు ఎంపీపీ రామినేని దేవి ప్రణబ్ అధ్యక్షతన జరుగుతుందని ఎంపీడీవో టి.కె.వి.రమణ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..సమావేశానికి సభ్యులందరూ హాజరు కావాలని కోరారు.

పైపులైన్‌తోనే ఆగిన పనులు

ఎన్టీఆర్ కలెక్టరేట్, న్యూస్‌టుడే: రెడ్డిగూడెం మండలం పాతనాగులూరులోని బుడమేరు వాగు నుంచి ఎత్తిపోతల వరకు గతంలో రూ.97 లక్షల వ్యయంతో పైపులైన్ వేసి పనులను ఆపేశారని బల్లి డేవిడ్‌రాజు పేర్కొన్నారు. దీనికి మోటార్లు, విద్యుత్తు తదితరాలను ఏర్పాటు చేసి 800 ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందించేలా చూడాలని నగరంలోని కలెక్టరేట్‌లో సోమవారం ఆయన వినతి పత్రం సమర్పించారు.

రైతులకు సహకారం అందించండి



పీఏసీఎస్ ఛైర్మన్‌గా ఎన్నికైన కోయ నెహ్రూతో ఎమ్మెల్యే కృష్ణప్రసాద్ తదితరులు

ఇబ్రహీంపట్నం, న్యూస్‌టుడే: రైతులకు ప్రభుత్వ నుంచి అన్ని విధాలా సహకారం అందించడంలో పీఏసీఎస్ త్రిసభ్య కమిటీలు వ్యవహరించాలని ఎమ్మెల్యే కృష్ణప్రసాద్ సూచించారు. ఇబ్రహీంపట్నం పీఏసీఎస్ త్రిసభ్య కమిటీ ప్రమాణస్వీకార కార్యక్రమం స్థానికంగా సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఛైర్మన్‌గా ఎన్నికైన కోయ నెహ్రూ, సభ్యులు చిన్న జమలయ్య, నడకుదిటి విఘ్నేశ్వరరావులను అభినందించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ..వ్యవసాయ సీజన్ ఆరంభం నేపథ్యంలో త్రిసభ్య కమిటీ సభ్యుల సేవలు రైతులకు ఎంతో అవసరమన్నారు. ఎరువులు, విత్తనాలు సకాలంలో రైతులకు అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వ లక్ష్యాల మేరకు అన్నదాతల అభ్యున్నతికి కృషి చేయాలని చెప్పారు. ప్రభుత్వ పథకాలకు తోడు సొసైటీ ద్వారా రైతుల శ్రేయస్సు కోసం ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని సూచించారు. కార్యక్రమంలో జనసేన నాయకుడు అక్కల రామ్మోహనరావు తదితరులు పాల్గొన్నారు. ◆ పీఏసీఎస్ త్రిసభ్య కమిటీగా ఎన్నికైన వారిని భాజపా నాయకులు సోమవారం అభినందించారు.

నైపుణ్యంతోనే ఉద్యోగావకాశాలు

మైలవరం, న్యూస్‌టుడే: ఫ్లటర్ వంటి సాంకేతిక అంశాల్లో నైపుణ్యం సాధించడం ద్వారా ఉద్యోగ, ఉపాధి అవకాశాలను పెంచుకోవచ్చని లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ కె.అప్పారావు పేర్కొన్నారు. కళాశాలలో ఐటీ విద్యార్థులకు ఫ్లటర్ ఫ్రేమ్‌వర్క్‌పై రెండ్రోజులపాటు జరిగే కార్యశాలను సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్యశాల శిక్షకుడు ఎం.రమణీర్ పూర్వపు యాప్‌ల అభివృద్ధి, ఫ్లటర్ ఉపయోగాలను ప్రయోగాత్మకంగా వివరించారు. దాని ద్వారా ఆండ్రాయిడ్, ఐఓఎస్ రెండింటికీ ఒకేసారి యాప్‌లను రూపొందించుకోవచ్చని, కార్యశాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఐటీ విభాగాధిపతి డి.రత్నకిశోర్, కోఆర్డినేటర్ ఎం.విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ప్రిన్సిపల్ అప్పారావు

ఉమాగౌరీశంకరా.. పాహిమాం




కొత్తపల్లి(గంపలగూడెం), న్యూస్‌టుడే: మండలంలోని కొత్తపల్లి సమీప కట్లేరులోని గోపాలస్వామి మడుగు ఒడ్డున ఉన్న ఉమాగౌరీ శంకరుని ఆలయంలో సోమవారం అర్చకులు కోటేశ్వరశర్మ ఆధ్వర్యంలో విశేష పూజలు నిర్వహించారు. శివలింగానికి పంచామృతాభిషేకాలు, అర్చనలు, పుష్పాలతో అలంకరణ చేయగా అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని దర్శించుకున్నారు.

పడిన గోడ..పట్టించుకోరా..?



స్థానిక జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల ప్రహరీ గత ఏడాది వచ్చిన వర్షాల తాకిడికి కూలిపోయింది. కానీ సంవత్సరం కావస్తున్నా ఇప్పటికీ నిర్మాణాలు ప్రారంభించ లేదు. గతంలో ఈ పాఠశాలకు చెందిన స్థలం ఆక్రమణకు గురికాగా..ఇప్పుడు ప్రహరీ కూడా లేకపోవడంతో మరి కొంత ఆక్రమణలకు గురయ్యే ప్రమాదం ఉందని గ్రామస్థులు చెబుతున్నారు. మరోవైపు పాఠశాల ఆవరణలోకి కుక్కల గుంపులు చేరుతుండడంతో విద్యార్థులు భయపడుతున్నారు. బడి ఆటస్థలంలో ఉదయపు నడకకు వచ్చే మాపై కుక్కలు దాడి చేస్తున్నాయని పలువురు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పాఠశాల చుట్టూ ప్రహరీ నిర్మించాలని గ్రామస్థులు విజ్ఞప్తి చేస్తున్నారు. -న్యూస్‌టుడే, రెడ్డిగూడెం

మురిపిస్తున్న ముసురు



వర్షాభావంతో ఆందోళనలో ఉన్న రైతులకు గత నాలుగైదు రోజులుగా ఒక మోస్తరు నుంచి భారీ వర్షాలు పడుతుండడంతో హర్షం వ్యక్తం చేస్తున్నారు. పత్తిసాగు ప్రారంభించి 40 రోజులు దాటినా..మొలకెత్తిన దగ్గర్నుంచి అడపాదడపా వర్షాలు తప్ప, మొన్నటి వరకు భారీ వర్షం కురవలేదు. మూడ్రోజుల కిందట మైలవరంలో ప్రాంతంలో దాదాపు అరగంట వ్యవధిలోనే సుమారు 4 సెం.మీ.ల వర్షపాతం నమోదవడం, సోమవారం నుంచి జల్లులు పడుతుండడంతో ఆనందంలో ఉన్నారు. నియోజకవర్గ పరిధిలో ఈ ఏడాది సైతం దాదాపు 20 వేల ఎకరాల వరకు పత్తి పంటను సాగుచేస్తున్నారు. -న్యూస్‌టుడే, మైలవరం

గుంతల దారి.. ఇక్కట్లే మరి



కేతనకొండ జాతీయరహదారి నుంచి మోడల్ కాలనీకి వచ్చే రహదారి అధ్వానంగా మారింది. ఈ రహదారిలోనే మోడల్ కాలనీ వాసులతోపాటు సైనిక పాఠశాల సిబ్బంది, విద్యార్థులు, పొలాలకు రైతులు రాకపోకలు సాగిస్తుంటారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు గొయ్యి ఎక్కడ ఉందో తెలియని దుస్థితి ఎదురవుతోంది. వీరందరికీ ప్రత్యామ్నాయ రహదారి లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. పడుతూ..లేస్తూ కాలినడకనే ప్రయాణాలు సాగిస్తున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ సమస్యపై గ్రామ కార్యదర్శి మౌనికను వివరణ కోరగా మండల పరిషత్తు నిధులు రూ.8 లక్షలు మంజూరయ్యాయని వర్షాలు తగ్గిన తర్వాత పనులు ప్రారంభిస్తామన్నారు. -న్యూస్‌టుడే, ఇబ్రహీంపట్నం గ్రామీణం

కొండెక్కుతున్న ధరలు



పచ్చి మిరపకాయలు కొరికితేనే కాదు, కొనాలన్నా మంటెక్కుతున్నాయి. స్థానికంగా తోటలు అందుబాటులో లేకపోవడంతో గడిచిన పది రోజులుగా ధరల మోతమోగుతోంది. రైతుబజారులోనే కిలో రూ.76లు పలుకుతుండగా, బయట మార్కెట్లలో రూ.90 చేరింది. సాధారణంగా స్థానికంగా పచ్చి మిరప తోటలు తగ్గిపోవడంతో పాటు, మిర్చి పంట తెస్తున్న నష్టాలతో రైతులు పంటసాగుకు ఉపక్రమించకపోవడమే కొరతకు కారణమని వ్యాపారులు చెబుతున్నారు. ఇతర ప్రాంతాల నుంచి దిగుమతులు కూడా తగ్గడంతో..ధరలు మరింత పెరిగే అవకాశం ఉందంటున్నారు. - న్యూస్‌టుడే, మైలవరం

ఆంక్షలు లేకుండా పథకాలు ఇవ్వాలి

తిరువూరు, న్యూస్‌టుడే: నగర పంచాయతీ కార్యాలయం వద్ద ఇంజినీరింగ్ కార్మికులు చేపట్టిన నిరవధిక సమ్మె తొమ్మిదో రోజు సోమవారం కూడా కొనసాగింది. కార్మికులకు 62 ఏళ్ల వయోపరిమితిని పెంచి రిటైర్మెంట్ బెనిఫిట్స్ కల్పించాలని, ప్రమాదవశాత్తు మరణించిన కార్మికులకు ప్రభుత్వం ఎక్స్‌గ్రేసియో ప్రకటించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు 36 జీవో ప్రకారం వేతనాలు చెల్లించాలని, సంక్షేమ పథకాలను కూడా ఆంక్షలు లేకుండా అమలు చేయాలని కోరారు. ఆయా సంఘాల నాయకులు బి.వెంకటేశ్వరరావు, మోహనరావు, కిశోర్, రవి, నరసింహారావు, నారాయణ, కృష్ణయ్య, బాజీ, శ్రీనివాసరావు పాల్గొన్నారు.



తిరువూరు: నినాదాలు చేస్తున్న ఇంజినీరింగ్ కార్మికులు



కొండపల్లి: నిరసన తెలుపుతూ..

కొండపల్లి, న్యూస్‌టుడే: పురపాలిక ఇంజినీరింగ్ కార్మికుల సమస్యలపై ప్రభుత్వం సరైన, స్పష్టమైన ప్రకటన విడుదల చేయాలని సీఐటీయూ మండల కార్యదర్శి మహేష్ అన్నారు. ఇంజినీరింగ్ కార్మికుల సమ్మె తొమ్మిదో రోజు కొండపల్లిలో సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికులకు వేతనాలు పెంచుతామని ప్రభుత్వం చేసిన ప్రకటనలో స్పష్టత లేదన్నారు. వేతనాలు పెంచడం మంచి విషయమే అయినా ఏళ్ల తరబడి సర్వీస్ ఉన్న వాళ్లు ఉన్నారని చెప్పారు. కేటగిరి విభజనలో స్పష్టత ఇవ్వకపోవడం విచారకరమన్నారు. కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులు అని చూపించే క్రమంలో.. ఉద్యోగులకు లభించే ప్రతి సౌకర్యం వీరికి వర్తింపజేయాలని డిమాండ్ చేశారు.

అన్నదాతకు అండగా

వృద్ధాప్యంలో నెలకు రూ.3 వేల పింఛను

ఇబ్రహీంపట్నం గ్రామీణం, గుంటుపల్లి, న్యూస్‌టుడే

వ్యవసాయం చేసే రైతులకు వృద్ధాప్యంలో భరోసా ఇవ్వడానికి కేంద్ర ప్రభుత్వం పీఎం కిసాన్ మాన్‌ధన్ పేరుతో పింఛను ఇవ్వడానికి శ్రీకారం చుట్టింది. యుక్త వయసులో కష్టపడి వ్యవసాయం చేసిన రైతులు వృద్ధాప్యంలో పనిచేయలేక ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారు. ఇటువంటి వారికి ప్రతినెలా రూ.3వేల చొప్పున జీవితకాలం పింఛనుగా ఇచ్చి కేంద్ర ప్రభుత్వం ఆదుకోనుంది. 60 ఏళ్లు దాటిన సన్న చిన్నకారు రైతులకు ఆసరా కల్పించేందుకు ఈ పథకం అమలులోకి రానుందని వ్యవసాయాధికారులు పేర్కొంటున్నారు.

అర్హులు వీరే: సొంతంగా భూమి ఉన్న 18 నుంచి 40 వయసుగల చిన్న సన్నకారు రైతులందరూ అర్హులే. మైలవరం నియోజకవర్గంలోని 61 గ్రామాల పరిధిలో 36,743 మంది రైతులు ఉండగా వీరిలో 40 ఏళ్లలోపు వారు 17,371 మంది ఉంటారని అంచనా. రైతు పేరున ఐదు ఎకరాల్లోపు పొలం ఉండాలి. భార్యాభర్తల పేరున భూమి ఉండి ఇద్దరికి వేర్వేరుగా పాస్ పుస్తకాలుంటే ఇద్దరూ అర్హులే. ఆదాయపు పన్ను చెల్లింపుదారులు, ఉన్నతమైన ఆర్థికస్థితి, సామాజిక భద్రతా పథకాల పరిధిలో ఉన్న వారికి పథకం వర్తించదు.

దరఖాస్తు ఇలా: ఆసక్తి ఉన్న రైతులు ఆధార్ కార్డు పట్టాదారు పాస్ పుస్తకం, బ్యాంకు ఖాతా నంబరు, ఫోన్ నంబరుతో మీసేవా కేంద్రాల్లో సంప్రదించాలి. పీఎం కిసాన్ కేఎంవై పోర్టల్ దరఖాస్తు డౌన్‌లోడ్ చేసుకుని సంతకం అప్‌లోడ్ చేయాలి. అనంతరం పింఛను కార్డు వస్తుంది. పీఎం కిసాన్ పథకానికి అనుసంధానమైన బ్యాంకు ఖాతా నుంచి ప్రీమియం చెల్లిస్తే సరిపోతుంది. ప్రీమియం మొత్తంలో సగం రైతులు చెల్లిస్తే మిగతా సగం కేంద్రప్రభుత్వం చెల్లిస్తుంది.



పీఎం కిసాన్ మాన్‌ధన్ కార్డు

ప్రయోజనం ఇలా: రైతు నెలకు చెల్లించిన ప్రీమియం ఎంత అయితే అంతే మొత్తాన్ని కేంద్రం తన వాటాగా కలిపి భారత జీవిత బీమా సంస్థ పింఛను నిధికి జమ చేస్తుంది. ప్రీమియం కనీసం అయిదేళ్లు చెల్లించాలి. ఆసక్తి లేకుంటే మధ్యలో వైదొలగవచ్చు. అప్పటి వరకు చెల్లించిన ప్రీమియం ప్రభుత్వ వాటా వడ్డీతో కలిపి తిరిగి చెల్లిస్తారు. 60 ఏళ్ల దాటాకా నెలకు రూ.3 వేలు పింఛను ఇస్తారు. వయసు కాకముందే మరణిస్తే అప్పటి వరకు చెల్లించిన ప్రీమియం ప్రభుత్వ వాటా వడ్డీతో కలిపి జీవిత భాగస్వామికి లేదా నామినికి అందజేస్తారు. 62 ఏళ్ల దాటాక మృతి చెందితే జీవిత భాగస్వామికి నెలకు రూ.1500 ఇస్తారు. ఆసక్తి గల రైతులు పూర్తి వివరాలు రైతు సేవా కేంద్రాలలో తెలుసుకుని పథకం ద్వారా ప్రయోజనం పొందాలని ఇబ్రహీంపట్నం మండల వ్యవసాయాధికారిణి రజని తెలిపారు.

ప్రీమియం చెల్లింపు ఇలా..

వయసు	ప్రీమియం(రూ.)
18–20	55
21–24	61
25–29	80
30–34	106
35–39	150
40	200

భర్త కనిపించడం లేదని ఫిర్యాదు

భవానీపురం, న్యూస్‌టుడే: భర్త అదృశ్యమైన ఘటనపై కేసు నమోదైంది. వివరాలిలా ఉన్నాయి.. విద్యాధరపురం కామకోటినగర్‌లో ఎం.శ్రీదేవి కుటుంబ సభ్యులతో కలిసి నివాసం ఉంటున్నారు. సోమవారం ఉదయం భర్త నాగ వెంకటదుర్గారావు వ్యక్తిగత పని మీద ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. దీంతో భార్య పోలీసులకు ఫిర్యాదు చేయగా.. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు అభివృద్ధి చేయాలని ఆందోళన



తిరువూరు బస్టాండ్ వద్ద సీపీఎం నాయకుల నినాదాలు

తిరువూరు, న్యూస్‌టుడే: స్థానిక బస్టాండ్ నుంచి సూర్యా రెస్టారెంట్ మీదుగా తోకపల్లి వెళ్లే రోడ్డు అధ్వానంగా తయారై ప్రమాదభరితంగా ఉందని సీపీఎం పట్టణ కమిటీ నాయకులు సోమవారం బస్టాండ్ ఔట్‌గేట్ వద్ద ఆందోళన చేశారు. రహదారిపై గుంతలు ఎక్కువై వాహదారులు ప్రమాదాలకు గురవుతున్నారని త్వరితగతిన అభివృద్ధి చేసి ప్రజల కష్టాలు తీర్చాలని నినాదాలు చేశారు. సీపీఎం పట్టణ కార్యదర్శి ఎం.నాగేంద్రప్రసాద్, నాయకులు ఎస్.నాగేశ్వరరావు, ఎస్వీ.భద్రం, బి.వెంకటేశ్వరరావు, ఎ.రవి, వి.నాగరాజు సీహెచ్.వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

త్రుటిలో తప్పిన ప్రమాదం



కాలువలోకి దూసుకెళ్లిన బూడిద లారీని బయటకు తీస్తున్న జేసీబీ

జూపూడి గ్రామ పరిధిలోని ఖిల్లా రహదారిలో సోమవారం బూడిద లోడుతో వేగంగా వస్తున్న లారీ ఎదురుగా వస్తున్న వాహనాన్ని తప్పించబోయి అదుపు తప్పి రోడ్డు పక్కన కాలువలోకి దూసుకెళ్లింది. ఆ సమయంలో అక్కడ ఎవరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. నిత్యం రద్దీగా ఉండే ఆ మార్గంలో కాసేపు ట్రాఫిక్ స్తంభించింది. అనంతరం పెద్ద క్రేన్, రెండు జేసీబీల సాయంతో కాలువలోని లారీని బయటకు తీశారు. బూడిద లారీల వేగాన్ని నియంత్రించేందుకు పోలీసులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.
– న్యూస్‌టుడే, ఇబ్రహీంపట్నం గ్రామీణం

సంక్షేమ పాలనే కూటమి ప్రభుత్వ ధ్యేయం

ఇబ్రహీంపట్నం, న్యూస్‌టుడే: సంక్షేమ పాలనే కూటమి ప్రభుత్వ ధ్యేయమని, సీఎం చంద్రబాబు ప్రతిష్ఠాత్మకంగా పథకాలు అమలు చేస్తున్నారని ఎమ్మెల్యే కృష్ణప్రసాద్ అన్నారు. ఇబ్రహీంపట్నంలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఛైర్మన్ చిట్టిబాబు, వైస్ ఛైర్మన్ శ్రీను, తెదేపా సీనియర్ నాయకులు సీతారామయ్య, రాజా, కౌన్సిలర్లు, నాయకులు పాల్గొన్నారు.

జి.కొండూరు: మండలంలోని కుంటముక్కలలో ఆయన స్థానిక నాయకులతో కలిసి ఇంటింటికీ తిరిగి కూటమి చేపట్టిన సంక్షేమ పాలనను వివరిస్తూ కరపత్రాలను అందజేశారు. అక్కల రామ్మోహన్‌రావు, ఉయ్యూరు వెంకటనరసింహారావు, పజ్జూరు రవికుమార్ పాల్గొన్నారు. ◆ కుంటముక్కల సొసైటీ అభివృద్ధికి ఇటీవల నూతనంగా నియమితులైన త్రిసభ్య కమిటీ సభ్యులను ఎమ్మెల్యే అభినందించారు. సొసైటీ అధ్యక్షుడు సుఖవాసి శ్రీహరి, సభ్యులు వరికూటి సుబ్బారావు, మైలవరపు జమలయ్యలకు శుభాకాంక్షలు తెలిపారు.



కొండపల్లి: పంచుతున్న ఎమ్మెల్యే కృష్ణప్రసాద్



తిరువూరు: తెదేపా నాయకుల ఆధ్వర్యంలో

రూ. 5వేలకు ఆధార్, పాన్ కార్డులు కొని.. డైరెక్టర్లను చేశారు

రాజస్థాన్‌లోని నసీరాబాద్‌కు చెందిన భన్వర్‌లాల్ జైన్ 4 కంపెనీలకు డైరెక్టర్. తనో నిరుపేద. ఆయనకు రూ.5 వేలిచ్చి ఆధార్, పాన్‌కార్డుల్ని కొన్న వైకాపా మాఫియా... వాటిని వినియోగిస్తూ కంపెనీలను పెట్టింది. వాటికి తాను డైరెక్టర్‌ను అనే విషయం భన్వర్‌లాల్‌కు తెలియదు.

పేదల పేరిట డొల్ల కంపెనీలు పెట్టి ముడుపుల నిధులు మళ్లించారు

మద్యం మాఫియా మాయాజాలం

ఈనాడు, అమరావతి: డొల్ల కంపెనీలు పెట్టడం, నిధులు మళ్లించడంలో వైకాపా నేతలు మాస్టర్‌మైండ్స్. 2019-24 మధ్య డిస్టిలరీలు, మద్యం సరఫరాదారుల నుంచి కొల్లగొట్టిన ముడుపుల సొమ్మును మళ్లించేందుకు మద్యం మాఫియా ఈ విధానాన్ని అవలంబించింది. ఉత్తరాది రాష్ట్రాలకు చెందిన పేదల నుంచి రూ.5 వేలకు ఆధార్, పాన్‌కార్డులను కొన్నది. వారినే డైరెక్టర్లుగా పెట్టి 17 డొల్ల కంపెనీలను సృష్టించింది. వాటిద్వారా భారీ ఎత్తున నిధులు మళ్లించింది. ఆ అమాయకుల్లో కొందరికి తాము డైరెక్టర్లమనే విషయమే తెలియదు. క్షేత్రస్థాయిలో సిట్ పరిశీలన చేపట్టగా ఇవన్నీ బయటపడ్డాయి.

తప్పుడు చిరునామాలతో...

నందలాల్ మాన్షన్, ఫ్లాట్ 02, చంపాగల్లీ, కల్బాదేవి, ముంబయి.. చిరునామాతో క్రిపటి ఎంటర్‌ప్రైజెస్, మలిస్కా గోల్డ్ అండ్ జ్యుయలరీ, న్యూమౌంట్ గోల్డ్ అండ్ జ్యుయలరీ, ఓల్విక్ మల్టీ వెంచర్, కేరాజ్ ఎంటర్‌ప్రైజెస్, విశాల్ ఎంటర్‌ప్రైజెస్ ఏర్పాటైనట్లు బయటపడింది. ఆ ఫ్లాట్ యజమాని పేరు రమేశ్ జైన్. అక్కడకు సిట్ బృందం వెళ్లి పరిశీలించగా తాను ఫ్లాట్‌ను ఎవరికీ అద్దెకు ఇవ్వలేదని, ఆ కంపెనీలు తన ఫ్లాట్‌లో లేవని రమేశ్ జైన్ చెప్పారు. మంత్రి బిల్డింగ్, కల్బాదేవి, ముంబయి.. చిరునామాతో క్రేజ్‌కింగ్ ఎంటర్‌ప్రైజెస్, కియాలైట్ మల్టీ వెంచర్స్, ట్రిఫెర్ ఎంటర్‌ప్రైజెస్‌ను కొందరు నెలకొల్పారు. తన ఫ్లాట్‌ను ఎవరికీ అద్దెకు కానీ, లీజుకు కానీ ఇవ్వలేదని యజమాని ప్రదీప్ పోర్వాల్ చెప్పడం గమనార్హం.



ఈ కార్యాలయాలెక్కడ?


బ్రైట్‌స్టార్ మల్టీ వెంచర్స్ అనే సంస్థను ముంబయిలోని కల్బాదేవి ప్రాంతంలోనే ఏర్పాటు చేసినట్లు చూపినా.. చిరునామా దొరకలేదు. విక్సో ఎంటర్‌ప్రైజెస్.. థానెలోని సిద్ధార్థ టవర్స్ పేరుతో నమోదైంది. ఆ చిరునామాలో కార్యాలయమే లేదు. పారాక్స్ ఎంటర్‌ప్రైజెస్ సంస్థను ముంబయిలోని కనకియా రోడ్డులోని ప్రైంమాల్ షాప్ నంబరు 93 చిరునామాలో చూపారు. అక్కడ దాని జాడేలేదు.

- సియా ట్రేడింగ్, రాహి ఎంటర్‌ప్రైజెస్‌లూ ముంబయిలోనే నమోదయ్యాయి. ఆ చిరునామాల్లోని యజమానుల స్టేట్‌మెంట్లను సిట్ సేకరించింది.
- అహ్మదాబాద్‌లో బీఆర్‌ఆర్ ఉద్యోగ్ లిమిటెడ్ సంస్థ నమోదైంది. కార్యాలయ చిరునామాను గుర్తించినా.. మూడేళ్ల నుంచీ సీజ్ చేసి ఉంది.
- వాగ్నెర్ షిప్పింగ్, శ్రీజి ఇన్ఫోటెక్ సంస్థల్ని ముంబయి, థానెలో నమోదు చేసినట్లు చూపినా.. తప్పుడు చిరునామాలుగా తేలింది.

పరిశీలన లేకుండానే...

సిట్ గుర్తించిన 17 డొల్ల కంపెనీల్లో ఏడింటిని జైప్రకాశ్ జోషి అనే కంపెనీ సెక్రటరీ సిఫారసు చేశారు. డైరెక్టర్లు, చిరునామాల వివరాలను పరిశీలించకుండానే.. క్రిపటి ఎంటర్ ప్రైజెస్, మలిస్కా గోల్డ్ అండ్ జ్యుయలరీ, న్యూమౌంట్ గోల్డ్ జ్యుయలరీ, క్రేజ్‌కింగ్ ఎంటర్‌ప్రైజెస్, కేరాజ్ ఎంటర్‌ప్రైజెస్, కియా లైట్ మల్టీ వెంచర్స్, ట్రిఫెర్ ఎంటర్‌ప్రైజెస్ సంస్థలను ఆర్‌ఓసీ(రిజిస్ట్రార్ ఆఫ్ కంపెనీస్)కి జైప్రకాశ్ పంపారు. ముంబయికి చెందిన సుషాంత్ అలియాస్ ఆషిష్ (నాలుగు డొల్ల కంపెనీల్లో డైరెక్టర్‌గా ఉన్న భన్వర్‌లాల్ జైన్ మేనల్లుడు) అనే వ్యక్తి రిజిస్ట్రేషన్ కోసం ఏడు కంపెనీల కేవైసీ పత్రాలు తెచ్చి ఇవ్వగా.. ఒక్కో కంపెనీకి రూ.10 వేల చొప్పున వసూలు చేసినట్లు ప్రకాశ్ జోషి... సిట్‌కు తెలిపారు.

- హరనాథరామ్ అనే మరో కంపెనీ సెక్రటరీ.. ధనుంజయ్ తివారీ అనే వ్యక్తి ఇచ్చిన పత్రాల ఆధారంగా ఓల్విక్ మల్టీ వెంచర్‌ను రిజిస్ట్రేషన్ కోసం సిఫారసు చేశారు. డైరెక్టర్లు, కార్యాలయ చిరునామాను పరిశీలించలేదు.
- ఒక్కో వ్యక్తికి రూ.5 వేల నుంచి రూ.15 వేలిచ్చి ఆధార్, పాన్ కార్డులను మాఫియా కొన్నది. అమ్మినవారినే కంపెనీ డైరెక్టర్లుగా మార్చింది. 12 మందికి సంబంధించి సిట్ విచారణ చేయగా.. ఏడుగురి చిరునామాలు తప్పు. మిగిలిన వారిలో కొందరు.. ఆధార్, పాన్‌కార్డులను ఎవరికీ ఇవ్వలేదన్నారు.
- కేరాజ్ ఎంటర్‌ప్రైజెస్ డైరెక్టర్లుగా ఉన్న రాజేశ్, శంబులాల్‌ను సిట్ విచారించగా.. ముంబయిలో రూ.15 వేలకు తమ ఆధార్, పాన్‌కార్డుల్ని అమ్మినట్లు చెప్పారు.



అనుభవించు రాజా..!

మద్యం కుంభకోణం సొమ్ముతో మాఫియా ముఠా జల్సా

భారీగా భూములు, ఆస్తుల కొనుగోలు ● విదేశాలకు నిధుల తరలింపు

ఈనాడు, అమరావతి: మద్యం కుంభకోణంలో దోచుకున్న డబ్బుతో మాఫియా ముఠా సభ్యులు అత్యంత విలాసవంతమైన జీవితం గడిపారు. తరచూ విదేశాలకు వెళ్లి జల్సాలు చేసేవారు. అక్కడ ఖరీదైన హోటళ్లు, రిసార్టుల్లో బస చేసేవారు. ముఖ్యంగా ప్రధాన నిందితుడు రాజ్ కెసిరెడ్డి హైదరాబాద్ చుట్టుపక్కల భారీగా భూములు కొన్నారు. ఆస్తులు కూడగట్టారు. ఖరీదైన, విలాసవంతమైన వాహనాలు కొనుగోలు చేశారు. రాజ్ కెసిరెడ్డి తన పేరు మీద, తల్లి సుభాషిణి, సొంత సంస్థ ఈషాన్వీ ఇన్‌ఫ్రా ప్రాజెక్ట్స్ లిమిటెడ్ పేరు మీద హైదరాబాద్ శివారు షాబాద్, మంచనపల్లె, దామరపల్లె వంటి చోట్ల 92 ఎకరాలు కొనుగోలు చేశారు. కొన్నప్పుడు వాటి మార్కెట్ విలువ రూ.100 కోట్లు ఉంటుందని సిట్ అంచనా. ఆ భూములను హెచ్‌ఎండీఏలో కమర్షియల్/రెసిడెన్షియల్ క్యాటగిరీలోకి మార్చుకుని భారీగా లబ్ధి పొందాలని రాజ్ కెసిరెడ్డి పన్నాగం పన్నారు. ఆయన ముడుపుల సొమ్ముతోనే ఆ భూములు కొన్నారని సిట్ పేర్కొంది. భూముల కొనుగోలుకు మధ్యవర్తులుగా వ్యవహరించిన వారికి రాజ్ కెసిరెడ్డికి చెందిన అదాన్ డిస్టిలరీస్ నుంచి కమీషన్ సొమ్ము చెల్లించినట్లు తేల్చింది. రూ.25 కోట్ల రుణం తీసుకుని భూములు కొన్నట్లు రికార్డుల్లో చూపించారు.

స్టార్టప్ కంపెనీలు.. సినిమాలు

- మద్యం ముడుపుల రూపంలో సంపాదించిన నల్లధనాన్ని చట్టబద్ధం చేసుకునేందుకు ఏ1 రాజ్ కెసిరెడ్డి, ఏ9 తూకేకుల ఈశ్వర్ కిరణ్‌కుమార్‌రెడ్డి పలు స్టార్టప్ కంపెనీలు ఏర్పాటు చేశారు. అప్పటికే ఉన్నవాటిని కొనుగోలు చేశారు. వాటిలో విద్యుత్ వాహనాలు (ఈవీ), ఫార్మా, లాజిస్టిక్స్ వంటి రంగాలకు చెందినవి ఉన్నాయి. ఆ కంపెనీల నిర్వహణ, పరిశోధన వ్యయం, ఉద్యోగుల వేతనాలకు మద్యం ముడుపుల సొమ్మే వెచ్చించారు.
- రాజ్ కెసిరెడ్డి 'ఈడీ ఎంటర్‌టైన్‌మెంట్' బ్యానర్‌పై సినిమాలు తీశారు. 'సైప్' సినిమాకు రూ.25 కోట్లు వరకు ఖర్చయితే.. రూ.12 కోట్లకు సంబంధించిన బ్యాంకు లావాదేవీలే అధికారికంగా చూపించారు.
- మద్యం కుంభకోణం సొమ్ముతో జాంబియా, టాంజానియా తదితర దేశాల్లో మైనింగ్, ఇనుప ఖనిజం తవ్వకాలు చేపట్టేందుకు, కర్మాగారాలు పెట్టేందుకు ఈ ముఠా సన్నాహాలు చేసింది. వారి ట్రావెల్ పత్రాలు, పాస్‌పోర్టుల ద్వారా ఈ విషయం వెల్లడైంది.

తరచూ పర్యటనలు..!

రాజ్ కెసిరెడ్డి ఆయన బృందం తరచూ విదేశీ పర్యటనలు చేసేది. విమాన ప్రయాణం, అక్కడ విలాసవంతమైన హోటళ్లలో వసతి కోసం భారీగా ముడుపుల సొమ్ము వెచ్చించింది. వారి ప్రయాణ ఏర్పాట్లు చూసే ఆద్య ట్రావెల్స్ సంస్థకు ఈడీ ఎంటర్‌టైన్‌మెంట్స్, రిసోర్స్ వన్ ఐటీ సొల్యూషన్స్ రూ.49 లక్షలు ఒకసారి, రూ.1.42 కోట్లు మరోసారి చెల్లించినట్లు సిట్ గుర్తించింది. ఈశ్వర్ కిరణ్‌కుమార్‌రెడ్డి 2021 నుంచి మొత్తం 28 సార్లు విదేశాలకు వెళ్లారు.

- ఈ ముఠా సభ్యులు ఆదాయ పన్ను పత్రాల్లో చూపిన వివరాలకు, వారి బ్యాంకు లావాదేవీలకు పొంతన లేదు. రాజ్ కెసిరెడ్డి పీఏ పైలా దిలీప్ తన వార్షిక ఆదాయం రూ.7 లక్షలేనని ఆదాయ పన్ను శాఖకు సమర్పించిన వివరాల్లో పేర్కొన్నారు. కానీ, అతని ఖాతాల్లో రెండున్నరేళ్లలో రూ.80 లక్షలు జమైంది.

విదేశాల్లో పెట్టుబడులు

- ముడుపుల సొమ్మును రాజ్ కెసిరెడ్డి, ఆయన అనుచరగణం హవాలా మార్గాల ద్వారా విదేశాలకు తరలించింది. ఆ సొమ్ముతో ఆయా దేశాల్లో పలు కంపెనీలు ఏర్పాటు చేసి, నల్లధనాన్ని వైట్‌లోకి మార్చేందుకు ప్రయత్నించింది. 2024లో వైకాపా అధికారంలోకి రాకపోయినా, ఇబ్బంది లేకుండా ముందు జాగ్రత్తగా ఆ సొమ్మును విదేశాలకు తరలించినట్లు సిట్ పేర్కొంది.
- రాజ్ కెసిరెడ్డి, ఆయన ముఠా సభ్యులైన బూనేటి చాణక్య, ఈశ్వర్ కిరణ్‌కుమార్‌రెడ్డి, సైఫ్ అహ్మద్, సైమన్ ప్రసన్ తదితరులు హవాలా మార్గాల్లో తరలించారు. ఆ సొత్తుతో యూఏఈ, జింబాబ్వే, థాయ్‌లాండ్‌లలో పెట్టుబడులు పెట్టారు. హవాలా, మనీ లాండరింగ్‌లో ఈశ్వర్ కిరణ్‌కుమార్‌రెడ్డి కీలకంగా వ్యవహరించారు.
- దుబాయ్‌లో టెక్కర్ ట్రేడింగ్ ఎల్‌ఎల్‌సీ, టెక్కర్ ట్రక్ యూఏఈ, ట్రాన్స్‌పోర్ట్ ఎల్‌ఎల్‌సీ, హోమ్‌హేవ్స్ ఆన్‌లైన్ ఫర్నిచర్ కంపెనీలు ఏర్పాటు చేశారు. యూకేలో టెక్కర్ ట్రాన్స్‌పోర్ట్ లిమిటెడ్ నెలకొల్పారు.
- మద్యం కేసు దర్యాప్తు ప్రారంభమైన వెంటనే, అరెస్టు నుంచి తప్పించుకునేందుకు ముఠా సభ్యుల్లో పలువురు విదేశాలకు పారిపోయారు. అక్కడ విలాసవంతమైన జీవితాన్ని గడుపుతున్నారు.

దిల్లీని మించిన కుంభకోణమిది

మైలవరం ఎమ్మెల్యే కృష్ణప్రసాద్



ఇబ్రహీంపట్నం, న్యూస్‌టుడే: రాష్ట్రాన్ని దోచుకునేందుకు ప్రణాళిక చేసుకుని అధికారంలోకి వచ్చి 2019 నుంచి లిక్కర్ స్కాంను వైకాపా ప్రభుత్వం అమలు చేసిందని మైలవరం ఎమ్మెల్యే కృష్ణప్రసాద్ విమర్శించారు. సోమవారం ఇబ్రహీంపట్నంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ మద్యం స్కాం విలువ రూ.3,500 కోట్ల కంటే ఎక్కువని పేర్కొన్నారు. ఆ సొమ్ముతోనే గత ఎన్నికల్లో జిల్లాకు రూ.400 కోట్లు చొప్పున ఖర్చు పెట్టారన్నారు. దిల్లీలో జరిగిన రూ.100 కోట్ల మద్యం కుంభకోణానికే అప్పట్లో అక్కడి ముఖ్యమంత్రి జైలుకు వెళ్లారని, ఏపీలో అంతకుమించిన స్కాం జరిగిందని, దీనిపై పార్లమెంట్‌లో చర్చ జరగాలని కోరారు. రాష్ట్రంలో ఇసుక కుంభకోణంపై ఈడీ దృష్టి సారించాలన్నారు. నెలకు రూ.300 కోట్ల వరకు ఇసుక దోపిడీ జరగ్గా, ఐదేళ్లలో రూ.వేల కోట్లకు చేరిందని చెప్పారు. ఈ రెండు కుంభకోణాలపై పూర్తి స్థాయిలో విచారణ జరిగితే నమ్మలేని నిజాలు వెలుగులోకి వస్తాయన్నారు.

కేపీఎంజీ ఎన్నో చెబితే.. అమలు పరిచింది ఒక్కటే

దోపిడీకి అడ్డమని మిగతా సిఫార్సులు గాలికి

- డిస్టిలరీలకు గ్రీన్‌ఛానల్‌లో చెల్లింపులు
- డిజిటల్ లావాదేవీలనూ పక్కనపెట్టిన ఏపీఎస్‌బీసీఎల్

ఈనాడు, అమరావతి: వైకాపా ప్రభుత్వ హయాంలో ముడుపులు ఇచ్చిన డిస్టిలరీలకే పెద్ద ఎత్తున మద్యం ఆర్డర్లు ఇచ్చేందుకు వీలుగా మద్యం మాఫియా ఆదేశాల మేరకు ఇష్టానుసారం నిబంధనలు మార్చేసిన బెవరేజెస్ కార్పొరేషన్ (ఏపీఎస్‌బీసీఎల్).. అంతా చట్టప్రకారమే చేశామనే భావన కల్పించేందుకు కేపీఎంజీ అనే కన్సల్టెన్సీ సంస్థను అడ్డం పెట్టుకుంది. మద్యం ఇండెంట్, ఎకౌంటింగ్, ఆడిటింగ్‌పై సలహాలు ఇచ్చేందుకంటూ 2019లో కేపీఎంజీని కన్సల్టెంట్‌గా నియమించుకుంది. అయితే ఆ సంస్థ పలు సిఫార్సులు చేసినా.. మద్యం మాఫియా దోపిడీకి అనుకూలంగా ఉన్న ఒక్క సిఫార్సును మాత్రం అమలు చేసింది. డిస్టిలరీలు, సరఫరాదారులకు 'పీడీ ఖాతా నుంచి ప్రత్యేక గ్రీన్ ఛానల్‌లో చెల్లింపులు జరపాలి' అన్న సూచన ఒక్కటే మాఫియాకు నచ్చింది. తమకు ముడుపులు చెల్లించిన డిస్టిలరీలు, సరఫరా సంస్థలకు పీడీ ఖాతా ద్వారా ఠంచనుగా చెల్లింపులు జరిగేలా చూసింది. డిస్టిలరీల నుంచి ప్రతి ఐదు రోజులకు ముక్కుపిండి ముడుపులు వసూలు చేసింది. కేపీఎంజీ ప్రతినిధి 2019 నవంబరు 4న బెవరేజెస్ కార్పొరేషన్‌కు నివేదిక అందజేశారు. కానీ 2019 డిసెంబరు 6న కేపీఎంజీ మరో నివేదిక ఇచ్చినట్లుగా బెవరేజెస్ కార్పొరేషన్ అధికారులు ఒక పత్రాన్ని తెరపైకి తెచ్చారు. అందులో సిఫార్సులు అంతకుముందు ఇచ్చిన నివేదికలోని అంశాలకు పూర్తి భిన్నంగా ఉన్నాయి. ఈ రెండో నివేదిక అనుమానాస్పదంగా ఉన్నట్లు సిట్ పేర్కొంది. కేపీఎంజీ నివేదికలోని సిఫార్సుల్ని పరిశీలించి సూచనలు చేసేందుకు నలుగురు అధికారులతో బెవరేజెస్ కార్పొరేషన్ కమిటీని నియమించింది. ఆ కమిటీ అనుమానాస్పదంగా ఉన్న రెండో నివేదికనే పరిగణనలోకి తీసుకుంది.

వాటిని పక్కన పెట్టేసి..

- మద్యం కొనుగోళ్లలో డిజిటల్ చెల్లింపులకు వీలు కల్పించాలన్న కేపీఎంజీ సూచనను గాలికొదిలేసింది. అలా చేస్తే అక్రమ మద్యం విక్రయాలు సాధ్యం కాదన్న ఉద్దేశంతో దుకాణాల్లో నగదు మాత్రమే స్వీకరించే విధానాన్ని అమలు చేసింది.
- ఒక డిస్టిలరీ/కంపెనీ బ్రాండ్‌కు గడచిన మూడేళ్లలో.. ఏ త్రైమాసికంలో ఎంత డిమాండ్ ఉందనే అంశం ఆధారంగా ఆర్డర్ ఫర్ సప్లై (ఓఎఫ్‌ఎస్), ఇండెంట్ ఫర్ సప్లై (ఐఎఫ్‌ఎస్)లను నిర్ణయించాలన్న సిఫార్సునూ తుంగలో తొక్కేసింది. ఈ సూచన పాటిస్తే.. గత మూడేళ్లలో ఎక్కువ విక్రయాలు ఉన్న పాపులర్ బ్రాండ్లకు ఆర్డర్లు ఇవ్వాల్సి ఉంటుందని.. ముడుపులు ఇచ్చిన డిస్టిలరీలు, సొంత డిస్టిలరీల్లో తయారైన బ్రాండ్లకే ఆర్డర్లు ఇవ్వాలన్న మాఫియా కుట్రకు ఈ సూచన అవరోధం అవుతుందని దానిని అమలు చేయలేదు.
- ఆ సూచనను పక్కన పెట్టేసి.. ముడుపులు ఇచ్చిన బ్రాండ్లకు లక్షల కేసుల ఆర్డర్లు ఇచ్చేందుకు వీలుగా కొత్త ఓఎఫ్‌ఎస్ విధానం రూపొందించింది. ఎస్పీవై ఆగ్రోస్, అదాన్ డిస్టిలరీస్ వంటి మద్యం మాఫియాకు చెందిన డిస్టిలరీల్లో తయారైన కొత్త బ్రాండ్లకు కూడా లక్షల కేసుల ఆర్డర్లు ఇచ్చింది.
- మద్యం సరఫరా, పంపిణీ, విక్రయాలను రియల్ టైమ్‌లో సమీకృతం చేయాలన్న కేపీఎంజీ సిఫార్సును అటకెక్కించింది. అప్పటికే అమల్లో ఉన్న కంప్యూటర్ ఆధారిత సి-టెల్ సొల్యూషన్‌కు స్వస్తి పలికింది.
- పారదర్శకంగా మద్యం ఆర్డర్లు ఇచ్చే ఆటోమేటెడ్ విధానాన్ని రద్దు చేసింది. బెవరేజెస్ కార్పొరేషన్‌లో ప్రత్యేకాధికారి ఇష్టానికి అనుగుణంగా మాన్యువల్‌గా ఆర్డర్లు ఖరారు చేసే విధానం అమల్లోకి తెచ్చింది. ఇండెంట్ విజ్ఞప్తుల్ని ఆన్‌లైన్‌లో స్వీకరించే విధానాన్ని వదిలేసి.. ప్రైవేటు మెయిల్ ద్వారా విజ్ఞప్తులు తీసుకుంది. ముడుపులు చెల్లించిన బ్రాండ్లకు ఆర్డర్లు ఇవ్వడమే దీని ఉద్దేశం.
- మద్యం దుకాణాల సూపర్‌వైజర్లు ఇండెంట్ పెట్టాలన్న కేపీఎంజీ సూచనా పట్టించుకోలేదు. ఇండెంట్ ఎంట్రీ బాధ్యతను డిపో మేనేజరుకు కట్టబెట్టింది. లిక్కర్ మాఫియాలోని పెద్దల కనుసన్నల్లోనే వారు ఇండెంట్లు పెట్టారు.



10 శాతం మందికే విజయం ఎందుకంటే..

ఆలోచనలు ప్రతి ఒక్కరికీ వస్తాయి. కానీ 50 శాతం మందే వాటిని సాకారం చేసుకోవడానికి ప్రయత్నాలు ప్రారంభిస్తారు. ఎందుకంటే ఆలోచన కన్నా ఆచరణ కష్టం కాబట్టి. వారిలో 10 శాతం మందే లక్ష్యం చేరేవరకూ ప్రయత్నిస్తుంటారు. మిగతా వారంతా మధ్యలోనే చేతులెత్తేస్తారు. స్థిరత్వంతో పనిచేయడం చాలా కష్టమైనా, అలా శ్రమించేవారే విజేతలవుతారు.

– జాన్ హెన్రీ, ఇన్వెస్ట్‌మెంట్ కోచ్

పక్కా ఆధారాలతోనే మిథున్‌రెడ్డి అరెస్టు

హోంమంత్రి వంగలపూడి అనిత

మడకశిర, న్యూస్‌టుడే: మద్యం కుంభకోణంలో రాజంపేట ఎంపీ మిథున్‌రెడ్డి హస్తం ఉందని, పక్కా ఆధారాలు ఉండటంతోనే అరెస్టు చేశారని రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనిత అన్నారు. సోమవారం శ్రీసత్యసాయి జిల్లా మడకశిరకు వచ్చిన ఆమె విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రాజకీయ ముసుగులో ఉన్న నేరస్థుడు జగన్ ఒక్క ఛాన్స్ అంటూ రావడంతో ప్రజలు ఐదేళ్లు పట్టం కట్టగా.. అభివృద్ధి మరచి కక్షసాధింపు చర్యలకే పరిమితం కావడంతో రాష్ట్రం 20 సంవత్సరాల వెనక్కి వెళ్లిందని ధ్వజమెత్తారు. రాష్ట్రంలోని ప్రతి పోలీస్‌స్టేషన్‌లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తామని.. జిల్లాకు ఒక సైబర్ క్రైం పోలీస్‌స్టేషన్‌ను అందుబాటులోకి తెస్తామన్నారు. రాప్తాడు నియోజకవర్గంలో బాలికపై జరిగిన లైంగిక దాడి విచారణ కొలిక్కి వచ్చిందని, వారం రోజుల్లో కేసు ఛేదిస్తారని తెలిపారు. మడకశిరకు రూ.7వేల కోట్లతో సోలార్ పార్క్ మంజూరు చేశారన్నారు. వైకాపా నేతలు బెంగళూరు, చెన్నై, హైదరాబాద్‌ల్లో కూర్చొని సంక్షేమ పథకాలు అమలు చేయలేదని మాట్లాడుతున్నారని వారి హయాంలో ఏ మేరకు సంక్షేమ పథకాలు అమలు చేశారో దానిపై చర్చకు సిద్ధంగా ఉన్నామన్నారు. సమావేశంలో మడకశిర ఎమ్మెల్యే ఎం.ఎస్.రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి పాల్గొన్నారు.



విలేకరులతో మాట్లాడుతున్న అనిత, చిత్రంలో తిప్పేస్వామి, ఎం.ఎస్.రాజు

జగన్‌పై కక్ష సాధింపులు లేవు

ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్

ఈనాడు, అమరావతి: వైకాపా అధ్యక్షుడు జగన్‌పై ఎన్డీయే ప్రభుత్వం ఎలాంటి కక్ష సాధింపు చర్యలకూ పాల్పడటం లేదని ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ పేర్కొన్నారు. రాష్ట్రంలో జరిగిన మద్యం కుంభకోణంపై ప్రస్తుతం తాను స్పందించలేనని అన్నారు. ఈ అంశం న్యాయస్థానం పరిధిలో ఉన్నందున మాట్లాడటం భావ్యం కాదని భావిస్తున్నట్లు చెప్పారు. హైదరాబాద్‌లో సోమవారం హరిహర వీరమల్లు సినిమాకు సంబంధించి జరిగిన విలేకరుల సమావేశం అనంతరం ఆయన వద్ద ఒక విలేకరి ఈ అంశాలు ప్రస్తావించగా పవన్‌కల్యాణ్ స్పందించారు.

రిమాండ్ ఖైదీ నంబరు 4196

మిథున్‌రెడ్డికి కేటాయింపు

కంబాలచెరువు(రాజమహేంద్రవరం), న్యూస్‌టుడే: మద్యం కుంభకోణంలో అరెస్టయిన వైకాపా ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డికి రాజమహేంద్రవరం కేంద్ర కారాగారంలో రిమాండ్ ఖైదీ నంబరు 4196 కేటాయించారు. ఆదివారం రాత్రి జైలు వైద్యాధికారి ఆధ్వర్యంలో ఆయనకు వైద్య పరీక్షలు చేశారు. ఫలితాలన్నీ సాధారణ స్థాయిలో ఉన్నాయని నిర్ధారించిన తరువాత జైలులోని స్నేహ బ్యారక్‌కు తరలించారు. ఎంపీ మిథున్‌రెడ్డి చిన్నాన్న, తంబళ్లపల్లె ఎమ్మెల్యే ద్వారకానాథరెడ్డి రాజమహేంద్రవరంలో మకాం వేశారు.

ప్రతాప్‌కుమార్‌రెడ్డికీ అందాయి

- కావలి మాజీ ఎమ్మెల్యేకు మద్యం ముడుపుల డబ్బులు
- గత ఎన్నికల్లో వైకాపా తరఫున పోటీ
- ప్రకాశం, నెల్లూరు, చిత్తూరు జిల్లాల్లో.. రూ.200-300 కోట్లు పంచిన చెవిరెడ్డి మనుషులు



ఈనాడు, అమరావతి: శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా కావలి మాజీ ఎమ్మెల్యే, గత ఎన్నికల్లో వైకాపా తరఫున పోటీ చేసిన రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డికి మద్యం ముడుపుల సొమ్ము అందినట్లు సిట్ దర్యాప్తులో తేలింది. ప్రకాశం, నెల్లూరు, చిత్తూరు జిల్లాల్లోని పలు నియోజకవర్గాల వైకాపా అభ్యర్థులకూ ఈ సొత్తు చేరినట్లు వెల్లడైంది. అప్పట్లో సిటింగ్ ఎమ్మెల్యేలుగా ఉన్న వీరికి, వారి పీఏలకు, నియోజకవర్గాల పరిధిలోని మండలాల్లో చక్రంతిప్పే వైకాపా ఎంపీపీలకు సొమ్ము అందినట్లు నిర్ధారణైంది. మద్యం ముడుపుల రూపంలో రూ.3,500 కోట్లకుపైగా కొల్లగొట్టిన వైకాపా ప్రభుత్వ పెద్దలు.. అందులోని రూ.200-300 కోట్లను ఈ 3 జిల్లాల్లోనే ఎన్నికల ఖర్చుకు వెచ్చించినట్లు ఆధారాలు సహా నిరూపితమైంది. సొమ్మును అభ్యర్థులకు చేరవేయడంలో పార్టీ ముఖ్యనేత, జగన్‌కు అత్యంత సన్నిహితుడైన చెవిరెడ్డి భాస్కరరెడ్డి నాయకత్వం వహించినట్లు శాస్త్రీయ, సాంకేతిక ఆధారాలతో సిట్ తేల్చింది. చెవిరెడ్డి దగ్గర పనిచేసే బాలాజీయాదవ్, నవీన్ కృష్ణ, గన్‌మన్ దుబ్బాక గిరిబాబు.. హైదరాబాద్, తాడేపల్లిల్లోని డెన్‌ల నుంచి డబ్బును తెచ్చి పంచారని నిగ్గుతేల్చింది. ప్రాథమిక అభియోగపత్రంలో ఈ వివరాలను పేర్కొంది.

ఎన్నికల్లో ఖర్చు చేసింది ఆ సొమ్మే..

ఎన్నికల్లో గెలిచేందుకు వైకాపా తొక్కని అడ్డదారి లేదు. ఓట్ల కోసం రూ.కోట్లు కుమ్మరించింది. నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో పట్టున్న నేతలకు రూ.కోటి, ఒకటి, రెండు మండలాల్లో ప్రభావం చూపేవారికి రూ.50 లక్షలు చొప్పున అప్పట్లో వైకాపా నేతలు ఇచ్చారు. ప్రభావం చూపగలిగే గ్రామస్థాయి నేతలు ఒక్కొక్కరికీ రూ.10 లక్షలు తక్కువ కాకుండా అందించారు. అంతా ముడుపుల సొమ్మే. బాలాజీయాదవ్, నవీన్‌కృష్ణలు అనేక సందర్భాల్లో తాడేపల్లి, హైదరాబాద్‌ల్లోని డెన్‌లకు వెళ్లి సొమ్ము తీసుకుని.. వైకాపా సిటింగ్ ఎమ్మెల్యేలు, వారి పీఏలు, మండల స్థాయి నాయకులకు ఇచ్చినట్లు సిట్ తేల్చింది. సాంకేతిక ఆధారాలన్నింటినీ అభియోగపత్రంలో పొందుపరిచింది.

●హైదరాబాద్ ఖాజాగూడలోని నిహారిక ఇంటర్‌లేక్ అపార్ట్‌మెంట్‌ను ముడుపుల సొమ్ము భద్రపరిచే డెన్‌గా నేతలు వినియోగించారు. నిందితుల్లో ఒకరైన బెహరూన్ సజీల్ షేక్ ఈ డెన్‌లో తొలుత రూ.10 కోట్లు భద్రపరిచారు. తర్వాత ప్రశాసన్‌నగర్‌లోని మారుతీ టవర్స్‌కు తరలించారు. ఆ డబ్బు వివిధ మార్గాల్లో చెవిరెడ్డికి చేరింది. ● కుంభకోణం నిందితుల్లో ఒకరైన సైఫ్ అహ్మద్.. హైదరాబాద్‌లోని ఓ2 స్క్వేర్ అపార్ట్‌మెంట్‌లో రూ.20-25 కోట్లు పెట్టారు. ఆ డబ్బు చెవిరెడ్డి మనుషుల ద్వారా వైకాపా అభ్యర్థులకు అందింది. ● కొమ్మారెడ్డి అవినాష్‌రెడ్డి(ఏ-46) ఓ సందర్భంలో హైదరాబాద్ నుంచి తాడేపల్లికి రూ.3 కోట్లను తీసుకొచ్చి వైకాపా అభ్యర్థులకు అందించారు. హైదరాబాద్, విజయవాడ మధ్య అనేక సందర్భాల్లో ఆయన రాకపోకలు సాగించినట్లు తేలింది. ఇవి కొన్ని ఉదంతాలే. అనేక సందర్భాల్లో ఇలా ముడుపుల సొమ్మును తరలించారు.

ఆయన ఫోన్ చేశారు... వారు డబ్బు ఇచ్చారు

2024 మార్చి 11 ఉదయం 7.09 నుంచి 7.12 గంటల మధ్య బాలాజీయాదవ్‌కు.. ప్రతాప్‌కుమార్‌రెడ్డి మూడుసార్లు ఫోన్ చేశారు. అదే రోజు బాలాజీయాదవ్, నవీన్‌కృష్ణలు తాడేపల్లి డెన్ వద్ద సైమన్ ప్రకాశ్ (మద్యం ముడుపులు వసూలు చేసే ముఠా సభ్యుడు)ను కలిశారు. అతని నుంచి సొమ్ము తీసుకుని.. మరుసటి రోజు ఉదయం 9.10 గంటలకల్లా బాలాజీయాదవ్, నవీన్‌కృష్ణ.. కావలి చేరుకుని 9.47 వరకూ అక్కడే ఉన్నారు. అప్పటి ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి పీఏకు డబ్బును అందించారు.

ముడుపులివ్వని బ్రాండ్లను చంపేశారు

- బినామీ కంపెనీలు, కమీషన్లు ఇచ్చినవారికి అడ్డగోలుగా ఆర్డర్లు
- ఇదీ వైకాపా మద్యం మాఫియా కుట్రకోణం

ఈనాడు, అమరావతి: ముడుపులిచ్చిన కంపెనీలకే భారీ ఆర్డర్లు ఇచ్చేలా 2019-20 నుంచి వైకాపా మద్యం మాఫియా కుట్రలు అమలుచేసింది. రాజ్ కెసిరెడ్డి సొంత కంపెనీలైన అదాన్, లీలా కంపెనీలకు డిస్టిలరీలు లేకున్నా రూ.వందల కోట్ల ఆర్డర్లు ఇచ్చారు. వీటికి లబ్ధి కల్పించాలని.. కొత్త బ్రాండ్లకు అమలుచేసే నిబంధనలనూ మార్చేశారు. అప్పటివరకు అమ్మకాల్లో అగ్రస్థానంలో ఉన్న పెర్నార్డ్ రికార్డ్, మెక్‌డోవెల్ తదితర బహుళజాతి సంస్థల బ్రాండ్లను చంపేశారు. దీంతో అమ్మకాలు క్షీణించి, డిస్టిలరీలు మూసివేత దిశగా నడిచాయి. ఈ వివరాలను సిట్ బయటపెట్టింది. 2020 ఫిబ్రవరి 13 నుంచి మార్చి 13 మధ్య 63 కంపెనీల నుంచి మద్యం సరఫరా కోసం 382 ఆర్డర్ ఫర్ సప్లై (ఓఎఫ్‌ఎస్) దరఖాస్తులు అందగా.. వాటిలో 271 ఆమోదించారు. కావాల్సిన కంపెనీలైతే 100% ఆమోదించారు. ముడుపుల లెక్క కుదరకపోతే తిరస్కరించారు.

100% ఓఎఫ్‌ఎస్ ఆమోదం

- ఎస్ఎన్‌జే డిస్టిలరీస్ 19, ఎస్ఎన్‌జే షుగర్స్ 13, విశాఖ డిస్టిలరీస్ 9, ఈగల్ డిస్టిలరీలు 9 దరఖాస్తులు చేయగా.. అన్నింటినీ ఆమోదించారు.

కొన్ని కంపెనీల బ్రాండ్ కిల్లింగ్ (అమ్మకాలు కేసుల్లో)

బ్రాండ్	2018–19 అమ్మకాలు	2023–24 అమ్మకాలు
మెక్‌డోవెల్ బ్రాందీ	22,73,086	5
ఇంపీరియల్ బ్లూ విస్కీ	20,21,955	7
కింగ్‌ఫిషర్ బీర్	1,02,47,566	11,82,388
బడ్‌వైజర్ బీర్	22,52,195	0

ఈ కంపెనీలకు తిరస్కరణే

పెర్నార్డ్ రికార్డ్ 14 దరఖాస్తులు చేస్తే అన్నింటినీ తిరస్కరించారు. క్రౌన్‌బీర్స్ కంపెనీ 19 దరఖాస్తులు చేస్తే 17 ఆమోదించలేదు. అన్‌హెషర్ బుష్ ఇనబెవ్ సంస్థ 17 దరఖాస్తులు చేస్తే 15 తిరస్కరించారు.

- ప్రముఖ బహుళజాతి కంపెనీల బ్రాండ్లను కావాలనే అణచివేసినట్లు స్పష్టమవుతోందని ఛార్జిషీటులో వెల్లడించారు. 2019 వరకు నామమాత్ర అమ్మకాలున్న బ్రాండ్లకు భారీగా ఆర్డర్లు ఇచ్చారు.
- క్రౌన్ బీర్స్, కార్ల్స్‌బర్గ్, పెర్నార్డ్ రికార్డ్, యునైటెడ్ బ్రూవరీస్, బకార్డి ఇండియా, జాన్ డిస్టిలరీస్, ఏన్‌హజర్ బుష్ ఎన్‌బేవ్ తదితర సంస్థలు 2019-20 వరకు అమ్మకాల్లో అగ్రస్థానంలో ఉండగా.. 2020-21 నుంచి వాటికి నామమాత్ర ఆర్డర్లే ఇచ్చారు.
- అంబర్ స్పిరిట్స్, సైప్ ఆగ్రో, బీఆర్‌కే స్పిరిట్స్, బీడీహెచ్ ఆగ్రో, ఎస్ఎన్‌జే డిస్టిలరీస్, ఎస్ఎన్‌జే షుగర్స్, ఈగల్ డిస్టిలరీస్, శర్వాణి ఆల్కో బ్రూ, అదాన్, లీలా డిస్టిలరీస్ సంస్థలకు 2020 నుంచి పెద్దఎత్తున ఆర్డర్లు ఇచ్చారు.

కొత్త బ్రాండ్ల సరఫరాకు పరిమితులు ఎత్తేసి

కొత్త సరఫరాదారులకు మొదటి నెలలో 10 వేల కేసులకే అనుమతి ఇచ్చేవారు. ఆ నిబంధనను ఎత్తేశారు. ప్రత్యేక సందర్భాల్లో కమిషనర్‌కే ఉండే అధికారాన్ని బెవరేజెస్ కార్పొరేషన్ ఎండీ ద్వారా ప్రత్యేక అధికారిగా ఉన్న సత్యప్రసాద్‌కు బదిలీ చేశారు. ఎంత పరిమాణంలో అయినా ఆర్డర్లు ఇవ్వడానికి అనుమతించేలా చేసుకున్నారు. 19 కొత్త బ్రాండ్లకు విచక్షణారహితంగా ఓఎఫ్‌ఎస్‌లు జారీచేశారు.

- ఎస్పీఓ ఆగ్రోస్‌కు చెందిన ఎస్పీవై హెచ్‌డీ గోల్డ్‌విస్కీకి మొదటి నెలలోనే 1,51,600, విశాఖ డిస్టిలరీ, అదాన్ డిస్టిలరీకి చెందిన అదాన్ సుప్రీమ్ బ్లెండ్ సుపీరియర్ గ్రెయిన్ విస్కీకి 1,03,400 కేసులకు ఆర్డర్లు ఇచ్చారు. లీలా డిస్టిలరీస్‌కు చెందిన లీలా బ్రిలియంట్ బ్లెండ్ సుపీరియర్ గ్రెయిన్‌విస్కీకి 69,300 కేసులు, అదాన్ డిస్టిలరీస్, ఎస్పీవై ఆగ్రోకు చెందిన అదాన్ సుప్రీంబ్లెండ్ సుపీరియర్ గ్రెయిన్ విస్కీకి 62,700 కేసుల ఆర్డర్లు దక్కాయి. 19 కంపెనీలకు ఇలా నిబంధనలకు విరుద్ధంగా ఆర్డర్లు ఇచ్చారు.
- బ్రాండ్ల రిజిస్ట్రేషన్‌కు అవసరమైన పత్రాల సమర్పణలోనూ ఉల్లంఘనలు జరిగాయి. కొన్ని బ్రాండ్లు రిజిస్ట్రేషన్ సమయంలో పత్రాలే ఇవ్వలేదని గుర్తించారు.



దశాబ్దానికి పైగా మహిళా వివక్షను గమనిస్తున్నా. మా సంస్థని ఐపీఓకి తీసుకెళ్తున్న సమయంలో చాలామంది బ్యాంకర్లతో సంప్రదింపులు జరిపేవాళ్లం. వాళ్లు సంస్థ నిర్మాణంలో అంచిత్(కవల సోదరుడు) పాత్ర గురించి ఎక్కువగా ప్రశంసించేవారు. ఒక దశలో కలగజేసుకుని, నేనూ సంస్థ అభివృద్ధిలో కీలకపాత్ర పోషించానని చెప్పా. కొన్నిసార్లు చొరవ చూపి మన గురించి మనమే మాట్లాడాలి. లేదంటే మన ప్రతిభకు గుర్తింపు, ప్రశంసలు దక్కవు.

- అద్వైత నాయర్, సహ- వ్యవస్థాపకురాలు, సీఈఓ, నైకా



భీకాజీ కామా... విదేశీగడ్డపై తొలిసారిగా భారత స్వాతంత్ర్య జెండాను 1907లో జర్మనీలోని స్టట్‌గార్ట్‌లో ఎగురవేసిన స్వాతంత్ర్యోద్యమ నాయకురాలు. ఈ జాతీయ పతాకం ఆకుపచ్చ, కాషాయం, ఎరుపు రంగుల్లో ఎనిమిది తామర పుష్పాలు, వందేమాతరం నినాదం, సూర్యుడు, చంద్రవంకలతో ఉంటుంది. సంపన్న పార్సీ జొరాస్ట్రియన్ కుటుంబంలో పుట్టిన ఈమె 'మదర్ ఆఫ్ జనరల్ నాలెడ్జ్', 'మదర్ ఆఫ్ ద ఇండియన్ రెవల్యూషన్'గానూ పేరొందారు. ఆమె గుర్తుగా దిల్లీ మెట్రో పింక్‌లైన్‌లోని ఓ ప్రాంతానికి భీకాజీ కామా అనీ పేరు పెట్టారు.

- నేడు 'జాతీయ జెండా దినోత్సవం'

వసుంధర

vasundhara@eenadu.in

నోటి అల్సర్‌కి చెక్ పెట్టండిలా!



మనం తీసుకునే ఆహారంలో పోషకాలు, విటమిన్లు తగ్గిపోవడం, నెలసరి సమయంలో హార్మోన్లలో వచ్చే మార్పులు, ఒత్తిడి, నిద్రలేమి, వివిధ రకాల వైరల్ ఇన్ఫెక్షన్లు నోటి అల్సర్లకు కారణం అవుతాయి. ఒంట్లో వేడిచేయడం వల్ల కూడా కొందరికి ఈ సమస్య వస్తుంది. మన జీవనశైలిలో కొన్ని మార్పులు చేసుకుంటే ఈ సమస్య రాకుండా జాగ్రత్త పడొచ్చు. అవేంటంటే...

- ఏదైనా ఆహారం తిన్న వెంటనే నోటిని శుభ్రం చేసుకోవాలి. లేదంటే నోట్లో మిగిలిన ఆహారపదార్థాలు ఆమ్లాలను విడుదల చేస్తాయి. ఇవి అల్సర్లకు కారణం అవుతాయి. అందుకే రోజులో ఒక్కసారైనా ఉప్పునీటితో పుక్కిలించాలి. దీనివల్ల ఇన్ఫెక్షన్లు తగ్గుతాయి.
- సాధారణంగా శరీరంలో విటమిన్ బి12, ఐరన్, జింక్, ఫోలేట్ తగ్గినప్పుడు నోటిలో పుళ్లు ఏర్పడతాయి. వీటికోసం ఫైబర్ ఎక్కువగా ఉండే కాయగూరలు, ఆకుకూరలు, గుడ్లు వంటి ఆహారపదార్థాలను తీసుకోవాలి.
- ప్రతి మూడు నెలలకోసారి టూత్‌బ్రష్‌ను మార్చాలి. అంతేకాదు, మృదువుగా ఉండే వాటికి ప్రాధాన్యం ఇవ్వాలి. ఇవి నోటిలోని మృదుకణజాలానికి హాని కలిగించవు.
- ఒత్తిడి వల్ల కూడా నోటి అల్సర్లు వచ్చే ప్రమాదం ఉంది. దీన్ని తగ్గించుకోవడానికి ధ్యానం, యోగ, బ్రీతింగ్ ఎక్సర్‌సైజ్... వంటివి చేయాలి. ఇవి ఒత్తిడిని తగ్గించి మంచి నిద్రపట్టేలా చేస్తాయి.
- టీ, కాఫీలకు దూరంగా ఉండాలి. అంతేకాదు, వీటితోపాటు తగినంత నీరు తాగాలి. నోరు ఆరిపోకుండా చూసుకోవాలి. ఇన్ని జాగ్రత్తలు పాటించినా ఫలితం లేదనుకుంటే వైద్యసలహా తీసుకుంటే మంచిది..

షేప్‌వేర్‌లు వాడుతున్నారా?

సన్నగా కనిపించాలనీ, పొట్ట దాచుకోవాలనీ, చక్కటి ఆకృతి సొంతం కావాలనీ కోరుకోని అమ్మాయిలెవరు? మరి అందుకోసం షేప్‌వేర్‌లను వాడుతున్నారా? అయితే, దానివల్ల ఎదురయ్యే ఇబ్బందుల్ని తప్పక తెలుసుకోవాల్సిందే అంటున్నారు నిపుణులు. అవేంటంటారా?



- సాగే గుణమున్న మెటీరియల్‌తో షేప్‌వేర్‌లను తయారు చేస్తారు. ఇవి ఎక్కువసేపు ఒంటిని అతుక్కుని ఉండటం వల్ల అలర్జీలు తలెత్తొచ్చు.
- ఒంటికి పట్టి ఉండే షేప్‌వేర్‌ని ఎంతసేపు ధరిస్తున్నారన్నదీ విషయమే. ఎక్కువసేపు వేసుకుంటే ఛాతి ఒత్తిడికి గురవుతుంది. ఇది శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది కలగజేయడమే కాదు... మైకం కమ్మేలానూ చేస్తుంది. ఇలాంటప్పుడు వాటికి దూరంగా ఉండటమే మేలు.
- శరీరానికి తగిన ఆకృతి ఇస్తుందని... వాస్తవిక పరిమాణం కంటే చిన్నది ఎంచుకుంటూ ఉంటారు కొందరు. ఇలా చేస్తే కడుపుపై ఒత్తిడి పెరిగి... యాసిడ్ రిఫ్లక్షన్స్, ఉబ్బరం, వంటి ఇబ్బందులు ఎదురవుతాయి. జీర్ణక్రియ నెమ్మదిస్తుంది.
- బిగుతుగా ఉండే షేప్‌వేర్ ధరించడం వల్ల రక్తప్రసరణలో లోపాలు తలెత్తుతాయి. దీన్ని ఎక్కువ సేపు ధరిస్తే శరీరం తిమ్మిరి ఎక్కుతుంది. పిల్లలు వాడితే వారి కండరాల అభివృద్ధి, ఎముక ఎదుగుదల మందగిస్తుంది.

ఆటతో మెరిశారు!

నాన్న తోడు లేదు. అమ్మనీ తనే చూసుకోవాల్సిన పరిస్థితి. అయితేనేం హాకీ, జూడో రెండింట్లో జాతీయ స్థాయిలో రాణిస్తోంది కలువుపల్లి భవ్య. స్కూల్లో హ్యాండ్‌బాల్ ఆటపై మనసు పారేసుకుంది. ఎవరేమన్నా... వరుస వైఫల్యాలు ఎదురైనా పట్టుదలగా ప్రయత్నించడమే కాదు, బెస్ట్ ప్లేయర్‌గానూ నిలిచింది బోయి సత్య. అంతర్జాతీయ స్థాయిలో సత్తా చాటడమే లక్ష్యంగా సాగుతోన్న ఈ యువకెరటాల స్ఫూర్తిదాయక ప్రయాణమిది..!





తల్లిదండ్రుల సంరక్షణలో ఎదగాల్సిన వయసులో అమ్మకే అమ్మయ్యింది భవ్య. 'మాది తిరుపతి. నా ఏడో తరగతిలో నాన్న మమ్మల్ని వదిలేశాడు. అమ్మ మస్తానమ్మ పక్షవాతంతో మంచానికి పరిమితమైంది. దీంతో ఇంటి పనులు, అమ్మ బాగోగులు అన్నీ నేనే చూసుకుంటూ స్కూలుకీ వెళ్లేదాన్ని. పరుగు, జూడోల్లో ఎప్పుడూ ముందే. అది చూసి మా పీఈటీ ప్రసన్నలక్ష్మి హాకీలో శిక్షణనిచ్చారు. ఇందులో రాణిస్తుండటం చూసి మా మేనమామ, టీచర్ ఆర్థికంగా సాయం చేశారు. ఉదయం 5.30గం.కల్లా ఇంటి పనులు చేసి, 2.5కి.మీ. దూరంలోని మైదానానికి నడిచి వెళ్లేదాన్ని. అక్కడ జూడో శిక్షణ పూర్తిచేసి పాఠశాలకు చేరుకునేదాన్ని. సాయంత్రం గంటన్నర హాకీ సాధన చేసేదాన్ని. పదో తరగతిలో అండర్-17 హాకీ పోటీలకు ఎంపికయ్యా. హాకీ, జూడో రెండింటికి సంబంధించి వివిధ పోటీల్లో పాల్గొని పతకాలూ సాధించా'నంటోంది భవ్య. కొవిడ్‌లో శిక్షణకు దూరమైంది. 2023లో జూడోకు రాష్ట్రస్థాయిలో ఎంపికై నేషనల్స్‌కు తమిళనాడు వెళ్తే... ఆటకు ముందు తగినంత బరువు లేదన్నారు. బలవంతంగా తినిపిస్తే కావాల్సిన దానికన్నా బరువు ఎక్కువైంది. దీంతో అనర్హురాలిగా ప్రకటించారు. 'ఆ రోజంతా ఏడ్చా. తిరిగి ధైర్యం తెచ్చుకుని విజయవాడలో జరిగిన స్టేట్‌మీట్‌లోనే కాదు, సౌత్ జోన్ నేషనల్స్, నేషనల్స్‌లోనూ జూడోలో బంగారు పతకాలు సాధించా'నసే భవ్య ఈ ఏడాది శ్రీకాళహస్తిలో జరిగిన స్టేట్‌మీట్‌లో కాంస్యం గెలుచుకుంది. హాకీ పరంగానూ రాణిస్తోంది. కేరళ స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (శాయ్)కి ఎంపికైంది. కేరళ రాష్ట్రం తరపున ఆడి గోల్డ్‌మెడల్ సాధించింది. ప్రస్తుతం ఇంటర్ చదువుతోన్న ఈమె తాజాగా ఆల్ ఇండియా సబ్-జూనియర్ విమెన్ నేషనల్ హాకీ టోర్నమెంట్-25కి ఎంపికైంది. ఒలింపిక్స్‌లో దేశం తరపున ఆడాలి, కొంతమంది క్రీడాకారులను తయారు చేయాలన్నవి భవ్య లక్ష్యాలు.

– వేల్పూరి వీర గంగాధర శర్మ, తిరుపతి

సత్యది విజయవాడలోని గొల్లపాలెం గట్టు. నాన్న కనక రాజు వీఎంసీ హెడ్ వాటర్ వర్క్స్‌లో పనిచేస్తారు. అమ్మ ఆదిలక్ష్మి. ఇద్దరు ఆడపిల్లల్లో పెద్దమ్మాయి సత్య. స్కూల్లో ఖోఖో ఆడేది. ప్రాక్టీసుకోసం దగ్గర్లోని కళాశాలకు వెళ్లినప్పుడు కొందరు హ్యాండ్‌బాల్ ఆడటం చూసి ఆసక్తి పెంచుకుంది. వాళ్లతోనే సాధన చేయడం మొదలుపెట్టింది. అండర్-14 బాలికల జట్టులో స్థానాన్నీ సంపాదించింది. రాష్ట్ర స్థాయి అంతర్ జిల్లాల సబ్ జూనియర్ హ్యాండ్‌బాల్ ఛాంపియన్‌షిప్‌లో జిల్లా జట్టుకు ప్రాతినిధ్యం వహించింది. రాష్ట్ర జట్టులోనూ స్థానం లభించింది. అయితే పతకాలు సాధించడంలోనే వెనకబడింది. మిగతా రాష్ట్రాల క్రీడాకారిణులను చూశాక తనలోని లోపాలు అర్థమయ్యాయామెకు. దీంతో తనని తాను మెరుగుపరచుకుంది. కొవిడ్‌లో దొరికిన ఖాళీ సమయాన్ని ఇందుకు వినియోగించుకుంది. తర్వాతి నుంచి రాష్ట్ర స్థాయి జూనియర్, సీనియర్ మహిళల ఛాంపియన్‌షిప్‌ల్లో తలపడింది. ప్రతిభ కనబరిచి జాతీయస్థాయి పోటీలకూ ఎంపికైంది. అండర్ 18, 19 హ్యాండ్‌బాల్ పోటీల్లో రాణించడమే కాదు, ఈ ఏడాది అంతర్జాతీయ మహిళా దినోత్సవం నాడు ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చేతుల మీదుగా 'బెస్ట్ ప్లేయర్' అవార్డునూ అందుకుంది. ప్రస్తుతం సత్య బీకాం ద్వితీయ సంవత్సరం చదువుతోంది. భారత జూనియర్ హ్యాండ్‌బాల్ జట్టులో స్థానం సాధించి, అంతర్జాతీయ వేదికపై సత్తా చాటాలన్న లక్ష్యంతో శ్రమిస్తోంది.

– టి.శ్రీనివాసరావు, విజయవాడ



పెళ్లయినా... సహజీవనం చేశాడు!

నా స్నేహితురాలు ఒక వ్యక్తిని ప్రేమించింది. అతడితో సహజీవనం చేస్తూ గర్భవతి అయ్యింది. అయితే, ఇప్పటికే ఆ వ్యక్తికి పెళ్లయ్యిందనే విషయం తాజాగా తెలిసింది. ఇప్పుడు ఆ అమ్మాయికి ఉండే హక్కులు ఏంటి? – ఓ సోదరి

మీ స్నేహితురాలు ప్రేమించిన వ్యక్తిని పెళ్లిచేసుకోవాలనే ఉద్దేశంతో అతనితో సహజీవనం చేసిందా? పెళ్లయిన తర్వాత సహజీవనం చేస్తే అది చట్టబద్ధం కాదు. కానీ, పెళ్లికాని ఇద్దరు కలిసి జీవిస్తే నేరం కాదని కోర్టులు చెబుతున్నాయి. వివాహమైనా ఆ విషయం దాచిపెట్టి సహజీవనం చేయడం... విడాకులు తీసుకోవడానికి మొదటి కారణంగా హిందూ వివాహచట్టంలోని సెక్షన్ 13(1)(i) చెబుతోంది. అంతేకాదు, అలా కలిసి జీవించిన అమ్మాయికి గృహహింస కేసు వేయడానికి, మెయింటెనెన్స్ అడగడానికి హక్కులు ఉన్నాయి. పుట్టిన పిల్లలకు కూడా మెయింటెనెన్స్ అడగొచ్చు. ఆ బిడ్డలకు అతడి వారసులుగా గుర్తింపు దక్కుతుంది. మీ స్నేహితురాల్ని అతడు మోసం చేశాడనుకుంటే... భారతీయ నాగరిక్ సురక్ష సంహిత(బీఎన్ఎస్ఎస్)లోని సెక్షన్ 81 కింద క్రిమినల్ కేసు ఫైల్ చేయవచ్చు. సెక్షన్ 316(2) ప్రకారం నమ్మకద్రోహం చేశాడని కూడా కేసు పెట్టవచ్చు. అంతేకాదు, అతడితో కలిసి ఉన్నప్పుడు మీరు పెట్టిన ఖర్చులు, ఇప్పుడు ప్రసవానికి అయ్యే ఖర్చులు, పిల్లలకు మెయింటెనెన్స్... వంటివన్నీ గృహహింస చట్టం ద్వారా తిరిగి పొందవచ్చు. ఈ సెక్షన్‌లోని 2(ఎ) ప్రకారం బాధిత వ్యక్తి... అతడితో సహజీవనం చేసిందని నిరూపించగలిగితే ఆ చట్టం వర్తిస్తుంది. అయితే, ఇప్పుడు అతడిని పెళ్లి చేసుకోవడానికి వీలులేదు కాబట్టి... మోసం చేసినందుకు పరిహారం కూడా కోరవచ్చు. ముందు ఒకసారి మధ్యవర్తుల ద్వారా సమస్య పరిష్కారానికి ప్రయత్నించండి. ఆమె గర్భవతి కాబట్టి వీలైనంత త్వరగా నిర్ణయం తీసుకుంటే మేలు.

డియర్ వసుంధర



జి. వరలక్ష్మి, న్యాయవాది

ఇవి మాట్లాడే గ్లవ్స్!

క్రీడాకారులు, వైద్య సిబ్బంది, కొందరు వృత్తి నిపుణులు గ్లవ్స్‌ని వాడటం చూసే ఉంటారు. కానీ ఈ గ్లవ్స్ ఎంతో ప్రత్యేకం. ఇవి మాట్లాడే గ్లవ్స్. అందుకే ఆ సంస్థ సీఈవో ఐశ్వర్య కర్ణాటకిని యువ వ్యాపారవేత్త-2025 పురస్కారం వరించింది.

ఎనిమిదో తరగతిలో ఎదురైన ఓ సంఘటన ఐశ్వర్య ఆలోచనల్లో ఏళ్లపాటు అలాగే ఉండిపోయింది. గురుగ్రామ్‌లో స్కాటిష్ హైస్కూల్లో చదువుకుందామె. అక్కడ దివ్యాంగులకు ప్రత్యేక విభాగం ఉండేది. స్టూడెంట్ కౌన్సిల్ సభ్యురాలిగా వారానికోమారు ఆ విద్యార్థులతో మాట్లాడేది ఐశ్వర్య. ఆ గదిలో చూపులేనివాళ్లు, నడవలేనివాళ్లు... ఇలా రకరకాల విద్యార్థులు ఉండేవారు. వాళ్లంతా మాట్లాడుకునేవారు. అక్కడున్న ఓ ఆరేళ్ల అబ్బాయిని చూడగానే ఐశ్వర్యకి జాలి కలిగేది. ఎందుకంటే మూగవాడైన ఆ పిల్లాడి సంజ్ఞల భాష అక్కడ ఎవరికీ అర్థం అయ్యేది కాదు. దాంతో ఒంటరిగా దిగాలుగా కూర్చునేవాడు. అప్పుడే సంజ్ఞల భాష (సైన్ లాంగ్వేజ్) నేర్చుకోవాలనుకుంది ఐశ్వర్య. తర్వాత పైచదువులకు వెళ్లింది, ఉద్యోగంలో చేరింది. ఏళ్లు గడిచిపోయినా, ఆ మూగ పిల్లాడు గుర్తొచ్చేవాడు. అలాంటివాళ్ల కోసం ఏదైనా చేయాలన్న సంకల్పం ఐశ్వర్యలో రోజురోజుకూ బలపడింది.

రోబోటిక్స్ నిపుణుడైన పరీక్షిత్‌తో ఆమెకు పరిచయం ఏర్పడింది. తన ఆలోచనను అతడితో పంచుకుంది. ఈ క్రమంలోనే ఇద్దరూ కలిసి పుణె కేంద్రంగా 2021లో గ్లోవాట్రిక్స్ సంస్థను ప్రారంభించారు. కొన్ని ప్రయోగాల తర్వాత 'ఫిఫ్త్‌సెన్స్' పేరుతో ప్రత్యేక చేతి తొడుగులను(గ్లవ్స్) తీసుకొచ్చారు. దీనికి కృత్రిమమేధలో ఒక విభాగమైన 'నేచురల్ లాంగ్వేజ్ ప్రాసెసింగ్' విధానాన్ని వినియోగించారు. దీని ద్వారా సంజ్ఞలు ఆంగ్ల భాషలో వాక్యాలుగా మారుతాయి. కావాలంటే ఆంగ్లం నుంచి హిందీ, మరాఠీ... ఇలా కొన్ని భారతీయ భాషల్లోకీ అనువదించవచ్చు. ఈ గ్లవ్స్‌కు అనుసంధానమై ఉండే యాప్.. ఇతరులు మాట్లాడిన మాటలను అక్షర రూపంలోకి మార్చి వాటిపైనున్న డిస్‌ప్లేలో చూపిస్తుంది. దీంతో సాధారణ వ్యక్తులు మాట్లాడుకున్నట్లుగానే సమాచార మార్పిడి జరుగుతుంది. దీనివల్ల లక్షల మంది బధిరులు ఇతరులతో సంభాషించవచ్చు. ఇన్ని ప్రత్యేకతలు ఉండబట్టే ప్రపంచ మేధో సంపత్తి సంస్థ నుంచి గ్లోవాట్రిక్స్‌కు వార్షిక అవార్డు, ఆ సంస్థ సహ వ్యవస్థాపకురాలు, సీఈవో అయిన ఐశ్వర్యకు ఉత్తమ యువ వ్యాపారవేత్త పురస్కారం లభించాయి. 'రాయల్ ఆర్కిడ్ హోటల్స్ తమ సీఎస్సార్ విభాగం నుంచి మా పరిశోధనలకు నిధులు అందించింది. ఈ సంస్థ చెవిటి, మూగ వ్యక్తులకు ఉపాధి అవకాశాలనూ చూపిస్తుంది. ఈ గ్లవ్స్ వచ్చే సంవత్సరం మార్కెట్‌లోకి రానున్నాయి. వీటి ధర రూ.20 వేలు ఉండొచ్చు' అని చెబుతున్నారు ఐశ్వర్య.



ఐశ్వర్య

– వీఎస్ఎస్ఎస్ ప్రసాద్, హైదరాబాద్

శోధిత

అమ్మ బాధ్యత... అపోహే!

కొత్తగా అమ్మయిన వాళ్లు కావొచ్చు లేదా పిల్లలు కాస్త పెద్దయ్యాకా కావొచ్చు... బిడ్డలు రాత్రుళ్లు ఏడ్చినా, మరే ఇతర అవసరమైనా సరే... ముందుగా మేల్కొనేది అమ్మే. బిడ్డ గొంతు వింటే చాలు.. తల్లి వెంటనే లేచేస్తుందనీ, సహజంగానే ఆ శక్తి వాళ్లకు ఉంటుందనీ అనుకునేవారే ఎక్కువ. అయితే, ఆర్హస్ యూనివర్సిటీ తాజా పరిశోధనలు మాత్రం ఇది పూర్తిగా అపోహే అంటున్నాయి. నిజానికి ఆడవాళ్లలోనూ, మగవారిలోనూ బేబీ శబ్దాలకు ప్రతిస్పందించే తీరు ఇంచుమించు ఒకేలా ఉంటుందట. ఈ పరిశోధన కోసం శాస్త్రవేత్తలు కొంతమంది తల్లిదండ్రులను ఎంపిక చేసుకుని, బేబీ ఏడ్చే కృత్రిమ శబ్దాలను వారికి వినిపించారు. ఆ సమయంలో ఇద్దరూ ఒకే సమయంలో నిద్ర మేల్కొన్నారట. అంతేకాదు, మరో ట్రయల్‌లో పరిశోధకులు 117మంది తొలిసారి తల్లిదండ్రులైన వారిని ఎంచుకుని వారం రోజులపాటు వారి నిద్రవేళలను పరిశీలించారు. రాత్రుళ్లు బేబీని చూసుకునేందుకు 75శాతం మంది అమ్మలే తమ నిద్రను త్యాగం చేస్తున్నట్లు గుర్తించారు. కాబట్టి, ఆడవాళ్లలో, మగవారిలో శబ్దాలకు స్పందించే తీరు ఒకేలా ఉంటుందనీ, ఇదేదో సహజసిద్ధంగా ఉన్న లక్షణం కాదనీ చెబుతున్నారు పరిశోధకులు. కేవలం, సామాజిక కారణాలు, మైండ్ సెట్టే దీనికి కారణమంటున్నారు. అందుకే, పిల్లల సంరక్షణ బాధ్యతల్ని అమ్మానాన్నలిద్దరూ సమానంగా పంచుకోవాలనీ మెటర్నిటీ లీవే కాదు, పెటర్నిటీ లీవ్ కూడా సమానంగా ఉండాలనీ సూచిస్తున్నారు. అందుకు... పాలసీలోనూ, ప్రజల ఆలోచనా విధానంలోనూ మార్పు రావాలంటున్నారు. అప్పుడే... నిద్రలేమి, డిప్రెషన్... వంటివాటి నుంచి అమ్మకు రక్షణ కల్పించొచ్చని చెబుతున్నారు.

ఆహ్వానం

వసుంధర పేజీపై మీ అభిప్రాయాలు, సలహాలు, నిపుణులకు ప్రశ్నలు... ఇలా మాతో ఏది పంచుకోవాలన్నా 9154091911కు వాట్సాప్ ద్వారా పంపవచ్చు.

బంగారం - వెండి



21న ముగింపు

	బంగారం (24క్యా)	ఆర్నమెంట్ (22క్యా)	వెండి (కిలో)
హైదరాబాద్	1,02,700	92,200	1,17,794
విజయవాడ	98,450	91,800	1,15,700
ప్రొద్దుటూరు	98,500	90,620	1,14,700
రాజమహేంద్రవరం	1,00,150	91,800	1,26,000
విశాఖపట్నం	99,790	91,800	1,18,000
తమిళనాడు	----	91,800	1,26,000

మరణాన్ని జయించిన లక్ష్యం..!

'ఒవేరియన్ క్యాన్సర్ స్టేజ్3... గర్భసంచి తొలగించాల్సిందే! పెళ్లి, పిల్లలు లాంటి భవిష్యత్తు కలలు కల్లలే'... అని తెలిసింది డా.శివానీ బిస్వాల్‌కు. అయినా ఆమె కుంగిపోలేదు. సంకల్ప బలంతో మహమ్మారిని జయించింది.



శివానిది దిల్లీ. డాక్టర్ అయ్యి పేదలకు సేవ చేయాలని కలలు కంది. లక్ష్య సాధన కోసం రేయింబవళ్లు చదివేది. అనుకున్నట్లే మంచి మార్కులతో ఎంబీబీఎస్ పూర్తిచేసింది. 2023 మాస్టర్స్ పరీక్షలకు 4 నెలల ముందు... 'పీరియడ్స్ అప్పుడు పొత్తికడుపులో విపరీతమైన నొప్పి. జ్వరం కూడా వచ్చింది. కానీ మరుసటి రోజుకు అన్నీ తగ్గిపోయాయి. సాధారణమే అనుకున్నా. కానీ నా స్నేహితులు 'ఎందుకైనా మంచిది అల్ట్రా సౌండ్ చేయించుకో' అన్నారు. పరీక్షల ముందు సమయం వృథా చేయడం ఇష్టం లేదు నాకు. కానీ అమ్మ బలవంతంతో వెళ్లాను. రిపోర్ట్స్‌లో ఒవేరియన్ క్యాన్సర్ అని తెలిసింది. ఒక్కసారిగా నా జీవితం తలకిందులైంది. తర్వాత తేరుకుని డాక్టర్‌గా నేనే వైద్యాన్ని నమ్మకపోతే... నా దగ్గరికి వచ్చే రోగులకు ఏం భరోసా ఇస్తా, అని నన్ను నేను సముదాయించుకున్నా. సర్జరీ చేయాలన్నారు. నాకేం కాదని అమ్మకు ధైర్యం చెప్పాను. గర్భసంచి తొలగించారు. నరకం... నొప్పిని తట్టుకోలేక అరిచేసేదాన్ని. మందుల వల్ల నిద్రపట్టేది కాదు. జుట్టు ఊడిపోయింది. 30 ఏళ్లకే మెనోపాజ్, హాట్‌ఫ్లాషెస్. ఏవేవో ఆలోచనలు... వీటినుంచి బయటపడటానికి చదువుని సాధనంగా చేసుకున్నా. కీమోలు జరుగుతున్నప్పుడే పరీక్షలు రాశాను. ఈ సమయంలో అమ్మ, నాన్న, నా కజిన్ అందించిన సాయం మరచిపోలేను. గతేడాదే ఎండీ పట్టానూ అందుకున్నా. క్యాన్సర్ నయమైనట్లు చెప్పారు. కానీ ఆ సంతోషం ఎంతసేపో నిలవలేదు. ఆ తరవాత నిమిషంలోనే 'ఇప్పటికి మీరు వ్యాధి నుంచి బయటపడినట్లే కానీ, ఈ ఏడాదిలోనే మళ్లీ వచ్చే ఆస్కారం ఉంది' అన్నారు. నా సహనం చచ్చిపోయింది. ఇక చాలు, నా జీవితం ఇక్కడే ఆగిపోతే బాగుణ్ను... మళ్లీ ఈ బాధలన్నీ నావల్ల కాదు అనిపించింది. రెండ్రోజులు గదిలోంచి బయటికి రాలేదు. కానీ, ఇలా ముగిసిపోవడం నాకు ఇష్టం లేదు. పోరాడే చనిపోవాలి అనుకున్నా. ధైర్యాన్ని కూడగట్టుకున్నా. కన్సల్టెంట్‌గా సేవలు అందించడం మొదలుపెట్టాను. క్యాన్సర్ వారియర్‌గా నేను పడిన ఇబ్బందుల్లో మరచిపోలేనిది జుట్టు ఊడిపోవడం. ఒక ఆడపిల్లకు ఇది చాలా దుఃఖంతో కూడుకున్నది. అందుకే హెయిర్ ట్రాన్స్‌ప్లాంటేషన్‌లో నైపుణ్యం సంపాదించి, నాలాంటి వారికి సాయం చేస్తున్నా' అనే శివాని... తన ప్రయాణాన్ని సామాజిక మాధ్యమాలు, పలు కార్యక్రమాల్లో పంచుకుంది. ఇది కొంతమందికైనా ఉపయోగపడి, మానసిక ఆందోళన నుంచి దూరమైతే చాలంటారామె.















శ్రావణ లక్ష్మికి పాపిటబిళ్ల..!

మరికొన్ని రోజుల్లో శ్రావణం రానే వస్తోంది. పెళ్లిళ్లు, పేరంటాలు, పూజలు, వ్రతాలు... ఒకటేమిటి, ఎన్నెన్నో శుభకార్యాలు. మరి ఆ వేడుకల్లో సంప్రదాయంగా కనిపించాలని కోరుకోని అమ్మాయిలెవరుంటారు. ఇందులో దుస్తులతో పాటూ నగలదీ ప్రధాన పాత్రే. హారాలు, గొలుసులు, గాజులు...ఇలా ఎన్ని ఉన్నా పాపిట మెరిసే బిళ్ల ఒక్కటి చాలు మగువల మోముని మెరిసిపోయేలా చేయడానికి. నుదుటన చమక్కుమనిపించే ఇది... అమ్మాయికి శ్రావణ శోభను తెచ్చేస్తుంది. అలాగని ఇది ఇప్పుడే వచ్చిన నయా ట్రెండేమీ కాదండోయ్! తరతరాలుగా... రాచరికపు హంగులకు నిదర్శనంగా నిలుస్తోంది. ఒకప్పుడు మహారాణులు, యువరాణులు... నవరత్నాలు పొదిగిన రాజ చిహ్నాలను పాపిట బొట్లుగా ఎంచుకునేవారట. ఆపై పసిపిల్లలూ, పడచుల నుదుటిన చేరి... ముఖ అందాన్ని రెట్టింపు చేశాయి. అప్పట్నుంచి కాలానుగుణంగా ఎన్నెన్నో మార్పులతో ఆకట్టుకుంటూనే ఉన్నాయి. అలా ఒకప్పుడు అచ్చంగా బంగారంతో చేసినవీ, ఆపై రాళ్లు పొదిగినవీ అలరిస్తే... గత కొన్నేళ్లుగా టెంపుల్ డిజైన్లతో, భారీ పనితనంతో తీర్చిదిద్ది పాపిట బిళ్లలు ముచ్చటగొలిపాయి. ఇప్పుడు పట్టు దుస్తులమీదకే కాదు... స్టైలిష్‌గా కనిపించే కుర్తీలపైన ధరించినా నప్పేలా.... సింపుల్ డిజైన్లతో స్టైలిష్‌గా కనువిందు చేస్తున్నాయి. పోల్కీ డైమండ్స్, నవరత్నాలతో చేసిన చిన్న పెండెంట్, కనీ కనిపించని సన్నని బంగారు గొలుసులు, ముత్యాల వరుసలతో చేసిన ఈ మాంగ్ టిక్కాలు ఈతరం అమ్మాయిల్ని మురిపిస్తున్నాయి. వాటిని మీరూ చూసేయండి.





జోరీగతో జాగ్రత్త!

ఇయర్ బడ్స్‌తో పొంచి ఉన్న ముప్పు



బస్సులో ఉన్నా.. బైక్ మీద వెళ్తున్నా.. రోడ్డు దాటుతున్నా.. ఫోన్ మాట్లాడుతున్నా.. భోజనం చేస్తున్నా.. బోర్ కొట్టినా.. చెవిలో 'ఇయర్ బడ్స్' ఉండాల్సిందే! యువతలో అధికంగా ఉన్న ఈ అలవాటు దారి తీస్తోంది ఎన్నో అనర్థాలకు..!

ఇయర్ ఫోన్స్, ఇయర్ బడ్స్ ఇప్పుడు మన జీవితంలో భాగమయ్యాయి. సెల్‌ఫోన్‌లో ఎక్కువ సమయం గడిపే యువత అనుక్షణం వీటిని చెవుల్లో పెట్టుకునే ఉంటున్నారు. తక్కువ బరువు, సులభంగా తీసుకెళ్లే సౌలభ్యం, చెవిలో ఇమిడిపోతున్నందున ఎక్కువగా వాడుతున్నారు. ఒక్కసారి వీటిని చెవిలో పెట్టుకుంటే చాలు, పరిసరాల్లో ఏం జరుగుతుందో పట్టించుకోవడం లేదు. బైక్‌పై రయ్యిమంటూ దూసుకెళుతూ పక్కనే వచ్చే వాహనాల ఊసు మరిచి ప్రమాదాలకు కారణమవుతున్నారు. కొన్ని సందర్భాల్లో ప్రాణాలే కోల్పోతున్నారు. మితిమీరిన వీటి వినియోగానికి కళ్లెం వేస్తేనే దీర్ఘకాల వినికిడి సమస్యకు చెక్ పెట్టవచ్చని, చెవి ఇన్‌ఫెక్షన్లను అధిగమించవచ్చని వైద్యులు సూచిస్తున్నారు.

వినికిడికి ప్రమాదముందని..

● ప్రపంచంలో 12-35 ఏళ్ల వయసు ఉన్న 100 కోట్ల మందికి వినికిడి లోపం వచ్చే ప్రమాదం ఉందని ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్‌ఓ) ఇటీవల హెచ్చరించింది.

● హెడ్ ఫోన్స్, ఇయర్ బడ్స్‌తో హై ఫ్రీక్వెన్సీతో పాటలు వినడం, భారీ ధ్వనులుండే కార్యక్రమాలకు హాజరు కావడమే దీనికి కారణమని చెప్పింది.

● ఇది శారీరక, మానసిక ఆరోగ్యంపైనా ప్రభావం చూపుతుంది.

● ఇయర్ ఫోన్స్ తరచూ చెవిలో పెట్టుకోవడం వల్ల లోపల తేమ చేరి బ్యాక్టీరియా ఏర్పడుతుంది. ఇన్ఫెక్షన్ సోకి వాపు వచ్చే ప్రమాదం ఉంది.

● మధుమేహంతో బాధపడుతున్న వృద్ధులకు ఇన్ఫెక్షన్ సీరియస్‌గానూ మారవచ్చు.

85 డెసిబెల్స్ మించితే అంతే...

● 85 డెసిబెల్స్ కంటే ఎక్కువ శబ్దం వింటే శాశ్వత వినికిడి సమస్య తలెత్తవచ్చు. ప్రస్తుతం యువత ఇంతకుమించిన శబ్దంతో పాటలు వింటున్నారు.

● చెవికి సంబంధించి ఎలాంటి ఇబ్బంది తలెత్తకుండా ఉండాలంటే 60-60 నియమం కొంతవరకు మేలని వైద్యులు సూచిస్తున్నారు.

● అంటే రోజులో 60 నిమిషాల పాటు గరిష్ఠ వాల్యూమ్‌లో 60 శాతానికి మించి సౌండ్ పెట్టుకోకూడదు. ఏకబిగిన గంటపాటు కాకుండా ప్రతి 10-15 నిమిషాలకు బ్రేక్ తీసుకోవాలి.

హెడ్‌ఫోన్‌లు మేలు

● ఇయర్ ఫోన్స్, ఇయర్ బడ్స్ ద్వారా శబ్దం నేరుగా కర్ణభేరిని తగులుతుంది. అదే హెడ్‌ఫోన్స్ అయితే కొంత దూరం ఉంటాయి.

● ఒకవేళ ఇయర్ బడ్స్ వాడితే యాక్టివ్ నాయిస్ క్యాన్సిలేషన్ (ఏఎన్‌సీ) ఉండేలా చూసుకోవాలి.

● బయటి నుంచి వచ్చే సౌండ్ వినపడనందున ఎక్కువ వాల్యూమ్ పెట్టుకోవాల్సిన అవసరం ఉండదు.

● ఇది కేవలం బస్సు, రైళ్లలో ప్రయాణిస్తున్నప్పుడు మాత్రమే వినియోగించాలి. ట్రాఫిక్‌లో ఏఎన్‌సీని తీసేసి వాడుకోవాలి.

చెవిలో నరాలు బలహీనమవుతాయి

– సింగిరి ప్రభాకర్, ఈఎన్‌టీ వైద్యులు, విజయవాడ

ఇయర్ బడ్స్ ఎక్కువగా వాడితే ఎలక్ట్రో మ్యాగ్నెటిక్ వేవ్స్ వల్ల చెవిలో ఉండే నరాలు బలహీనపడే ప్రమాదం ఉంటుంది. క్రమంగా వినికిడి సమస్య వస్తుంది. మెదడుపై ప్రతికూల ప్రభావం చూపుతుంది. చాలా మంది ఎక్కువ శబ్దంతో వింటున్నారు. దీంతో చెవిలో ఉండే బ్యాలెన్స్ ఆర్గాన్ దెబ్బతిని తల తిరగడం, తలనొప్పి, వాంతులు మొదలైన సమస్యలు ఎదురవుతాయి. రక్తపోటు పెరగడానికి అవకాశం ఉంటుంది.

- ఈనాడు, అమరావతి, చిత్తూరు

నమో.. నమో...



ఉత్తర్‌ప్రదేశ్‌లోని మేరఠ్‌లో రెండో శ్రావణ సోమవారం నేపథ్యంలో ప్రధాని మోదీ బొమ్మను భుజాలపై మోసుకుంటూ వెళ్తున్న ఓ కన్వారీ

అపాచీ.. అపర కాళీ!

సైన్యంలోకి ఎగిరే యుద్ధట్యాంక్!

అమెరికా నుంచి అందనున్న 3 హెలికాప్టర్లు


గగనతలం నుంచి శత్రుమూకపై ఉరుము లేని పిడుగులా నిప్పులు కురిపించే అద్భుత ఆయుధం భారత సైన్యం అమ్ములపొదిలో చేరేందుకు రంగం సిద్ధమైంది. ప్రపంచంలోనే అత్యంత శక్తిమంతమైన పోరాట హెలికాప్టర్ 'అపాచీ-64ఈ' మన ప్రత్యర్థులకు చుక్కలు చూపబోతోంది. 'ఎగిరే యుద్ధట్యాంకు'గా పేరుపొందిన ఈ అస్త్రం.. నింగిలో అద్భుత విన్యాసాలు చేస్తూ ప్రత్యర్థులను తికమకపెట్టగలదు.

భారత వైమానిక దళం వద్ద ఇప్పటికే 22 అపాచీ హెలికాప్టర్లు ఉన్నాయి. అదనంగా సైన్యం కోసం 600 మిలియన్ డాలర్ల వ్యయంతో ఆరు హెలికాప్టర్లను అమెరికా నుంచి కొనుగోలు చేసేందుకు కేంద్రప్రభుత్వం 2020 ఫిబ్రవరిలో ఆమోదం తెలిపింది. తొలుత మూడు హెలికాప్టర్లు సైన్యంలో చేరబోతున్నాయి. దేశ పశ్చిమ సరిహద్దులకు చేరువలోని జోధ్‌పుర్‌లో వీటిని మోహరించబోతున్నారు.

శత్రుభీకరం..

అపాచీల్లో అధునాతన కమ్యూనికేషన్లు, నేవిగేషన్, సెన్సర్, ఆయుధ వ్యవస్థలు ఉన్నాయి. శత్రువుపై గురితప్పకుండా ఆయుధ ప్రయోగం చేసేందుకు మోడర్నైజ్డ్ టార్గెట్ అక్విజిషన్ డిజిగ్నేషన్ సిస్టమ్ దీనిలో ఉంది. రాత్రి, పగలు, తేడాలేకుండా దాడులు చేయడానికి ఇది సాయపడుతుంది. ధూళి, వర్షం, పొగమంచు వంటి ప్రతికూల పరిస్థితుల్లోనూ కచ్చితత్వంతో ఆయుధ ప్రయోగాన్ని చేయగలదు.

-ఈనాడు ప్రత్యేక విభాగం



■ ఈ హెలికాప్టర్ ప్రధాన బలం లాంగ్‌బౌ రాడార్. ఇది రెక్కల పైన ఉంటుంది. అందువల్ల చెట్లు, కొండల మాటున దాగి ఉంటూ దాడులు చేయగలదు.

■ శక్తిమంతమైన ఇంజిన్లు, పటిష్ఠమైన రెక్కలు దీని సొంతం. అందువల్ల యుద్ధంలో ప్రత్యర్థుల దాడులను కాచుకోగలదు.

■ తక్కువ ఎత్తులో ఎగురుతూ.. వేగంగా శత్రువుపై విరుచుకుపడి, సురక్షితంగా తిరిగి వచ్చే సత్తా ఈ హెలికాప్టర్ సొంతం

■ లేజర్, రాడార్ గైడెడ్ హెల్‌ఫైర్ క్షిపణులను ప్రయోగించగలదు

■ గరిష్ఠ వేగం: 279 కిలోమీటర్లు
■ నింగిలో చేరగల గరిష్ఠ ఎత్తు: 6వేల మీటర్లు
■ పైలట్లు: ఇద్దరు
■ ఇంజిన్లు: రెండు
■ తయారీ సంస్థ: బోయింగ్

■ శక్తిమంతమైన 30 ఎంఎం చైన్‌గన్. ఇది నిమిషానికి 650 వరకూ తూటాలను పేల్చగలదు

■ నేలపైనున్న భిన్న లక్ష్యాలపైకి రాకెట్లతో ఏకకాలంలో దాడులు చేయగలదు

రూ.100కే ఇల్లు

మరమ్మతులకు రూ.50 లక్షలు



ఇంటర్నెట్ డెస్క్: ఎప్పటికైనా సొంతిల్లు కొనుగోలు చేయాలనే ఆశ అందరికీ ఉంటుంది. తాము కలలుకనే నివాసం తక్కువ ధరకే.. విదేశాల్లో సొంతమైతే.. ఇంకేముంది ఎగిరి గంతేస్తారు. ఇలా సొంతింటి కలలు కంటున్న వారి కోసం ఫ్రాన్స్ ఓ మంచి అవకాశాన్ని తీసుకొచ్చింది. ఆ దేశంలోని అంబర్ట్ పట్టణంలో ఒక్క యూరో (రూ.100) చెల్లించి.. ఇల్లు కొనుగోలు చేసే అవకాశాన్ని కల్పించింది. అంబర్ట్‌లో తగ్గిపోతున్న జనాభాను పునరుద్ధరించేందుకు ఈ ప్రయత్నం చేస్తున్నట్లు మీడియా కథనాలు పేర్కొన్నాయి. ఇక్కడి ప్రజలు నగరాల వైపు తరలివెళ్లడంతో ఈ ప్రాంతంలో జనాభా తగ్గుతూ వస్తోంది. ప్రస్తుతం ఈ పట్టణంలో 6,500 మంది నివసిస్తున్నారు. జనాభాను మరింత పెంచడానికి అక్కడి అధికారులు ఐదేళ్ల ప్రణాళికను రూపొందించారు. ఇందులో భాగంగానే రూ.100కే ఇల్లు కొనుగోలు చేసే అవకాశం కల్పిస్తున్నారు. అయితే శతాబ్దాల నాటి ఈ భవనాలను పునరుద్ధరించడానికి మాత్రం రూ.20 నుంచి రూ.50 లక్షల వరకు ఖర్చయ్యే అవకాశం ఉన్నట్లు అధికారుల అంచనా. ఇంటిని కొనుగోలు చేసే సమయంలోనే కొనుగోలుదారులు ఆ ఇంటి పునరుద్ధరణకు కట్టుబడి ఉంటామని హామీ ఇవ్వాల్సి ఉంటుంది. ఫ్రాన్స్ ప్రజలతో పాటు విదేశీయులు సైతం అంబర్ట్‌లో ఇళ్లను కొనుగోలు చేయవచ్చు.

మలయప్ప స్వామికి.. మైసూరు మహారాజా ఆతిథ్యం





బీఆర్ నాయుడికి జ్ఞాపిక అందిస్తున్న మైసూరు మహారాణి ప్రమోదాదేవి

కర్ణాటక సత్రానికి ఊరేగింపుగా విచ్చేస్తున్న శ్రీదేవి భూదేవి సమేత శ్రీ మలయప్పస్వామి

తిరుమల, న్యూస్‌టుడే: తిరుమలలో పల్లవోత్సవం సోమవారం ఘనంగా జరిగింది. మైసూరు మహారాజు జయంతిని పురస్కరించుకుని తితిదే ఈ కార్యక్రమాన్ని నిర్వహించడం ఆనవాయితీ. సహస్ర దీపాలంకార సేవ అనంతరం శ్రీదేవి, భూదేవి సమేత మలయప్పస్వామి ఊరేగింపుగా కర్ణాటక సత్రానికి వేంచేపు చేశారు. అక్కడ మైసూరు సంస్థానం ఆతిథ్యాన్ని స్వీకరించారు. ఈ సందర్భంగా మైసూరు సంస్థానం ప్రతినిధులు స్వామి, అమ్మవార్లకు ఆహ్వానం పలికి, ప్రత్యేక హారతి సమర్పించారు. అనంతరం తితిదే ఛైర్మన్ బీఆర్ నాయుడిని మైసూరు మహారాణి ప్రమోదాదేవి సత్కరించి, సంస్థానం జ్ఞాపిక అందజేశారు. మైసూరు సంస్థానం మహారాజు యదువీర్ కృష్ణదత్త చామరాజ్ వడియార్, తితిదే బోర్డు సభ్యులు నరేష్, జంగా కృష్ణమూర్తి పాల్గొన్నారు.

సైన్యానికి బిట్స్ విద్యార్థుల డ్రోన్లు

ఈనాడు, హైదరాబాద్, శామీర్‌పేట్, న్యూస్‌టుడే: ఇద్దరు బిట్స్ హైదరాబాద్ విద్యార్థులు భారత సైన్యానికి అత్యాధునిక సమాచార సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన శక్తిమంతమైన డ్రోన్లను అందించారు.



జయంత్ ఖత్రి, శౌర్యచౌదరి

జయంత్ ఖత్రి(మెకానికల్), శౌర్యచౌదరి(ఎలక్ట్రికల్)లు ఈ ఏడాది అపోలియాన్ అనే అంకుర సంస్థను స్థాపించారు. దాని ద్వారా యుద్ధాలు, అత్యవసర పరిస్థితుల్లో వినియోగించే డ్రోన్లను తయారు చేస్తూ సైన్యం నుంచి ఆర్డర్ పొందారు. వీరు అందించిన డ్రోన్లను సైన్యం వివిధ యూనిట్లకు పంపించింది. ఈ సందర్భంగా జయంత్, శౌర్య మాట్లాడుతూ.. 'ఆపరేషన్ సిందూర్ సమయంలో ఈ ఆలోచన వచ్చింది. ప్రస్తుతం మన సైన్యం వినియోగిస్తున్న వాటికంటే శక్తిమంతమైన డ్రోన్లు తయారు చేసి అందించాలని భావించాం. రాత్రింబవళ్లు శ్రమించి గంటకు 300 కి.మీ. వేగంతో ప్రయాణించే వాటిని రూపొందించాం. శత్రుదేశాల రాడార్లకు కూడా చిక్కవు' అని తెలిపారు.

విమానంలో ప్రయాణం.. మియావాకీపై అధ్యయనం

తక్కువ విస్తీర్ణంలో దట్టమైన వనాలను సృష్టించడమే మియావాకీ విధానం. గుజరాత్‌లోని కచ్ ప్రాంతంలో చేపట్టిన ఈ ప్రాజెక్టుపై అధ్యయనం చేపట్టే అవకాశం శ్రీసత్యసాయి జిల్లా గోరంట్ల మండలం పాలసముద్రం జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల విద్యార్థులకు దక్కింది. అదీనూ విమానంలో అక్కడికి వెళ్లి రానున్నారు. ఈ ఏర్పాట్లను కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్ పర్యవేక్షించడం విశేషం. పాలసముద్రం సమీపంలోని నాసిన్ (నేషనల్ అకాడమీ ఆఫ్ కస్టమ్స్, ఇన్‌డైరెక్ట్ ట్యాక్సెస్ అండ్ నార్కొటిక్స్)ను జూన్ 6న నిర్మలా సీతారామన్ సందర్శించారు. స్థానిక రైతులు, విద్యార్థులతో కలిసి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా వారికి.. కచ్ ప్రాంతానికి తీసుకెళ్లి మియావాకీ విధానంలో పెంపకాన్ని చూపిస్తామని హామీ ఇచ్చారు. మొదటి విడతలో 27 మంది విద్యార్థులు, ఐదుగురు ఉపాధ్యాయులను ఎంపిక చేశారు. వీరు బుధవారం బెంగళూరులో విమానం ఎక్కనున్నారు. కచ్‌లో మొక్కల పెంపకం పద్ధతిని రెండు రోజులు పరిశీలించి శ్రీసత్యసాయి జిల్లాలోనూ అమలు చేయనున్నారు.

– న్యూస్‌టుడే, పాలసముద్రం (గోరంట్ల)




అంబారీపై అమ్మోరు..

కళాకారుల డోలు వాయిద్యాల హోరు.. కనుచూపు మేర బారులు తీరిన భక్తుల నడుమ హైదరాబాద్ పాతబస్తీలోని బోనాల ఉత్సవాలు రెండోరోజు సోమవారం జరిగాయి. హరీబౌలిలో ఉన్న అక్కన్న మాదన్న మహంకాళి అమ్మవారి ఘటాన్ని అంబారీపై ఊరేగించారు.

–న్యూస్‌టుడే, చాంద్రాయణగుట్ట, చార్మినార్

ఓయ మీర్ పెల్లి కబూర్



మా తోల్ మూర్ మర్రి
పెక్మాడాన్ పేకాల్: ఓయ కన్నారాజు M.Tech
పెళ్లి
పెళ్లి కోకాడ్: పూనె లక్ష్మీ శరణ్య MA B.Ed Teacher
భద్రాద్రి కొత్తగూడెం జి: భద్రాచలం మం: భద్రాచలం (జగదీష్ కాలనీ)
శ్రీ పూనె శ్రీరాములు-శాంతమ్మ కీన్ సిన్నముయ్యాడ్ తోటి రెయికెనేరూమ్ అత్తె
పందిర్ మూర్తం :
02-08-2025 సనివారం వెర్‌వె 8 గంటాన్ 15 నిమిసాన్ 24 సెకెండ్కు
పెళ్లి మూర్తం :
03-08-2025 ఆదివారం వెర్‌వె 9 గంటాన్ 15 నిమిసాన్ 24 సెకెండ్కు
మా సొంతనార్ : గంగదేవి గుప్ప, దంతేలబోర పం: పాల్వంచ మం: భద్రాద్రి కొత్తగూడెం జి: తెలంగాణ

మన పక్కనే అనేక భాషలు మాట్లాడేవారుంటారు. మనకు ఆ భాష తెలియకపోతే అంతగా పట్టించుకోం. ఒక్క భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోనే 23 మండలాల పరిధిలో సుమారు 2 లక్షల కోయ జనాభా ఉంది. వారంతా ఆ భాషలోనే మాట్లాడతారు. దానికి లిపి లేకపోవడంతో ఆ భాష పదాలనే తెలుగు అక్షరాల్లో రాసి తమ పెళ్లి పత్రిక ముద్రించారు. కాబోయే దంపతులు ఓయ కన్నారాజు (జాతీయ ఆదివాసీ తెగల సమన్వయకర్త), పూనె లక్ష్మీశరణ్య సోమవారం భద్రాచలం ఐటీడీఏ పీవో రాహుల్‌కు ఈ పత్రికను అందజేశారు. సోమవారం 'విశ్వ కోయ భాష దినోత్సవం' కాగా.. దాన్ని పురస్కరించుకొని ఈ ప్రయత్నం చేసినట్లు కన్నారాజు తెలిపారు. ఓయ మీర్ పెల్లి కబూర్ (ఓయ వారి పెళ్లి పిలుపు) అంటూ ప్రారంభమైన ఆసక్తికరమైన ఆ పెళ్లి పత్రికనూ మీరు ఓసారి చదివేయండి!

◆ మరో విశేషమేమంటే.. సొంత ఆసక్తితో కోయ భాష నేర్చుకున్న ఐటీడీఏ పీవో రాహుల్.. గిరిజనులతో ఆ భాషలోనే సంభాషిస్తుంటారు.

– న్యూస్‌టుడే, భద్రాచలం

150కి పైగా లగ్జరీ కార్లు కొట్టేసి..



చెన్నై(ప్యారిస్), న్యూస్‌టుడే: దేశ వ్యాప్తంగా 150కి పైగా లగ్జరీ కార్లను చోరీ చేసి, సుమారు 20 ఏళ్లుగా పోలీసులకు చిక్కకుండా తిరుగుతున్న నిందితుడు ఎట్టకేలకు అరెస్టయ్యాడు. పోలీసుల వివరాల మేరకు.. చెన్నై అన్నానగర్‌కు చెందిన యతిరాజ్‌రత్నం ఈ ఏడాది మే నెలలో తన కారును కోయంబేడులోని సర్వీస్ సెంటర్‌కు తీసుకెళ్లారు. సర్వీస్ పూర్తయిన తర్వాత ఇంటికి తీసుకొచ్చారు. జూన్ 10న ఇంటి ముందు నిలిపిన కారు అదృశ్యమైంది. బాధితుడి ఫిర్యాదుతో రంగంలోకి దిగిన పోలీసులు సీసీ కెమెరాల ఫుటేజీల సాయంతో దర్యాప్తు చేసి, కారు చోరీ చేసిన యువకుడిని పుదుచ్చేరిలో అరెస్టు చేశారు. ఆదివారం నిందితుడిని చెన్నైకి తీసుకొచ్చి విచారించగా.. అతను రాజస్థాన్‌కు చెందిన సత్యేంద్రసింగ్ షెకావత్ అని, ఎంబీఏ చదివాడని, తండ్రి విశ్రాంత ఆర్మీ ఉద్యోగి అని తెలిసింది. సత్యేంద్రసింగ్ కార్ల సర్వీస్ సెంటర్లకు వెళ్లి, తన కారు సర్వీస్‌కు ఇవ్వాలని అక్కడున్న సిబ్బందితో మాటలు కలిపేవాడు. అక్కడున్న కార్ల గురించి తెలుసుకొని, వాటిలో ఒకదానికి జీపీఎస్ పరికరాన్ని అమర్చేవాడు. దాని సాయంతో ఆ కారు ఎక్కడికి వెళ్తుందో తెలుసుకొని చోరీ చేసేవాడని దర్యాప్తులో తేలింది. నిందితుడు లగ్జరీ కార్లను మాత్రమే చోరీ చేసి, వాటిని రాజస్థాన్‌లో విక్రయించేవాడు. అలా తమిళనాడు, కర్ణాటక తదితర రాష్ట్రాల్లో గత 20 ఏళ్లుగా 150కి పైగా లగ్జరీ కార్లను చోరీ చేసినట్లు పోలీసులు గుర్తించారు.

బరువు కాదు.. బాధ్యత





హెల్మెట్‌తో పాటు క్లిప్ పెట్టుకోవడం కూడా ముఖ్యమే.

హెల్మెట్లను నిబంధనల కోసం కాదు మన ప్రాణ రక్షణ కోసం ధరించాలి.

- ● హెల్మెట్‌తో ప్రాణాలకు రక్షణ
- ● రోడ్డు ప్రమాద మృతుల్లో 44.5 శాతం ద్విచక్రవాహదారులే
- ● ట్రాఫిక్ ఉల్లంఘనుల్లో హెల్మెట్ లేని వారే అధికం
- ● చిన్న తప్పిదంతో తెచ్చుకోవద్దు ముప్పు

మూడు, నాలుగేళ్లు ఉండే మొబైల్‌ఫోన్ కింద పడకుండా జాగ్రత్తలు తీసుకుంటాం.. పడ్డా పగిలిపోకుండా ఖరీదైన స్క్రీన్ గార్డు వేయిస్తాం.. మరి ఎంతో విలువైన జీవితం మాటేంటి? చాలామంది జుట్టు ఊడుతుందనో.. తలపై బరువు అనో.. వెళ్లేది తక్కువ దూరమే అన్న కారణంతోనో హెల్మెట్ ధరించకుండా ప్రయాణిస్తున్నారు. ఇది నిబంధనల్ని ఉల్లంఘించడమే కాదు.. విలువైన ప్రాణాన్ని ప్రమాదంలోకి నెట్టడమే. కొందరు చలాన్ల భయంతో హెల్మెట్ కొంటున్నా నాణ్యత ఉండదు. ఫోన్ పగిలితే మరోటి కొనుక్కోవచ్చు. తల పగిలితే జీవితాన్నే కోల్పోతాం! మనపై ఆధారపడ్డవాళ్లను రోడ్డున పడేసినట్లే.. అందుకే హెల్మెట్ లేకుండా ప్రయాణం ప్రాణాంతకం!!

కేంద్ర రవాణా శాఖ 2022లో విడుదల చేసిన గణాంకాల ప్రకారం రోడ్డు ప్రమాద మృతుల్లో ఏకంగా 44.5% మంది ద్విచక్రవాహనదారులే. ఇందులో ఎక్కువ మంది హెల్మెట్ వాడకపోవడంతోనే మృత్యువాతపడ్డారు.

రిస్క్ 6 రెట్లు తగ్గుతుంది..

మోటారు సైకిళ్లపై వెళ్తూ ప్రమాదానికి గురై కిందపడితే తలకు తీవ్ర గాయాలై ప్రాణాలకు ముప్పు అధికంగా ఉంటుంది.

● సరైన హెల్మెట్ వాడితే మరణం రిస్క్‌ను ఆరు రెట్లు తగ్గిస్తుంది

● మెదడు గాయాల ప్రమాదాన్ని 74% తగ్గిస్తుంది.

.. ఇవి ప్రపంచ ఆరోగ్య సంస్థ(డబ్ల్యూహెచ్‌ఓ) చెప్పిన వివరాలు.. తలకు తగిలే గాయాలే ద్విచక్ర వాహనదారుల మరణాలకు ప్రధాన కారణమని తెలిపింది. అలాంటి ప్రమాదాల నుంచి తప్పించుకోవడంలో నాణ్యమైన హెల్మెట్లు కీలక పాత్ర పోషిస్తాయని డబ్ల్యూహెచ్‌ఓ 2023లో విడుదల చేసిన 'హెల్మెట్లు మాన్యువల్- రెండో ఎడిషన్'లో స్పష్టం చేసింది.

బీఐఎస్ సర్టిఫికేషన్ ఉన్నవే..

హెల్మెట్లకు నాణ్యత ప్రమాణాల్ని బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్(బీఐఎస్) నిర్దేశిస్తోంది. 'ఐఎస్ 4151: 2015' ప్రమాణం ద్విచక్రవాహనాలకు వర్తిస్తుంది. బీఐఎస్ సర్టిఫికేషన్ ఉన్న హెల్మెట్లను వాడాలి. అసలైన హెల్మెట్లకు ఐఎస్ఐ మార్క్‌తోపాటు లైసెన్సు నంబరు ఉంటుంది. దేశవ్యాప్తంగా ప్రస్తుతం 176 తయారీదారులకు బీఐఎస్ ధ్రువీకరణ ఉంది.

క్లిప్ కూడా ముఖ్యమే

కారులో సీట్‌బెల్ట్ పెట్టుకోవడం ఎంత ముఖ్యమో.. హెల్మెట్‌తోపాటు క్లిప్ పెట్టుకోవడం కూడా అంతే ముఖ్యం. దాదాపు 90 శాతం మంది ఈ క్లిప్పు పెట్టడం లేదని అంచనా. ఈ పట్టీ పెట్టుకోకపోతే ప్రమాదం జరిగినప్పుడు శిరస్త్రాణం ఊడితే తలకు గాయాలై ప్రాణాపాయ ముప్పు ఏర్పడుతుంది. తీయడం కష్టం అవుతుందనో, మొబైల్ ఫోన్ మాట్లాడేందుకు ఇబ్బందనో కొందరు క్లిప్ పెట్టరు.

అలవాటుగా మారాలి: రమేశ్‌నాయుడు, తెలంగాణ ఐజీ, రోడ్‌సేఫ్టీ

హెల్మెట్లను నిబంధనల కోసం కాదు మన ప్రాణ రక్షణ కోసం ధరించాలి. బండి నడిపేవారితోపాటు వెనుక కూర్చునేవారూ పెట్టుకోవాలి. హెల్మెట్లపై అవగాహన ఉండడమే కాదు.. ధరించడం అలవాటుగా మార్చుకోవాలి. ద్విచక్రవాహనం పైనుంచి కింద పడ్డప్పుడు అది ప్రాణాలు కాపాడుతుంది. లేకపోతే తలకు గాయమై రక్తం గడ్డకట్టే ప్రమాదం ఉంటుంది. ప్రాణాపాయం కలగొచ్చు.

- ఈనాడు, హైదరాబాద్

ఈ స్టీల్ గ్లాస్‌ని మడతపెట్టేయవచ్చు!



పేపర్ కప్పు.. పర్యావరణ పరిరక్షణ కోసమంటూ విరివిగా వాడేస్తున్నాం. కానీ, మనం రోజుకు వాడుతున్న పేపర్ కప్పుల సంఖ్యకు, అవి భూమిలో కలిసిపోవడానికి పడుతున్న సమయానికి సంబంధించిన నిష్పత్తిలో ఏమాత్రం పొంతన ఉండడం లేదు. అంతేనా.. చాలా మంది త్వరగా భూమిలో కలిసిపోయేవంటూ నాసిరకం కప్పులనూ అంటగడుతున్నారు. కొన్నిరకాల పేపర్ కప్పుల్లో వేడి పానీయాన్ని 15 నిమిషాలు ఉంచడం వల్ల వేలల్లో మైక్రోప్లాస్టిక్స్ విడుదలవుతున్నట్లు అధ్యయనాలు పేర్కొంటున్నాయి. ఈ కారణాల రీత్యా పర్యావరణ పరిరక్షణ అంశం మళ్లీ మొదటికి వచ్చేలా ఉంది. ఈ పరిస్థితికి చెక్ చెబుతూ వచ్చిందే ఫోల్డబుల్ స్టీల్ గ్లాస్. దీనిని ఎక్కడికైనా బ్లూటూత్ ఇయర్‌బడ్స్ కేస్ మాదిరిగా తీసుకుపోవచ్చు. ఈ గ్లాసును తెరచి టీ, కాఫీ తాగవచ్చు. శుభ్రం చేసుకుని మళ్లీ బ్యాగ్‌లో లేదా జేబులో పెట్టేసుకోవచ్చు.

ఎంఫార్మసీ ప్రవేశాలకు ప్రత్యేక షెడ్యూల్

ఈనాడు, అమరావతి: పలు కళాశాలల్లో ఎంఫార్మసీ కోర్సులకు అనుమతులు లభించనందున ఏపీ పీజీఈసెట్‌లో ఎంటెక్ కోర్సులకు మాత్రమే కౌన్సెలింగ్ చేపట్టినట్లు ఉన్నత విద్యామండలి కార్యదర్శి టీవీ శ్రీకృష్ణమూర్తి తెలిపారు. ఫార్మసీలో ప్రవేశాలకు ప్రత్యేకంగా షెడ్యూల్ విడుదల చేయనున్నట్లు పేర్కొన్నారు.

రన్‌వేపై అదుపుతప్పిన ఎయిరిండియా విమానం



ముంబయి: ఎయిరిండియా విమానానికి త్రుటిలో ప్రమాదం తప్పింది. కొచ్చిన్ నుంచి వచ్చిన విమానం ముంబయి ఛత్రపతి శివాజీ మహారాజ్ అంతర్జాతీయ విమానాశ్రయంలో సోమవారం ల్యాండవుతుండగా రన్‌వేపై అదుపుతప్పింది. దీంతో ప్రధాన రన్‌వేపై కార్యకలాపాలను తాత్కాలికంగా నిలిపివేయాల్సి వచ్చింది. ప్రయాణికులు, సిబ్బంది సురక్షితమని విమానాశ్రయ వర్గాలు తెలిపాయి. "ప్రమాదంలో విమాన ఇంజిన్‌కు నష్టం జరిగింది. మూడు టైర్లు దెబ్బతిన్నాయి. మట్టిలోకి వెళ్లడంతో ఇంజిన్‌లోకి మురికి ప్రవేశించింది. దిగే సమయంలో భారీ వర్షం కురియడంతో రన్‌వే నుంచి పక్కకు మళ్లింది. తర్వాత సురక్షితంగా ఆగింది" అని ఎయిరిండియా వర్గాలు తెలిపాయి.

ఎన్నికల్లో జపాన్ ప్రధానికి ఎదురుదెబ్బ



టోక్యో: జపాన్ ప్రధానమంత్రి షిగేరు ఇషిబా నేతృత్వంలోని సంకీర్ణ ప్రభుత్వం పార్లమెంటు ఎగువసభలో మెజారిటీ కోల్పోయింది. సభలో 248 స్థానాలుండగా, వాటిలో సగం సీట్లకు ఆదివారం ఎన్నికలు జరిగాయి. అధికార లిబరల్ డెమొక్రటిక్ పార్టీ (ఎల్‌డీపీ) సభలో మెజారిటీ సాధించాలంటే 50 స్థానాలు దక్కించుకోవాలి. కానీ 47 స్థానాలకే పరిమితమైంది. గత అక్టోబరులో జరిగిన దిగువ సభ ఎన్నికల్లోనూ ఈ కూటమి ఓటమి పాలైంది. 1955లో స్థాపించిన ఎల్‌డీపీ రెండు సభల్లో మెజారిటీని కోల్పోవడం ఇదే తొలిసారి. ప్రతికూలంగా ఫలితాలొచ్చినా తాను పదవిలో కొనసాగుతానని ఇషిబా తెలిపారు. ఈ ఓటమితో రాజీనామా చేయాలని అధికార కూటమిలోని ఇతర రాజకీయ పార్టీల నుంచి ఇషిబాపై ఒత్తిడి వచ్చే అవకాశాలున్నాయి.

లోక్‌సభలో మాట్లాడనివ్వడం లేదు: రాహుల్



దిల్లీ: ప్రతిపక్ష నేతగా లోక్‌సభలో మాట్లాడే హక్కు తనకుందని, అయినా మాట్లాడే అవకాశమివ్వడం లేదని, అది కొత్త పద్ధతి అని సభలో ప్రకటనలు చేస్తున్నారని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ పేర్కొన్నారు. 'రక్షణ మంత్రి, భాజపా సభ్యులు మాట్లాడేందుకు అనుమతి లభిస్తోంది. కానీ ప్రతిపక్షాల నుంచి ఎవరైనా ఏదైనా చెప్పాలనుకుంటే.. అవకాశం ఇవ్వడం లేదు' అని విమర్శించారు. ప్రతిపక్ష సభ్యుల ఆందోళనల మధ్య లోక్‌సభ సోమవారం రెండోసారి వాయిదా పడిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. ఒక్క సెకనులో సభ నుంచి ప్రధాని వెళ్లిపోయారని రాహుల్ ధ్వజమెత్తారు. 'ప్రభుత్వం చెప్పాలనుకున్నది చెప్పాక మాకూ మాట్లాడేందుకు కొంత సమయమివ్వాలి. మేం రెండు మాటలైనా మాట్లాడాలనుకుంటున్నాం. కానీ అనుమతించడం లేదు' అని రాహుల్ పేర్కొన్నారు.

పాఠశాలపై కూలిన శిక్షణ యుద్ధవిమానం

ఢాకాలో 20 మంది మృత్యువాత

ఢాకా: బంగ్లాదేశ్ రాజధాని ఢాకాలో సోమవారం ఘోర ప్రమాదం చోటుచేసుకుంది. ఆ దేశ వాయుసేనకు చెందిన శిక్షణ యుద్ధవిమానమొకటి పాఠశాలపై కూలిపోయింది. ఈ దుర్ఘటనలో 20 మంది దుర్మరణం పాలయ్యారు. 171 మంది గాయపడ్డారు. మృతుల్లో అత్యధికులు విద్యార్థులే. గాయపడ్డవారిలో పలువురి పరిస్థితి విషమంగా ఉంది. మృతుల సంఖ్య మరింత పెరిగే ముప్పుందంటూ అధికారులు ఆందోళన వ్యక్తం చేశారు. రక్షణ మంత్రిత్వ శాఖ వెల్లడించిన వివరాల ప్రకారం- చైనా తయారీ ఎఫ్-7 బీజీఐ శిక్షణ యుద్ధవిమానం కుర్మిటోలాలోని ఏకే ఖండేకర్ వైమానిక స్థావరం నుంచి.. సాధారణ శిక్షణ కార్యక్రమంలో భాగంగా సోమవారం మధ్యాహ్నం 1:06 గంటలకు టేకాఫ్ అయింది. దాదాపు 1:15 గంటల సమయంలో పెద్ద శబ్దంతో.. ఢాకాలోని ఉత్తర అనే ప్రాంతంలో దియాబరి వద్ద రెండంతస్తుల మైల్‌స్టోన్ పాఠశాల భవనాన్ని ఢీకొట్టింది. అనంతరం పెద్దఎత్తున మంటలు చెలరేగాయి. ప్రమాద సమాచారం తెలిసిన వెంటనే అగ్నిమాపక దళాలు, అంబులెన్సులు, వాయుసేన హెలికాప్టర్లు ఘటనా స్థలానికి చేరుకున్నాయి. అధికారులు, స్థానికులు ముమ్మర స్థాయిలో సహాయక చర్యలు చేపట్టారు. గాయపడ్డవారిలో అత్యధికులు విద్యార్థులేనని అధికారులు చెప్పారు. ఈ దుర్ఘటనలో పైలట్ మరణించారు.



ఇవి ఉంటే చాలు.. ఏ లోటూ లేనట్లే

- మీరు ఊపిరి తీసుకుంటున్నారా?
- నడవగలుగుతున్నారా?
- మాట్లాడగలుగుతున్నారా?
- ఆహారం, నీరు దొరుకుతున్నాయా?
- రాత్రిపూట నిద్ర పడుతోందా?

మీ సమాధానం 'అవును' అయితే, మీకు ఏ లోటూ లేదు. సాకులు మాని పని మొదలుపెట్టండి.

– డేనియల్ జహీద్, కాపీరైటర్

12 మంది నిర్దోషులే

- 7/11 ముంబయి రైలు పేలుళ్ల కేసులో బాంబే హైకోర్టు సంచలన తీర్పు

ముంబయి: దాదాపు రెండు దశాబ్దాల క్రితం 2006లో జరిగిన ముంబయి రైల్లో పేలుళ్ల కేసులో బాంబే హైకోర్టు సంచలన తీర్పు వెలువరించింది. ఈ కేసులో ఉరిశిక్ష, జీవితఖైదు పడిన 12 మందిని సోమవారం నిర్దోషులుగా ప్రకటించింది. వారిపై ఉన్న అభియోగాలను నిర్ధారించడంలో ప్రాసిక్యూషన్ తీవ్రంగా విఫలమైందని, ఎలాంటి పేలుడు పదార్థాలు వాడారన్నది నిరూపించలేకపోయిందని జస్టిస్ అనిల్ కిలోర్, జస్టిస్ శ్యామ్ చాండక్‌ల ధర్మాసనం పేర్కొంది. ప్రత్యక్ష సాక్షులను విచారించడంతో విఫలమైందని, స్వాధీనం చేసుకున్న ఆధారాలను సరిగ్గా భద్రపరచలేదని ప్రాసిక్యూషన్‌ను మందలించింది. ఈ కేసులో సాక్షుల వాంగ్మూలానికి ఎలాంటి విలువ లేదని, సరైన ఆధారాలు లేకుండా నిందితులు నేరం చేశారని నమ్మడం కష్టమని వివరించింది. నిందితులను దోషులుగా ప్రకటించడంలో ట్రయల్ కోర్టు లోపభూయిష్టంగా వ్యవహరించిందని ధర్మాసనం అభిప్రాయపడింది. నిందితులను హింసించి నేరాన్ని ఒప్పించినట్లుగా ఉందని వ్యాఖ్యానించింది. 2015లో నిందితులకు విధించిన శిక్షలను రద్దు చేస్తున్నట్లు ప్రకటించిన బాంబే హైకోర్టు, వారిని నిర్దోషులుగా విడుదల చేయాలని ఆదేశించింది.



రైల్లో పేలుళ్ల కేసులో కోర్టు నిర్దోషులుగా ప్రకటించిన వ్యక్తులు

ఏమిటీ కేసు..

2006 జులై 11న ఏడు చోట్ల ముంబయి లోకల్ రైళ్లలో దుండగులు వరుస బాంబు పేలుళ్లకు పాల్పడ్డారు. ఈ ఘటనలో 180 మందికి పైగా ప్రాణాలు కోల్పోగా, 800 మందికి పైనే గాయపడ్డారు. సుదీర్ఘ దర్యాప్తు అనంతరం 2015 అక్టోబరులో ప్రత్యేక కోర్టు.. ఐదుగురికి ఉరిశిక్ష, ఏడుగురికి జీవితఖైదు విధించింది. వీరిలో బాంబు అమర్చారని అభియోగాలున్న కమల్‌అహ్మద్ అన్సారీ, మహ్మద్ ఫైసల్ రెహమాన్ షేక్, ఎహతేశామ్ సిద్దిఖీ, నవీద్ హుస్సేన్‌ఖాన్ రషీద్, ఆసిఫ్‌ఖాన్ బషీర్‌ఖాన్‌లకు మరణశిక్ష వేసింది. తన్వీర్‌అహ్మద్ అన్సారీ, మహ్మద్ షఫీ, షేక్‌మహ్మద్ అలీఆలం, మహ్మద్‌సాజిద్ అన్సారీ, ముజామ్మిల్ రెహమాన్ షేక్, సుహైల్‌మహ్మద్ షేక్, జమీర్ రెహమాన్ షేక్‌లకు జీవితఖైదు విధించింది. వీరిలో కమల్‌అహ్మద్ అన్సారీ 2021లో కొవిడ్ కారణంగా నాగ్‌పుర్ జైల్లో మృతి చెందాడు. హైకోర్టు తీర్పుతో నిందితుల్లో ఏడుగురు నాగ్‌పుర్, అమరావతి జైళ్ల నుంచి సోమవారం సాయంత్రం విడుదలయ్యారు. హైకోర్టు తీర్పును అన్ని విధాల పరిశీలించి సుప్రీం కోర్టులో సవాలు చేయాలా? లేదా? అన్న అంశంపై తమ ప్రభుత్వం ఓ నిర్ణయానికి వస్తుందని మహారాష్ట్ర రెవెన్యూ మంత్రి చంద్రశేఖర్ బావంకులే తెలిపారు. సీఎం ఫడణవీస్ దీనిని పరిశీలిస్తారని ఆయన పేర్కొన్నారు.

జస్టిస్ వర్మ.. మీ స్నేహితుడా?


- పేరు పెట్టి ఎలా పిలుస్తారు..
- న్యాయవాదిపై సీజేఐ ఆగ్రహం

దిల్లీ: 'అలహాబాద్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ యశ్వంత్ వర్మ.. మీ స్నేహితుడా.. ఆయనింకా హైకోర్టు న్యాయమూర్తే.. అలాంటప్పుడు 'వర్మ' అని ఎలా పిలుస్తారు' అని న్యాయవాది మాథ్యూస్ నెడుంపరపై సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బి.ఆర్.గవాయ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ వివాదంపై మూడు పిటిషన్లు దాఖలు చేయడంపట్లా ఆయన అసహనం వ్యక్తం చేశారు. జస్టిస్ వర్మపై ఎఫ్ఐఆర్ నమోదు చేసేలా ఆదేశాలివ్వాలని కోరుతూ దాఖలు చేసిన పిటిషన్‌పై అత్యవసరంగా విచారణ జరపాలన్న న్యాయవాది నెడుంపర విజ్ఞప్తిని తోసిపుచ్చారు. సరైన సమయంలో జరుగుతుందని సోమవారం స్పష్టం చేశారు. అంతకుముందు జస్టిస్ బి.ఆర్.గవాయ్, జస్టిస్ కె.వి.చంద్రన్ ధర్మాసనం ఎదుట తన పిటిషన్‌పై అత్యవసరంగా విచారణ జరపాలని నెడుంపర కోరారు. ఈ సందర్భంగానే వర్మ అంటూ సంబోధించారు. దీంతో సీజేఐ ఆగ్రహం వ్యక్తం చేశారు. 'మీరు ఒక న్యాయమూర్తి పేరును ప్రస్తావిస్తున్నారు. ఆయన ఇంకా కోర్టులో న్యాయమూర్తిగానే ఉన్నారు' అని జస్టిస్ గవాయ్ స్పష్టం చేశారు. న్యాయవాది స్పందిస్తూ.. 'ఆయనకు అంత గొప్పతనాన్ని ఆపాదించాల్సిన అవసరం లేదనుకుంటున్నా. పిటిషన్‌ను వెంటనే విచారణకు స్వీకరించాలి' అని కోరారు. దీంతో కోర్టును శాసించాలనుకోవద్దని సీజేఐ హెచ్చరించారు. తాను విజ్ఞప్తి చేస్తున్నానని న్యాయవాది తెలిపారు. విచారణకు స్వీకరించాలని పదేపదే న్యాయవాది విజ్ఞప్తి చేస్తుండటంతో ఆగ్రహించిన సీజేఐ.. ఇప్పటికిప్పుడే పిటిషన్‌ను డిస్మిస్ చేయాలా అని ప్రశ్నించారు. న్యాయవాది స్పందిస్తూ.. 'డిస్మిస్ చేయడం అసాధ్యం. ఎఫ్ఐఆర్ నమోదు చేయాల్సిందే. జస్టిస్ వర్మ అదే కోరుకుంటున్నట్లు కనిపిస్తోంది. ఎఫ్ఐఆర్ నమోదు చేయాలి. దర్యాప్తు జరగాలి' అని వాదించారు.

ఈడీ అన్ని పరిమితులు దాటుతోంది

- న్యాయవాదులకు సమన్లెలా జారీ ఇస్తారు
- సుప్రీంకోర్టు ఆగ్రహం

దిల్లీ: కక్షిదారులకు చట్టపరమైన సలహాలిచ్చే న్యాయవాదులకు దర్యాప్తు సంస్థలు సమన్లు జారీ చేయడంపై సుప్రీంకోర్టు తీవ్ర ఆందోళన వ్యక్తంచేసింది. ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) అన్ని పరిమితులను దాటుతోందంటూ ఆగ్రహం వ్యక్తం చేసింది. న్యాయవాదులకు సమన్లు ఎలా జారీ చేస్తారని ప్రశ్నించింది. సీనియర్ న్యాయవాదులు అరవింద్ దతార్, ప్రతాప్ వేణుగోపాల్‌లకు ఈడీ.. సమన్లు జారీ చేయడంపై భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బి.ఆర్.గవాయ్, జస్టిస్ కె.వినోద్ చంద్రన్‌ల ధర్మాసనం మండిపడింది. న్యాయవాదులకు, క్లయింట్లకు మధ్య జరిగే సంభాషణ చాలా ప్రత్యేకమైందని, దానికి నోటీసులివ్వడం తమను విస్మయానికి గురిచేసిందని పేర్కొంది. ఓ మనీలాండరింగ్ కేసులో కక్షిదారులకు న్యాయసలహా ఇచ్చిన న్యాయవాదులు అరవింద్ దతార్, ప్రతాప్ వేణుగోపాల్‌లకు ఇటీవల ఈడీ సమన్లు జారీ చేసిన సంగతి తెలిసిందే. ఈ అంశాన్ని సుమోటోగా స్వీకరించిన సుప్రీంకోర్టు సోమవారం విచారణ నిర్వహించింది. ఈ అంశంపై తాము మార్గదర్శకాలు జారీ చేసే అంశాన్ని పరిశీలిస్తామని ధర్మాసనం తెలిపింది. కేంద్రం తరఫున వాదనలు వినిపించిన అటార్నీ జనరల్ ఆర్. వెంకటరమణి, సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా కూడా న్యాయస్థానం అభిప్రాయంతో ఏకీభవించారు. రాజకీయ నాయకులు, రాష్ట్ర ప్రభుత్వంతో పాటు ఈడీ తరఫున వాదించే న్యాయవాదులు ఈ అంశాన్ని రాజకీయం చేయకూడదని సీజేఐ పేర్కొన్నారు. తదుపరి విచారణను కోర్టు ఈనెల 29కి వాయిదా వేసింది.



గాజాలో యుద్ధం ఆగి తీరాలి

25 దేశాల సంయుక్త ప్రకటన

లండన్: గాజాలో యుద్ధం ఆగి తీరాలని, అంతర్జాతీయ చట్టాలను ఇజ్రాయెల్ గౌరవించాలని బ్రిటన్, ఫ్రాన్స్, ఆస్ట్రేలియా, కెనడా, జపాన్‌లతో సహా మొత్తం 25 దేశాలు సోమవారం ఒక సంయుక్త ప్రకటన వెలువరించాయి. కొనసాగుతున్న దాడుల కారణంగా గాజాలో సామాన్యుల కష్టాలు మరింతగా పెరిగాయని ఆయా దేశాల విదేశాంగ మంత్రులు పేర్కొన్నారు. చాలీచాలని సాయం అందించడమే కాక, కనీస అవసరాలైన ఆహారం, నీళ్ల కోసం వేచివున్న అమాయక ప్రజల్ని, మహిళలు, పిల్లలను విచక్షణ లేకుండా హతమార్చడాన్ని వారు తీవ్రంగా ఖండించారు. "ఇజ్రాయెల్ ప్రభుత్వం అనుసరిస్తున్న సహాయ పంపిణీ విధానం అత్యంత ప్రమాదకరం. ఇది అస్థిరతను పెంపొందించడంతోపాటు గాజా వాసుల కనీస మానవ గౌరవాన్ని హరిస్తోంది" అని సంయుక్త ప్రకటన తెలియజేసింది.

ఖర్గేకు జన్మదిన శుభాకాంక్షల వెల్లువ

- ఆయన్ను అవిశ్రాంత పోరాటయోధుడిగా అభివర్ణించిన కాంగ్రెస్

దిల్లీ: కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే సోమవారం 83వ పడిలో అడుగుపెట్టారు. ఈ సందర్భంగా ఆయనకు ప్రధాని మోదీ, కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ సహా పలువురు నేతలు శుభాకాంక్షలు తెలిపారు. పార్లమెంటు ప్రాంగణంలోని కాంగ్రెస్ పార్లమెంటరీ కార్యాలయం(సీపీపీ)లో పార్టీ ఎంపీలు ఖర్గే జన్మదిన వేడుకను నిర్వహించారు. కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ప్రియాంకాగాంధీ వాద్రా స్వయంగా తయారుచేసిన కేకును ఆయన కోసినట్లు పార్టీ నేతలు తెలిపారు. ట్విటర్ వేదికగా కాంగ్రెస్ పార్టీ ఖర్గేకు శుభాకాంక్షలు చెబుతూ.. స్వేచ్ఛ, సమానత్వాల కోసం అవిశ్రాంత పోరాటం చేస్తున్న యోధుడిగా ఆయన్ను అభివర్ణించింది. అసమాన ధైర్య సాహసాలు, వివేకం, రాజకీయ కుశలతతో ఆయన పార్టీని నడిపిస్తున్నారని పేర్కొంది. ఖర్గే దీర్ఘకాలం ఆరోగ్యంగా జీవించాలంటూ ప్రధాని మోదీ 'ఎక్స్'లో శుభాకాంక్షలు చెప్పారు. ఖర్గే నాయకత్వం, దేశ ప్రజల పట్ల ఆయనకున్న చిత్తశుద్ధి అందరికీ స్ఫూర్తినిస్తుంటాయని రాహుల్ పేర్కొన్నారు. ప్రియాంకాగాంధీ, తమిళనాడు సీఎం ఎం.కె.స్టాలిన్, కేరళ సీఎం పినరయి విజయన్, హిమాచల్ ప్రదేశ్ ముఖ్యమంత్రి సుఖ్వీందర్‌సింగ్ సుఖు తదితరులు ఖర్గేకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపినవారిలో ఉన్నారు.



పార్లమెంటు హౌస్‌లోని సీపీపీ కార్యాలయంలో కేకు కోస్తున్న మల్లికార్జున ఖర్గే. చిత్రంలో రాహుల్ తదితరులు

సీనియర్ నక్సల్ నేత అజీజుల్ హక్ మృతి

- పశ్చిమ బెంగాల్‌లో ముగిసిన విప్లవ రాజకీయ శకం

కోల్‌కతా: సీనియర్ నక్సల్ నేత, కవి, రాజకీయ చింతనాశీలి అజీజుల్ హక్ సోమవారం కోల్‌కతాలో మృతి చెందారు. ఆయన వయసు 83 ఏళ్లు. హక్ మృతితో పశ్చిమ బెంగాల్‌లో విప్లవ రాజకీయ శకం ముగిసినట్లయింది. దీర్ఘకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన ఇటీవల ఇంట్లో కిందపడ్డారు. దీంతో చేతికి ఫ్రాక్చర్ అయింది. అప్పటి నుంచి ఆసుపత్రిలోని ఐసీయూలో చికిత్స పొందుతున్నారు. సోమవారం మధ్యాహ్నం 2.28 గంటల సమయంలో తుది శ్వాస విడిచారు. అజీజుల్ హక్.. 1942లో హావ్‌డాలో జన్మించారు. తుపాకీతోనే రాజ్యాధికారం అనే నినాదాన్ని నమ్మిన నక్సల్స్ నేతల తరానికి చెందిన ఆయన.. చారు మజుందార్‌ను తన మెంటార్‌గా భావించేవారు. 1960, 70లలో దేశాన్ని కుదిపేసిన బెంగాల్ నక్సల్బరీ ఉద్యమంలో హక్ కీలకపాత్ర పోషించారు. సీపీఐ(ఎంఎల్) సెకండ్ సెంట్రల్ కమిటీకి ఆయన నాయకత్వం వహించారు. చారు మజుందార్, కనయ్ ఛటర్జీలకు సన్నిహితుడైన హక్.. ప్రభుత్వ అణచివేత తర్వాతా నక్సల్ ఉద్యమాన్ని దీర్ఘకాలం కొనసాగించడానికి కృషి చేశారు. మజుందార్ విప్లవ మార్గాన్ని సమర్థించడంతో సీపీఎం నుంచి హక్ బహిష్కృతుడయ్యారు. ఆ తర్వాత నిషిత్ భట్టాచార్యతో కలిసి సీపీఐ(ఎంఎల్) సెకండ్ సెంట్రల్ కమిటీని ఏర్పాటు చేశారు. వీరిద్దరూ కలిసి 1970లలో పశ్చిమ బెంగాల్, బిహార్‌లలోని గ్రామీణ ప్రాంతాల్లో సమాంతర ప్రభుత్వాలు నడపడానికి ప్రయత్నించారు. 1970లో పార్వతీపురం కుట్ర కేసులో మొదటిసారిగా అరెస్టయిన హక్.. 1977లో విడుదలయ్యారు. తన జీవిత కాలంలో ఆయన రెండు దశాబ్దాలపాటు జైల్లోనే గడిపారు. కారాగారే అథరో బొఖర్‌తోపాటు పలు పుస్తకాలను రాశారు. హక్ మృతిపట్ల పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ సంతాపం తెలిపారు. తన సుదీర్ఘ రాజకీయ జీవితంలో ఆయన ఎవరికీ తలవంచలేదని కొనియాడారు.



గాజాలో 59 వేలు దాటిన పాలస్తీనా మృతుల సంఖ్య

డెయిర్ అల్ బలా: గడచిన 21 నెలలుగా గాజాలో సాగుతున్న యుద్ధంలో మరణించిన పాలస్తీనీయుల సంఖ్య 59 వేలు దాటిపోయిందని ఇక్కడి వైద్య మంత్రిత్వ శాఖ పేర్కొంది. 2023, అక్టోబరు 7న యుద్ధం ప్రారంభమైన నాటి నుంచి మొత్తం 59,029 మంది పాలస్తీనీయులు ప్రాణాలు కోల్పోయారని, మరో 1.42 లక్షల మంది క్షతగాత్రులయ్యారని ఆ శాఖ వెల్లడించింది. అయితే వీరిలో ఎందరు పోరాడుతూ మరణించారు, ఎందరు సాధారణ పౌరులు అన్న వివరాలను వైద్య శాఖ తెలపలేదు. మృతుల్లో సగం మంది మహిళలు, పిల్లలేనని పేర్కొంది.

మరోవైపు ఆకలికి తాళలేక అన్నం కోసం పడిగాపులు కాస్తున్న గాజా వాసులపై ఇజ్రాయెల్ యుద్ధ ట్యాంకులు, తుపాకీ గుళ్లతో దాడికి పాల్పడుతోందని ప్రపంచ ఆహార సంస్థ(డబ్ల్యూఎఫ్‌పీ) పేర్కొంది. ఇజ్రాయెల్‌తో సత్సంబంధాలు కలిగిన డబ్ల్యూఎఫ్‌పీ చేసిన ఈ ఆరోపణ వాస్తవ పరిస్థితికి అద్దం పట్టింది. గాజాలో ఆహారం నిండివున్న వాహనాల కాన్వాయ్ వైపు దూసుకెళ్లిన పాలస్తీనా జన సమూహంపై ఇజ్రాయెల్ చేసిన దాడిలో ఆదివారం 80 మంది మృతి చెందారు. ముప్పు ముంచుకొస్తున్నట్టుగా భావించి హెచ్చరిక రూపేణా గాలిలో కాల్పులు జరిపాకే జన సమూహంపై గురిపెట్టామని ఇజ్రాయెల్ చెప్పుకొచ్చింది. మరణాల సంఖ్యను ఎక్కువ చేసి చూపుతున్నారని తెలిపింది. మరోవైపు ఇజ్రాయెల్ దళాలు మధ్య గాజా నగరంలోకి ప్రవేశించాయి. ఈ ప్రాంతంలోకి ఇజ్రాయెల్ భూదళాలు ప్రవేశించడం ఇదే మొదటిసారి.



ఇజ్రాయెల్ దాడితో గాజాలోని ఓ భవనంపై చెలరేగిన మంటలు

సిరియాలో ఇజ్రాయెల్ జోక్యం సరికాదన్న అమెరికా

బీరుట్: సిరియాలో సాయుధుల మధ్య సాగుతున్న పోరాటంలో ఇజ్రాయెల్ జోక్యం చేసుకోవడాన్ని అమెరికా విమర్శించింది. సిరియా ప్రభుత్వ దళాలపై దాడికి పాల్పడటం ద్వారా ఈ ప్రాంతంలో సుస్థిరత సాధించడం కోసం జరుగుతున్న ప్రయత్నాలకు ఇజ్రాయెల్ విఘాతం కలిగించిందని అమెరికా రాయబారి టామ్ బరాక్ ఆరోపించారు. సిరియాలో కొత్తగా ఏర్పాటైన ప్రభుత్వానికి అమెరికా మద్దతు ఉంటుందని ఆయన స్పష్టంచేశారు. టామ్ బరాక్ తుర్కియేలో అమెరికా రాయబారిగా, సిరియాకు ప్రత్యేక దూతగా, లెబనాన్‌కు తాత్కాలిక దౌత్యాధికారిగా పనిచేస్తున్నారు. సిరియాపై దాడికి సంబంధించి ఇజ్రాయెల్ అమెరికాను సంప్రదించలేదని ఆయన అన్నారు. సిరియాలోని స్వెయిదా రాష్ట్రంలో సాయుధ మిలీషియాకు, డ్రూజ్ మైనారిటీ వర్గానికి, సున్నీ బెడ్విన్ తెగలకు మధ్య వారం రోజులుగా సాగుతున్న పోరాటాన్ని ఆదివారం విరమించిన సంగతి తెలిసిందే. సిరియా ప్రభుత్వం సోమవారం స్వెయిదా నగరంలో చిక్కుకున్న బెడ్విన్ తెగల కుటుంబాలను సురక్షిత ప్రాంతాలకు తరలించడం ప్రారంభించింది.

వైష్ణోదేవి యాత్రలో ప్రమాదం ఒకరి మృతి

శ్రీనగర్: జమ్ముకశ్మీర్‌లోని రియాసి జిల్లాలోని వైష్ణోదేవి ఆలయానికి వెళ్లే దారిలో కొండచరియలు విరిగిపడి ఓ యాత్రికుడు మృతిచెందగా, 10 మందికి గాయాలయ్యాయి. "ఈ ప్రమాదంలో గాయపడిన వారికి చికిత్స అందిస్తున్నాం. భద్రతా దళాలు రంగంలోకి దిగి ఆ మార్గంలోని రాకపోకలను నిలిపివేశాయి. ప్రస్తుతం పూర్తిస్థాయి శిథిలాల తొలగింపు ప్రక్రియ చేపడుతున్నాం" అని సంబంధిత అధికారులు తెలిపారు.

కేంద్ర, రాష్ట్రాలకు సుప్రీంకోర్టు నోటీసులు

దిల్లీ: వ్యాపార ఉత్పత్తులకు సంబంధించి అన్ని వివరాలు 'తెలుసుకునే హక్కు' వినియోగదారులకు ఉందని ఆదేశించాలన్న పిటిషన్‌పై విచారణ జరిపిన సుప్రీం కోర్టు కేంద్రం, రాష్ట్రాలకు సోమవారం నోటీసులు జారీ చేసింది. నాలుగు వారాల్లోగా సమాధానం చెప్పాలని ఆదేశించింది. అక్రమ వ్యాపార పద్ధతుల నుంచి తమను తాము రక్షించుకోవటానికి 'తెలుసుకునే హక్కు' వినియోగదారులకు కీలకమని పిటిషనర్ పేర్కొన్నారు. 'ప్రతి పంపిణీదారుడు, వ్యాపారి, యజమాని వారి పేర్లు, చిరునామా, ఫోన్‌నంబరు, కంపెనీ ఉద్యోగుల సంఖ్యను పెద్ద అక్షరాలతో ప్రజలకు కనబడేలా ప్రవేశ ద్వారాల ముందు పెట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించాలి' అని న్యాయవాది అశ్వినీ కుమార్ ఉపాధ్యాయ్ తన పిటిషన్‌లో పేర్కొన్నారు. దీని ద్వారా అక్రమ వ్యాపారుల నుంచి వినియోగదారులకు రక్షణ ఏర్పడుతుందని అని తెలిపారు.

ఉగ్ర అనుమానితుడిని పట్టించిన 'ముఖ గుర్తింపు వ్యవస్థ'

శ్రీనగర్: పహల్గాం దాడి తర్వాత జమ్మూకశ్మీర్‌లో ఉగ్ర అనుమానితులను పట్టుకునేందుకు విస్తృత తనిఖీలు చేస్తున్న భద్రతా దళాలు సాంకేతికత సాయం తీసుకుంటున్నాయి. ఈ క్రమంలోనే అనంత్‌నాగ్ జిల్లాలో 'ముఖ గుర్తింపు వ్యవస్థ'(ఫేసియల్ రికగ్నిషన్ సిస్టమ్) సాయంతో ఓ ఉగ్ర అనుమానితుడిని తాజాగా పోలీసులు అరెస్టు చేశారు. నిందితుడిని డ్రాంగ్‌బల్ పాంపోర్ ప్రాంతానికి చెందిన మునీబ్ ముస్తాక్‌షేక్‌గా గుర్తించారు. గనీస్‌బల్‌లోని ఎక్స్‌రే పాయింట్ వద్ద పోలీసులు ఏర్పాటు చేసిన ముఖగుర్తింపు యంత్రం అతడిని గుర్తించి వెంటనే కంట్రోల్ రూమ్‌కు సమాచారమిచ్చింది. అప్రమత్తమైన పోలీసులు వెంటనే అక్కడికి చేరుకొని మునీబ్‌ను అరెస్టు చేసి దర్యాప్తు చేపట్టారు. జమ్మూకశ్మీర్‌లో శాంతి భద్రతలను పెంపొందించడంతో పాటు నిందితులను త్వరగా పట్టుకునేందుకు అధునాతన నిఘా సాంకేతికత మెరుగ్గా సాయపడుతోందని, అందుకు ఉగ్ర అనుమానితుడి అరెస్టే ఉదాహరణ అని పోలీసులు పేర్కొన్నారు.

విమాన ప్రమాదంపై విదేశీ మీడియా అసత్య ప్రచారం

- పార్లమెంటులో కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడు

దిల్లీ: గుజరాత్‌లోని అహ్మదాబాద్‌లో చోటుచేసుకున్న ఎయిరిండియా విమాన ప్రమాదంపై విదేశీ మీడియా అసత్య ప్రచారం చేస్తోందని పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు పేర్కొన్నారు. విమాన ప్రమాదంపై సోమవారం రాజ్యసభలో చర్చ జరిగింది. దీనిపై విపక్షాలు అడిగిన ప్రశ్నలకు కేంద్రమంత్రి సమాధానమిచ్చారు. "ఎయిరిండియా విమాన ప్రమాద ఘటనపై ప్రాథమిక నివేదిక వచ్చింది. దాన్ని పరిశీలిస్తున్నాం. తుది నివేదిక వచ్చాకే మరిన్ని వివరాలు తెలుస్తాయి. భవిష్యత్తులో ఇలాంటి ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకుంటున్నాం. ఈ ప్రమాదంపై ఎయిర్‌క్రాఫ్ట్ యాక్సిడెంట్ ఇన్వెస్టిగేషన్ బ్యూరో (ఏఏఐబీ) పారదర్శకంగా దర్యాప్తు జరుపుతోంది. ఘటనపై విదేశీ మీడియా అసత్య ప్రచారం చేయడం తగదు. ఇలాంటి ప్రమాదాలు జరిగినప్పుడు సొంత అభిప్రాయాలు చెప్పకూడదు. విమాన ప్రమాదాలకు సంబంధించిన కేసుల్లో నిబంధనల ప్రకారమే దర్యాప్తు చేపడతారు. అంతర్జాతీయ ప్రొటోకాల్‌కు అనుగుణంగానే దర్యాప్తు కొనసాగుతోంది" అని ఆయన వివరించారు.



రాజ్యసభలో మాట్లాడుతున్న రామ్మోహన్‌నాయుడు

దర్యాప్తు ప్రక్రియను ప్రతిఒక్కరూ గౌరవించాలి

"ఈ ప్రమాదంలో మేం నిజం వైపు నిలబడాలని కోరుకుంటున్నాం. ప్రమాదానికి గురైన ఎయిరిండియా విమానంలోని బ్లాక్‌బాక్స్‌ల నుంచి డేటాను విజయవంతంగా సేకరించాం. ప్రమాద సమయంలో విమానంలో ఏం జరిగిందన్నది తుది నివేదిక వచ్చిన తర్వాత మాత్రమే తెలుస్తుంది. అప్పటి వరకు దర్యాప్తు ప్రక్రియను ప్రతిఒక్కరూ గౌరవించాలి" అని రామ్మోహన్‌నాయుడు కోరారు.

కీవ్‌పై రష్యా దాడిలో ఇద్దరి మృతి

కీవ్: ఉక్రెయిన్ రాజధాని కీవ్ నగరంపై రష్యా సోమవారం క్షిపణులు, డ్రోన్‌లతో అతి పెద్ద దాడికి పాల్పడింది. ఈ దాడిలో ఇద్దరు మరణించారని, 15 మంది క్షతగాత్రులయ్యారని ఉక్రెయిన్ అధ్యక్షుడు వొలోదిమిర్ జెలెన్‌స్కీ వెల్లడించారు. నాటో కూటమి ఉక్రెయిన్‌కు మరిన్ని ఆయుధాలు అందించాలన్న ట్రంప్ ప్రతిపాదనపై చర్చించేందుకు నిర్వహించనున్న సమావేశం మరికొన్ని గంటల్లో జరగనుండగా రష్యా తన దాడుల్ని తీవ్రం చేయడం గమనార్హం. బ్రిటన్ రక్షణ మంత్రి జాన్ హెలీ, జర్మనీ రక్షణ మంత్రి బోరిస్ పిస్టోరియస్‌లు ఈ ఆన్‌లైన్ సమావేశానికి అధ్యక్షత వహిస్తారు. అమెరికా రక్షణ మంత్రి పీట్ హెగ్‌సెత్, నాటో నాయకుడు మార్క్ రుట్, నాటో బలగాల సుప్రీం కమాండర్ జనరల్ అలెక్స్ గ్రింకెవిచ్‌లు సమావేశంలో పాల్గొననున్నారు. మరో 50 రోజుల్లో కాల్పుల విరమణకు అంగీకరించకుంటే రష్యాపై మరిన్ని ఆంక్షలు విధిస్తామని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇటీవల హెచ్చరించిన సంగతి తెలిసిందే.



ఉక్రెయిన్ రాజధాని కీవ్‌పై సోమవారం రష్యా ప్రయోగించిన డ్రోన్, క్షిపణి పేలుడు కారణంగా ఆకాశంలో వెలుగులు

బ్రిటన్ ఆంక్షలు: రష్యాపై బ్రిటన్ తాజా ఆంక్షలు ప్రకటించింది. ఇప్పటికే కష్టకాలంలో ఉన్న రష్యా చమురు రంగాన్ని ఈ ఆంక్షలు మరింత దెబ్బతీస్తాయని భావిస్తున్నారు. ఈ కొత్త ఆంక్షలు పుతిన్‌కు రహస్యంగా అందుతున్న చమురు ఆదాయానికి గండి కొడతాయని బ్రిటన్ విదేశాంగ మంత్రి డేవిడ్ ల్యామీ అన్నారు.

పాఠశాలల్లో సీసీటీవీ కెమెరాలు తప్పనిసరి

- సీబీఎస్ఈ ఆదేశం


దిల్లీ: పాఠశాలల్లో భద్రతను మరింత బలోపేతం చేసేలా సెంట్రల్ బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్(సీబీఎస్ఈ) కీలక నిర్ణయం తీసుకుంది. తమ పరిధిలోని అన్ని పాఠశాలల్లో హై రిజల్యూషన్‌తో పాటు ఆడియో, దృశ్య సౌకర్యమున్న సీసీటీవీ కెమెరాలను తప్పనిసరిగా ఏర్పాటు చేయాలని ఆదేశాలు జారీ చేసింది. గత నిబంధనను సవరిస్తూ పాఠశాలల యాజమాన్యాలకు సీబీఎస్ఈ కార్యదర్శి హిమాన్షు గుప్తా ఈ మేరకు లేఖ రాశారు. "పాఠశాలల్లోని ప్రవేశ, నిష్క్రమణ మార్గాలు, కారిడార్లు, మెట్లు, తరగతి గదులు, ప్రయోగశాలలు, గ్రంథాలయాలు, భోజన శాలలు, స్టోర్‌రూమ్‌లు, ఆట స్థలాల్లో సీసీటీవీ కెమెరాలను ఏర్పాటు చేయాలి. ఈ సీసీటీవీ కెమెరాలు కనీసం 15 రోజుల ఫుటేజీని నిల్వ చేయగల సామర్థ్యంతో ఉండాలి" అని హిమాన్షు లేఖలో పేర్కొన్నారు.

బరాక్ ఒబామా అరెస్టు!

ఏఐ వీడియో విడుదల చేసిన ట్రంప్

వాషింగ్టన్: మాజీ అధ్యక్షుడు బరాక్ ఒబామాను ఎఫ్‌బీఐ అధికారులు అరెస్టు చేసినట్లు చూపిస్తున్న ఓ ఏఐ వీడియోను అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తన సోషల్ మీడియా 'ట్రూత్ సోషల్'లో షేర్ చేశారు. చట్టానికి ఎవరూ అతీతులు కారంటూ వ్యాఖ్యానించారు. ఇది సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది. ఈ ఏఐ వీడియోలో ఓవల్ ఆఫీస్‌లో ట్రంప్, ఒబామా కూర్చొని మాట్లాడుతుండగా.. ఎఫ్‌బీఐ అధికారులు అక్కడికి వచ్చి మాజీ అధ్యక్షుడిని అరెస్ట్ చేసి జైలుకు తీసుకెళ్తారు. ఆ సమయంలో ట్రంప్ నవ్వుతూ కనిపిస్తారు. ఖైదీ దుస్తుల్లో ఒబామా జైలులో కూర్చొని, దీర్ఘంగా ఆలోచిస్తున్న ఉన్న దృశ్యాలతో వీడియో ముగుస్తుంది. ట్రంప్ పాలనను నియంత్రించేందుకు ఒబామా సన్నిహిత వర్గాలు అసత్య ప్రచారం చేశాయని నేషనల్ ఇంటెలిజెన్స్ డైరెక్టర్ తులసీ గబ్బార్డ్ ఇటీవల వెల్లడించిన నేపథ్యంలో ఈ వీడియోను ట్రంప్ షేర్ చేయడం గమనార్హం.





రాజకీయాలు కోర్టు బయట చేసుకోండి

సుప్రీం హెచ్చరిక

దిల్లీ: రాజకీయాలేమైనా ఉంటే బయట చూసుకోవాలని, న్యాయస్థానం లోపలకు వాటిని తీసుకురావద్దని పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమత బెనర్జీకి వ్యతిరేకంగా దాఖలైన పిటిషన్‌పై విచారణ సందర్భంగా సుప్రీంకోర్టు వ్యాఖ్యానించింది. ఉపాధ్యాయ నియామక కుంభకోణం కేసులో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుపై మమత వ్యతిరేక వ్యాఖ్యలు చేశారంటూ ఓ ఛారిటబుల్ ట్రస్ట్ నేరధిక్కార పిటిషన్‌ను దాఖలు చేసింది. ఈ వ్యాఖ్యలు.. అత్యున్నత న్యాయవ్యవస్థ అధికారాన్ని దెబ్బతీసేలా ఉన్నాయని పేర్కొంది. ఈ వ్యాజ్యాన్ని విచారించిన భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బి.ఆర్.గవాయ్, జస్టిస్ కె.వినోద్ చంద్రన్‌ల ధర్మాసనం రాజకీయ పోరాటాలేమైనా ఉంటే కోర్టు బయటే చూసుకోవాలని, ఇలాంటి వాటిని తాము సమ్మతించమని హెచ్చరించింది. పిటిషన్‌ను కొట్టివేసింది.

మీకోసం... ఓ మధ్యవర్తి!



ఓ ఇంట్లో పెట్టే స్పీకర్ల మోతతో కాలనీలో అందరి చెవుల తుప్పు వదులుతోంది... **వారిని ఎవరు నియంత్రించాలి?**

నో పార్కింగ్ అని పెట్టిన చోట కొందరు నిరభ్యంతరంగా బండ్లను పెట్టేస్తున్నారు. **వారిని అడ్డుకోవడానికి ఎక్కడకు వెళ్లాలి?**

అపార్ట్‌మెంట్‌లో పక్క ఫ్లాట్ వాళ్లతో గొడవైంది... **దాన్ని చక్కబెట్టేదెవరు?**

కాలనీలు, అపార్ట్‌మెంట్లలో తలెత్తే వివాదాల పరిష్కారానికి ఓ సరికొత్త విధానం మేలు దారి చూపిస్తోంది. సాధారణంగా చిన్న చిన్న వివాదాలకు పోలీసు స్టేషన్లు, కోర్టు దాకా ఎందుకులే అనిపిస్తుంది. కానీ దాన్ని అనుభవించే వారికి మాత్రం నరకమే. ఈ సమస్యలను పరిష్కరించడానికి ఓ అత్యుత్తమ మార్గం కమ్యూనిటీ మీడియేషన్. ఇందులో విభేదాలను పరిష్కరించుకోవడానికి ఉన్న మార్గాలేంటో తెలియక సతమతమవుతున్న వారికి శిక్షణ పొందిన మధ్యవర్తి సాయపడతారు. దేశంలో మధ్యప్రదేశ్‌తో పాటు తెలంగాణలో మాత్రమే ఏర్పాటైన ఈ వ్యవస్థ డబ్బు, సమయం వృథా కాకుండా వివాదాలను చక్కబెడుతోంది. సామాన్యులకు న్యాయ సహాయంలో గేమ్ ఛేంజర్‌గా నిలుస్తోంది.



తెలంగాణలో ఈ ఏడాది ఇప్పటివరకు కమ్యూనిటీ మీడియేషన్ సెంటర్లకు 734 వివాదాలు వస్తే... అందులో 412 పరిష్కారమయ్యాయి. 9 జిల్లాల్లోని 468 మందికి రాష్ట్ర న్యాయసేవాధికార సంస్థ శిక్షణ ఇచ్చింది.

ఎవరీ మీడియేటర్...

- కమ్యూనిటీ మీడియేషన్‌లో భాగంగా వివిధ సామాజిక, మత, సాంస్కృతిక, సంస్థలు, రెసిడెన్స్ అసోసియేషన్లు, ఫ్లాట్ ఓనర్ల అసోసియేషన్లు వంటివి తమ వివాదాల పరిష్కారానికి ఓ వ్యక్తిని గుర్తించాలి..
- ఆ వ్యక్తికి కనీసం డిగ్రీ, 25 ఏళ్ల వయసుండాలి. మధ్యవర్తిత్వంలో అనుభవంగానీ.. సామాజిక సేవలో తగిన పాత్ర పోషించిన వారికి గానీ ప్రాధాన్యం.
- ఎంపిక చేసిన వారికి రాష్ట్ర న్యాయసేవాధికార సంస్థ మీడియేషన్‌లో శిక్షణనిస్తుంది.
- కమ్యూనిటీ వారే తగిన సౌకర్యాలతో కేంద్రం ఏర్పాటుచేయాల్సి ఉంటుంది. అక్కడి నుంచే న్యాయ సేవలను అందిస్తారు.
- ఇందులో మధ్యవర్తికి ఎలాంటి వేతనమూ ఉండదు. స్వచ్ఛందంగా... సేవాభావంతో ఈ బాధ్యతలు నిర్వర్తించాల్సి ఉంటుంది.
- ఆశ్రయించిన ఇరు వర్గాలకు ఆమోదయోగ్యంగా కమ్యూనిటీ మీడియేటర్ వివాదాన్ని పరిష్కరించాలి.
- ఆయా కమ్యూనిటీలు ఎంపిక చేసుకున్న వ్యక్తి కాబట్టి వాస్తవిక పరిస్థితులపై సహజంగానే అవగాహన ఉంటుంది. దీంతో వివాదాలను తేలిగ్గా, సామరస్యంగా పరిష్కరించడానికి వీలుంటుంది.
- దీనివల్ల డబ్బు, సమయం ఆదా కావడంతో పాటు శాంతి భద్రతలకు భరోసా ఉంటుంది.

దరఖాస్తు ఇలా...

- మధ్యవర్తిత్వం కోరుకునేవారు మండల, జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీలోగానీ, సబ్‌డివిజనల్, రెవెన్యూ డివిజనల్ అధికారికిగానీ దరఖాస్తు చేసుకోవాలి. వాటిని సంబంధిత కమ్యూనిటీ మీడియేషన్ సెంటర్‌కు సిఫారసు చేస్తారు.
- దరఖాస్తులో ఉన్న వివరాల ఆధారంగా రెండో పార్టీకి కమ్యూనిటీ మీడియేటర్ నోటీసు జారీచేస్తారు. మధ్యవర్తిత్వ నిబంధనల ప్రకారం ఇరుపక్షాల మధ్య వివాదాన్ని పరిష్కరిస్తారు.
- మీడియేటర్ తనకు అందిన ఫిర్యాదులను రిజిస్టర్‌లో నమోదుచేయాలి. ప్రతి నెలా కేసుల వివరాలను, పరిష్కారమైన వాటి గురించి న్యాయసేవాధికార సంస్థకు నివేదిక సమర్పించాలి.
- కమ్యూనిటీ మీడియేషన్ సెంటర్ల పనితీరును మండల, జిల్లాస్థాయి న్యాయసేవాధికార సంస్థలు పర్యవేక్షిస్తుంటాయి. నెలకోసారి వెళ్లి అక్కడ రికార్డులను పరిశీలిస్తుంటాయి.

ఏమేం కేసులు...

- రెండు గ్రూపుల మధ్య లేదా ఇద్దరు వ్యక్తుల మధ్య ఏ వివాదమైనా మధ్యవర్తిత్వం వహించవచ్చు.
- విడాకులు, సంరక్షణ నిర్ణయాలు తప్ప మిగిలిన కుటుంబ, దాంపత్య వివాదాలు, ఆస్తి, సరిహద్దు, వ్యాపార వివాదాలను పరిష్కరిస్తారు.
- క్రిమినల్ కేసులను పరిష్కరించడం మాత్రం సాధ్యంకాదు.

చట్టబద్ధత ఎంత?

- మధ్యవర్తి కుదిర్చే ఒప్పందం అమలుకు ప్రత్యేకంగా చట్టబద్ధత ఏమీ ఉండదు. కోర్టు తీర్పుల్లా తప్పనిసరిగా అమలు చేయాలనే నిబంధనం లేదు.
- లీగల్ సర్వీసెస్ అథారిటీ మరోసారి ఇరు పార్టీలతో సంప్రదించి అవార్డు జారీ చేస్తే దానికి చట్టబద్ధత ఉంటుంది.

స్వచ్ఛందంగా ఇద్దరూ అంగీకరిస్తేనే మధ్యవర్తిత్వం ఉంటుంది. ఎవరు అంగీకరించకున్నా కమ్యూనిటీ మీడియేషన్ కేంద్రంలో వివాదాన్ని మూసివేస్తారు.

- ఈనాడు, హైదరాబాద్

గ్రీన్ హైడ్రోజన్ వ్యాలీగా రాష్ట్రం

- పరిశోధనకు రూ.500 కోట్ల కేటాయింపు
- డిక్లరేషన్‌ను ప్రకటించిన సీఎం చంద్రబాబు

ఈనాడు, అమరావతి: దేశంలోనే అతి పెద్ద గ్రీన్ హైడ్రోజన్ తయారీ కేంద్రంగా రాష్ట్రాన్ని తీర్చిదిద్దే లక్ష్యంతో 'అమరావతి గ్రీన్ హైడ్రోజన్ వ్యాలీ- అమరావతి డిక్లరేషన్‌'ను సీఎం చంద్రబాబు సోమవారం ప్రకటించారు. 2030 నాటికి గ్రీన్ హైడ్రోజన్ వ్యాలీగా రాష్ట్రాన్ని తీర్చిదిద్దేందుకు పూర్తిస్థాయి ప్రణాళికను వెల్లడించారు. ఈ రంగంలో పరిశోధన, ఆవిష్కరణలకు రూ.500 కోట్లను కేటాయిస్తున్నట్లు తెలిపారు. 'శుద్ధ ఇంధన, గ్రీన్ హైడ్రోజన్ తయారీ విధానాలను తీసుకురావడమే డిక్లరేషన్ ప్రధాన లక్ష్యం. దీనికోసం రాష్ట్రంలో గ్రీన్ ఎనర్జీ కారిడార్ అభివృద్ధి చేస్తాం. గ్రీన్ హైడ్రోజన్ ఉత్పత్తి పెంచేందుకు అనుకూల పరిస్థితులను కల్పిస్తాం' అని సీఎం పేర్కొన్నారు. అమరావతిలోని ఎస్ఆర్ఎం విశ్వవిద్యాలయంలో జరిగిన 'గ్రీన్ హైడ్రోజన్ సమిట్-2025'లో పారిశ్రామిక నిపుణులు, భాగస్వామ్య పక్షాలు కలిపి సుమారు 600 మంది పాల్గొన్నారు. సమిట్‌లో చర్చించిన కీలక అంశాల ఆధారంగా గ్రీన్ హైడ్రోజన్ డిక్లరేషన్‌ను సీఎం ప్రకటించారు. ఉండవల్లిలోని సీఎం క్యాంపు కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్, నెడ్‌క్యాప్ ఎండీ కమలాకర్‌బాబు పాల్గొన్నారు.

డిక్లరేషన్ ప్రధాన లక్ష్యాలు

★ 2027 నాటికి 2 గిగావాట్లు, 2029 నాటికి 5 గిగావాట్ల ఎలక్ట్రోలైజర్ల తయారీ ప్రధాన లక్ష్యం.
★ 2029 నాటికి ఏటా 1.5 మిలియన్ మెట్రిక్ టన్నుల గ్రీన్ హైడ్రోజన్ తయారీ.
★ హైడ్రోజన్ గ్యాస్ కిలో ప్రస్తుత ధర రూ.460 నుంచి రూ.160కు తగ్గించేలా పరిశోధనలు జరపడం.
★ 2029 నాటికి 25 గిగావాట్ల పునరుత్పాదక ఇంధన ప్రాజెక్టులకు అవసరమైన మౌలిక సదుపాయాలను కల్పించడం.

జగన్ పర్యటనకు అనుమతుల్లేవని నోటీసులిచ్చినా ఎందుకు పాల్గొన్నారు?

మాజీ మంత్రులు రజిని, రాంబాబులను ప్రశ్నించిన పోలీసులు



సత్తెనపల్లి గ్రామీణ పోలీసు స్టేషన్ వద్ద మాట్లాడుతున్న మాజీ మంత్రులు రజిని, రాంబాబు

సత్తెనపల్లి గ్రామీణ, సత్తెనపల్లి, న్యూస్‌టుడే: 'వైకాపా అధినేత జగన్ రెంటపాళ్ల పర్యటనకు అనుమతి లేదని, ఆ కార్యక్రమంతో శాంతిభద్రతల సమస్య తలెత్తే ప్రమాదముందని, మీరు పాల్గొనవద్దని ముందుగానే నోటీసులు అందజేసినా ఎందుకు హాజరయ్యారు. మీ నియోజకవర్గం నుంచి ఎంతమందిని ఆ ర్యాలీకి సమీకరించారు? రప్పా రప్పా ప్లకార్డులు ఎక్కడ ముద్రించారో తెలుసా? జనసమీకరణ చేయాలని మిమ్మల్ని ఎవరైనా కోరారా' అని మాజీ మంత్రులు విడదల రజిని, అంబటి రాంబాబులను పోలీసులు ప్రశ్నించారు. జూన్ 18న పల్నాడు జిల్లా సత్తెనపల్లిలో జగన్ చేసిన ర్యాలీతో ట్రాఫిక్ నిబంధనల ఉల్లంఘన, ప్రజల ఆస్తుల ధ్వంసంపై పట్టణ, గ్రామీణ పోలీసు స్టేషన్లలో కేసులు నమోదయ్యాయి. సోమవారం ఆయా స్టేషన్లలో వారిద్దరినీ వేర్వేరుగా పోలీసులు విచారించారు. తాను జనాన్ని సమీకరించలేదని, పట్టణంలో జరిగిన పరిణామాలపై తనకు అవగాహన లేదని రజిని పోలీసులకు చెప్పినట్లు తెలుస్తోంది. విచారణ అనంతరం ఆమె విలేకరులతో మాట్లాడుతూ తాము జనసమీకరణ చేయాల్సిన అవసరం లేదని, జగన్ పర్యటన అంటే ప్రజలు స్వచ్ఛందంగా తరలివస్తున్నారన్నారు. పోలీసులను అడ్డుపెట్టుకుని ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి లోకేశ్ ఏడాదిగా వైకాపా నాయకులను వేధిస్తున్నారని ఆరోపించారు. రెడ్‌బుక్ రాజ్యాంగం ప్రకారమే మిథున్‌రెడ్డిపై తప్పుడు కేసులు పెట్టి జైలుకు పంపారని ఆరోపించారు. మాజీ మంత్రి అంబటి రాంబాబు మాట్లాడుతూ పోలీసుస్టేషన్‌కు హాజరవడం బిడియంగా ఉందన్నారు. మిథున్‌రెడ్డి అరెస్టు రాష్ట్రంలో వేధింపుల పాలనకు నిదర్శనమన్నారు.

విద్యుత్ కార్మికుల పొట్టగొడతారా..?

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ



మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ. వేదికపై రవీంద్రనాథ్, రామలింగారెడ్డి, శివయ్య, వెంకటసుబ్బయ్య, బాలకాశీ తదితరులు

విజయవాడ(గాంధీనగర్), న్యూస్‌టుడే: విద్యుత్ రంగ సమస్యలపై యాజమాన్యం, ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయని.. ఈ రంగాన్ని అదానీకి కట్టబెట్టి కార్మికుల పొట్టగొడతారా అని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ ప్రశ్నించారు. విద్యుత్తు ఉద్యోగులు, కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సోమవారం విజయవాడలో ర్యాలీ నిర్వహించారు. రైల్వేస్టేషన్ నుంచి ధర్నా చౌక్ వరకు భారీ సంఖ్యలో ఉద్యోగులు, కార్మికులు ప్రదర్శన నిర్వహించారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ కార్మికులకు న్యాయం జరిగే వరకు పోరాడతామని చెప్పారు. ఏపీ ఎలక్ట్రికల్ స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు బి.రామలింగారెడ్డి మాట్లాడుతూ... జేఎల్ఎం గ్రేడ్-2 ఉద్యోగులకు సర్వీస్ నిబంధనల్లో వివక్ష తొలగించి, అందరికీ సమానమైన ఏపీఎస్ఈబీ నిబంధనలు అమలు చేయాలని, ఏఎల్ఎంలుగా పదోన్నతులు కల్పించాలని డిమాండ్ చేశారు. సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పోన్నా శివయ్య, గ్రామ, వార్డు సచివాలయ ఎనర్జీ ఎంప్లాయీస్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.మల్లికార్జునరెడ్డి, ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్.రవీంద్రనాథ్ తదితరులు మాట్లాడారు.

'ధర్మస్థలలో అసహజ మరణాలు' ప్రచారంపై సిట్

కర్ణాటక ప్రభుత్వం తీరును తప్పుబట్టిన భాజపా

మంగళూరు, న్యూస్‌టుడే: దక్షిణ భారతదేశంలోని ప్రముఖ ఆధ్యాత్మిక కేంద్రం ధర్మస్థలలో కొన్నేళ్లుగా ఎన్నో అసహజ మరణాలు సంభవించాయని జరుగుతున్న ప్రచారంలో వాస్తవాలను నిగ్గు తేల్చేందుకు కర్ణాటక ప్రభుత్వం ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని (సిట్) ఏర్పాటు చేశాక.. భాజపా, కాంగ్రెస్ పార్టీలు భిన్నంగా స్పందిస్తున్నాయి. సిట్ ఏర్పాటును భాజపా తీవ్రంగా వ్యతిరేకించగా.. కాంగ్రెస్ నేతలు 'వాస్తవాలు వెల్లడవుతాయి' అని ప్రకటించారు. సిట్ ఏర్పాటును ధర్మస్థల ఆలయ ప్రతినిధులు స్వాగతించారు. 'సిట్ దర్యాప్తు అనంతరం వాస్తవాలు వెలుగులోకి వస్తాయని ఆలయ అధికార ప్రతినిధి కె.పార్శ్వనాథ్ జైన్ సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

★ ప్రభుత్వం సిట్ ఏర్పాటు చేసి తప్పుడు సంప్రదాయానికి తెరతీసిందని విధానసభలో విపక్ష నేత ఆర్.అశోక్ దుయ్యబట్టారు. ధర్మస్థల ఆలయంపై కోట్ల మంది భక్తుల నమ్మకాన్ని వమ్ముచేసేందుకు ప్రయత్నిస్తోందని ఆరోపించారు. ఇప్పటి వరకు వందల మంది అనుమానాస్పదంగా మరణించారని చెబుతున్నా, వారి కుటుంబసభ్యులు పోలీసులకు ఎందుకు ఫిర్యాదు చేయలేదని ప్రశ్నించారు.

ఉపకార వేతనాలకు వివరాలు నమోదు చేయాలి: డీజీఈ

ఈనాడు, అమరావతి: గతేడాది డిసెంబరు 8న జరిగిన నేషనల్ మీన్స్ కం మెరిట్ ఉపకార వేతనాల పరీక్షలో ఎంపికైన విద్యార్థులు ఆగస్టు 31లోపు www.scholarships.gov.in వెబ్‌సైట్‌లో వివరాలు నమోదు చేసి, దరఖాస్తు సమర్పించాలని ప్రభుత్వ పరీక్షల విభాగం సంచాలకులు(డీజీఈ) శ్రీనివాసులు రెడ్డి తెలిపారు. ఆధార్‌లో ఉన్న విధంగా వివరాలు సరిచూసుకుని నమోదు చేయాలని సూచించారు. మెరిట్ జాబితాలో వివరాలు తప్పుగా ఉంటే వెంటనే సంబంధిత పాఠశాల ద్వారా జిల్లా విద్యాధికారి కార్యాలయంలో అందించాలని పేర్కొన్నారు. ప్రభుత్వ, ఎయిడెడ్ విద్యాసంస్థల్లో చదువుతున్న పది, ఇంటర్మీడియట్ విద్యార్థులు తప్పకుండా రెన్యువల్ చేసుకోవాలని సూచించారు.

బెట్టింగ్ యాప్‌ల ప్రచారం కేసులో

విచారణకు రండి

సినీ ప్రముఖులకు ఈడీ నోటీసులు

ఈనాడు, హైదరాబాద్: బెట్టింగ్ యాప్‌ల ప్రచారం కేసు దర్యాప్తులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) దూకుడు పెంచింది. ఆయా యాప్‌ల తరఫున ప్రచారం చేసిన పలువురు సినీ ప్రముఖులకు సోమవారం నోటీసులు జారీ చేసింది. వీరిలో దగ్గుబాటి రానా, ప్రకాశ్‌రాజ్, విజయ్ దేవరకొండ, మంచు లక్ష్మిలు ఉన్నారు. దగ్గుబాటి రానా ఈ నెల 23న, ప్రకాశ్‌రాజ్ ఈ నెల 30, విజయ్ దేవరకొండ ఆగస్టు 6, మంచులక్ష్మి ఆగస్టు 13 తేదీల్లో విచారణ నిమిత్తం తమ ఎదుట హాజరుకావాలంటూ ఈడీ అధికారులు నోటీసుల్లో పేర్కొన్నారు. ఇంకా పలువురు సెలెబ్రిటీలు, యూట్యూబర్లకు నోటీసులు జారీ చేసి విచారించనున్నారు. రాష్ట్రంలో బెట్టింగ్ యాప్‌ల కారణంగా అనేకమంది అప్పులపాలై ఆత్మహత్యలకు పాల్పడిన నేపథ్యంలో పలు పోలీస్‌స్టేషన్లలో ఆయా యాప్‌లపై కేసులు నమోదయ్యాయి. వీటన్నింటినీ కలిపి విచారించే ఉద్దేశంతో ప్రభుత్వం సిట్‌ను ఏర్పాటు చేసింది. ప్రస్తుతం ఈ అంశంపై సిట్ విచారణ జరుపుతుండగా..మరోవైపు ఇదే కేసులో నిధుల మళ్లింపుపై ఈడీ మరో కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించింది.

తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్‌కు అస్వస్థత

చెన్నై, న్యూస్‌టుడే: తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ సోమవారం ఉదయం స్వల్ప అస్వస్థతకు గురై ఆసుపత్రిలో చేరారు. ఆయన రోజూ ఉదయపు నడకకు వెళ్తుంటారు. సోమవారం ఉదయం నడుస్తున్నప్పుడు తల తిరిగినట్లు అనిపించడంతో ఇంటికి వెళ్లిపోయారు. క్యాంపు కార్యాలయం, డీఎంకే కార్యాలయంలో జరిగిన కార్యక్రమాల్లో పాల్గొన్నారు. అనంతరం గ్రీమ్స్‌రోడ్డులోని అపోలో ఆసుపత్రిలో చేరారు. సీఎం వెంట ఆయన సతీమణి దుర్గ, కుమారుడు ఉదయనిధి, కుమార్తె సెంతామరై ఉన్నారు. 'సీఎంకు కొన్ని వైద్యపరీక్షలు చేశాం. మరికొన్ని పరీక్షలు చేయాలి. మూడు రోజులు ఆసుపత్రిలోనే ఉండి చికిత్స పొందాల్సి ఉంటుంది' అని అపోలో వైద్యులు ఓ ప్రకటనలో తెలిపారు.

విచారణకు హాజరుకండి

మాజీ ఎమ్మెల్యే నల్లపరెడ్డికి పోలీసుల నోటీసులు



ప్రసన్నకుమార్‌రెడ్డికి నోటీసు అందజేస్తున్న ఎస్సై

నెల్లూరు(నేర విభాగం), న్యూస్‌టుడే: పోలీసుల విచారణకు హాజరు కావాలని శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా కోవూరు మాజీ ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డికి స్థానిక పోలీసులు నోటీసులు జారీ చేశారు. అనుచిత వ్యాఖ్యల నేపథ్యంలో కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసిన విషయం తెలిసిందే. కేసులో భాగంగా ఈ నెల 25న ఉదయం పది గంటలకు కోవూరు సర్కిల్ కార్యాలయానికి రావాలని సీఐ సుధాకర్ రెడ్డి సోమవారం రాత్రి నోటీసు జారీ చేశారు. ఆ ప్రతిని మాజీ ఎమ్మెల్యేకు ఎస్సై వై.రంగనాథగౌడ్ అందజేశారు.



సమయాన్ని ఉచిత వనరుగా చూడొద్దు

చాలా మంది డబ్బును తమ కష్టార్జితంగా చూస్తూ, సమయాన్ని ఉచితంగా లభించిన వనరుగా భావిస్తుంటారు. వాస్తవానికి డబ్బు ఎంతైనా సంపాదించొచ్చు. ఒకసారి పోగొట్టుకున్నా మళ్లీ పొందొచ్చు. కానీ సమయాన్ని ఇతరుల కన్నా ఎక్కువగా సంపాదించుకోలేం. వృథా చేసిన సమయాన్ని తిరిగి పొందలేం. కాబట్టి డబ్బు కన్నా సమయానికి విలువివ్వడం నేర్చుకోండి.

- అర్జున్ ఖేమానీ, కంటెంట్ క్రియేటర్

ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు 'జీరో ఫేర్ టికెట్' జారీ

- ప్రభుత్వం ఇచ్చే రాయితీ వివరాలు ఉండాలి
- ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశం

ఈనాడు, అమరావతి: మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఆగస్టు 15 నుంచి అమలు చేయనున్న ఉచిత ప్రయాణ పథకంలో.. 'జీరో ఫేర్ టికెట్' జారీచేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశించారు. ఎక్కడి నుంచి ఎక్కడికి ప్రయాణిస్తున్నారు, టికెట్ ధర ఎంత, ప్రభుత్వం 100 శాతం ఇస్తున్న రాయితీ.. వంటి వివరాలన్నీ అందులో ఉండాలని పేర్కొన్నారు. మహిళలకు ఉచిత ప్రయాణ పథకంపై సీఎం సోమవారం సచివాలయంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జీరో ఫేర్ టిక్కెట్ ద్వారా ఎంత లబ్ధి పొందారనేది మహిళలకు సులభంగా తెలుస్తుందన్నారు. ఇందుకు సంబంధించిన సాఫ్ట్‌వేర్‌లో మార్పులు చేయాలని ఆదేశించారు. ఈ పథకం అమలు చేస్తున్న రాష్ట్రాల్లో ప్రభుత్వాలపై ఎంత భారం పడింది? మన రాష్ట్రంలో ఎంత వ్యయం అవుతుందనే వివరాలపై అధికారులతో చర్చించారు. ఎట్టిపరిస్థితుల్లో ఆగస్టు 15 నుంచి సమర్థంగా ఈ పథకం అమలు చేయాలని ఆదేశించారు.



మహిళలకు ఆర్టీసీ బస్సులో ఉచిత ప్రయాణ పథకంపై అధికారులతో సమీక్షిస్తున్న చంద్రబాబు

ఇతర ఆదాయమార్గాలు పెంచుకోవాలి

మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ పథకం అమలు చేయనున్నందున.. ఆర్టీసీకి భారం లేకుండా ఇతర ఆదాయ మార్గాలను పెంచుకొని, నిర్వహణ వ్యయం తగ్గించుకోవాలని, సంస్థను లాభాల బాట పట్టించాలని చంద్రబాబు సూచించారు. ఏ విధానాలు అవలంబిస్తే లాభాలు పొందేందుకు అవకాశం ఉంటుందనే అంశాలపై కార్యాచరణ రూపొందించాలని ఆదేశించారు. సంస్థలో ఇకపై తీసుకునేవన్నీ ఏసీ విద్యుత్తు బస్సులే ఉండాలని సీఎం ఆదేశించారు. ప్రస్తుతమున్న డీజిల్ బస్సులను విద్యుత్తు బస్సులుగా మారిస్తే నిర్వహణ వ్యయం ఎంత తగ్గుతుందనేది కూడా అధ్యయనం చేయాలని సూచించారు. మున్ముందు అన్నీ విద్యుత్తు బస్సులే తీసుకుంటున్నందున.. అన్ని డిపోల్లో ఛార్జింగ్ స్టేషన్లు ఏర్పాటు చేసే అంశంపై అధ్యయనం చేయాలని ఆదేశించారు.

అమరావతి రెండో దశ భూ సమీకరణపై

మంత్రివర్గ ఉపసంఘంలో చర్చిస్తాం

- మంత్రి నారాయణ వెల్లడి

తుళ్లూరు, న్యూస్‌టుడే: మంత్రివర్గ ఉపసంఘంలో చర్చించి అమరావతి రెండో దశ భూ సమీకరణపై నిర్ణయం తీసుకుంటామని మంత్రి పి.నారాయణ తెలిపారు. అమరావతిలో వివిధ సంస్థలకు భూ కేటాయింపుల కోసం ఏర్పాటు చేసిన మంత్రివర్గ ఉపసంఘమే దీనిపైనా చర్చిస్తుందని, ఆ నిర్ణయాన్ని వచ్చే క్యాబినెట్ సమావేశంలో పెట్టి చర్చిస్తామని చెప్పారు. ముఖ్యమంత్రి చంద్రబాబు సూచనల మేరకు తుది నిర్ణయం ప్రకటిస్తామన్నారు. సోమవారం నారాయణ రాజధాని ప్రాంతంలో పర్యటించారు. ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ, అఖిల భారత సర్వీసుల ఉద్యోగుల భవన సముదాయాలు, మంత్రులు, జడ్జీలు, ముఖ్య కార్యదర్శులు, కార్యదర్శుల కోసం నిర్మిస్తున్న బంగ్లాలు, సచివాలయ ఐకానిక్ టవర్స్ నిర్మాణ పనులను సీఆర్డీఏ ఇంజినీర్లతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా జడ్జీల బంగ్లాల వద్ద నిర్మాణ పనులపై మంత్రి నారాయణ బీఎస్ఆర్ గుత్తేదారు సంస్థ ప్రతినిధిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎప్పటిలోగా పిల్లర్స్ నిర్మాణం పూర్తిచేస్తారని ప్రశ్నించగా.. సరైన సమాధానం చెప్పక పోవడంతో మంత్రి అసహనం వ్యక్తం చేశారు. జాప్యం చేసినా, నాణ్యత లోపించినా ఉపేక్షించబోమని హెచ్చరించారు. అనంతరం మంత్రి నారాయణ మీడియాతో మాట్లాడుతూ.. అమరావతిలో అంతర్జాతీయ విమానాశ్రయం, క్రీడా ప్రాంగణం, వాణిజ్య ప్రాంతాలు నిర్మించడానికి సీఆర్డీఏకి సుమారు 10 వేల ఎకరాల భూమి అవసరమవుతుందని, భూ సేకరణ చేస్తే తమకు నష్టం వచ్చే అవకాశం ఉందని, భూ సమీకరణ చేయాలని ఆయా గ్రామాల్లోని రైతులు కోరారన్నారు. ఈ విషయాన్ని క్యాబినెట్ సబ్ కమిటీలో చర్చించారా అని గత మంత్రివర్గ సమావేశంలో సీఎం చంద్రబాబు ప్రస్తావించారని, తదనుగుణంగా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు.

నాకు చెప్పింది ఒక్కటే!

సిట్ విచారణలో నారాయణస్వామి వెల్లడి

ఈనాడు, అమరావతి: 'ప్రభుత్వ దుకాణాలు తీసుకొస్తే మద్యం వినియోగం తగ్గుతుందని, ప్రజలను మద్యం నుంచి దూరం చేయవచ్చని నాకు చెప్పారు.. అంతకుమించి నూతన మద్యం విధానం గురించి నాతో ఏమీ చర్చించలేదు' అని వైకాపా హయాంలో ఎక్సైజ్‌శాఖ మంత్రిగా పనిచేసిన కె.నారాయణస్వామి సిట్ అధికారులతో చెప్పినట్లు సమాచారం. మద్యం విధానాన్ని అడ్డం పెట్టుకుని దోపిడీ జరిగినట్లు తన దృష్టికి ఎన్నడూ రాలేదని, రాజ్ కెసిరెడ్డి ఎవరో కూడా తనకు తెలియదని వివరించినట్లు తెలిసింది. విజయవాడలోని సిట్ కార్యాలయంలో సోమవారం విచారణకు రావాలంటూ ఆయనకు అధికారులు నోటీసులివ్వగా అనారోగ్య కారణాల రీత్యా విచారణకు నేరుగా హాజరుకాలేనని సమాచారమిచ్చారు. దీంతో తిరుపతిలోని నారాయణస్వామి నివాసానికి సిట్ అధికారులు ఓ ఇన్‌స్పెక్టర్‌ను పంపి.. వీడియోకాల్ ద్వారా ఆయన్ను విచారించారు. దాదాపు 20 నిమిషాల పాటు ఆయన్ను ప్రశ్నించారు. ఏ ఒక్క ప్రశ్నకూ ఆయన సరైన సమాధానాలు చెప్పలేదని తెలిసింది.

వసతిగృహాల దుస్థితిపై హైకోర్టు అసంతృప్తి

- ఖర్చు చేస్తున్న రూ.కోట్ల నిధులు ఎక్కడికి పోతున్నాయి?
- పరుపులు లేక విద్యార్థులు నేలపై పడుకోవడం ఏమిటి?
- హాస్టళ్లపై నివేదిక ఇవ్వాలని సీఎస్‌కు ధర్మాసనం ఆదేశం

ఈనాడు, అమరావతి: ప్రభుత్వ వసతిగృహాల దుస్థితిపై హైకోర్టు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. సంక్షేమ హాస్టళ్ల కోసం ఖర్చు చేస్తున్న రూ.కోట్ల నిధులు ఎక్కడికి పోతున్నాయని, గుత్తేదారుల లబ్ధి కోసమే పనులు చేపడుతున్నారా.. అని ఘాటుగా వ్యాఖ్యానించింది. మంచాలు, పరుపులు లేక విద్యార్థులు నేలపై పడుకోవడం ఏమిటని ఆవేదన వ్యక్తం చేసింది. ఇళ్లలో మన పిల్లల్ని నేలపై నిద్రపోనిస్తామా అని ప్రశ్నించింది. పరుపులు ఇచ్చి విద్యార్థుల సుఖనిద్రకు అవకాశం కల్పించాలంది. బాలల హక్కుల రక్షణ జాతీయ కమిషన్ (ఎన్‌సీపీసీఆర్) మార్గదర్శకాల ప్రకారం వసతిగృహాల్లో కనీస మౌలిక సదుపాయాలు, నాణ్యమైన ఆహారం విద్యార్థులకు అందించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని తేల్చిచెప్పింది. వసతిగృహాల నిర్వహణ, సౌకర్యాల కల్పన విషయంలో నిర్లక్ష్యం వహిస్తే సాంఘిక, గిరిజన, బీసీ సంక్షేమ శాఖల ముఖ్య కార్యదర్శులను బాధ్యులను చేస్తామని హెచ్చరించింది. హాస్టళ్లలో సమస్యల పరిష్కారానికి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సీఎస్) జోక్యం చేసుకోవాల్సిన అవసరం ఉందని స్పష్టం చేసింది. వసతిగృహాల్లో పరిస్థితుల మెరుగుకు కార్యాచరణ ప్రణాళికను అఫిడవిట్ రూపంలో సమర్పించాలని సీఎస్ విజయానంద్‌ను ఆదేశించింది. ప్రతి జిల్లాలో సీనియర్ అధికారి హాస్టళ్లలో తనిఖీలు చేయాలని, ఆ నివేదికలను తమ ముందుంచాలని స్పష్టం చేసింది. హాస్టళ్లలో సౌకర్యాల మెరుగుకు చేపట్టిన పనులపై స్థాయి నివేదిక ఇవ్వాలంటూ విచారణను నెల రోజులకు వాయిదా వేసింది. హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, జస్టిస్ చీమలపాటి రవితో కూడిన ధర్మాసనం సోమవారం ఈ మేరకు ఉత్తర్వులిచ్చింది. వసతిగృహాల్లో మౌలిక సదుపాయాల కొరతను ప్రశ్నిస్తూ కాకినాడకు చెందిన కేపీఎస్ గురుతేజ 2023లో హైకోర్టులో పిల్ దాఖలు చేశారు. ఇటీవల ఈ వ్యాజ్యంపై విచారణ జరిపిన ధర్మాసనం.. ఆన్‌లైన్‌లో విచారణకు హాజరుకావాలని సీఎస్‌ను ఆదేశించింది. సీఎస్ విజయానంద్ సోమవారం ఆన్‌లైన్‌లో విచారణకు హాజరయ్యారు.

కూలిపోతున్న భవనంలో..


192 మంది పిల్లల భవిత!

ఊరికి దూరంగా విసిరేసినట్లు పొలాల్లో ఉందా భవనం. పాకుడుపట్టిన గోడలు.. పగుళ్లిచ్చి ఓ వైపు పడిపోతున్నాయి. దర్వాజలు చెదలుపట్టి ఊడిపోతున్నాయి. కిటికీలకు చువ్వలు తప్ప తలుపుల్లేవు. మట్టి ఫ్లోరింగ్ కదా.. దుమ్ము రేగుతోంది. అందులోనే దుప్పట్లు వేసుకొని కూర్చొని 192 మంది పిల్లలు చదువుకుంటున్నారు. ఇదేదో హర్రర్ సినిమాల్లోని భవనం కాదు. నంద్యాల జిల్లా ఆళ్లగడ్డలోని ఏపీ గిరిజన సంక్షేమ బాలుర గురుకుల పాఠశాల. ఇప్పటికే రెండు చోట్ల గోడలు కూలిపోయాయి. మిగతావి ఈ వర్షాకాలం ఎప్పుడు పడిపోతాయోనని పిల్లలు ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని ఉన్నారు. పైగా గదులూ సరిపోను లేవు. వసతి, తరగతులు అన్నీ ఒకే దాంట్లో నిర్వహిస్తున్నారు. కనీస అవసరాలూ తీర్చలేని ఈ భవనానికి ఏటా రూ.5 లక్షలు అద్దె చెల్లిస్తుండటం గమనార్హం.

- న్యూస్‌టుడే, ఆళ్లగడ్డ



శిథిల గురుకుల భవనం



కూలిపోయిన గోడ



ఒకే గదిలో తరగతి, వసతి

EENADU Vol: 51, Issue: 343 | Printed and Published by M Nageswara Rao on behalf of Ushodaya Publications, a division of Ushodaya Enterprises Pvt Ltd. Printed and Published at Ushodaya Publications, Eenadu Press, Survey No. 239/3, 240/3B & 240/4, Gudavalli Village, Vijayawada Rural Mandal, NTR District - 521 104, Andhra Pradesh. Editor: M Nageswara Rao. Phones: 0866-2494900, 2862111. Regd. No. VJ/013/2024-26. RNI No.32238/1978. Air Surcharge Extra. Mumbai, Kolkata, Goa. Re. 1.00, Portblair Rs. 10.00. | Founder Ramoji Rao

మన ఆయుధాల వైపు ప్రపంచం చూపు: మోదీ

దిల్లీ: ఆపరేషన్ సిందూర్‌తో మన సైనికుల సత్తాను చూశామని, మన దేశంలో తయారైన ఆయుధాలపై ప్రపంచవ్యాప్తంగా ఆసక్తి కనిపిస్తోందని ప్రధాని నరేంద్రమోదీ చెప్పారు. సోమవారం పార్లమెంటు సమావేశాలకు ముందు ఆయన విలేకరులతో మాట్లాడారు.



ఆపరేషన్‌లో వంద శాతం లక్ష్యాలు సాధించామని, కచ్చితత్వంతో కేవలం 22 నిమిషాల్లోనే ఉగ్రవాద శిబిరాలను ధ్వంసం చేశామని చెప్పారు. తుపాకులు, బాంబుల ముందు మన రాజ్యాంగం బలంగా నిలబడిందని తెలిపారు. ఆపరేషన్ సిందూర్ విజయోత్సవంగా పార్లమెంటు సమావేశాలను నిర్వహించుకోవాలన్నారు. భారత వ్యోమగామి శుభాంశు శుక్లా రోదసి యాత్ర విజయవంతం కావడం స్ఫూర్తిదాయకమన్నారు.

సజావుగా నడిచేలా సహకరించండి: స్పీకర్

సభ సజావుగా జరగడానికి, నిర్మాణాత్మక చర్చలకు సహకరించాలని లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా కోరారు. పార్లమెంటును ప్రజాస్వామ్య పవిత్ర దేవాలయంగా అభివర్ణించారు. సభ పనితీరు పట్టిక సజావుగా సాగే నిర్మాణాత్మక చర్చలపై ఆధారపడి ఉంటుందని నొక్కిచెప్పారు. ఈ మేరకు 'ఎక్స్'లో సుదీర్ఘమైన పోస్ట్ పెట్టారు.

రాజకీయ ఉద్రిక్తతలు సడలించుకోవాలి

రాజ్యసభలో ఛైర్మన్ ధన్‌ఖడ్ మాట్లాడుతూ- ప్రజాస్వామ్యం వర్ధిల్లాలంటే రాజకీయ వైరం, ఉద్రిక్తతలు నిరంతరం ఉండటం తగదని చెప్పారు. బహిరంగంగా ఒకరిపై ఒకరు వ్యక్తిగత విమర్శలు చేసుకోవద్దని పార్టీలను కోరారు. ఘర్షణకు అతీతమైన చర్చలు జరపాలని, దేశ పురోగతికి నిర్మాణాత్మక రాజకీయాలు చేయాలని పిలుపునిచ్చారు. ఒకరినొకరు గౌరవించుకుంటూ సుహృద్భావంతో మెలగాలని, తగని భాషను వాడవద్దని కోరారు. మనలో మనం కొట్లాడుకుంటే అది శత్రువును బలపరుస్తుందని చెప్పారు.

'వాటర్ బాంబు'తో భారత్‌కు నష్టమెంత?

- బ్రహ్మపుత్ర నదిపై చైనా భారీ ప్రాజెక్టుతో ఆందోళన
- ఒక్కసారిగా నీరు వదిలితే కష్టమే..
- భారత్‌లో ప్రవాహానికి ఇబ్బంది లేదన్న అస్సాం సీఎం



ఈటీవీ భారత్: భారత సరిహద్దుకు సమీపంలో టిబెట్‌లోని బ్రహ్మపుత్ర నదిపై చైనా ప్రపంచంలోనే అత్యంత భారీ జల విద్యుత్తు ప్రాజెక్టు నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. ప్రతి విషయానికి భారత్‌తో కయ్యానికి కాలుదువ్వే డ్రాగన్ సరిహద్దులో చేపడుతున్న ఈ అతి పెద్ద నిర్మాణం దేశానికి సవాల్‌గా మారబోతోందా.. డ్రాగన్ ఈ ప్రాజెక్టును వ్యూహాత్మకంగా నిర్మిస్తోందా.. ఈ ప్రాజెక్టుతో భారత్‌కు భారీ నష్టం జరుగుతుందా.. ఈ ప్రాజెక్టుకు సంబంధించిన దృశ్యాలను చైనా తొలిసారిగా బహిర్గతం చేసిన వేళ దీనిపై ఇలా అనేక ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. బ్రహ్మపుత్ర నదిపై అత్యంత భారీ జల విద్యుత్తు ప్రాజెక్టు నిర్మాణానికి ఈ నెల 19న చైనా ప్రధాని లీ కియాంగ్ శంకుస్థాపన చేశారు. దాదాపు 14 లక్షల కోట్ల రూపాయలతో నిర్మిస్తున్న ఈ ప్రాజెక్టుపై మన దేశంలో ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. దీనివల్ల మనకు నీటిపరంగా నష్టం జరిగే అవకాశం ఉందని, ఇరు దేశాల మధ్య బలహీన ద్వైపాక్షిక నీటి పంపిణీ వ్యవస్థ ఉండటాన్ని అభిప్రాయం వ్యక్తమవుతోంది.


త్రీగోర్జెస్ డ్యాం కంటే 3 రెట్లు పెద్దది

టిబెట్‌లోని నైంగ్చీ నగరంలో భారీ స్థాయిలో విద్యుదుత్పత్తి లక్ష్యంగా ఈ ప్రాజెక్టును చైనా చేపడుతోంది. దీని ద్వారా ఏటా 300 బిలియన్ కిలో వాట్ల విద్యుత్తు ఉత్పత్తి చేయనుంది. ఇది గతంలో చైనా నిర్మించిన ప్రపంచంలోనే అతి పెద్దదైన త్రీగోర్జెస్ డ్యాం కంటే 3 రెట్లు పెద్దది.

ఆది నుంచే భారత్ ఆందోళన

ఈ ప్రాజెక్టుపై ఆది నుంచే భారత్ ఆందోళన వ్యక్తం చేస్తోంది. హిమాలయాల్లో టిబెట్ నుంచి అరుణాచల్ ప్రదేశ్‌కు నది గమనంలో వంపు తిరిగే చోట ఈ డ్యాంను నిర్మిస్తున్నారు. భారీ డ్యాం నిర్మాణంవల్ల ఇక్కడి పర్యావరణానికి తీరని నష్టం కలగవచ్చనే విమర్శలున్నాయి. ప్రాజెక్టు కారణంగా అరుణాచల్‌తోపాటు అస్సాం రాష్ట్రాలపై ప్రతికూల ప్రభావం పడుతుందనే ఆందోళనలను భారత్ వ్యక్తం చేస్తోంది. ఒకవేళ రెండు దేశాల మధ్య సంఘర్షణ తలెత్తితే చైనా ఈ డ్యాం నుంచి ఒక్కసారిగా భారీ పరిమాణంలో నీటిని విడుదల చేస్తే భారత్‌లోని భూభాగాలు ముంపునకు గురయ్యే ప్రమాదం ఉంది.

ఇప్పటికిప్పుడు ఎలాంటి ఇబ్బంది లేదు



బ్రహ్మపుత్ర నదిపై చైనా నిర్మిస్తున్న ప్రాజెక్టుతో ఇప్పటికిప్పుడు ఎలాంటి ఇబ్బంది లేదని అస్సాం ముఖ్యమంత్రి హిమంత బిశ్వ శర్మ తెలిపారు. 'బ్రహ్మపుత్ర నది భారత్‌లో ప్రవహించే కొద్దీ విస్తరిస్తుందేగానీ కుంచించుకుపోదు. ఈ నదిలోని మొత్తం ప్రవాహంలో చైనా నుంచి కేవలం 30-35శాతం జలాలే వస్తాయి. మిగిలిన 65-70శాతం నీరు భారత్ నుంచే లభిస్తుంది. వీటిలో చాలాశాతం మంచు కరగడంతోపాటు.. టిబెట్‌లోని పరిమిత వర్షాలవల్ల లభిస్తాయి. అరుణాచల్ ప్రదేశ్, అస్సాం, నాగాలాండ్, మేఘాలయాల్లో రుతుపవనాలవల్ల కురిసే వర్షాలవల్లే ఈ నీరు వస్తుంది' అని వెల్లడించారు.

అందుకే దీన్ని వాటర్ బాంబ్‌గా అభివర్ణిస్తున్నారు. మరోవైపు ఎగువ ప్రాంతాల్లో నిర్మించే ప్రాజెక్టులవల్ల దిగువన ఉన్న ప్రాంతాలకు హాని కలగకుండా చూసుకోవాలని చైనాకు ఇప్పటికే భారత్ సూచించింది. ఇటీవలే చైనాలో పర్యటించిన విదేశీ వ్యవహారాల శాఖ మంత్రి జైశంకర్.. ఆ దేశ విదేశాంగ మంత్రి వాంగ్ యీతో ఈ అంశంపై చర్చించారు. ఇరు దేశాల సరిహద్దు నదుల జలాల డేటాను పంచుకోవడంతోపాటు పరస్పరం సహకరించుకోవాలని వారు నిర్ణయించారు. ఈ ప్రాజెక్టు కారణంగా భారత్, బంగ్లాదేశ్‌లకు ఎలాంటి ప్రతికూల ప్రభావం ఉండబోదని చైనా చెబుతోంది. భారత్‌లోనూ బ్రహ్మపుత్ర నదీ ప్రవాహంపై ఎలాంటి ప్రభావం చూపబోదని పేర్కొంది. బ్రహ్మపుత్ర నదిలో మనకు కావాల్సిన నీరు అందుబాటులో ఉందని, చైనా ఉద్దేశపూర్వకంగా నీటిని విడుదల చేస్తేనే మనకు ప్రమాదమని నిపుణుడు ఉత్తమ్ కుమార్ సిన్హా అభిప్రాయపడ్డారు.

వీరివీరి గుమ్మడి పండు..వీరి పేరేమి?



పార్లమెంటు సమావేశాలు ప్రారంభమైన సోమవారం డీఎంకే ఎంపీ ఎ.రాజా కళ్లను సరదాగా మూసిన భాజపా ఎంపీ నిశికాంత్ దూబే

బంగ్లాదేశీ అక్రమ వలసదారుల చెరలో 10 లక్షల ఎకరాలు: హిమంత

గోరఖ్‌పుర్: బంగ్లాదేశ్ నుంచి అక్రమంగా వలస వచ్చినవారు, భారత పౌరసత్వంపై అనుమానం ఉన్నవారి చెరలో అస్సాంలో 10 లక్షల ఎకరాల భూమి ఉందని ముఖ్యమంత్రి హిమంత బిశ్వ శర్మ పేర్కొన్నారు. తాను అధికారంలోకి వచ్చాక గౌహతిలో అక్రమ వలసదారుల భూమి ఖాళీ చేయించేందుకు ప్రయత్నించగా.. అంతర్జాతీయంగా ఒత్తిళ్లు వచ్చాయని తెలిపారు. కానీ ప్రజలు అడ్డుకోలేదని వెల్లడించారు. గోరఖ్‌పుర్‌లో సోమవారం జరిగిన కార్యక్రమంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు.

ఒడిశాలో బాలికపై దాడి సిగ్గుచేటు: సుప్రీంకోర్టు



దిల్లీ: ఒడిశాలో 15 ఏళ్ల విద్యార్థినిపై జరిగిన దాడి సిగ్గుచేటు, దురదృష్టకరమని సుప్రీంకోర్టు సోమవారం అభివర్ణించింది. గ్రామీణ ప్రాంతాల్లో మహిళలకు రక్షణ కల్పించాల్సిన అవసరాన్ని కోర్టు నొక్కి చెప్పింది. రెండు రోజుల క్రితం బాలికకు నిప్పంటించారు. మహారాష్ట్ర, తమిళనాడుల్లో కూడా ఇలాంటి ఘటనలే జరిగాయని.. పిటిషన్ దాఖలు చేసిన 'సుప్రీంకోర్టు మహిళా న్యాయవాదుల సంఘం' తరఫున సీనియర్ న్యాయవాది మహాలక్ష్మి పావని అన్నారు. "ఇలా ఇంకెంతకాలం సాగాలి? మహిళల రక్షణకు ఈ కోర్టు ఆదేశాలు జారీ చేయాలి" అని కోరారు. దీనిపై జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జాయ్‌మాల్యా బాగ్చీల ధర్మాసనం స్పందించింది. "బడికి వెళ్లే విద్యార్థినులు, గృహిణులు, గ్రామీణ ప్రాంతాల బాలికలు అత్యంత బలహీనులు, గళం విప్పలేని నిస్సహాయులు. వారికి సాధికారత కల్పించడానికి ఏం చర్యలు తీసుకోవాలో మీ సూచనలు తెలపండి. దేశంలోని పరిస్థితిని మేము గమనిస్తున్నాం. పిటిషనర్లు, ప్రతివాదులు అందరి సూచనల్ని పరిగణనలోకి తీసుకుంటాం. మేమిచ్చే ఆదేశాలు ప్రభావవంతంగా ఉండాలి" అని ధర్మాసనం వ్యాఖ్యానించింది. తాలూకా స్థాయిలో మహిళల సాధికారత కోసం కొన్ని స్వల్పకాలిక, మరికొన్ని దీర్ఘకాలిక ఆదేశాలు ఇవ్వాల్సిన అవసరం ఉంది అని ధర్మాసనం పేర్కొంది. తాలూకా స్థాయిలో పారా లీగల్ వాలంటీర్లుగా మహిళలకు శిక్షణ ఇవ్వవచ్చని అభిప్రాయపడింది. ఈ అంశంపై కేంద్రం ప్రమాణపత్రం సమర్పించలేదని పేర్కొంటూ కోర్టు తదుపరి విచారణను వచ్చే వారానికి వాయిదా వేసింది.

దిల్లీలో రూ.10కే భోజనం



ఈటీవీ భారత్: ప్రస్తుత కాలంలో ఏదైనా హోటల్, రెస్టారెంట్లో కడుపు నిండా భోజనం చేయాలంటే జేబులో కనీసం రూ.100-150 అయినా ఉండాల్సిందే. ఇక దేశ రాజధాని దిల్లీ విషయానికొస్తే సామాన్యుడి జేబుకు చిల్లుపడటం ఖాయం! అయితే అక్కడ రూ.10కే కడుపునిండా భోజనం పెడుతున్నారో వ్యక్తి. దీంతో రోజువారీ కూలీలు, డెలివరీ బాయ్స్, రిక్షా కార్మికులు పది రూపాయలకే సంతృప్తిగా భోజనం చేస్తున్నారు. పశ్చిమ దిల్లీలోని మాయాపురిలో ప్రతిరోజు మధ్యాహ్నం 'ఫుడ్ విత్ డిగ్నిటీ' పేరుతో రూ.10కే కడుపునిండా భోజనం అందించే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు చార్టర్డ్ అకౌంటెంట్(సీఏ) సంజయ్ దోడ్రాజ్కా(70). అక్కడ నిత్యం దాదాపు 250 మంది వరకు భోజనం చేస్తారు. అన్నం, రాజ్మా, కఢి, లోబియా, చోలే, సోయా, దాల్ వంటి పౌష్టికాహార వంటకాలతో భోజనం వడ్డిస్తారు. పేదల కోసం గత ఆరేళ్లుగా సంజయ్ ఈ స్టాల్‌ను నిర్వహిస్తున్నారు. కరోనా సమయంలో కొన్ని రోజులు ఆగినా.. మళ్లీ ఎలాంటి ఆటంకం లేకుండా కొనసాగుతోంది. 2014లో విమాన ప్రమాదంలో సంజయ్ తన మిత్రుడిని కోల్పోయారు. ఆ తర్వాత స్నేహితులతో కలిసి మిత్రుడి జ్ఞాపకార్థం 'హమారీ ఉడాన్' అనే స్వచ్ఛంద సంస్థను మొదలుపెట్టారు. ఇందులో భాగంగానే 'ఫుడ్ విత్ డిగ్నిటీ'ని ఏర్పాటు చేసినట్లు సంజయ్ పేర్కొన్నారు.

మద్యం 'స్టఫ్' విషయంలో గొడవ

- బార్ ఉద్యోగిని పొడిచి చంపిన వ్యక్తి!

ఈటీవీ భారత్: బార్‌లో జరిగిన ఓ చిన్న గొడవ హత్యకు దారితీసింది. ఆహార పదార్థం(స్టఫ్) విషయంలో వాగ్వాదానికి దిగిన ఓ వ్యక్తి బార్ ఉద్యోగిని ఏకంగా కత్తితో పొడిచి చంపాడు. కేరళలో ఆదివారం జరిగిన ఈ ఘటన స్థానికంగా కలకలం రేపింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. త్రిశ్శూర్ జిల్లా నెల్లువాయికి చెందిన హేమచంద్రన్(62) బార్‌లో పని చేస్తున్నాడు. అంబల్లూర్‌లోని అలక్కపనగర్‌కు చెందిన సిజో అనే వ్యక్తి మద్యం సేవించడానికి బార్‌కు వెళ్లాడు. అయితే టూనా ఫిష్ పికిల్ కోసం బార్ సిబ్బందితో గొడవ పడ్డాడు. ఈ క్రమంలో హేమచంద్రన్‌కు, సిజోకు మధ్య తీవ్ర వాగ్వాదం జరిగింది. దీంతో హేమచంద్రన్.. సిజోను బార్ నుంచి బయటకు తోసేశాడు. ఈ నేపథ్యంలో పగ పెంచుకున్న సిజో బార్ మూసివేసే వరకూ అక్కడే వేచి ఉన్నాడు. ఆదివారం రాత్రి 11:30 గంటల సమయంలో హేమచంద్రన్ టీ తాగడానికి వెళ్లి వస్తుండగా అతడిపై కత్తితో దాడి చేసి సిజో పారిపోయాడు. తోటి సిబ్బంది ఆసుపత్రికి తరలించగా.. అప్పటికే హేమచంద్రన్ మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు.



నిందితుడు సిజో, మృతుడు హేమచంద్రన్

వందలకొద్దీ విమానాలకు అంతరాయం

- అలస్కా ఎయిర్‌లైన్స్‌లో సాంకేతిక లోపంతో తాత్కాలికంగా సమస్య

వాషింగ్టన్: అమెరికాలోని అలాస్కా విమానయాన సంస్థలో సాంకేతిక సమస్య తలెత్తడంతో వందల విమానాలు కొద్దిసేపు నిలిచిపోయాయి. ఆదివారం రాత్రి 8 గంటలకు తొలుత తాత్కాలిక సాంకేతిక అంతరాయం ఎదురైంది. దీంతో అలాస్కా, హొరైజన్ ఎయిర్‌లైన్స్‌లకు చెందిన వందల విమానాలను దాదాపు మూడు గంటల పాటు నిలిపివేశామని ఆ సంస్థ సామాజిక మాధ్యమంలో సోమవారం పోస్ట్ చేసింది. ఈ అంతరాయానికి సదరు ప్రయాణికులకు క్షమాపణలు చెప్పింది. ఎటువంటి అంతరాయం లేకుండా విమాన సేవలు తిరిగి ప్రారంభమయ్యాయని తెలిపింది. ఈ ఘటనపై అమెరికా ఫెడరల్ ఏవియేషన్ అడ్మినిస్ట్రేషన్ తక్షణమే స్పందించలేదు.

స్థిరాస్తి వ్యాపారానికి మద్యం నిధులు

- బఘేల్ తనయుడు రూ.16 కోట్లు వినియోగించారన్న ఈడీ

దిల్లీ: ఛత్తీస్‌గఢ్ మాజీ ముఖ్యమంత్రి భూపేశ్ బఘేల్ తనయుడు చైతన్య బఘేల్ మద్యం కుంభకోణంలో పొందిన రూ.1,000 కోట్లలో రూ.16.7 కోట్లు తన స్థిరాస్తి ప్రాజెక్టు అభివృద్ధికి వినియోగించారని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) సోమవారం ఆరోపించింది. పారిశ్రామికవేత్త అయిన చైతన్య బఘేల్‌ను ఈ నెల 18న ఈడీ అరెస్టు చేసి రాయ్‌పుర్ కోర్టు ఆదేశాలతో అదే రోజు ఐదు రోజుల కస్టడీలోకి తీసుకున్న విషయం తెలిసిందే. చైతన్య స్థానిక పారిశ్రామికవేత్త త్రిలోక్ ధిల్లాన్‌తో కలిసి కుట్రకు పాల్పడ్డాడని ఈడీ పేర్కొంది. అతడి కంపెనీలను ఉపయోగించుకుని రూ.5 కోట్లు పొందారని తెలిపింది. మరోవైపు.. మాజీ సీఎం భూపేశ్ బఘేల్ మాట్లాడుతూ.. అక్రమంగా చెట్ల నరికివేత అంశంపై అసెంబ్లీలో తాము చర్చకు పట్టుబడతామనే ఉద్దేశంతో దాన్ని పక్కదారి పట్టించేందుకు ఈడీ తన కుమారుణ్ని అరెస్టు చేసిందని ఆరోపించారు.

భర్తను చంపి ఇంట్లోనే పాతిపెట్టిన భార్య!

పాల్ఘడ్: మహారాష్ట్రలోని పాల్ఘడ్ జిల్లాలో దారుణ ఘటన చోటుచేసుకుంది. వివాహేతర సంబంధానికి అడ్డొస్తున్నాడన్న కారణంతో ఓ మహిళ తన ప్రియుడితో కలిసి భర్తను హతమార్చింది. అంతేకాకుండా అతడి మృతదేహాన్ని ఇంట్లోనే పాతిపెట్టింది. పోలీసులు వెల్లడించిన వివరాల ప్రకారం.. తూర్పు నలసపోరా ప్రాంతం గడ్డపాడాలో విజయ్ చౌహాన్(34) తన భార్య చమన్ దేవి (28)తో కలిసి నివసిస్తున్నాడు. గత 15 రోజుల నుంచి విజయ్ కనిపించకపోవడంతో.. అతడి సోదరుడికి అనుమానం వచ్చి.. ఇంటికి వెళ్లి వాకబు చేశాడు. అక్కడి ఫ్లోర్ టైల్స్ దెబ్బతినడం గమనించి.. వాటిని తొలగించగా.. తీవ్ర దుర్వాసన వచ్చింది. వెంటనే పోలీసులకు సమాచారం అందించాడు. పోలీసుల సమక్షంలో తవ్వి చూడగా.. విజయ్ చవాన్ మృతదేహం లభ్యమైంది. కోమల చవాన్, పొరుగింటి మోనూశర్మ(20) రెండు రోజులుగా కనిపించకపోవడంతో వారే ఈ హత్య చేసి ఉంటారని పోలీసులు ప్రాథమికంగా నిర్ధారించారు. వారిద్దరి మధ్య గత కొంతకాలంగా ప్రేమ వ్యవహారం కొనసాగుతున్నట్లు స్థానికులు చెబుతున్నారు. నిందితుల కోసం పోలీసులు గాలిస్తున్నారు.

ప్రతి పోలింగ్ కేంద్రంలోనూ 1,200 కంటే తక్కువ ఓటర్లే

- దేశంలోనే ఈ తరహా తొలి రాష్ట్రంగా బిహార్

దిల్లీ: దేశంలో ప్రతి పోలింగ్ కేంద్రం పరిధిలోనూ 1,200 మంది కంటే తక్కువ ఓటర్లను కలిగి ఉన్న తొలి రాష్ట్రంగా బిహార్ అవతరించిందని ఎన్నికల సంఘం (ఈసీ) సోమవారం వెల్లడించింది. ఓటింగ్ రోజున పోలింగ్ స్టేషన్ల వద్ద ప్రజలు ఎక్కువ సమయం బారులు తీరకుండా చూసేందుకు ఈసీ కొంతకాలంగా చర్యలు తీసుకుంటోంది. ఇందులో భాగంగా బిహార్‌లోని పోలింగ్ కేంద్రాల పరిధిలో ఓటర్ల సంఖ్యను గరిష్ఠంగా 1,200కు తగ్గించేందుకు కసరత్తులు చేపట్టినట్లు తెలిపింది. రాష్ట్రంలో కొత్తగా 12,817 కొత్త పోలింగ్ కేంద్రాలను ఏర్పాటుచేసినట్లు వెల్లడించింది. దీంతో ప్రస్తుతం అన్ని పోలింగ్ స్టేషన్ల పరిధిలో ఓటర్ల సంఖ్య 1,200 కంటే దిగువకు చేరుకున్నట్లు తెలియజేసింది. రాష్ట్రంలో మొత్తం ఓటింగ్ కేంద్రాల సంఖ్య 90,712కు పెరిగినట్లు చెప్పింది. ఈ తరహా కసరత్తును అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో చేపట్టనున్నట్లు ఈసీ తెలిపింది. మరోవైపు- బిహార్‌లోని అన్ని ప్రధాన రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఈసీ అధికారులు తాజాగా భేటీ అయ్యారు. తమ పరిశీలన సమయంలో రాష్ట్రంలో 43.93 లక్షల మంది ఓటర్లు వారివారి చిరునామాల్లో కనిపించలేదని తెలియజేశారు. ఆ జాబితాను పార్టీల ప్రతినిధులకు అందజేశారు. బిహార్ ముసాయిదా ఓటరు లిస్టును వచ్చే నెల 1న ఈసీ జారీ చేయనుంది.

98.5% 'అధిక పింఛను' దరఖాస్తులను పరిష్కరించాం

- లోక్‌సభలో కేంద్రం వెల్లడి

దిల్లీ: అధిక పింఛను కోసం ఉద్యోగుల భవిష్య నిధి సంస్థ (ఈపీఎఫ్‌వో)కు మొత్తం 15,24,150 దరఖాస్తులు వచ్చాయని కేంద్ర ప్రభుత్వం తెలిపింది. ఈ నెల 16 నాటికి వాటిలో 98.5% దరఖాస్తులను ప్రాసెస్ చేసి, పరిష్కరించినట్లు వెల్లడించింది. అందులో 4,00,573 మందికి అధిక పింఛనుకు అర్హత ఉందని గుర్తించి డిమాండ్ లెటర్లు జారీ చేశామని పేర్కొంది. 11,01,582 దరఖాస్తులను తిరస్కరించినట్లు తెలియజేసింది. మరో 21,995 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయని వెల్లడించింది. కేంద్ర కార్మిక-ఉపాధి శాఖ సహాయ మంత్రి శోభా కరంద్లాజె లోక్‌సభకు సోమవారం ఈ మేరకు రాతపూర్వకంగా వివరాలు తెలియజేశారు.

అతిగా ప్రాసెస్ చేసిన ఆహారాలతో స్థూలకాయం

దిల్లీ: బిస్కెట్లు, తీపి పానీయాల వంటి అతిగా ప్రాసెస్ చేసిన ఆహారాలను భుజిస్తే స్థూలకాయం, టైప్ 2 మధుమేహం, హృద్రోగాలు వచ్చే ప్రమాదం అధికంగా ఉందని ఓ అధ్యయనంలో తేలింది. దక్షిణాసియా దేశాల్లో ఇలాంటి ఆహారం తీసుకుంటున్న వారిపై కేంబ్రిడ్జ్ విశ్వవిద్యాలయం, చెన్నైలోని మద్రాస్ డయాబెటిస్ రీసెర్చ్ ఫౌండేషన్‌తో పాటు శ్రీలంక, పాకిస్థాన్, బంగ్లాదేశ్‌లలోని పరిశోధనా సంస్థలు అధ్యయనం జరిపాయి. అందులో 60,700 మంది పాల్గొన్నారు. తమ అధ్యయనానికి ముందు రోజు ఉత్తర భారతం, బంగ్లాదేశ్, శ్రీలంకలలోని అధ్యయన భాగస్వాముల్లో 75 శాతంమంది అతిగా ప్రాసెస్ చేసిన ఆహారం తీసుకున్నారని పరిశోధకులు తెలిపారు. దక్షిణ భారతం, పాకిస్థాన్‌లలో 41 శాతమే అలాంటి ఆహారం భుజించారు.


ఈడీ ముందు హాజరుకాని మెటా, గూగుల్ ప్రతినిధులు

దిల్లీ: ఆన్‌లైన్ బెట్టింగ్, గ్యాంబ్లింగ్ యాప్‌లతో సంబంధమున్న నగదు అక్రమ లావాదేవీల వ్యవహారానికి సంబంధించి గూగుల్, మెటా సంస్థల ప్రతినిధులు సోమవారం ఈడీ విచారణకు హాజరు కాలేదు. ముఖ్యమైన డాక్యుమెంట్లను సేకరించడానికి కొంత సమయం కావాలని వారు విజ్ఞప్తి చేయడంతో ఈ నెల 28న రావాలని వారికి అధికారులు సూచించారు.

మాల్దీవుల స్వాతంత్ర్య వేడుకలకు మోదీ

ఇంటర్నెట్‌డెస్క్: మాల్దీవుల స్వాతంత్ర్య దినోత్సవాలకు ప్రధాని నరేంద్ర మోదీ ముఖ్య అతిథిగా హాజరుకాబోతున్నట్లు విదేశీ వ్యవహారాలశాఖ ప్రకటించింది. ఈనెల 25, 26 తేదీల్లో అక్కడ నిర్వహించబోయే ప్రత్యేక కార్యక్రమాల్లో మోదీ పాల్గొననున్నారు. మాల్దీవుల అధ్యక్షుడిగా మహ్మద్ ముయిజ్జు ఎన్నికైన తర్వాత మోదీ అక్కడ పర్యటించడం ఇదే తొలిసారి.

హనీమూన్ నుంచి జైలుకు.. ఏకాకిగా మారిన సోనమ్



ఇంటర్నెట్ డెస్క్: సంచలనం సృష్టించిన మేఘాలయ హనీమూన్ హత్య కేసులో నిందితురాలు సోనమ్ రఘువంశీ ప్రస్తుతం షిల్లాంగ్ జైలులో ఉంది. నెల రోజులు దాటినా ఆమెను చూసేందుకు కుటుంబసభ్యులు ఎవరూ రాలేదట. ఇక చేసిన నేరానికి ఆమె ఏమాత్రం పశ్చాత్తాపపడట్లేదని జైలు వర్గాల సమాచారం. జైలులో వార్డెన్ కార్యాలయానికి సమీపంలో ఉన్న గదిలో సోనమ్‌ను ఉంచారు. అక్కడ ఆమెతో పాటు మరో ఇద్దరు మహిళా ఖైదీలు కూడా ఉన్నారు. జైల్లో సోనమ్‌కు ఇంతవరకు ఏ పనీ అప్పగించలేదని అధికారవర్గాలు తెలిపాయి. ఆమెను నిరంతరం సీసీటీవీ కెమెరాల పర్యవేక్షణలో ఉంచినట్లు వెల్లడించాయి. జైలు నియమావళి ప్రకారం నడుచుకుంటున్న సోనమ్.. తన వ్యక్తిగత జీవితం, చేసిన నేరం గురించి ఆమె తోటి ఖైదీలకు ఎలాంటి వివరాలు చెప్పలేదని తెలిసింది. ఇక, ఆమెకు ములాఖత్ అవకాశం ఉన్నప్పటికీ.. ఇప్పటివరకు కుటుంబసభ్యులెవరూ నిందితురాలిని చూడటానికి రాలేదని జైలు వర్గాలు పేర్కొన్నాయి. కనీసం ఫోన్‌లో కూడా ఆమెతో మాట్లాడలేదని తెలిపాయి. మధ్యప్రదేశ్‌లోని ఇండోర్‌కు చెందిన రాజా రఘువంశీ ట్రాన్స్‌పోర్టు వ్యాపారి. ఈ ఏడాది మే 11న అతడికి సోనమ్‌తో వివాహం జరిగింది. అదే నెల 20న హనీమూన్ కోసం ఈ నవ దంపతులు మేఘాలయ వెళ్లారు. అక్కడ ప్రియుడితో కలిసి తన భర్తను సోనమ్ హత్య చేసినట్లు విచారణలో బయటపడింది. దీంతో పోలీసులు ఆమెను అరెస్టు చేశారు.

రాహుల్ గాంధీకి వ్యతిరేకంగా వారణాసి కోర్టులో పిటిషన్

వారణాసి: గత ఏడాది అమెరికా పర్యటన సమయంలో సిక్కులపై అభ్యంతరకరమైన వ్యాఖ్యలు చేశారని ఆరోపిస్తూ కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీపై ఉత్తర్‌ప్రదేశ్‌లోని వారణాసి కోర్టులో పిటిషన్ దాఖలైంది. న్యాయవాది వివేక్ శంకర్ తివారీ వేసిన ఈ పిటిషన్‌ను విచారణకు స్వీకరిస్తున్నట్లు అదనపు జిల్లా, సెషన్స్ కోర్టు జడ్జి యజువేంద్ర విక్రమ్ సింగ్ సోమవారం తెలిపారు. గత ఏడాది నవంబరు 28న ఇదే పిటిషన్‌ను అడిషనల్ చీఫ్ జ్యుడిషియల్ మేజిస్ట్రేట్ కోర్టు తోసిపుచ్చింది. దీంతో రివిజన్ పిటిషన్ దాఖలు చేసినట్లు న్యాయవాది వివేక్ శంకర్ తెలిపారు.



అమర్‌నాథ్ యాత్రలో భాగంగా జమ్మూలోని రామమందిర్ బేస్‌క్యాంపు వద్ద బస చేసి కోతికి తన నోటి ద్వారా ఆహారాన్ని అందిస్తున్న ఓ సాధువు

ఐదుగురు రాజ్యసభ సభ్యుల పదవీ ప్రమాణం

దిల్లీ: పార్లమెంటు వర్షాకాల సమావేశాలు ప్రారంభ రోజైన సోమవారం ముగ్గురు నామినేటెడ్ సభ్యులు సహా ఐదుగురు రాజ్యసభ సభ్యులు పదవీ స్వీకార ప్రమాణం చేశారు. బీరేంద్ర ప్రసాద్ బైష్య (ఏజేపి), కనాద్ పుర్కాయస్థ (భాజపా)తో పాటు రాష్ట్రపతి నామినేట్ చేసిన మీనాక్షి జైన్, సి సదానందన్ మాస్టర్, హర్ష వర్ధన్ శ్రింగ్లాలు ప్రమాణం చేశారు. కాంగ్రెస్ అధ్యక్షుడు, ప్రతిపక్ష నాయకుడు మల్లికార్జున ఖర్గేతో పాటు లక్ష్మీ కాంత్ బాజ్‌పాయ్, రాజీవ్ శుక్లా, సంగీత యాదవ్‌కు రాజ్యసభ పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపింది,

గర్భిణీతో గుంజీలు

- యూపీలో అమానుషం..

ఇంటర్నెట్ డెస్క్: తమ దుకాణంలో ఉద్యోగం మానేసిన ఓ వ్యక్తిని చితకబాదిన నిందితులు.. అంతటితో ఆగకుండా గర్భిణీ అయిన అతడి భార్యతో గుంజీలు తీయించారు. ఈ అమానుష ఘటన ఉత్తర్‌ప్రదేశ్‌లో వెలుగుచూసింది. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. కౌవాదిల్ గ్రామానికి చెందిన శివమ్ శర్మ అనే వ్యక్తి గోలా ప్రాంతంలో ఓ దుకాణంలో పనిచేసేవాడు. తక్కువ వేతనం కావడంతో ఆర్థిక ఇబ్బందుల కారణంగా ఇటీవల అక్కడ ఉద్యోగం మానేశాడు. దీంతో దుకాణ యజమాని రతన్ భరద్వాజ్‌తో పాటు అతడి అనుచరుడు ఖుష్ శర్మ.. శివమ్ ఇంట్లోకి చొరబడి కర్రలు, ఇనుప రాడ్లతో అతడిపై దాడికి పాల్పడ్డారు. అడ్డుకునేందుకు యత్నించిన శివమ్ భార్యను గర్భిణి అనీ చూడకుండా తోసేశారు. దీంతో ఆమెకు గాయాలయ్యాయి. అనంతరం నిందితులు ఆమెతో గుంజీలు తీయించినట్లు కుటుంబ సభ్యులు ఆరోపించారు. దీంతో ఆమె పరిస్థితి మరింత దిగజారి.. స్పృహ కోల్పోయినట్లు తెలిపారు. నిందితులపై కేసు చేసినట్లు పోలీసులు తెలిపారు.

రష్యా మహిళ స్వదేశానికి వెళ్లి ఉండొచ్చు: కేంద్రం

- ఇది కోర్టు ధిక్కారమవుతుందని సుప్రీంకోర్టు స్పష్టీకరణ

దిల్లీ: బిడ్డ సంరక్షణపై భారతీయ భర్తతో పోరాడుతున్న రష్యా మహిళ స్వదేశానికి వెళ్లి ఉండవచ్చని సుప్రీం కోర్టుకు కేంద్ర ప్రభుత్వం వెల్లడించింది. ఆమె సరిహద్దులను దాటి నేపాల్‌లోకి ప్రవేశించి.. అక్కడి నుంచి షార్జా ద్వారా రష్యాకు వెళ్లిందని భావిస్తున్నామని సోమవారం తెలిపింది. ఈ కేసుపై విచారణ జరుపుతున్న జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జాయ్‌మాల్యా బాగ్చీలతో కూడిన ధర్మాసనం.. దీనిని తీవ్రంగా పరిగణించింది. ఈ పరిస్థితి ఎంతమాత్రం ఆమోద యోగ్యం కాదని, కోర్టు ధిక్కారమవుతుందని స్పష్టం చేసింది. 'ఆమె పాస్‌పోర్టు సీజ్ అయింది. డూప్లికేట్ పాస్‌పోర్టును ఆమె ఎలా సంపాదించారు. రష్యా ఎంబసీలోని కొందరు అధికారుల సహాయం లేకుండా ఇది అసాధ్యం. ఇది పూర్తిగా కోర్టు ధిక్కారమే. మేం కఠిన ఉత్తర్వులు జారీ చేస్తాం. రెడ్ కార్నర్ నోటీసులు జారీ చేయాలని ఆదేశిస్తాం. అప్పుడు అధికారులు వాటి ప్రకారం చర్యలు తీసుకోవాల్సి ఉంటుంది' అని ధర్మాసనం స్పష్టం చేసింది. 'ఐపీ అడ్రస్‌లు, ఈమెయిళ్లను పరిశీలించగా.. ఆమె తొలుత మైనరుతో కలిసి బిహార్ మీదుగా నేపాల్ వెళ్లారు. అక్కడి నుంచి విమానంలో షార్జా చేరుకున్నారు. అక్కడి నుంచి రష్యా వెళ్లారు' అని కేంద్రం, దిల్లీ పోలీసుల తరఫున కోర్టుకు హాజరైన అదనపు సొలిసిటర్ జనరల్ ఐశ్వర్యా భాటీ వివరించారు. రష్యాలోని భారతీయ ఎంబసీతో మన విదేశాంగశాఖ, పోలీసు అధికారులు సంప్రదింపులు జరుపుతున్నారని తెలిపారు. ఇంకా దర్యాప్తు జరుగుతోందని, మరికొన్ని వివరాలతో స్టేటస్ రిపోర్టును సమర్పిస్తామని వెల్లడించారు. దీంతో వారంలోగా సమగ్ర స్టేటస్ రిపోర్టును సమర్పించాలని దిల్లీ పోలీసులను ధర్మాసనం ఆదేశించింది.

కశ్మీర్‌లో కానిస్టేబుల్‌కు చిత్రహింసలు

- సీబీఐ దర్యాప్తునకు ఆదేశించిన సుప్రీం


దిల్లీ: జమ్మూకశ్మీర్‌లో ఓ పోలీస్ కానిస్టేబుల్‌ను కస్టడీలో ఉంచి చిత్రహింసలకు గురిచేసిన సంఘటనపై సుప్రీంకోర్టు సోమవారం తీవ్రంగా స్పందించింది. ఈ ఉదంతంపై ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని సీబీఐని ఆదేశించింది. బాధిత కానిస్టేబుల్‌కు రూ.50 లక్షల పరిహారం చెల్లించాలని జమ్మూకశ్మీర్ కేంద్ర పాలిత ప్రాంత ప్రభుత్వాన్ని కోరింది. కానిస్టేబుల్‌ను అక్రమంగా నిర్బంధించడమే కాకుండా అతణ్ని చిత్రహింసలకు గురిచేశారని, అతని మర్మాంగాన్ని తీవ్రంగా గాయపరచి దానిపై కారం చల్లడం అమానుషమని జస్టిస్ విక్రంనాథ్, జస్టిస్ సందీప్ మెహతాలతో కూడిన ధర్మాసనం పేర్కొంది. 2023 ఫిబ్రవరి 17న ఒక మాదక ద్రవ్యాల కేసు విచారణ కోసం డీఎస్పీ కార్యాలయానికి రావాలని బాధిత కానిస్టేబుల్‌కు కబురు అందింది. కానిస్టేబుల్‌ను నిర్బంధించిన సహచర పోలీసులు 2023 ఫిబ్రవరి 20 నుంచి ఫిబ్రవరి 26 వరకు అతణ్ని కస్టడీలో ఉంచి చిత్ర హింసలకు గురిచేశారు. ఈ అంశంపై దర్యాప్తు జరపడానికి ఒక ప్రత్యేక విచారణ బృందాన్ని ఏర్పాటు చేయాల్సిందిగా కోర్టు సీబీఐ డైరెక్టర్‌ను ఆదేశించింది. చిత్రహింసలకు బాధ్యులైన పోలీసు అధికారులను అరెస్టు చేయాలని, ఈ వ్యవహారంపై దర్యాప్తును 90 రోజుల్లో పూర్తి చేయాలని ధర్మాసనం పేర్కొంది. కానిస్టేబుల్‌ను చిత్రహింసలకు గురిచేసిన పోలీసులు అతనిపైనే ఆత్మహత్యాయత్నం కేసు నమోదు చేశారని గుర్తించిన సుప్రీంకోర్టు ఆ కేసును కొట్టివేసింది.

27 నుంచి ప్రతిఘటనోద్యమం: మమత

కోల్‌కతా: బెంగాలీలపై భాషాపరమైన ఉగ్రవాదానికి భాజపా పాల్పడుతోందని పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ ఆరోపించారు. భాజపా పాలనలో ఉన్న బిహార్‌లో ఓటర్ల జాబితా నుంచి బెంగాలీలను తొలగిస్తున్నారని, వారిని వేధింపులకు గురిచేస్తూ, నిర్బంధ శిబిరాలకు పంపుతున్నారని మమత పేర్కొన్నారు. అస్సాంలోనూ బెంగాల్ పౌరులకు జాతీయ పౌర రిజిస్టర్ కింద నోటీసులు ఇస్తున్నారని తెలిపారు. ఈ దాడులకు నిరసనగా ఈ నెల 27 నుంచి ప్రతిఘటనోద్యమం ప్రారంభిస్తున్నట్లు మమత ప్రకటించారు.

నిధుల కోతపై కోర్టుకు ఆక్స్‌ఫర్డ్


బోస్టన్: అమెరికాలో డొనాల్డ్ ట్రంప్ ప్రభుత్వం తనకు అందించాల్సిన నిధుల్లో 260 కోట్ల డాలర్ల మేర చట్ట విరుద్ధంగా కోత విధించడంపై దాఖలు చేసిన కేసుకు సంబంధించి హార్వర్డ్ విశ్వవిద్యాలయం సోమవారం ఫెడరల్ కోర్టు సమక్షంలో తన వాదన వినిపించింది. ట్రంప్ ప్రభుత్వం తీసుకున్న చర్య అమెరికాలో అతి పురాతనమైన, అత్యంత ధనిక విశ్వవిద్యాలయాన్ని ఇబ్బందులపాలు చేసింది. హార్వర్డ్ విశ్వవిద్యాలయం ఉదార వాదులకు, యూదు వ్యతిరేక వాదులకు నెలవుగా మారిందని ట్రంప్ ఆరోపణ. విశ్వవిద్యాలయ అంతర్గత యంత్రాంగాన్ని నియంత్రించేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తోందని హార్వర్డ్ తరఫు న్యాయవాది స్టీవెన్ లెహోట్స్కీ పేర్కొన్నారు. నిధుల కోతను ఉపసంహరించకుంటే విశ్వవిద్యాలయ పరిశోధనకు నష్టం జరుగుతుందని, ప్రయోగశాలలు మూతబడతాయని, విద్యార్థులకు వృత్తి జీవితం మృగ్యమవుతుందని ఆయన అన్నారు. ఈ కేసుపై అమెరికా డిస్ట్రిక్ట్ జడ్జిఅలిసన్ బరోస్ కోర్టులో విచారణ జరుగుతోంది.



మనల్ని, మన జీవితాలను నడిపించేది మెదడే. ఒకరకంగా మన శరీరానికి ఇదే హెడ్‌మాస్టర్! అందుకే ఇది ఏమాత్రం గాడి తప్పినా ఇబ్బందే. వైకల్యం సంభవించటానికి, హాయిగా జీవించే కాలం తగ్గటానికి కారణమవుతున్న ప్రధాన జబ్బుల్లో దీంతో ముడిపడిన నాడీ సమస్యలూ ఒకటి కావటం గమనార్హం. మంచి విషయం ఏంటంటే- వీటిని చాలావరకూ నివారించుకునే వీలుండటం. కానీ మెదడు ఆరోగ్యం మీద దృష్టి పెట్టకపోవటమే అనర్థాలకు దారితీస్తోంది. కాబట్టే వీటిపై అవగాహన కలిగుండాలని, అన్ని వయసుల వారికీ మెదడు ఆరోగ్యం తప్పనిసరని వరల్డ్ బ్రెయిన్ డే నినదిస్తోంది.

హెడ్‌మాస్టర్ భద్రం!

నిలబడతాం, నడుస్తాం, కూర్చుంటాం, తింటాం, చదువుతాం.. ఇలా మనం చేసే అన్ని పనులకూ మూలం మెదడే. దీనిలోని వేలాది కోట్ల నాడీకణాలు (న్యూరాన్స్), వీటి చివర్లలోని లక్షలాది కోట్ల అనుసంధానాల (సినాప్సెస్) గుండా ప్రసారమయ్యే సందేశాల మీదే మన జీవితం సాగుతుంది. మనకు కలిగే ప్రతి ఒక్క ఆలోచన, భావన.. గూడు కట్టుకునే జ్ఞాపకాలు అన్నింటికీ ఇవే ఆధారం. కాబట్టే మెదడుకు అంత ప్రాధాన్యం. దీన్ని ఆరోగ్యంగా ఉంచుకుంటే ఏకాగ్రత, చురుకుదనం మెరుగవుతాయి. ఆలోచన, జ్ఞాపకశక్తి ఇనుమడిస్తాయి. నేర్చుకున్న విషయాలను సమర్థంగా వాడుకోవటమూ అబ్బుతుంది. భావోద్వేగాలు, మానసిక స్థితి అదుపులో ఉంటాయి. ఫలితంగా సరైన నిర్ణయాలు తీసుకోవటం, పరిస్థితులకు అనుగుణంగా వేగంగా స్పందించటం సాధ్యమవుతుంది. పనుల్లో ఉత్పాదకతా పెరుగుతుంది. పెద్దవయసులో ఇతరుల మీద ఆధారపడకుండా హాయిగా జీవించటానికి వీలవుతుంది. అందువల్ల మెదడును దెబ్బతీసే సమస్యల గురించి తెలుసుకోవటం, ముందు నుంచే మెదడు ఆరోగ్యాన్ని కాపాడుకోవటం మనందరి కర్తవ్యం.



డా॥ జి.వి.సుబ్బయ్య చౌదరి,
సీనియర్ న్యూరాలజిస్ట్ & క్లినికల్ డైరెక్టర్,
యశోద హాస్పిటల్, హైటెక్‌సిటీ, హైదరాబాద్

ఇలా కాపాడుకోవాలి

- మానసిక ఒత్తిడిని తగ్గించుకోవాలి. ఇందుకు ధ్యానం, యోగా, ప్రాణాయామం వంటివి మేలు చేస్తాయి.
- అధిక రక్తపోటు, గ్లూకోజు, కొలెస్ట్రాల్ అదుపులో ఉంచుకోవాలి. అవసరమైతే వీటికి మందులు వేసుకోవాలి.
- క్రమం తప్పకుండా వ్యాయామం చేయటం ముఖ్యం. శారీరక శ్రమతో రక్త సరఫరా పుంజుకొని, మెదడు చురుకుగా పనిచేస్తుంది. అలాగే బ్రెయిన్ డిరైవ్డ్ న్యూరోట్రోఫిక్ ఫ్యాక్టర్ (బీడీఎన్ఎఫ్) అనే ప్రొటీన్ మోతాదులూ పెరుగుతాయి. ఇది నాడీకణాలకు 'ఎరువు'గా ఉపయోగపడటం విశేషం.
- ఆరోగ్యకరమైన ఆహారం తినాలి. పాలకూర వంటి ఆకుకూరల్లోని విటమిన్ కె, ల్యూటీన్, ఫోలేట్, బీటా కెరటిన్ వంటి పోషకాలు.. చేపలు, అక్రోట్ల వంటి గింజపప్పుల్లోని ఒమేగా 3 కొవ్వు ఆమ్లాలు మెదడుకు మేలు చేస్తాయి.
- పుస్తకాలు చదవాలి. కొత్త విషయాలు నేర్చుకోవాలి. మెదడుకు మేత పెట్టే పజిల్స్ చేయాలి. దీంతో నాడీ కణాలు చురుకుగా పనిచేస్తాయి. కొత్త అనుసంధానాలు ఏర్పడతాయి.
- రాత్రిపూట 7-9 గంటలు నిద్రపోవాలి. పడుకునే ముందు మొబైల్‌ఫోన్లు చూడొద్దు.
- నలుగురితో కలవటం, మాట్లాడటం, మనసులోని భావాలను ఇతరులతో పంచుకోవటం తప్పనిసరి.
- వినికిడి లోపంతో నలుగురితో మాట్లాడటం, కలవటం తగ్గుతుంది. ఇది కుంగుబాటుకు దారితీస్తుంది. క్రమంగా మెదడూ దెబ్బతింటుంది. కాబట్టి వినికిడి లోపముంటే చికిత్స తీసుకోవాలి. సాధనాలు వాడుకోవాలి.
- తగినన్ని ద్రవాలు తీసుకోవాలి.
- సిగరెట్ల జోలికి వెళ్లొద్దు. మద్యం అలవాటుంటే పరిమితం చేసుకోవాలి.
- తలకు గాయాలు తగలకుండా చూసుకోవాలి. మోటారు సైకిల్ నడుపుతున్నప్పుడు తలకు హెల్మెట్ ధరించాలి. కారులో సీటు బెల్టు పెట్టుకోవాలి. అలాగే వృద్ధులు కింద పడిపోకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. బాత్రూమ్‌లో చేత్తో పట్టుకునే పట్టీలు బిగించటం, మంచం వద్ద తగినంత లైటు ఉండేలా చూసుకోవాలి. తివాచీలు, మ్యాట్స్ కాళ్లకు తగలకుండా చూసుకోవాలి.
- కాలుష్యం లేని, ప్రశాంతమైన వాతావరణమూ ముఖ్యమే. ఇలాంటిచోట్ల నివసించేవారు భావోద్వేగాలను బాగా అదుపులో ఉంచుకుంటారు. జ్ఞాపకశక్తి మెరుగ్గా ఉంటుంది. మానసికంగా ఏవైనా సమస్యలు వచ్చినా బాగా ఎదుర్కొంటారు.

సమస్యలు అనేకం

మెదడు ఆరోగ్యం, సామర్థ్యం తగ్గటానికి జబ్బుల దగ్గరి నుంచి తల గాయాల వరకూ రకరకాల అంశాలు దోహదం చేయొచ్చు. కొన్ని మామూలు సమస్యలైతే.. కొన్ని తీవ్రమైనవీ కావొచ్చు.

మతిమరుపు

వయసు మీద పడుతున్నకొద్దీ ఇతర భాగాల్లో మాదిరిగానే మెదడులోనూ మార్పులు తలెత్తుతుంటాయి. దీంతో జ్ఞాపకశక్తి తగ్గొచ్చు. మునుపటిలా విషయాలను గుర్తుపెట్టుకోలేకపోవచ్చు. వాటినిని త్వరగా గుర్తుతెచ్చుకోలేకపోవచ్చు. అప్పుడప్పుడూ వస్తువులు పెట్టిన చోటు, బిల్లులు చెల్లించటం వంటివి మరచిపోవచ్చు. ఒత్తిడి, ఆందోళనకు గురికావటం.. ఏకాగ్రత చూపక పోవటం, ధ్యాస పెట్టకపోవటం వంటివి దీనికి దారితీయొచ్చు. ఇదేమంత ప్రమాదకరమైంది కాదు. వృద్ధాప్యంలో తరచూ చూసేదే. సోడియం మోతాదులు తగ్గటం, అమ్మోనియా స్థాయులు పెరగటంతోనూ మతిమరుపు తలెత్తొచ్చు.

- **ఎంసీఐ:** కొందరికి విషయగ్రహణ సామర్థ్యం కొద్దిగా లోపించటం (ఎంసీఐ) మూలంగానూ మతిమరుపు రావొచ్చు. ఇందులో ఆలోచనా శక్తీ తగ్గుతుంటుంది. ఇది అల్జీమర్స్ జబ్బుకు తొలి లక్షణం కావొచ్చు కూడా. అలాగని ఎంసీఐ ఉన్నా అల్జీమర్స్ రావాలనేమీ లేదు.
- **డిమెన్షియా:** మామూలు మతిమరుపులో మరచిపోయిన విషయం కాసేపటికి గుర్తుకొస్తుంది. కానీ డిమెన్షియాలో మరచిన సంగతే తెలియకపోవచ్చు. ఆలోచనా శక్తి, నేర్చుకోవటం వంటి గ్రహణ సామర్థ్యాలూ తగ్గుతాయి. మానసిక ధోరణి, వ్యక్తిత్వం మారిపోవచ్చు. డిమెన్షియాలో అల్జీమర్స్ జబ్బు, లెవీ బాడీ, వ్యాస్కులర్ డిమెన్షియా వంటి ఇతర రకాలూ ఉంటాయి. రోగనిరోధక వ్యవస్థ పొరపాటున మెదడు మీద దాడి చేయటంతోనూ మతిమరుపు రావొచ్చు (ఆటోఇమ్యూన్ డిమెన్షియా).

కాబట్టి అడిగిన విషయాన్నే మళ్లీ మళ్లీ అడగటం, తెలిసిన చోట్ల కూడా దారి తప్పటం.. దారులు, సమయం, వ్యక్తులు, ప్రాంతాలను గుర్తించటంలో తికమక పడటం.. తమ మీద శ్రద్ధ చూపకపోవటం (సరిగా తినకపోవటం, స్నానం చేయకపోవటం, ప్రమాదాలను పట్టించుకోకపోవటం లాంటివి) వంటి లక్షణాలు గుర్తిస్తే డాక్టర్‌ను సంప్రదించటం మంచిది.

జీవనశైలి అంశాలు

మెదడు ఆరోగ్యంలో జీవనశైలి, అలవాట్లు గణనీయమైన పాత్ర పోషిస్తాయి. పొగ తాగటం వల్ల రక్తంలో ఆక్సిజన్ మోతాదులు తగ్గుతాయి. దీంతో మెదడుకు తగినన్ని పోషకాలు అందక కుంచించుకుపోవచ్చు. మద్యం మితిమీరి తాగటమూ ప్రమాదకరమే. ఇది మెదడు దెబ్బతినటానికి, విషయగ్రహణ సామర్థ్యం తగ్గటానికి దారితీస్తుంది. శారీరక శ్రమ, వ్యాయామం లేకపోవటమూ మెదడుకు హానికరంగా పరిణమిస్తాయి.

పక్షవాతం

ఇది తీవ్ర సమస్య. మనిషిని హఠాత్తుగా కూల్చేస్తుంది. దీనికి కారణం మెదడులోని రక్తనాళాలు మూసుకుపోవటం లేదా చిట్లిపోయి రక్తస్రావం కావటం. దీని మూలంగా మెదడులో కొంత భాగం దెబ్బతింటుంది. ఒకవైపు కాలూ చేయీ బలహీనం కావటం, మాట తత్తరపోవటం, అర్థం చేసుకోలేకపోవటం, స్పర్శ తగ్గటం, సమన్వయం లోపించటం వంటివి తలెత్తుతాయి. సత్వరం చికిత్స అందకపోతే వైకల్యమూ సంభవించొచ్చు. మళ్లీ మళ్లీ పక్షవాతం వస్తుంటే డిమెన్షియాకూ దారితీయొచ్చు.

▼ కొందరికి స్వల్పంగానూ పక్షవాతం రావొచ్చు (టీఐఏ). ఇందులోనూ పక్షవాతం లక్షణాలే ఉంటాయి గానీ నిమిషాల్లో లేదా గంటల్లో తగ్గొచ్చు. అలాగని నిర్లక్ష్యం చేయొద్దు. దీని బారినపడ్డవారిలో మూడు నెలల్లో దాదాపు 10-18% మందికి పెద్ద పక్షవాతం వచ్చే అవకాశముంది.

మానసిక జబ్బులు

ఒత్తిడి, ఆందోళన, కుంగుబాటు వంటి మానసిక, ప్రవర్తన, భావోద్వేగ సమస్యలూ మెదడు మీద విపరీత ప్రభావం చూపొచ్చు. దీర్ఘకాల మానసిక ఒత్తిడితో జ్ఞాపకశక్తికి కేంద్రమైన హిప్పోక్యాంపస్ భాగం క్షీణిస్తుంది. కార్యకారణాలను గుర్తించటం, నిర్ణయాలు తీసుకోవటానికి తోడ్పడే ప్రిఫ్రాంటల్ కార్టెక్స్ పనితీరు మందగిస్తుంది. భయాన్ని ప్రేరేపించే అమిగ్దల భాగం అతిగా స్పందిస్తుంది. ఫలితంగా మతిమరుపు, ఏకాగ్రత కుదరకపోవటం వంటివి తలెత్తుతాయి.

▼ ఇప్పుడు ఒంటరితనమూ సమస్యగా మారింది. జీవిత భాగస్వామి మరణించటమో, పిల్లలు ఇంటికి దూరంగా ఉండటమో.. కారణమేదైనా ప్రస్తుతం ఎంతోమంది వృద్ధులు ఒంటరిగా ఉంటున్నారు. ఇది దిగులు, నిరాశ, కుంగుబాటుకు దారితీస్తుంది. మెదడు ఆరోగ్యాన్నీ దెబ్బతీస్తుంది. వీరికి జ్ఞాపకశక్తి బాగానే ఉంటుంది గానీ దేని మీదా శ్రద్ధ పెట్టకపోవటం, ఆసక్తి చూపకపోవటం వల్ల మతిమరుపు వంటి సమస్యలు తలెత్తుతుంటాయి.

తలకు గాయాలు

ప్రమాదాల్లోనో, ఆటలు ఆడుతున్నప్పుడో లేదా కింద పడటం వల్లనో తలకు తగిలే గాయాలూ మెదడును దెబ్బతీస్తాయి. దెబ్బలు తగలటం వల్ల మెదడు కణజాలం మీద మచ్చలు ఏర్పడొచ్చు. రసాయనాల పనితీరు మారిపోవచ్చు. దీంతో మతిమరుపు, మాట సరిగా రాకపోవటం, ప్రవర్తన మారటం వంటి ఇబ్బందులు తలెత్తొచ్చు.

ఇతర సమస్యలు

అధిక రక్తపోటు, మధుమేహం, అధిక కొలెస్ట్రాల్ వంటి సమస్యలూ మెదడుకు శాపంగా మారతాయి. అధిక రక్తపోటుతో మెదడులోని రక్తనాళాలు దెబ్బతిని పక్షవాతం ముప్పు పెరుగుతుంది. విషయగ్రహణ సామర్థ్యమూ తగ్గొచ్చు. రక్తంలో గ్లూకోజు ఎక్కువగా ఉండటం వల్ల మెదడు త్వరగా వృద్ధాప్య స్థితికి చేరుకుంటుంది. కొలెస్ట్రాల్ ఎక్కువ కావటం వల్ల రక్తనాళాల్లో పూడికలు ఏర్పడి మెదడుకు రక్త సరఫరా మందగిస్తుంది.

▼ విటమిన్ బి12 తగ్గటం, థైరాయిడ్ హార్మోన్ల లోపం, ఇన్‌ఫెక్షన్ల వంటివీ మెదడు సామర్థ్యాన్ని దెబ్బతీయొచ్చు.

శోధన

శృంగారానికి తీపి శాపం

మగవారిలో శృంగార సామర్థ్యం క్షీణించటానికి వయసు, టెస్టోస్టిరాన్ హార్మోన్ తగ్గటం మాత్రమే కాదు.. రక్తంలో గ్లూకోజు మోతాదులు పెరగటమూ కారణమవుతున్నట్టు తాజా అధ్యయనం పేర్కొంటోంది. మధుమేహంగా గుర్తించే స్థాయిలో గ్లూకోజు పెరగాల్సిన అవసరమేమీ లేదు. ఒకింత ఎక్కువగా పెరిగినా కూడా శుక్ర కణాల వేగం నెమ్మదించటానికి, అంగ స్తంభన బలహీనం కావటానికి, శృంగారాసక్తి తగ్గటానికి దారితీస్తున్నట్టు తేలింది. మగవారు తమ శృంగార, సంతాన సామర్థ్యాన్ని కాపాడుకోవటానికి కేవలం టెస్టోస్టిరాన్ హార్మోన్ మోతాదులే కాకుండా రక్తంలో గ్లూకోజును నియంత్రించుకోవటమూ ముఖ్యమేనని అధ్యయన ఫలితాలు సూచిస్తున్నాయి.

మధ్యవయసులోనే పేగు క్యాన్సర్లేల?

ఎలాంటి క్యాన్సరైనా గానీ వయసు పెరుగుతున్నకొద్దీ ముప్పు ఎక్కువవుతుంది. అరవై ఏళ్లు పైబడ్డ ప్రతి 100 మందిలో ఒకరు క్యాన్సర్ బారినపడుతున్నారని అంచనా. అయితే ఇటీవల 50 ఏళ్లలోపు వారిలోనూ పెద్దపేగు క్యాన్సర్లు ఎక్కువగా బయటపడుతుండటం ఆందోళన కలిగిస్తోంది. దీనికి కచ్చితమైన కారణమేంటన్నది తెలియదు గానీ పర్యావరణ అంశాలు, ఆహారం, జీవనశైలి దోహదం చేసే అవకాశమున్నట్టు పలు అధ్యయనాల సమీక్షలో తేలింది. ఆహార ఉత్పత్తులు, మాంసం ఎక్కువగా తినటం.. ఊబకాయం, వ్యాయామం చేయకపోవటం, మద్యం అతిగా తాగటం, తీపి పానీయాలు, సూక్ష్మ ప్లాస్టిక్ రేణువుల వంటివి పేగు బ్యాక్టీరియా మీద విపరీత ప్రభావం చూపుతున్నట్టు ఇది సూచిస్తోంది. రోగనిరోధక వ్యవస్థ వాపుప్రక్రియ అనుకూల ప్రతిస్పందనలను సృష్టించటమూ ముందుగానే క్యాన్సర్ తలెత్తటానికి దారితీస్తోందని పరిశోధకులు చెబుతున్నారు.



యోగ నిద్ర!

నిద్రలేమితో ఇబ్బంది పడుతున్నారా? అయితే యోగా సాధన చేయండి. దీంతో రాత్రిపూట సుమారు 2 గంటలు ఎక్కువగా నిద్ర పడుతున్నట్టు, అలాగే గాఢ నిద్ర 15% పెరుగుతున్నట్టు తాజాగా బయటపడింది. అలాగే నిద్ర కూడా త్వరగా పడుతున్నట్టు బయటపడింది. శ్వాసను నియంత్రిస్తూ నెమ్మదిగా, లయబద్ధంగా ఆసనాలు వేయటం వల్ల పారాసింపథెటిక్ నాడీ వ్యవస్థ సజావుగా పనిచేస్తుంది. ఇది మానసిక ప్రశాంతత కలిగించటం ద్వారా నిద్ర బాగా పట్టటానికి తోడ్పడుతుందని పరిశోధకులు పేర్కొంటున్నారు.

ప్రొటీన్.. కండకు మించి!

ప్రొటీన్ అనగానే అది కండను వృద్ధి చేస్తుందనే విషయమే గుర్తుకొస్తుంది. నిజానికి ప్రొటీన్ ప్రయోజనాల్లో ఇదొక మచ్చుతునక మాత్రమే. కండ కేవలం బలానికి, సౌందర్యానికి సంబంధించిందే కాదు. జీవక్రియ ఉత్తేజిత కణజాలంగానూ మనల్ని కాపాడుతుంది. ప్రొటీన్ ఎక్కువగా తీసుకునేవారిలో.. ముఖ్యంగా వృద్ధుల్లో మరణాల రేటు తక్కువగా ఉంటున్నట్టు గత సంవత్సరం జామా పత్రికలో ప్రచురితమైన అధ్యయనం పేర్కొంటోంది. ఎనిమిది వేలకు పైగా మందిని పదేళ్లకు పైగా పరిశీలించి మరీ ఈ విషయాన్ని గుర్తించారు.

ప్రొటీన్ మనకు కల్పించే రక్షణకు మూలం అమైనో ఆమ్లాలు. ముఖ్యంగా ల్యూసీన్ అనే అమైనో ఆమ్లం కండర ప్రొటీన్ సంశ్లేషణ ప్రక్రియకు తోడ్పడే ఎంటార్ మార్గాన్ని ప్రేరేపిస్తుంది. రోజువారీ పనుల్లో భాగంగా కండర ప్రొటీన్లు సైతం విచ్ఛిన్నమవుతుంటాయి. వీటిని శరీరం ఎప్పటికప్పుడు తొలగించుకుంటుంది. అందువల్ల ఇవి తగ్గకుండా చూసుకోవటం చాలా ముఖ్యం. మనం ప్రొటీన్‌ను తిన్నప్పుడు వాటిల్లోని అమైనో ఆమ్లాలను శరీరం సంగ్రహించుకుంటుంది. వీటిని ఎముకలకు అతుక్కునే కండరాలు తీసుకొని, కండర నిర్మాణ ప్రక్రియను మొదలెడతాయి. ఇలా కండరం మరమ్మతు కావటానికి



తోడ్పడతాయి. జీవక్రియల్లోనూ ప్రొటీన్ గణనీయ పాత్ర పోషిస్తుంది. ఇది ఘ్రెలిన్, జీఎల్‌పీ-1 వంటి ఆకలి హార్మోన్లను ప్రభావితం చేయటం ద్వారా కడుపు నిండిన భావన కలిగిస్తుంది. చిరుతిండి వైపు మనసు మళ్లకుండా చూస్తుంది. ఇలా రక్తంలో గ్లూకోజు, ఇన్సులిన్ మోతాదులు నియంత్రణలో ఉండటానికీ తోడ్పడుతుంది. అలాగే కొవ్వు మినహా ఇతర శరీర బరువు (లీన్ బాడీ మాస్) పెరగటానికీ దోహదం చేస్తుంది. విశ్రాంతి తీసుకునే సమయంలో జీవక్రియలు వేగంగా జరగటానికి తోడ్పడేది ఇదే. శక్తిని ఉత్పత్తి చేసే మైటోకాండ్రియా శరీరంలో కణ బ్యాటరీలుగా పనిచేస్తుంది. ఈ మైటోకాండ్రియాతో కూడిన కణజాలం కండరాల్లో పెద్దమొత్తంలో ఉంటుంది. అంటే కండ ఎంత ఎక్కువగా ఉంటే శక్తి అంత ఎక్కువగా ఉత్పత్తి అవుతుందన్నమాట. కొవ్వు కూడా బాగా కరుగుతుంది. శరీరం శక్తి కోసం పిండి పదార్థాలను, కొవ్వులను మరింత బాగా వినియోగించుకుంటుంది. దీనంతటికీ ప్రొటీనే ముడి పదార్థంగా ఉపయోగపడుతుంది. వ్యాయామం చేయలేని సందర్భాల్లో (ఉదా: మోకీళ్ల మార్పిడి) ప్రొటీన్, అమైనో ఆమ్లాలు అదనంగా తీసుకోవటం వల్ల కండ క్షీణించకుండా కాపాడుతున్నట్టూ అధ్యయనాలు చెబుతున్నాయి. అంతేకాదు.. బరువు తగ్గటానికి వాడే సెమాగ్లుటైడ్ వాడేవారిలోనూ ప్రొటీన్ ఎక్కువగా తీసుకోవటం మేలు చేస్తున్నట్టు, కండర మోతాదు తగ్గకుండా చూస్తున్నట్టూ వెల్లడైంది. ఇలా ప్రొటీన్ చేసే మేలు అంతా ఇంతా కాదు.

ప్రయాణ విరేచనాలతో పేగుపూత



విహార యాత్రలు, పర్యటనలు ఆహ్లాదం, మానసికోల్లాసం కలిగిస్తాయనటంలో సందేహం లేదు. కానీ ఆహారం విషయంలో జాగ్రత్తగా లేకపోతే విరేచనాలు పట్టుకోవచ్చు. ఇది పర్యటన ఆనందాన్ని దెబ్బతీయటమే కాదు.. కొన్నిసార్లు పేగుపూత (ఐబీఎస్) సమస్యనూ ప్రేరేపించొచ్చు. ఈ దీర్ఘకాల సమస్య ఇంటికి వచ్చిన తర్వాతా నెలలు.. చివరికి ఏళ్ల కొద్దీ వెంటాడుతూ రావొచ్చు. ఆశ్చర్యకరంగా అనిపించినా ఇలాంటి సమస్య తలెత్తే అవకాశముందని తెలుసుకోవటం చాలా ముఖ్యం.

ప్రయాణ సమయంలో విరేచనాల బారినపడ్డవారిలో ప్రతి 8 మందిలో ఒకరికి కనీసం ఆరు నెలల వరకూ దీని లక్షణాలు కొనసాగుతూ వస్తున్నట్టు ఒక అధ్యయనం పేర్కొంటోంది. అంతేనా? వీరిలో 80% మందిలో కనీసం ఏడాది వరకూ ఇబ్బంది పడుతున్నారు. పేగుపూత గలవారిలో విరేచనాలు లేదా మలబద్ధకం కనిపిస్తుంటారు. కొందరిలో రెండూ ఉండొచ్చు. అలాగే కడుపు నొప్పి, పొట్ట ఉబ్బరంతోనూ ఇబ్బంది పడుతుంటారు. ప్రయాణ అనంతరం తలెత్తే ఐబీఎస్‌ను ఇన్‌ఫెక్షన్ అనంతర ఐబీఎస్ (పీఐ-ఐబీఎస్) అంటారు. కొందరికిది జీవితాంత సమస్యగానూ మారొచ్చు. సుమారు 25% నుంచి 30% మందిలో పదేళ్ల తర్వాతా లక్షణాలు వేధిస్తుండటం గమనార్హం.

ముప్పు తగ్గించుకునేదెలా?

ప్రయాణాల సమయంలో విరేచనాలు పట్టుకోకుండా చూసుకోవటం చాలా ముఖ్యం. ఆహారం, నీరు ఎక్కువగా కలుషితమయ్యే చోట్లకు వెళ్లినప్పుడు చాలా జాగ్రత్తగా ఉండాలి.

- సురక్షితమైనదని తెలిస్తే తప్ప కుళాయి నీరు తాగొద్దు. బాటిళ్లలో అమ్మే నాణ్యమైన నీరే తాగాలి.
- పాశ్చరైజ్ చేయని పాలు, పాల పదార్థాలు.. పచ్చి ఆహార పదార్థాలు తినొద్దు. మాంసం, చేపలు, గుడ్ల వంటివి పూర్తిగా ఉడికించిన తర్వాతే తినాలి.
- అపరిశుభ్రంగా ఉండే హోటళ్లు, వీధి బండ్ల వద్ద ఆహార పదార్థాలు తినొద్దు, పానీయాలు తాగొద్దు.
- భోజనం చేసే ముందు, మల విసర్జన తర్వాత సబ్బుతో చేతులు శుభ్రంగా కడుక్కోవాలి.
- ఒక మాదిరి విరేచనాలకు యాంటీబయాటిక్ మందులు వాడటం తగదనీ గుర్తుంచుకోవాలి. ఇవి పేగు బ్యాక్టీరియాను అస్తవ్యస్తం చేయటం వల్ల లక్షణాలు మరింత తీవ్రమవుతాయి. విరేచనాలు బాగా తీవ్రంగా ఉంటే యాంటీబయాటిక్స్ అవసరమవుతాయి. అదీ డాక్టర్ సలహాతోనే తీసుకోవాలి.

ముప్పు ఎవరికి?

చాలామంది ప్రయాణాలు చేస్తుంటారు. చాలామందికి విరేచనాలు పట్టుకోవచ్చు. అలాగని అందరికీ ఇవి పేగుపూతకు దారితీయవు. కొందరికే ఈ సమస్య ఎందుకు వస్తుందనేది కచ్చితంగా తెలియదు. ఇది ఆడవారిలో, పిల్లల్లో ఎక్కువ. కొందరిలో జన్యువులూ దీనికి కారణం కావొచ్చని పరిశోధకులు భావిస్తున్నారు. కలుషితాహారంతో తీవ్రంగా విరేచనాలు పట్టుకున్నవారికి దీని ముప్పు ఎక్కువని చెబుతున్నారు. అప్పటికే ప్రయాణ అనంతర ఐబీఎస్ గలవారికి మరోసారి వచ్చే అవకాశమూ ఎక్కువగానే ఉంటుంది. వీరిలో లక్షణాలు మరింత తీవ్రంగానూ ఉండొచ్చు.

ఎందుకీ సమస్య?

ప్రయాణ అనంతర ఐబీఎస్‌కు మూలం బ్యాక్టీరియా, వైరస్ లేదా పరాన్నజీవుల ఇన్‌ఫెక్షన్లు. సాధారణంగా కలుషిత ఆహారం లేదా నీటిలోని క్యాంపైలోబ్యాక్టర్, ఇ.కొలి వంటి సూక్ష్మక్రిముల ద్వారా ఇవి సంక్రమిస్తాయి. ఈ ఇన్‌ఫెక్షన్లు తగ్గినా కూడా లక్షణాలు విడవకుండా వేధిస్తుంటే ప్రయాణ అనంతర ఐబీఎస్‌గా భావిస్తారు. ఇది ఎందుకు ప్రేరేపితమవుందనే దానిపై రకరకాల సిద్ధాంతాలు ఉన్నాయి. రోగనిరోధక వ్యవస్థ పొరపాటున ఒక ప్రొటీన్‌ను హానికరమైందని భావించి, దానిపై దాడి చేయటం కారణం కావొచ్చని ఒకటి చెబుతుంది. ప్రయాణ విరేచనాలతో ముడిపడిన షిగెల్లా, క్యాంపైలోబ్యాక్టర్, సాల్మోనెల్లా, ఇ.కొలి వంటి బ్యాక్టీరియా ఒక విషతుల్య పదార్థాన్ని విడుదల చేస్తాయి. ఇది పేగుల్లో ఉండే విన్‌క్యులిన్ అనే ప్రొటీన్‌ను పోలి ఉంటుంది ఈ ప్రొటీన్ పేగుల ఆరోగ్యానికి చాలా ముఖ్యం. అయితే రోగనిరోధక వ్యవస్థ విషతుల్య పదార్థాన్ని, విన్‌క్యులిన్‌ను పోల్చుకోవటంలో పొరపడొచ్చు. ఇది విడుదల చేసే యాంటీబాడీలు పొరపాటున విన్‌క్యులిన్ మీదా దాడి చేస్తాయి. దీంతో పేగుల పనితీరు దెబ్బతింటుంది. కొన్నిరకాల బ్యాక్టీరియా ఎక్కువగా వృద్ధి చెందుతుంది. ఇది ఐబీఎస్‌కు దారితీస్తుంది. ఈ సమస్య గల 56% మందిలో విన్‌క్యులిన్ యాంటీబాడీలు ఉంటున్నట్టు ఒక అధ్యయనంలో తేలింది.

- జియార్డియా వంటి పరాన్నజీవులతోనూ ప్రయాణ కాల విరేచనాలు పట్టుకోవచ్చు. పీఐ-ఐబీఎస్‌కు జియార్డియా ఎక్కువగా కారణమవుతుంది కూడా. అయితే ఇదేమీ విషతుల్యాలను విడుదల చేయదు. అంటే పేగుపూత సమస్యకు మరేదో దోహదం చేస్తోందన్నమాట. దీనికి కారణం పేగు బ్యాక్టీరియా అస్తవ్యస్తం కావొచ్చని భావిస్తున్నారు. ప్రయాణ కాల విరేచనాలతో మంచి, చెడు బ్యాక్టీరియా మధ్య సమతుల్యత దెబ్బతింటుంది. మంచి బ్యాక్టీరియా వాపు నివారణ గుణాలు కలిగుంటాయి. పేగుల నుంచి రక్తంలోకి హానికారకాలు చేరకుండా నియంత్రిస్తాయి కూడా. ఒకవేళ చెడు బ్యాక్టీరియా ఎక్కువగా వృద్ధి చెందినట్టయితే దీర్ఘకాల వాపు ప్రక్రియ (ఇన్‌ఫ్లమేషన్) ప్రేరేపితమవుతుంది. ఇది మల విసర్జన తీరులో మార్పులకు దోహదం చేస్తుంది. చివరికి పేగుపూత లక్షణాలకు కారణమవుతుంది.

సమయం కన్నా తీరే ముఖ్యం

పిల్లల్లో మొబైల్ ఫోన్లు, ట్యాబ్లెట్ల వంటి డిజిటల్ పరికరాల వాడకాన్ని తగ్గించటానికి ప్రయత్నిస్తున్నారా? పరిమిత సమయాన్ని కేటాయించటం, పరికరాలు లాగేసుకోవటం చేస్తున్నారా? ఇవి మంచివే కావొచ్చు గానీ అంత సమర్థమైన పద్ధతులేమీ కావని తాజా అధ్యయనం పేర్కొంటోంది. డిజిటల్ పరికరాలతో ఎంతసేపు గడిపారనే దాని కన్నా వాటితో ఎలా గడుపుతున్నారు? వీటి వాడకం వ్యసనంగా మారిందా? అనేవే కీలకమని సూచిస్తోంది. పిల్లలు (10-14 ఏళ్లు) పరికరాలకు అతుక్కుపోవటానికీ, వీరిలో ఆత్మహత్య ఆలోచనలు కలగటానికీ.. పరికరాలతో గడిపే తీరుకూ సంబంధం ఉంటున్నట్టు బయటపడింది. తల్లిదండ్రులకు ఇది మంచి విషయమేనని చెప్పుకోవచ్చు. ఎందుకంటే ఇప్పుడు ఎక్కడ పడితే అక్కడ డిజిటల్ పరికరాలు కనిపిస్తున్నాయి. పిల్లలు వీటిని రకరకాల పద్ధతుల్లో వాడుతున్నారు. విశ్రాంతి సమయాల్లో వినోదం కోసమే కాకుండా స్కూలు వర్క్, చదువులకూ వాడుకుంటున్నారు. రోజూ డిజిటల్ పరికరాలు వాడే పిల్లల్లోనూ చాలామందిలో మానసిక సమస్యలేవీ లేకపోవటం గమనార్హం. అందువల్ల వీటి వాడకం విషయంలో అందరినీ ఒకే గాటన కట్టలేమని పరిశోధకులు భావిస్తున్నారు. అయితే డిజిటల్ పరికరాలను చూడటం వ్యసనంగా మారితే.. అంటే నిద్ర, చదువులు, సంబంధాలను దెబ్బతీస్తున్నా వీటి వాడకాన్ని ఆపలేకపోతే ఆత్మహత్య ఆలోచనలు, మానసిక జబ్బుల ముప్పు గణనీయంగా పెరుగుతున్నట్టు తేలిందని చెబుతున్నారు. ఆశ్చర్యకరమైన విషయం ఏంటంటే- చాలామందిలో వీటి వాడకం వ్యసనంగా మారుతుండటం. పదకొండేళ్ల వయసు వచ్చేసరికే ముగ్గురిలో ఒకరికివి వ్యసనంగా మారుతోంది.

ఈనాడు సినిమా

చిత్ర పరిశ్రమ అందరిదీ... ఇక్కడ ప్రతిభే ముఖ్యం!

- 'హరి హర వీరమల్లు' కోసం అత్యుత్తమంగా పనిచేశా!
- సినిమా అనాథ కాదు... నేనున్నానని చెప్పడానికే వచ్చా
- ఏపీ ఎఫ్.డి.సి ఛైర్మన్ పదవి కోసం ఎ.ఎం.రత్నం పేరు ప్రతిపాదించా
- ఏపీ ఉపముఖ్యమంత్రి, కథానాయకుడు పవన్‌కల్యాణ్


నిధి అగర్వాల్, పవన్‌కల్యాణ్

"నా సినిమాల్ని గతంలో ఎన్ని రకాలుగా ఇబ్బందులకు గురిచేశారో అందరికీ తెలుసు. మన ప్రభుత్వం రాగానే హృదయ కవాటాలు తెరిచి సాదరంగా చిత్ర పరిశ్రమని ఆహ్వానించాం" అన్నారు ప్రముఖ కథానాయకుడు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్. కోట్లాది మంది ప్రజలకు అండగా ఉంటూ, దేశంలో ఉండే సమస్యలకి స్పందించే వాడినని, అలాంటిది తన సినిమాని తాను ఎలా వదిలేస్తానన్నారు. రాజకీయ ప్రత్యర్థులు తిడుతున్నా ఈ సమావేశానికి వచ్చానంటే అన్నం పెట్టిన సినిమా రంగంపై ఉన్న అపారమైన గౌరవమే కారణం అన్నారు. ఆయన కథానాయకుడిగా తెరకెక్కిన 'హరి హర వీరమల్లు' ఈ నెల 24న ప్రేక్షకుల ముందుకొస్తోంది. జ్యోతికృష్ణ, క్రిష్ జాగర్లమూడి దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రమిది. నిధి అగర్వాల్ కథానాయిక. బాబీ దేవోల్ ముఖ్యభూమిక పోషించారు. మెగా సూర్య ప్రొడక్షన్స్ పతాకంపై ఎ.దయాకర్‌రావు నిర్మించారు. ఎ.ఎం.రత్నం సమర్పకులు. ఈ సినిమా ప్రచార కార్యక్రమాల్లో భాగంగా సోమవారం ఉదయం హైదరాబాద్‌లో విలేకర్ల సమావేశాన్ని నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్ ఉపముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన అనంతరం, పవన్‌కల్యాణ్ తన సినిమా ప్రచారం కోసం మీడియా ముందుకు రావడం ఇదే తొలిసారి.

నిర్మాత కోసమే...

"ఈ సమావేశం పెట్టడానికి కారణం నిర్మాత ఎ.ఎం.రత్నం. నేను సినిమాల్లోకి రాకముందు ఎ.ఎం.రత్నం లాంటి నిర్మాత దొరికితే బాగుండేది అనుకునేవాణ్ని. మన చిత్ర పరిశ్రమని పాన్ ఇండియా స్థాయికి తీసుకెళ్లిన వ్యక్తి ఆయన. చిత్ర పరిశ్రమలోని సృజనాత్మక శక్తి ఎలాంటిదో చూపించారు. అంత తపన ఉన్న ఆయన వచ్చి.. నేను రాజకీయాల్లో తలమునకలై ఉన్నప్పుడు 'మీరు మళ్లీ సినిమా చేయాలి' అని అడిగారు. ఓ నటుడిగా ఈ సినిమా కోసం నేనెంత అత్యుత్తమంగా పనిచేయగలనో అంతా చేశా. అన్నిటికంటే నేను ఇవ్వలేనిది సమయం. అయినా సరే, పతాక సన్నివేశాల కోసమే మండుటెండల్లో 57 రోజులు చిత్రీకరణ చేయాల్సి వచ్చింది. నేను ఎప్పుడో నేర్చుకున్న యుద్ధ విద్యలు ఈ సినిమాకి చాలా బాగా పనికొచ్చాయి. కృష్ణానది తీరంలోని కొల్లూరులో దొరికిన కోహినూర్, హైదరాబాద్ సుల్తానుల వరకూ ఎలా వెళ్లిందనే నేపథ్యంలో సాగే కథ ఇది. దర్శకుడు క్రిష్ జాగర్లమూడి ఓ బలమైన కాన్సెప్ట్‌తో వచ్చారు. అది నచ్చే చేశా. ఈ సినిమా ఎన్నో ఒడిదొడుకుల్ని ఎదుర్కొంది. పరిశ్రమలో పరిస్థితులు ఎంతో కఠినంగా ఉంటాయి. ఇక్కడ ఎవ్వరినీ తప్పు పట్టలేం. ఒకప్పుడు హీరోలు, పంపిణీదారులు.. నిర్మాత ఎ.ఎం.రత్నం చుట్టూ తిరిగేవారు. అలాంటి వ్యక్తి నలిగిపోతుంటే నాకు చాలా బాధేసింది. రత్నం లాంటి నిర్మాతకి ఇబ్బందులు కలగకూడదనే నేను బయటికొచ్చి ఈ సినిమాని భుజాలకు ఎత్తుకున్నా"నని చెప్పారు పవన్‌కల్యాణ్.

సినిమా ప్రాణవాయువు

"రాజకీయంగా నాకు పేరు ఉండొచ్చు, దేశ వ్యాప్తంగా నేను తెలిసి ఉండొచ్చు కానీ, సినిమా పరంగా నేను చాలా మంది హీరోల కంటే తక్కువే. మిగతావాళ్ల సినిమాలకు వ్యాపారమైనంతగా నాకు అవ్వదు. దానికుండే ఇబ్బందులు దానికి ఉంటాయి. సమాజం, రాజకీయాలపై పెట్టినంత దృష్టి సినిమా రంగంలోని పోటీపై పెట్టలేదు. చిత్ర పరిశ్రమలోని చాలా మంది హీరోల్లో నేను ఒకడిని. ఏడాదిలో ఒక గురువారమో, శుక్రవారమో నా సినిమా విడుదలవుతుంది. ఇది అందరి పరిశ్రమ, అందరూ రావాలని కోరుకునేవాడిని నేను. భారతీయ సినిమాకు కులం, మతం, ప్రాంతం, భాష అనే భేదాలు ఉండవు. సృజనాత్మకతపైనే ఆధారపడి ఉంటుంది. చిరంజీవి కుమారుడైనా, తమ్ముడైనా ఎవరైనా ప్రతిభ లేకపోతే నిలబడలేరు. రేపు నా కుమారుడైనా అంతే. ఇక్కడ ప్రతిభే ముఖ్యం. నాకు అన్నం పెట్టిన సినిమా అంటే నాకు అపారమైన గౌరవం, ఆసక్తి. నాకు ప్రాణ వాయువుతో సమానం" అన్నారు పవన్‌కల్యాణ్.

- మొఘల్ చక్రవర్తి ఔరంగజేబుకీ, కల్పిత పాత్ర అయిన వీరమల్లుకీ మధ్య జరిగే యుద్ధమే ఈ సినిమా అన్నారు దర్శకుడు జ్యోతికృష్ణ. ఈ కార్యక్రమంలో నిర్మాత ఎ.ఎం. రత్నం, గీత రచయిత రాంబాబు గోసాల తదితరులు పాల్గొన్నారు.

పాలనకు ఇబ్బంది కలగకుండానే..

'ఒకానొక సమయంలో ఈ సినిమా బయటికొస్తుందా రాదా అన్నట్టు ఉండేదని, మేం నీరసించినప్పుడల్లా సంగీత దర్శకుడు కీరవాణి ప్రాణ వాయువు అందించారన్నారు పవన్ కల్యాణ్. "సినిమా అనేది ఓ యజ్ఞం లాంటిది. నా కార్యాలయానికి దగ్గరలోనే నా స్నేహితుడి స్థలంలో చిత్రీకరణ చేశాం. ఉపముఖ్యమంత్రి అయిన తర్వాత పాలనా సమయానికి ఇబ్బంది కలగకుండా, నా వ్యక్తిగత సమయాన్ని ఈ సినిమా కోసం కేటాయించా. ఈ సినిమా అనాథ కాదు, నేనున్నాను అని చెప్పడానికే నేను వచ్చాను ఈ రోజు. నిర్మాతలు కనుమరుగవుతున్న ఈ సమయంలో, ఎన్నో బలమైన సినిమాల్ని తీసిన ఎ.ఎం. రత్నం కోసం నిలబడాలనుకున్నా. ఆయనకు ఏపీ ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్ పదవి ఇవ్వాలని ప్రతిపాదించాను. నా నిర్మాత అని కాదు, మేకప్‌మ్యాన్‌గా ప్రయాణం మొదలుపెట్టి, దర్శకుడిగా, నిర్మాతగా అంచలంచెలుగా ఎదిగారు. ఇలాంటి వ్యక్తి ఉంటే సినీ పరిశ్రమ బాగుంటుందని ఆయన పేరు ప్రతిపాదించా" అన్నారు పవన్‌కల్యాణ్.


కర్ణాటక మంత్రి ఈశ్వర్ ఖండ్రేను సత్కరిస్తున్న పవన్


పవన్‌కల్యాణ్, ఎ.ఎం.రత్నం, రఘు రామకృష్ణంరాజు, జ్యోతికృష్ణ, కందుల దుర్గేశ్, కీరవాణి

నా దగ్గర గూండాలు లేరు... గుండెల్లో అభిమానులు తప్ప!

- విడుదలకు ముందస్తు వేడుకలో పవన్‌కల్యాణ్

"మన పాఠ్య పుస్తకాల్లో మొఘల్ చక్రవర్తుల గొప్పతనాన్నే చెప్పారు తప్ప, ఆరాచకాల గురించి చెప్పలేదు. విజయనగర సామ్రాజ్యాధీశుడితో సహా ఎంతోమంది రాజులు ఉన్నారు కానీ, వారి గురించి మాట్లాడలేదు. ఔరంగజేబు సొంత తమ్ముడిని చంపాడు. షాజహాన్‌ని జైల్‌లో పెట్టాడు. హిందువుగా బతకాలంటే పన్ను కట్టాలన్నాడు. అప్పుడే ఛత్రపతి శివాజీ మహారాజ్ వచ్చి నిలబడ్డారు. అలాంటి పరిస్థితుల్లో ఒక సగటు మనిషి అయితే ఏం చేసి ఉండొచ్చన్న ఓ కల్పిత కథతోనే 'హరి హర వీర మల్లు' సినిమా తెరకెక్కింద'న్నారు పవన్‌కల్యాణ్. సోమవారం రాత్రి హైదరాబాద్‌లోని శిల్పకళావేదికలో విడుదలకు ముందస్తు వేడుకని నిర్వహించారు. ఈ వేడుకకి చిత్రబృందంతోపాటు, కర్ణాటక రాష్ట్ర అటవీ శాఖ మంత్రి ఈశ్వర్ ఖండ్రే, ఆంధ్రప్రదేశ్ శాసనసభ ఉప సభాపతి రఘు రామకృష్ణంరాజు, ఏపీ మంత్రి కందుల దుర్గేశ్ తదితరులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా పవన్‌కల్యాణ్ మాట్లాడుతూ "సినిమా రంగంలోకి వచ్చాక ప్రేక్షకుల అభిమానాన్ని ఎలా సంపాదించుకున్నానో, అలా రాజకీయాల్లోకి వచ్చాక నేను సంపాదించుకున్న మిత్రుడు ఈశ్వర్ ఖండ్రే. రెండేళ్ల కిందట 'భీమ్లానాయక్' విడుదలైనప్పుడు అందరి సినిమాల టికెట్ ధరలు రూ.వందల్లో ఉంటే నా సినిమాకి రూ.10 చేశారు. ఆ రోజున ఒక్కటే చెప్పా, మనల్ని ఎవ్వరూ ఆపేదని! డబ్బు గురించో, రికార్డుల గురించో కాదు, ధైర్యం, చిత్తశుద్ధి గురించి చెప్పిన మాట అది. ఆ రోజు అభిమానులు పంతం కొద్దీ చూశారు. ఆ సత్తా ఏమిటో ఇప్పుడు చూస్తారు. నా దగ్గర గూండాలు, ఆయుధాలు లేవు, నా గుండెల్లో ఉండే అభిమానులు తప్ప. చిత్ర పరిశ్రమకు వచ్చి 30 ఏళ్లు అయింది. కొంత వయసు పెరిగిందేమో కానీ, గుండెల్లో చావ ఇంకా ఉంది. నాకు డబ్బు వచ్చేది సినిమా పైనే. అయితే నేను సినిమా చేస్తే అది ప్రేక్షకుల్ని రంజింపజేయాలి. నేను రీమేక్స్ చేశానని అందరూ అంటుంటారు. పార్టీని నడపాలన్నా, భార్యాపిల్లల్ని పోషించాలన్నా వీటన్నిటికీ రీమేక్ సులభమైన దారి అయ్యింది. వేరే దారి లేకే ఆ సినిమాల్ని చేశా. క్రిష్ జాగర్లమూడి వల్ల ఈ సినిమా నాకు వచ్చింది. ఆయన ఈ సినిమాకి పునాది వేశారు. జ్యోతికృష్ణ చాలా బాగా హ్యాండిల్ చేసి సినిమాని తీశాడు" అన్నారు.

- ఆంధ్రప్రదేశ్ శాసనసభ ఉప సభాపతి రఘు రామకృష్ణంరాజు మాట్లాడుతూ "సినిమా విడుదలకు ముందే ఆంధ్రప్రదేశ్‌లో ఉన్న ఔరంగజేబులాంటి వ్యక్తిని జయించడంలో ప్రముఖ పాత్ర వహించారు పవన్‌కల్యాణ్. ఇప్పుడు రీల్ లైఫ్‌లో 'హరి హర వీర మల్లు'గా శివాజీ కలలు కన్న సామ్రాజ్య స్థాపన కోసం ఏం చేశారో చూడబోతున్నాం" అన్నారు. ఏపీ మంత్రి కందుల దుర్గేశ్ మాట్లాడుతూ ' 'సినిమా రంగంలో కానీ, రాజకీయ రంగంలో కానీ తాను చెప్పిన మాటల్నే ఆచరణలో పెట్టే ఏకైక నాయకుడు పవన్‌కల్యాణ్" అన్నారు. కర్ణాటక మంత్రి ఈశ్వర్ ఖండ్రే మాట్లాడుతూ "పవన్‌కల్యాణ్‌కు తెలంగాణ, ఆంధ్రలోనే కాదు, దేశవ్యాప్తంగా అభిమానులు ఉన్నారు. పవన్‌కల్యాణ్ ఈ తరానికి గొప్ప నటుడు, మంచి మానవతావాది"అన్నారు. ఈ కార్యక్రమంలో పవన్‌కల్యాణ్ భార్య అన్నా లెజినోవా, బ్రహ్మానందం, తనికెళ్ల భరణి, టి.జి.విశ్వప్రసాద్, నవీన్ ఎర్నేని, వై.రవిశంకర్, రోహిణ్ రెడ్డి, శ్రీనివాస్ తదితర సినీ, రాజకీయ ప్రముఖులు పాల్గొన్నారు.


రిషబ్ శెట్టి

ఛాప్టర్ వన్ చిత్రీకరణ పూర్తి

విజయవంతమైన 'కాంతార'కి ముందు భాగంగా రూపొందుతున్న చిత్రమే 'కాంతార - ఛాప్టర్ 1'. రిషబ్ శెట్టి కథానాయకుడిగా నటిస్తూ, దర్శకత్వం వహిస్తున్నారు. హోంబలే ఫిల్మ్స్ సంస్థ నిర్మిస్తోంది. ఈ సినిమా చిత్రీకరణ పూర్తయింది. ఈ సందర్భంగా చిత్రబృందం సోమవారం మేకింగ్ వీడియోను విడుదల చేసింది. 250 రోజుల పాటు ఈ సినిమా చిత్రీకరణ సాగినట్టు ఆ వీడియో స్పష్టం చేస్తోంది. మూడేళ్ల ప్రయాణం ఈ చిత్రం. అక్టోబరు 2న ప్రేక్షకుల ముందుకు రానుంది. పాన్ ఇండియా స్థాయిలో ప్రేక్షకుల్ని అలరించిన 'కాంతార'కి ప్రీక్వెల్‌గా రూపొందుతున్న 'కాంతార ఛాప్టర్ 1'పై భారీ అంచనాలున్నాయి. అందుకు తగ్గట్టే సినిమా రూపొందుతోందని సినీ వర్గాలు తెలిపాయి. ఈ చిత్రానికి సంగీతం: బి.అజనీశ్ లోకనాథ్, కళ: వినేశ్ బంగ్లాన్, ఛాయాగ్రహణం: అరవింద్ కశ్యప్.


వరుణ్ తేజ్

అజిత్‌కు తప్పిన ప్రమాదం


అజిత్

సినిమాల్లో డూప్ లేకుండా యాక్షన్ సీక్వెన్స్ చేస్తూ.. మరోవైపు కారు రేసింగ్‌లో కూడా సత్తా చాటుతూ అభిమానుల్ని ఆకట్టుకుంటున్నారు తమిళ హీరో అజిత్. తాజాగా ఇటలీలో జరిగిన జీటీ4 యూరోపియన్ సిరీస్ రేసులో పాల్గొన్నారాయన. ఇందులో భాగంగా ట్రాక్‌పై దూసుకెళ్లిన ఆయన కారు ప్రమాదానికి గురైంది. ఈ సంఘటనలో అజిత్‌కు గాయాలేమి కాలేదు.. కానీ దీని తర్వాత ఆయన చేసిన పనిపై నెట్టింట్లో అభిమానులు ప్రశంసలు కురిపిస్తున్నారు. కారు ప్రమాదానికి గురైన తర్వాత ట్రాక్‌పై ఉన్న శిథిలాలను తొలగించడానికి అక్కడి సిబ్బందికి సహాయం చేశారు అజిత్. దీనికి సంబంధించిన వీడియోను జీటీ4 యూరోపియన్ సిరీస్ ఎక్స్‌లో పంచుకుంది. "ప్రమాదం వల్ల రేసు నుంచి తప్పుకున్నప్పటికీ.. ట్రాక్‌ను శుభ్రం చేయడంలో సాయం చేసి ఇప్పటికీ సంతోషంగానే ఉన్నారు. దీంతో అజిత్‌పై గౌరవం రెట్టింపయ్యింద'నే వ్యాఖ్యల్ని జోడించింది. ప్రస్తుతం ఈ వీడియో నెట్టింట్లో సందడి చేస్తుంది.

త్వరలో ధనుష్-నిత్యల ప్రేమ కబుర్లు



ధనుష్

'కుబేర' సినిమాతో ఇటీవలే మంచి హిట్‌ను తన ఖాతాలో వేసుకున్నారు ధనుష్. ప్రస్తుతం ఇటు దర్శకుడిగా.. మరోవైపు నటుడిగా శక్తిమంతమైన కథలతో ప్రయాణిస్తున్న ఆయన.. 'ఇడ్లీ కడై' చిత్రంలో నటిస్తున్న సంగతి తెలిసిందే. నిత్యామేనన్ కథానాయిక. ధనుష్ దర్శకత్వంలో రాబోతుందీ చిత్రం. తాజాగా ఈ నెల 28న ధనుష్ పుట్టిన రోజు సందర్భంగా ఈ సినిమా ప్రచార కార్యక్రమాలను మొదలు పెట్టడానికి సన్నాహాలు చేస్తున్నట్లు తెలుస్తోంది. ఇందులో భాగంగా ఈ చిత్ర మొదటి సింగిల్‌ను విడుదల చేయనున్నారని.. ధనుష్, నిత్యల ప్రేమ గురించి తెలిపేలా ఈ రాబోయే గీతాన్ని తీర్చిదిద్దినట్లు సమాచారం. డాన్ పిక్చర్స్ సంస్థ నిర్మిస్తున్న ఈ సినిమాలో ప్రకాశ్ రాజ్, షాలినీ పాండే తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. గ్రామీణ నేపథ్యంలో రూపొందుతున్న ఈ చిత్రం అక్టోబరు 1న రానుంది.

సంగీత చర్చల్లో వరుణ్ చిత్రం

వరుణ్‌తేజ్ కథానాయకుడిగా... మేర్లపాక గాంధీ దర్శకత్వంలో ఓ చిత్రం తెరకెక్కుతోంది. రితికానాయక్ కథానాయిక. ఫస్ట్ ఫ్రేమ్ ఎంటర్‌టైన్‌మెంట్, యు.వి.క్రియేషన్స్ సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. శరవేగంగా చిత్రీకరణ చేసుకుంటున్న ఈ సినిమాకి తమన్ స్వరాలు సమకూర్చనున్నారు. ప్రస్తుతం సంగీత చర్చలు కొనసాగుతున్నాయి. త్వరలోనే సినిమా పేరుని, ప్రచార చిత్రాన్ని విడుదల చేయనున్నట్టు సినీ వర్గాలు తెలిపాయి. ' 'వరుణ్‌తేజ్ 15వ చిత్రమిది. భారీబడ్జెట్‌తో, ఉన్నతమైన సాంకేతిక హంగులతో రూపొందుతోంది. హారర్ కామెడీ నేపథ్యంలోని కథ ఒకెత్తైతే, ఆ కథ ఇండియా, కొరియాతో ముడిపడటం మరో ఎత్తు. ఇప్పటికే సింహభాగం చిత్రీకరణ పూర్తయింది. 'తొలిప్రేమ' తర్వాత వరుణ్‌తేజ్ - తమన్ కలయికలో మరోసారి ఓ మంచి ఆల్బమ్ సిద్ధమవుతోంద"ని సినీ వర్గాలు తెలిపాయి.

'ఉదయ్‌పూర్ ఫైల్స్' చిత్రంలో మార్పులు



'ఉదయ్‌పూర్ ఫైల్స్: కన్హయ్యలాల్ టైలర్ మర్డర్' చిత్రం విడుదలపై సుప్రీంకోర్టు ధర్మాసనం చిత్ర నిర్మాతలను కేంద్ర ప్రభుత్వ నిర్ణయం కోసం వేచి ఉండాల్సిందిగా కోరిన సంగతి తెలిసిందే. దీనిపై ధర్మాసనం సోమవారం విచారణ చేపట్టింది. ఈ పిటిషన్ విచారణకు ఏర్పాటైన కమిటీ ఆరు మార్పులను సూచించగా వాటిని కేంద్ర సమాచార ప్రసార శాఖ ఆమోదించింది. విడుదలకు ముందే వాటిని చిత్ర నిర్మాతలు అమలు చేయాల్సి ఉంటుందని ధర్మాసనం పేర్కొంది. ఈ కేసు విచారణను గురువారం నాటికి వాయిదా వేసింది. తదుపరి విచారణ వరకు సినిమా విడుదలపై స్టే అమలులో ఉంటుందని పేర్కొంది.

ఏంటవి? "ఇప్పటికే ఉన్న డిస్‌క్లయిమర్‌ను సిఫార్సు చేసిన డిస్‌క్లయిమర్‌తో భర్తీ చేయాలి. దానికి వాయిస్ ఓవర్ ఇవ్వాలి. క్రెడిట్స్‌లో కొందరు వ్యక్తుల పేర్లు తొలగించాలి. తలపాగాకు సంబంధించి ఏఐ సాయంతో క్రియేట్ చేసిన సన్నివేశాల్ని సవరించాలి. పోస్టర్ సహా అన్ని చోట్ల నూతన్ శర్మ పేరును మరో పేరుతో మార్చాలి. ఓ మతాన్ని ఉద్దేశిస్తూ నూతన్ శర్మ చెప్పే డైలాగ్‌ను తొలగించాలి. బలూచీ ప్రస్తావన ఉన్న రెండు సంభాషణలను తీసి వేయాల"ని కమిటీ సూచించింది.

మునుపెన్నడూ అడుగుపెట్టని ప్రపంచం సలాకార్

త్వరలో అగ్రహీరో చిరంజీవితో కలిసి 'విశ్వంభర'లో ఆడిపాడటానికి ముస్తాబవుతోంది బాలీవుడ్ నటి మౌని రాయ్. ఇటీవలే 'ది భూత్నీ' చిత్రంతో ప్రేక్షకుల్ని పలకరించిన ఆమె.. ఇప్పుడు మరో ప్రాజెక్టుతో అలరించడానికి సిద్ధమైంది. మౌని రాయ్, నవీన్ కస్తూరియా ప్రధాన పాత్రల్లో నటిస్తున్న చిత్రం 'సలాకార్'. ఈ స్పై థ్రిల్లర్‌కు ఫరూక్ కబీర్ దర్శకత్వం వహిస్తున్నారు. తాజాగా ఈ సినిమా జియో హాట్‌స్టార్‌లో ఆగస్టు 8న రాబోతున్నట్లు ప్రకటిస్తూ.. ఇన్‌స్టా వేదికగా టీజర్‌ను విడుదల చేసింది చిత్ర బృందం. "దేశ భద్రత కోసం ధైర్యసాహసాల్ని ప్రదర్శించిన స్పై మాస్టర్ కథ 'సలాకార్'" అనే వ్యాఖ్యల్ని జోడించింది. వాస్తవ సంఘటనల ఆధారంగా రూపొందుతున్న ఈ సినిమా.. ఒక భారతీయ గూఢచారి కథ చుట్టూ తిరగనుందని టీజర్‌తో స్పష్టమవుతుంది. ఈ సందర్భంగా మౌని రాయ్ మాట్లాడుతూ.. "నేను ఇంతకు ముందు అడుగుపెట్టని కొత్త ప్రపంచమిది. నన్ను నేను కొత్తగా నిరూపించుకోవడానికి 'సలాకార్'తో మరో గొప్ప అవకాశం లభించింది.


మౌని రాయ్

జీవితాన్ని తలకిందులు చేసిన ఉత్తరాలు





సిరీస్: 'లెటర్స్ ఫ్రమ్ ది పాస్ట్'
నటీనటులు: ఇపెక్ తుర్క్‌టాన్, గునెస్ సెన్సోయ్
విడుదల: బుధవారం,
ప్లాట్‌ఫామ్: నెట్‌ఫ్లిక్స్

కథాంశం: లాలిస్తూ.. బుజ్జగిస్తూ.. ప్రతి క్షణం మనల్ని కంటికి రెప్పలా కాపాడుకునే గొప్ప వ్యక్తి అమ్మ. చిన్నప్పటి నుంచి తల్లి చేయి పట్టుకొని అడుగులు వేస్తూ ప్రపంచాన్ని చూస్తాము. అలా ప్రేమకు ప్రతిరూపమైన అమ్మ.. నిన్ను నవమాసాలు మోసి కనలేదు.. దత్తత తీసుకుంది అని తెలిస్తే.. ఆ బాధను మాటల్లో చెప్పలేం. ఇప్పుడిలాంటి వేదనే పడుతోంది ఎలిఫ్ అయర్. మరి ఆమె కథేంటో తెలుసుకోవాలంటే 'లెటర్స్ ఫ్రమ్ ది పాస్ట్' సిరీస్ చూడాల్సిందే. డ్రామా, మిస్టరీ కథాంశాలతో దీన్ని రానా డెనిజర్ రూపొందించారు. ఇపెక్ తుర్క్‌టాన్, గునెస్ సెన్సోయ్ ప్రధాన పాత్రలు పోషించారు. ఇందులో ఇపెక్.. ఫాత్మా అయర్ పాత్రలో, ఎలిఫ్ అయర్‌గా గునెస్ కనిపించనున్నారు. ఫాత్మా ఒక స్కూల్ టీచర్. 2003లో ఆమె తరగతి గదిలో విద్యార్థులతో భవిష్యత్తుకు సంబంధించిన కొన్ని లేఖల్ని రాయిస్తుంది. 2023లో ఆ ఉత్తరాలను అందజేస్తానని పిల్లలకు మాటిస్తుందామె. కొన్నేళ్ల తర్వాత ఫాత్మా కూతురు ఎలిఫ్ చేతికి ఆ ఉత్తరాల పెట్టే దొరుకుతుంది. ఆ తర్వాత ఏమైందనేదే ఈ సిరీస్ కథాంశం. మరి ఎలిఫ్ జీవితాన్ని తలకిందులు చేసిన ఆ ఉత్తరాల్లోని రహస్యాల గురించి మీరూ తెలుసుకోండి.

డియర్ పాట


ధనుష్ రఘుముద్ర, మనోజ్

ధనుష్ రఘుముద్ర, హెబ్బా పటేల్ జంటగా తెరకెక్కిన చిత్రం 'థ్యాంక్యూ డియర్'. రేఖా నిరోషా ముఖ్యభూమిక పోషిస్తున్నారు. తోట శ్రీకాంత్ కుమార్ దర్శకుడు. పప్పు బాలాజీరెడ్డి నిర్మాత. 'చిక్కక చిక్కిన గుమ్మ...' అంటూ సాగే ఈ చిత్రంలోని తొలి పాటని ప్రముఖ కథానాయకుడు మంచు మనోజ్ ఇటీవల విడుదల చేశారు. నిర్మాత బాలాజీరెడ్డి స్వయంగా రచించిన ఈ గీతాన్ని శ్రీచరణ్ ఆలపించారు. సుభాష్ ఆనంద్ స్వరకర్త. ఈ సందర్భంగా మంచు మనోజ్ మాట్లాడుతూ "ధనుష్ కుటుంబం మాకెంతో సన్నిహితులు. తను కథానాయకుడిగా నటించిన ఈ చిత్రం గొప్ప విజయం సాధించాలని కోరుకుంటున్నా. పాట చాలా బాగుంది" అన్నారు. "బలమైన కథతో రూపొందుతున్న చిత్రమిది. ప్రముఖ దర్శకుడు వి.వి.వినాయక్ చేతుల మీదుగా విడుదలైన టీజర్‌కి మంచి స్పందన లభించింది. ఇందులోని పాటలు కూడా అందరినీ అలరించేలా ఉంటాయి. మంచు మనోజ్ చేతుల మీదుగా తొలి పాట విడుదల కావడం ఆనందంగా ఉంది" అన్నారు కథానాయకుడు. మంచు మనోజ్ వ్యక్తిగతంగా ఈ పాటకి చాలా బాగా కనెక్ట్ అయ్యారని చెప్పారు సంగీత దర్శకుడు సుభాష్ ఆనంద్. ఈ కార్యక్రమంలో నిర్మాత బాలాజీరెడ్డి, లైన్ ప్రొడ్యూసర్ పునీత్ తదితరులు పాల్గొన్నారు.

ఈనాడు బిజినెస్

జీసీసీల ఖిల్లా హైదరాబాద్



✦ 3 దక్షిణాది నగరాల్లోనే ఎక్కువ
✦ 2028 నాటికి దేశంలో 2100 కేంద్రాలు

ఈనాడు - హైదరాబాద్

బహుళ జాతి కంపెనీలు తమ జీసీసీ (గ్లోబల్ కేపబిలిటీ సెంటర్)లు ఏర్పాటు చేయడానికి మనదేశం వైపే ఎక్కువగా చూస్తున్నాయి. ఇప్పటివరకు ప్రపంచ వ్యాప్తంగా ఏర్పాటైన జీసీసీల్లో సగానికి పైగా మనదేశంలోనే ఉండటం ఇందుకు నిదర్శనం. అందులోనూ అత్యధికం దక్షిణాది నగరాల్లో ఉన్నాయి. కొత్తగా ఏర్పాటయ్యే కేంద్రాలనూ దక్షిణాది నగరాలు అధికంగా ఆకర్షిస్తున్నాయి. ఇందులో బెంగళూరు అగ్రస్థానంలో ఉండగా, తదుపరి స్థానాల్లో హైదరాబాద్, చెన్నై కనిపిస్తున్నాయి.

ఇవన్నీ కీలకం

జీసీసీలను ఏర్పాటు చేసేందుకు అనువైన భవనాల లభ్యత, నిర్వహణ ఖర్చులు, వీటన్నింటికీ మించి మానవ వనరుల లభ్యత వంటివి.. కంపెనీల నిర్ణయంలో కీలక పాత్ర పోషిస్తున్నాయి. సంబంధిత కంపెనీ వ్యాపార కార్యకలాపాలు సాగిస్తున్న రంగానికి సంబంధించిన పరిశ్రమలు స్థానికంగా ఉండటమూ ముఖ్యమే. ఐటీ కంపెనీలకు బెంగళూరు - హైదరాబాద్, ఫార్మా- బయోటెక్‌కు హైదరాబాద్, ఆటోమొబైల్- ఇంజినీరింగ్ రంగాలకు చెన్నై ఎంతో పేరు సంపాదించాయి. ఫార్మా-బయోటెక్ రంగాల్లో కార్యకలాపాలు సాగిస్తున్న కంపెనీలు జీసీసీలను ఏర్పాటు చేయాలంటే సహజంగానే హైదరాబాద్ అగ్రస్థానంలో కనిపిస్తుంది.

✦ వెస్టియన్ అనే స్థిరాస్తి కన్సల్టింగ్ సేవల సంస్థ తాజా నివేదిక ప్రకారం.. ప్రస్తుతం ప్రపంచ వ్యాప్తంగా దాదాపు 3,200 జీసీసీలు ఉన్నాయి. ఇందులో 53 శాతం, అంటే దాదాపు 1700 కేంద్రాలు మనదేశంలోనే కొలువుదీరాయి. అత్యధిక సంఖ్యలో జీసీసీలు బెంగళూరులో ఉన్నాయి. తదుపరి స్థానాల్లో హైదరాబాద్, చెన్నై, ఎన్‌సీఆర్ దిల్లీ, ముంబయి, పుణె కనిపిస్తున్నాయి. మనదేశంలోని జీసీసీల్లో 94% ఈ 6 నగరాల్లోనే ఉన్నాయి. మిగిలిన కేంద్రాలు కోల్‌కతా, కొచి, అహ్మదాబాద్, చండీగఢ్, విశాఖపట్నం, మైసూరు, వరంగల్, తిరువనంతపురం, కోయంబత్తూరుల్లో ఏర్పాటయ్యాయి. ప్రధానంగా టైర్-1 నగరాల్లో జీసీసీలు అధికంగా ప్రారంభమవుతున్నా, ఇటీవల టైర్-2 నగరాల వైపు కంపెనీలు మొగ్గుచూపుతున్నాయి. నిర్వహణ ఖర్చులు, స్థిరాస్తి వ్యయాలు కొంత తక్కువగా ఉండటం దీనికి ప్రధాన కారణం.

కొన్ని ప్రత్యేకతలు

✦ మనదేశంలో జీసీసీల సంఖ్య 2028కి 2,100 కు చేరుతుందని అంచనా వేస్తున్నారు. సగటున ఏటా 150 కొత్త కేంద్రాలు ఏర్పాటవుతాయని అంచనా.
✦ ఈ రంగంలో వచ్చే కొన్నేళ్ల పాటు ఏటా 8% వృద్ధి నమోదయ్యే అవకాశం ఉంది.
✦ బెంగళూరులో 487, హైదరాబాద్‌లో 273 జీసీసీ కేంద్రాలు ఉన్నాయి. హైదరాబాద్ ఎంతో వేగంగా జీసీసీలకు కేంద్ర స్థానంగా మారుతోంది.
✦ చెన్నైలో 178 జీసీసీలు ఉన్నాయి. మనదేశంలోని మొత్తం జీసీసీ కేంద్రాల్లో చెన్నై వాటా 11%.

ఐటీదే అగ్రస్థానం

జీసీసీలను ఐటీ- ఐటీఈఎస్ రంగ కంపెనీలే అధికంగా ఏర్పాటు చేస్తున్నాయి. మనదేశంలోని మొత్తం జీసీసీల్లో ఐటీ- ఐటీఈఎస్ రంగ వాటా 49%. బీఎఫ్ఎస్ఐ రంగానికి చెందిన కేంద్రాలు 17% ఉన్నాయి. ఆరోగ్య రంగం- జీవశాస్త్రాలు, ఇంజినీరింగ్- ఉత్పత్తి, కన్సల్టింగ్ సేవలు, టెలికాం- మీడియా రంగాల వాటా 19%. మనదేశంలో జీసీసీల ఏర్పాటు ముందు ముందు ఇంకా పెరుగుతుందని వెస్టియన్ సీఈఓ శ్రీనివాసరావు అభిప్రాయపడ్డారు. తక్కువ వ్యయాలు, అధిక నైపుణ్యాలు కలిగిన మానవ వనరుల లభ్యత, సానుకూల ప్రభుత్వ విధానాలు దీనికి వీలుకల్పిస్తున్నట్లు తెలిపారు. సరైన నగరాన్ని ఎంచుకోవడంపైనే జీసీసీల విజయం ఆధారపడి ఉంటుందని వివరించారు.

దుబాయ్ ఆభరణాల సంస్థలో టైటన్‌కు 67% వాటా

దిల్లీ: దుబాయ్‌కు చెందిన ఆభరణాల సంస్థ దమాస్‌లో 67% వాటాను 283.2 మిలియన్ డాలర్ల (దాదాపు రూ.2,435 కోట్ల)కు టాటా గ్రూప్ సంస్థ టైటన్ కంపెనీ కొనుగోలు చేయనుంది. ఖతార్‌కు చెందిన మన్నాయ్ కార్పొరేషన్ నుంచి ఈ వాటా కొనుగోలు చేయనున్నట్లు స్టాక్ ఎక్స్ఛేంజీలకు టైటన్ తెలిపింది. దమాస్‌లో మిగిలిన 33% వాటాను కూడా టైటన్ 2029 డిసెంబరు 31 తర్వాత కొనుగోలు చేసేందుకు హక్కు ఉంటుంది. ఆరు జీసీసీ దేశాలు- యూఏఈ, సౌదీ అరేబియా, ఖతార్, ఒమన్, కువైట్, బహ్రెయిన్‌లో విస్తరించడానికి ఈ కొనుగోలు దోహదపడుతుందని టైటన్ తెలిపింది. ప్రస్తుతం జీసీసీ దేశాల్లో దమాస్‌కు 146 స్టోర్లు ఉన్నాయి. దమాస్ కొనుగోలుతో ఇతర దేశాలకు టైటన్ విస్తరించనుంది.. ఉత్పత్తుల ఆవిష్కరణ, నాణ్యత, వినియోగదారుల సేవల్లో జీసీసీ దేశాల్లో దమాస్ అగ్రగామి బ్రాండ్‌గా ఉందని టైటన్ ఎండీ సీకే వెంకట్రామన్ పేర్కొన్నారు.

స్వల్పంగా తగ్గిన దొడ్ల డెయిరీ లాభం

ఈనాడు, హైదరాబాద్: దొడ్ల డెయిరీ నికరలాభం స్వల్పంగా తగ్గింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మొదటి త్రైమాసికానికి ఈ సంస్థ రూ.1006.9 కోట్ల ఆదాయం, రూ.62.9 కోట్ల నికరలాభం ఆర్జించింది. 2024-25 ఇదేకాలంలో రూ.911.6 కోట్ల ఆదాయంపై రూ.65 కోట్ల నికరలాభాన్ని ఆర్జించింది. దీంతో పోల్చితే నికరలాభం 3.3% తగ్గింది. సమీక్షా త్రైమాసికంలో రోజుకు 18.7 లక్షల లీటర్ల పాలు సేకరించినట్లు కంపెనీ వెల్లడించింది. పాల అమ్మకాలు సగటున రోజుకు 11.9 లక్షల లీటర్లుగా నమోదయ్యాయి. విలువ జోడించిన పాల ఉత్పత్తుల అమ్మకాలు 12% పెరిగినట్లు కంపెనీ తెలియజేసింది.

భారత్‌లో నయారా రూ.70,000 కోట్ల పెట్టుబడులు

దిల్లీ: రష్యా చమురు దిగ్గజం రాస్‌నెఫ్ట్‌కు చెందిన భారత అనుబంధ సంస్థ నయారా ఎనర్జీ భారత్‌లో రూ.70,000 కోట్ల పెట్టుబడులు పెట్టనుంది. ఐరోపా సమాఖ్య (ఈయూ) తమపై విధించిన తాజా ఆంక్షలు అన్యాయమైనవని, భారత ప్రయోజనాలను దెబ్బతీసేవని నయారా ఎనర్జీ పేర్కొంది. కోట్ల మంది భారత పౌరులతో పాటు ఆర్థిక పరిశ్రమలకు అవసరమైన పెట్రోలియం ఉత్పత్తుల సరఫరాకు అవాంతరం తెచ్చేవిగా ఈ ఆంక్షలున్నాయని, ఇవి భారత ఇంధన భద్రతకు నష్టం కలిగించే ప్రమాదాన్ని తెచ్చిపెడుతున్నాయని తెలిపింది. భారత చట్టాలు, నిబంధనలను పూర్తిగా పాటిస్తున్నట్లు, భారత ఇంధన భద్రత, దేశ వృద్ధికి మద్దతు ఇవ్వడానికి కట్టుబడి ఉన్నట్లు వివరించింది.

ఐడీబీఐ బ్యాంక్ లాభం రూ.2,007 కోట్లు

దిల్లీ: ఐడీబీఐ బ్యాంక్, జూన్ త్రైమాసికంలో రూ.2,007 కోట్ల నికరలాభాన్ని నమోదు చేసింది. 2024-25 తొలి త్రైమాసిక లాభం రూ.1719 కోట్ల కంటే ఇది 17% అధికం. మొత్తం ఆదాయం రూ.7471 కోట్ల నుంచి రూ.8458 కోట్లకు పెరిగింది. వడ్డీ ఆదాయం రూ.6666 కోట్ల నుంచి రూ.7021 కోట్లకు చేరింది. స్థూల నిరర్థక ఆస్తులు (ఎన్‌పీఏ) 3.87% నుంచి 2.93 శాతానికి, నికర ఎన్‌పీఏలు 0.23% నుంచి 0.21 శాతానికి తగ్గాయి.

కోడి గుడ్డు

22న ప్రారంభ ధర వద్ద రైతు అమ్మకం ధరలు (నెక్) (వంద గుడ్లు రూపాయల్లో)

హైదరాబాద్	480
వరంగల్	482
విజయవాడ	510
గోదావరి	505
విశాఖపట్నం	540
చిత్తూరు	543

శత్రు జలాంతర్గాములకు చుక్కలే



శత్రుదేశాల జలాంతర్గాములను ధ్వంసం చేసే యుద్ధ నౌక మరొకటి భారత నావికాదళంలో చేరింది. ప్రభుత్వ రక్షణ రంగ సంస్థ గార్డెన్ రీచ్ షిప్‌బిల్డర్స్ అండ్ ఇంజినీర్స్ (జీఆర్ఎస్ఈ)కు ఇలాంటి 8 నౌకల తయారీకి ఆర్డర్ ఇవ్వగా, 'అజయ్' పేరుతో ఆఖరు యుద్ధ నౌకను సోమవారం నౌకాదళానికి అందచేసింది. యాంటీ సబ్‌మెరైన్ వార్‌ఫేర్ షాలో వాటర్ క్రాఫ్ట్స్‌గా వీటిని వ్యవహరిస్తుంటారు. ఇండియన్ నేవీ చీఫ్ ఆఫ్ మెటీరియల్, వైస్ అడ్మిరల్ కిరణ్ దేశ్‌ముఖ్ సతీమణి ప్రియా దేశ్‌ముఖ్ ఈ నౌకను ప్రారంభించారు. 77.6 మీటర్ల పొడవు, 10.5 మీటర్ల వెడల్పు ఉండే ఈ నౌకను నీటి మట్టం ఎగువ నుంచి తక్కువ లోతులోనూ ఉండేలా తయారు చేయడం వల్ల తీర ప్రాంతంలో కార్యకలాపాలకు ఇవి అనువుగా ఉంటాయి.

ఎంజీ మోటార్ ఎం9 ఎలక్ట్రిక్



దిల్లీ: జేఎస్‌డబ్ల్యూ ఎంజీ మోటార్ ఇండియా సరికొత్త బహుళ వినియోగ వాహనం (ఎంపీవీ) ఎం9 ఎలక్ట్రిక్ లిమోసిన్‌ను విపణిలోకి విడుదల చేసింది. ధర రూ.69.90 లక్షలు (ఎక్స్-షోరూమ్). ఇందులోని 90 కిలోవాట్ అవర్ ఎన్ఎంసీ బ్యాటరీ ఒక్కసారి ఛార్జింగ్‌తో 548 కి.మీ. ప్రయాణాన్ని అందిస్తుంది. ఎంజీ ప్రీమియం సెలెక్ట్ విక్రయశాలల ద్వారా ఈ కార్లను విక్రయిస్తారు. ఆగస్టు 10 నుంచి ఎం9 డెలివరీలను కంపెనీ ప్రారంభించనుంది. ప్రస్తుతం దేశంలో ఇదే అతి పెద్ద విలాస ఎంపీవీ అని కంపెనీ చెబుతోంది. పెర్ల్ లస్టర్ వైట్, మెటల్ బ్లాక్, కాంక్రీట్ గ్రే రంగుల్లో ఈ కారు లభించనుంది. కియా కార్నివాల్, టయోటా వెల్‌ఫైర్ వంటి కార్లతో ఎం9 పోటీపడనుంది.

అల్ట్రాటెక్ లాభం రూ.2,221 కోట్లు

దిల్లీ: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2025-26) మొదటి త్రైమాసికంలో అల్ట్రాటెక్ సిమెంట్ రూ.2,220.91 కోట్ల ఏకీకృత నికర లాభాన్ని ప్రకటించింది. 2024-25 ఇదే త్రైమాసిక లాభం రూ.1,493.45 కోట్లే కావడం గమనార్హం. ఇదే సమయంలో మొత్తం కార్యకలాపాల ఆదాయం రూ.18,818.56 కోట్ల నుంచి రూ.21,275.45 కోట్లకు వృద్ధి చెందింది. జూన్ త్రైమాసికంలో ఇండియా సిమెంట్స్, వండర్ వాల్‌కేర్, రస్ అల్‌ఖైమా, యూఏఈ సంస్థ ఆర్ఏకేడబ్ల్యూసీటీలను అల్ట్రాటెక్ కొనుగోలు చేసింది. దీంతో ప్రస్తుత ఫలితాలను 2024-25 తొలి త్రైమాసిక ఫలితాలతో పోల్చిచూడలేమని వెల్లడించింది. అల్ట్రాటెక్‌లో కేశోరామ్ ఇండస్ట్రీస్‌కు చెందిన సిమెంట్ వ్యాపారం విలీనం 2025 మార్చి 1 నుంచి అమల్లోకి వచ్చింది.
✦ సమీక్షిస్తున్న త్రైమాసికంలో కంపెనీ ఏకీకృత విక్రయాలు 9.7% పెరిగి 36.83 మిలియన్ టన్నులకు చేరాయి. గ్రే సిమెంట్ వార్షిక సామర్థ్యం 192.26 మిలియన్ టన్నులకు పెరిగింది. అల్ట్రాటెక్ మొత్తం వ్యయాలు రూ.18,405.19 కోట్లుగా నమోదయ్యాయి. ఇతరాదాయంతో కలిసిన మొత్తం ఆదాయం రూ.21,455.68 కోట్లుగా ఉంది. చమురు ధరలు తగ్గడంతో ఇంధన వ్యయాలు 12% తగ్గుముఖం పట్టాయి. ముడివస్తువుల ధరలు 2% పెరిగాయి.

జూన్‌లో కీలక రంగాల వృద్ధి 1.7%

దిల్లీ: దేశంలో కీలక మౌలిక రంగాల వృద్ధి ఈ ఏడాది జూన్‌లో 1.7 శాతానికి పరిమితమైంది. గతేడాది ఇదే నెలలో ఈ వృద్ధి 5% కావడం గమనార్హం. ఈ ఏడాది మే నెలలో కీలక మౌలిక రంగాల వృద్ధి 1.2 శాతమే కనుక, దానితో పోలిస్తే మెరుగైంది. గత నెలలో బొగ్గు (-6.8%), ముడి చమురు (-1.2%), సహజ వాయువు (-2.8%), ఎరువులు (-1.2%), విద్యుత్తు (-2.8%) ఉత్పత్తిలో ప్రతికూల వృద్ధి నమోదైంది. రిఫైనరీ ఉత్పత్తులు (3.4%), ఉక్కు (9.3%), సిమెంటు (9.2%) సానుకూల వృద్ధిని కనబరచాయి.
✦ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ఏప్రిల్-జూన్‌లో ఎనిమిది కీలక రంగాల వృద్ధి 1.3 శాతంగా నమోదైంది. 2024-25 ఇదే సమయంలో ఇది 6.2 శాతంగా ఉంది.

బ్యాంకుల డిజిటల్ ఛానళ్లపై థర్డ్ పార్టీ ఉత్పత్తులు వద్దు

ఆర్‌బీఐ ప్రతిపాదన


ముంబయి: బ్యాంకుల డిజిటల్ బ్యాంకింగ్ ఛానళ్లపై థర్డ్ పార్టీ ఉత్పత్తులు, సేవలను ప్రదర్శించరాదని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) తాజాగా జారీ చేసిన ముసాయిదా నిబంధనల్లో పేర్కొంది. ప్రమోటర్ గ్రూప్‌లు, బ్యాంక్ గ్రూప్ సంస్థలు (అనుబంధ/సంయుక్త సంస్థలు/ అసోసియేట్స్)కు సంబంధించిన థర్డ్ పార్టీ ఉత్పత్తులకు ఇది వర్తిస్తుంది. 'ఆర్‌బీఐ (డిజిటల్ బ్యాంకింగ్ ఛానల్స్ ఆథరైజేషన్) ఆదేశాలు, 2025' ప్రకారం.. ముప్పు ఆధారిత లావాదేవీల పర్యవేక్షణ, నిఘా వ్యవస్థలను బ్యాంకులు కలిగి ఉండాలి. వినియోగదారు లావాదేవీల సరళి, అనుమానాస్పద లావాదేవీల పర్యవేక్షణ లేదా ఇతర లావాదేవీల కోసం వినియోగదారుల నుంచి ముందస్తు స్పష్టత తీసుకోవాలని ముసాయిదా పేర్కొంది. మొబైల్ బ్యాంకింగ్ సేవలను అందించే బ్యాంకులు (మొబైల్ యాప్స్ ద్వారా కాకుండా), వినియోగదారులు ఆ సేవలు పొందగలరని నిర్ధారించుకోవాలి. నెట్‌వర్క్‌తో సంబంధం లేకుండా సేవలను వినియోగదారులు పొందాలని దీని అర్థం.

క్రిప్టో చోరీల విలువ రూ.18,500 కోట్లు

చైన్‌అలిసిస్ నివేదిక

దిల్లీ: ఈ ఏడాది తొలి అర్ధభాగంలో, క్రిప్టోకరెన్సీల్లో 2.17 బిలియన్ డాలర్ల (దాదాపు రూ.18,500 కోట్ల) విలువైన అపహరణలు చోటుచేసుకున్నాయని బ్లాక్‌చైన్ ఎనలిటిక్స్ ప్లాట్‌ఫాం అయిన చైన్‌అలిసిస్ నివేదిక తెలిపింది. డిజిటల్ కరెన్సీ ప్రపంచంలో సైబర్ దాడుల ప్రభావాన్ని ఈ గణాంకాలు తెలియజేస్తున్నాయి. 2022 జూన్‌తో పోలిస్తే 2025 జూన్ చివరికి క్రిప్టోల్లో చోరీలు 17% అధికమైనట్లు ఆ నివేదిక తెలిపింది. మనదేశంలో క్రిప్టోకరెన్సీ ఎక్స్ఛేంజీ అయిన కాయిన్‌డీసీఎక్స్‌పై గత వారంలో సైబర్‌దాడి జరిగి 44.2 మి.డాలర్లు (దాదాపు రూ.378 కోట్లు) చోరీకి గురయ్యాయి. ఇంతవరకు క్రిప్టో చోరీలు 2022లోనే ఎక్కువగా జరిగాయని పరిగణిస్తున్నాయి. అప్పట్లో బైబిట్ హ్యాకింగ్‌కు గురికావడంతో 1.5 బిలియన్ డాలర్లు కోల్పోవడం క్రిప్టో చరిత్రలో అతిపెద్ద హ్యాకింగ్‌గా నిలిచింది.
✦ 2025లో ఇప్పటిదాకా అమెరికా, జర్మనీ, రష్యా, కెనడా, జపాన్, ఇండోనేషియా, దక్షిణ కొరియాల్లో బాధితులు ఎక్కువ మంది కనిపించారు.
✦ గతేడాదిలో భారత క్రిప్టో ఎక్స్ఛేంజీ అయిన వాజిర్‌ఎక్స్‌పైనా హ్యాకింగ్ జరిగింది. దీని వల్ల 230 మి. డాలర్లు కోల్పోయారు.

వాణిజ్య ఒప్పందంపై తదుపరి దశ చర్చలకు
ఆగస్టులో వస్తున్న అమెరికా బృందం



దిల్లీ: ప్రతిపాదిత ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందంపై తదుపరి విడత చర్చల కోసం, వచ్చే నెలలో మనదేశానికి అమెరికా బృందం ఒకటి రానుంది. గత వారం వాషింగ్టన్‌లో అయిదో దఫా చర్చలను భారత్-అమెరికా బృందాలు పూర్తి చేశాయి. ఇందులో వ్యవసాయం, డెయిరీ ఉత్పత్తులపై చర్చలు జరిగినట్లు సమాచారం. 'ఆగస్టు ద్వితీయార్ధంలో అమెరికా బృందం భారత్‌కు రానుంద'ని ఒక ఉన్నతాధికారి వివరించారు.

యూకేతో 24న వాణిజ్య ఒప్పందం

భారత్-యునైటెడ్ కింగ్‌డమ్ (యూకే) మధ్య స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందంపై ఈనెల 24న సంతకాలు జరగనున్నాయి. ఇందుకోసం ప్రధానమంత్రి నరేంద్రమోదీ, వాణిజ్య మంత్రి పీయూష్ గోయల్ లండన్ వెళ్తున్నారు.

సంక్షిప్తంగా..

✦ హరియాణాలోని పానిపట్‌లో ఉన్న హెచ్‌పీసీఎల్ రిఫైనరీ వద్ద దేశంలోనే అతిపెద్ద గ్రీన్ హైడ్రోజన్ ప్లాంటును ఎల్అండ్‌టీకి చెందిన ఎల్అండ్‌టీ ఎనర్జీ గ్రీన్ ఏర్పాటు చేయనుంది.
✦ ఇంగ్లండ్ అండ్ వేల్స్ క్రికెట్ బోర్డ్ నిర్వహించే క్రికెట్ లీగ్ ద హండ్రెడ్‌లో ఫ్రాంఛైజీగా ఉన్న నార్తర్న్ సూపర్‌ఛార్జర్స్‌ను 10.05 కోట్ల పౌండ్ల (దాదాపు రూ.1,170 కోట్ల)తో కొనుగోలు చేసేందుకు సన్ టీవీ నెట్‌వర్క్ బోర్డు ఆమోదం తెలిపింది.
✦ అర్హత కలిగిన సంస్థాగత మదుపర్లకు ఈక్విటీ జారీ చేయడం ద్వారా రూ.3000 కోట్ల వరకు సమీకరించనున్నామని ఇరెడా వెల్లడించింది.

ఏప్రిల్ - జూన్ త్రైమాసిక ఫలితాలు (రూ.కోట్లలో)

కంపెనీ	నికర లాభం/(నష్టం)		మొత్తం ఆదాయం	
	2025-26	2024-25	2025-26	2024-25
పీఎన్‌బీ హౌసింగ్	534	433	2082	1832
యూకో బ్యాంక్	607	551	7433	6859
సిఫి	(38.9)	(5.2)	1072.3	942.1
హావెల్స్	352.3	411.18	5437.81	5798.11
ఎటెర్నల్	25	253	7167	4206
ఒబెరాయ్ రియాల్టీ★	421.25	584.51	1073.98	1441.95

★ మధ్యంతర డివిడెండ్ రూ.2

విమానాశ్రయ వ్యాపారాలపై అదానీ రూ.లక్ష కోట్ల పెట్టుబడులు



● వచ్చే అయిదేళ్లకు ప్రణాళిక
● జీత్ అదానీ వెల్లడి

గౌతమ్ అదానీ నేతృత్వంలోని అదానీ గ్రూప్ తన విమానాశ్రయ వ్యాపారాన్ని మరింతగా విస్తరించనుంది. వచ్చే అయిదేళ్లలో రూ.లక్ష కోట్ల వరకు పెట్టుబడులు ఈ రంగంలో పెట్టనున్నట్లు గౌతమ్ అదానీ కుమారుడు, అదానీ గ్రూప్ విమానాశ్రయ వ్యాపారాధిపతి జీత్ అదానీ వెల్లడించారు. ఇప్పటికే ఈ గ్రూప్, మనదేశంలో ముంబయి సీఎస్ఎంఐఏ సహా 7 విమానాశ్రయాలను నిర్వహిస్తుండగా.. వచ్చే అక్టోబరుకల్లా నవీ ముంబయి విమానాశ్రయం కూడా జత చేరనుంది.

విదేశాల్లో విస్తరణ లేదు: ప్రస్తుతానికి ఇతర దేశాల్లో విమానాశ్రయాలకు విస్తరించే ప్రణాళికలు లేవని ఒక ఆంగ్ల వార్తా సంస్థకిచ్చిన ఇంటర్వ్యూలో జీత్ తెలిపారు. 'మనదేశంలోనే వచ్చే 10-15 ఏళ్లలో విమానయానంలో భారీ వృద్ధి అవకాశాలున్నాయని మేం భావిస్తున్నాం. పీపీపీ (ప్రభుత్వ-ప్రైవేటు భాగస్వామ్య) పద్ధతిలో అభివృద్ధి చేయడానికి 26 విమానాశ్రయాలను గుర్తించారు. అందుకే విదేశాల కంటే ఇక్కడే బలంగా విస్తరించాలని భావిస్తున్న'ట్లు తెలిపారు.

ఏ విమానాశ్రయాల్లో అంటే..: అయిదేళ్లలో విమానాశ్రయ మౌలిక వసతులు, స్థిరాస్తులపై రూ.95,000-96,000 కోట్ల వరకు పెట్టుబడులు పెట్టనున్నట్లు తెలిపారు. ఇందులో ఎక్కువ భాగం నవీ ముంబయి విమానాశ్రయం, ముంబయి విమానాశ్రయంపైనే పెట్టనున్నట్లు తెలిపారు. 'నవీ ముంబయిలో రూ.19,000 కోట్లతో 2 కోట్ల మంది ప్రయాణికుల వార్షిక సామర్థ్యంతో విమానాశ్రయాన్ని నిర్మిస్తున్నాం. ఇక్కడ నిర్మించబోయే టీ2లోనూ 3 కోట్ల మంది ప్రయాణించేలా రూ.30,000 కోట్లు, లేదా 5 కోట్ల మంది ప్రయాణించేలా రూ.40,000-45,000 కోట్ల పెట్టుబడులు పెడతాం. అహ్మదాబాద్, జయపుర, తిరువనంతపురంలలో కొత్త టెర్మినళ్ల ఏర్పాటు ప్రణాళికలూ ఉన్నాయి. వీటితో పాటు లఖ్‌నవూలో కొత్త టెర్మినల్ విస్తరణ కూడా ఉంటుంది. గువహటిలో కొత్త టెర్మినల్‌ను అక్టోబరు-నవంబరుకల్లా అందుబాటులోకి తీసుకురానున్న'ట్లు ఆయన వివరించారు. విమానయాన సంస్థలైన ఇండిగో, ఎయిరిండియా యాజమాన్యాలతో మంచి సంబంధాలున్నాయని, తమ ప్రణాళికల్లో వారు.. వారి ప్రణాళికల్లో తాము పాలు పంచుకుంటున్నామన్నారు.

బీసీసీఐ, రవీంద్రన్ పిటిషన్లను కొట్టివేసిన సుప్రీం

దిల్లీ: ఎడ్యుటెక్ సంస్థ బైజూస్‌పై దివాలా ప్రక్రియ ఉపసంహరించాలంటూ బీసీసీఐ, బైజూస్ సహ వ్యవస్థాపకుడు రవీంద్రన్ దాఖలు చేసిన అప్పీళ్లను తిరస్కరిస్తూ, గతంలో ఎన్‌సీఎల్ఏటీ ఇచ్చిన ఆదేశాలను సుప్రీం కోర్టు సమర్థించింది. ఏప్రిల్ 17 నాటి నేషనల్ కంపెనీ లా అప్పిలేట్ ట్రిబ్యునల్ (ఎన్‌సీఎల్ఏటీ) తీర్పును సవాలు చేస్తూ బీసీసీఐ, రవీంద్రన్ దాఖలు చేసుకున్న పిటిషన్లను న్యాయమూర్తులు జస్టిస్ జేబీ పర్దీవాలా, జస్టిస్ ఆర్ మహదేవన్‌లతో కూడిన సుప్రీం ధర్మాసనం కొట్టిపారేసింది. కొత్త కమిటీ ఆఫ్ క్రెడిటర్స్ (సీఓసీ)కు ముందు సెటిల్‌మెంట్ ఆఫర్ తీసుకెళ్లాలని నేషనల్ కంపెనీ లా ట్రిబ్యునల్ (ఎన్‌సీఎల్‌టీ)-బెంగళూరు బెంచి ఫిబ్రవరి 10న జారీ చేసిన ఆదేశాలను సైతం గతంలో బీసీసీఐ, రవీంద్రన్ సవాలు చేశారు.

మారుతీ 500 సేవాకేంద్రాలు

దిల్లీ: విక్రయానంతర సేవల కోసం ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో మారుతీ సుజుకీ ఇండియా 500 కేంద్రాలను ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. ఇప్పటికే ఇందులో 91 ప్రారంభించింది కూడా. తాజాగా రాజస్థాన్‌లోని ఉదయ్‌పూర్‌లో కొత్త సేవా కేంద్రాన్ని కంపెనీ ప్రారంభించింది. దీంతో దేశవ్యాప్తంగా కంపెనీకి ఉన్న మొత్తం సేవా కేంద్రాల సంఖ్య 5,500కు చేరింది. 2024-25లో 460 కొత్త సేవా కేంద్రాలను మారుతీ తెరిచింది.

మేలో 20.06 లక్షల మంది సభ్యుల చేరిక: ఈపీఎఫ్ఓ

దిల్లీ: ఈ ఏడాది మేలో ఉద్యోగుల భవిష్య నిధి సంస్థ (ఈపీఎఫ్ఓ)లో నికరంగా 20.06 లక్షల మంది సభ్యులు చేరారు. 2018 ఏప్రిల్‌లో చందాదార్ల గణాంకాలను వెల్లడించడం ప్రారంభించాక, ఇంత అధికంగా చేరడం ఇప్పుడే. ఈ ఏడాది ఏప్రిల్‌తో పోలిస్తే 4.79%, 2024 మేతో పోలిస్తే 2.84% ఎక్కువగా సభ్యులు చేరారు. వీళ్లలో 9.42 లక్షల మంది కొత్తగా ఉద్యోగాల్లో చేరిన వాళ్లు. 2025 ఏప్రిల్‌తో పోలిస్తే కొత్త ఉద్యోగుల సంఖ్య 11.04% పెరిగింది. కొత్త ఉద్యోగుల్లో 18-25 ఏళ్లలోపు వారు 5.60 లక్షల మంది ఉన్నారు. మేలో సుమారు 2.62 లక్షల మంది కొత్త మహిళా చందాదార్లు ఈపీఎఫ్ఓలో చేరారు.

స్మార్ట్‌ఫోన్ల సరఫరాలు మళ్లీ పెరిగాయ్

దిల్లీ: దేశీయంగా స్మార్ట్‌ఫోన్ల విక్రయాలు మళ్లీ పెరుగుతున్నాయి. వరుసగా రెండు త్రైమాసికాలు స్మార్ట్‌ఫోన్ల సరఫరాలు క్షీణించగా, ఏప్రిల్-జూన్‌లో పెరిగినట్లు మార్కెట్ పరిశోధనా సంస్థ కానలిస్ తెలిపింది. 2024 ఇదే త్రైమాసికంతో పోలిస్తే 7%, ఈ ఏడాది జనవరి-మార్చితో పోలిస్తే 22% పెరిగినట్లు వివరించింది. రానున్న పండగల సీజన్‌ను దృష్టిలో పెట్టుకుని, కంపెనీల నుంచి విక్రయదార్లకు 3.9 కోట్ల స్మార్ట్‌ఫోన్లు సమీక్షా త్రైమాసికంలో సరఫరా అయినట్లు పేర్కొంది. కంపెనీల నుంచి కొత్త మోడళ్ల విడుదల కూడా ప్రభావం చూపుతుంది.

హెచ్‌డీఎఫ్‌సీ, ఐసీఐసీఐ షేర్ల జోరు

సెన్సెక్స్ ▲443 82200 | నిఫ్టీ ▲122 25091

లాభాల్లో ముగిసిన సూచీలు

ఎఫ్ఐఐ విక్రయాలు రూ.1,681.23 కోట్లు
డీఐఐ కొనుగోళ్లు రూ.3,578.43 కోట్లు

సమీక్ష

ఏప్రిల్- జూన్ త్రైమాసిక ఫలితాల జోష్‌తో ప్రైవేట్ రంగ హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, ఐసీఐసీఐ బ్యాంక్ షేర్లు రాణించాయి. ఈ ప్రభావంతో సూచీలూ లాభాల బాట పట్టాయి. నిఫ్టీ తిరిగి 25,000 పాయింట్ల ఎగువన ముగిసింది. విదేశీ మార్కెట్ల సానుకూల సంకేతాలూ ఉపకరించాయి. బీఎస్ఈలోని నమోదిత కంపెనీల మార్కెట్ విలువ రూ.1.50 లక్షల కోట్లు పెరిగి రూ.459.89 లక్షల కోట్ల (5.33 లక్షల కోట్ల డాలర్ల)కు చేరింది.

లాభాలతో మొదలై...: సెన్సెక్స్ 160.80 పాయింట్ల (క్రితం ముగింపు 81,757.73) లాభంతో 81,918.53 వద్ద ఆరంభమైంది. వెంటనే నష్టాల్లోకి జారినా, మళ్లీ పుంజుకుని 82,274.03 పాయింట్ల వద్ద ఇంట్రాడే గరిష్ఠాన్ని నమోదు చేసింది. చివరకు 442.61 పాయింట్లు పెరిగి 82,200.34 వద్ద ముగిసింది. ఎన్ఎస్ఈ నిఫ్టీ 122.30 పాయింట్లు లాభపడి 25,090.70 పాయింట్ల వద్ద స్థిరపడింది. ఇంట్రాడేలో 24,882.30 పాయింట్ల వద్ద కనిష్ఠాన్ని, 25,111.40 పాయింట్ల వద్ద గరిష్ఠాన్ని తాకింది. సెన్సెక్స్ 30 షేర్లలో 11 మినహా మిగతావి లాభాల్లో ముగిశాయి.



జూన్ త్రైమాసిక ఫలితాల ప్రభావంతో

✦ రిలయన్స్ ఇండస్ట్రీస్ షేర్లలో మదుపర్లు లాభాలు స్వీకరించారు. దీంతో బీఎస్ఈలో ఈ కంపెనీ షేరు 3.29% నష్టపోయి రూ.1,428.20 వద్ద ముగిసింది.
✦ హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ ఫలితాలు ఫరవాలేదనిపించే రీతిలో ఉండటంతో, ఈ షేరు బీఎస్ఈలో 2.19% పెరిగి రూ.2000.20 వద్ద స్థిరపడింది.
✦ ఐసీఐసీఐ బ్యాంక్ నికర లాభంలో 15.9% వృద్ధిని ప్రకటించడంతో బీఎస్ఈలో షేరు 2.76% పెరిగి రూ.1,465.85 వద్ద ముగిసింది.
✦ జొమాటో, బ్లింకిట్ బ్రాండ్లపై కార్యకలాపాలు నిర్వహిస్తున్న ఎటెర్నల్ షేరు బీఎస్ఈలో 5.38% పెరిగి రూ.271.20 వద్ద ముగిసింది.

డాలరు.. రూ.86.31 (+15 పైసలు)
బ్రెంట్ ముడి చమురు.. 68.89 డాలర్లు (-0.55%)

నేటి బోర్డు సమావేశాలు: కోల్గేట్, సైయెంట్ డీఎల్ఎం, దాల్మియా భారత్, డిక్సన్, ఐఆర్ఎఫ్‌సీ, పేటీఎం, జీ ఎంటర్‌టైన్‌మెంట్, వీఎస్‌టీ ఇండస్ట్రీస్, ఎం అండ్ ఎం ఫైనాన్స్

జేన్‌స్ట్రీట్‌పై ట్రేడింగ్ నిషేధం తొలగింపు

అమెరికాకు చెందిన ప్రొప్రయిటరీ ట్రేడింగ్ సంస్థ జేన్ స్ట్రీట్‌పై ట్రేడింగ్ ఆంక్షలను, మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీ ఎత్తివేసింది. ఈనెల 3న సెబీ ఆదేశాలకు అనుగుణంగా రూ.4,843.57 కోట్లను ఎస్క్రో ఖాతాలో జేన్ స్ట్రీట్ డిపాజిట్ చేయడంతో.. తిరిగి ట్రేడింగ్ కార్యకలాపాలను ప్రారంభించేందుకు అనుమతి ఇచ్చింది.

ఐపీఓ సమాచారం

✦ బ్రిగేడ్ హోటల్ వెంచర్స్ పబ్లిక్ ఇష్యూకు రూ.85-90 ధరల శ్రేణిని నిర్ణయించారు. ఈనెల 24న ప్రారంభమై 28న ముగియనున్న ఈ ఐపీఓ ద్వారా కంపెనీ రూ.760 కోట్లు సమీకరించాలని అనుకుంటోంది.
✦ ఏంథమ్ బయోసైన్సెస్ షేరు సోమవారం బీఎస్ఈలో రూ.723.10 వద్ద నమోదైంది. ఇష్యూ ధర రూ.570 కంటే ఇది 26.85% ఎక్కువ. ఆ తర్వాత మరింత పెరిగి రూ.746.70 వద్ద ఇంట్రాడే గరిష్ఠాన్ని చేరింది. చివరకు 28.13% లాభంతో రూ.730.35 వద్ద ముగిసింది.
✦ పబ్లిక్ ఇష్యూ ద్వారా రూ.2035 కోట్లు సమీకరించేందుకు అనుమతి కోరుతూ సెబీ వద్ద ముసాయిదా పత్రాలను డెయిరీ ఉత్పత్తుల సంస్థ మిల్కీ మిస్ట్ డెయిరీ ఫుడ్ లిమిటెడ్ దాఖలు చేసింది. ఇందులో రూ.1785 కోట్ల విలువైన తాజా షేర్లతో పాటు, ప్రమోటర్లు రూ.250 కోట్ల విలువైన షేర్లు విక్రయిస్తారు.

కరెంట్ అఫైర్స్



✿ ఎవరెస్ట్ శిఖరాన్ని అధిరోహించిన మొదటి సీఐఎస్‌ఎఫ్ అధికారిణిగా ఇటీవల ఎవరు చరిత్ర సృష్టించారు?
జ: గీతా సమోటా

✿ అంతర్జాతీయ శాంతితో కలసి జీవించే దినోత్సవాన్ని (ఇంటర్నేషనల్ డే ఆఫ్ లివింగ్ టుగెదర్ ఇన్ పీస్) ఐక్యరాజ్యసమితి ఏ రోజున నిర్వహిస్తోంది? (ఐక్యరాజ్యసమితి సస్టెయినబుల్

మాదిరి ప్రశ్నలు

డెవలప్‌మెంట్ గోల్స్ (ఎస్‌డీజీ) లోని 16 (పీస్, జస్టిస్, అండ్ స్ట్రాంగ్ ఇన్‌స్టిట్యూషన్స్)వ గోల్‌కు అనుగుణంగా దీన్ని నిర్వహిస్తున్నారు.) జ: మే 16

✿ ఇటీవల ఏ దేశ ఫుట్‌బాల్ సమాఖ్యపై విధించిన సస్పెన్షన్‌ను ఫిఫా (ఫెడరేషన్ ఆఫ్ ఇంటర్నేషనల్ ఫుట్‌బాల్ అసోసియేషన్) ఎత్తివేసింది?
జ: రిపబ్లిక్ ఆఫ్ కాంగో


✿ ఇండియన్ కోస్ట్ గార్డ్ (ఐసీజీ) ఏటా చేపట్టే ఏ ఆపరేషన్ ద్వారా ఇటీవల ఒడిశాలోని రుషికుల్య నది ముఖద్వారం వద్ద గూడు కట్టుకున్న దాదాపు 6.98 లక్షల ఆలివ్ రిడ్లీ తాబేళ్లను విజయవంతంగా రక్షించింది?
జ: ఆపరేషన్ ఒలివియా

మరింత సమాచారం

✿ అంతర్జాతీయ టీ దినోత్సవాన్ని ఏటా ఏ రోజున నిర్వహిస్తారు? ('టీ ఫర్ బెటర్ లైవ్స్' అనే థీమ్‌తో 2025లో ఈ దినోత్సవాన్ని నిర్వహించారు.) జ: మే 21

జనరల్ స్టడీస్
రసాయనశాస్త్రం

స్థిరమైన నురగను ఇవ్వకపోతే కఠినం!



నిత్యం అందరూ తాగే నీరు ఒక సార్వత్రిక ద్రావణం. టానిక్‌లు, ఇంటిని శుభ్రపరిచే ఉత్పత్తులు తదితరాలన్నీ ద్రావణాల రూపంలోనే ఉంటాయి. అన్నిరకాల పరిశ్రమల్లో ద్రావణాల వాడకం తప్పనిసరి. ఈ విధంగా రోజువారీ జీవితంలో ద్రావణాలు ప్రధాన భాగంగా మారాయి. రెండు లేదా అంతకు మించిన సజాతీయ పదార్థాల కలయికతో ద్రవ లేదా ఘన స్థితిలో ఉన్న పదార్థమే ద్రావణం. ఇందులో వివిధ భాగాలన్నీ రసాయనికంగా కలిసిపోయి చూసేందుకు ఒకే రీతిలో కనిపిస్తాయి. చుట్టూ ఉన్న ప్రపంచాన్ని శాస్త్రీయంగా అర్థం చేసుకోవాలంటే ఈ ద్రావణాల గురించి అవగాహన ఉండాలి. ద్రావణాల్లో రకాలు, అవి లభ్యమయ్యే పరిస్థితులు, ద్రావణీయత, దానిని ప్రభావితం చేసే అంశాలను స్థూలంగా తెలుసుకోవాలి.

నీరు-ద్రావణాలు

పరిశుద్ధ నీరు

వర్షపు నీరు వాతావరణంలోకి ప్రవేశించక ముందు పరిశుద్ధంగా ఉంటుంది. ప్రకృతిలో లభ్యమయ్యే నీటిలో అతిశుద్ధమైనది వర్షపు నీరు. తాగడానికి ఉపయోగపడే నీటిని 'పోటబుల్ నీరు (తాగునీరు)' అంటారు. స్వేదన జలం కూడా పరిశుద్ధమైనదే. ఇది విద్యుత్తు వాహకం కాదు. కారణం ఇది అయనీకరణం చెందదు. నీటికి ఉండే హైడ్రోజన్ బంధాల కారణంగా దాని మరిగే స్థానం అధికం. లోతుకు వెళ్లే కొద్దీ, లవణీయత పెరుగుతున్న కొద్దీ సముద్రపు నీరు సాంద్రత పెరుగుతుంది. నీటిసాంద్రత 4 డిగ్రీల సెంటీగ్రేడ్ వద్ద గరిష్ఠం. దీనికి కారణం నీటి అసంగత వ్యాకోచం.

1) **స్వాదు జలం:** సబ్బు ద్రావణంతో నురగను త్వరగా ఇచ్చే నీటిని 'స్వాదు జలం' అంటారు.
2) **కఠిన జలం:** సబ్బు ద్రావణంతో స్థిరమైన నురగను ఇవ్వని నీటిని 'కఠిన జలం' అంటారు.
3) **తాత్కాలిక కాఠిన్యత:** కాల్షియం, మెగ్నీషియం బైకార్బొనేట్లు నీటిలో కరిగి ఉండటం వల్ల తాత్కాలిక కఠినత్వం ఏర్పడుతుంది. నీటిని మరిగించడం లేదా తడి సున్నం కలపడం వల్ల కఠినత్వాన్ని తొలగించవచ్చు.
4) **శాశ్వత కాఠిన్యత:** కాల్షియం, మెగ్నీషియం క్లోరైడ్‌లు, సల్ఫేట్‌ల వల్ల శాశ్వత కఠినత్వం ఏర్పడుతుంది. ఈ రకమైన కఠినత్వాన్ని నీటిని మరిగించడం వల్ల తొలగించడం కుదరదు. నీటి శాశ్వత కాఠిన్యాన్ని కొన్ని పద్ధతుల ద్వారా తొలగించవచ్చు. అవి- ఎ) పర్ముటైట్ అనే పదార్థం ద్వారా వడపోయడం. బి) కాల్గాన్ పద్ధతి సి) స్వేదన క్రియ డి) అయాన్ల వినిమయ పద్ధతి.

నీటి తాత్కాలిక లేదా శాశ్వత కాఠిన్యతను సోడా పద్ధతి ఉపయోగించి తొలగించవచ్చు. ఈ పద్ధతిలో నీటికి తగిన పరిమాణంలో సోడియం కార్బొనేట్ కలపాలి.

ద్రావణాలు

రెండు లేదా అంతకంటే ఎక్కువ పదార్థాల సజాతీయ మిశ్రమాన్ని 'ద్రావణం' అంటారు. దానిలో ఒక పదార్థాన్ని 'అనుఘటకం' అంటారు. రెండు మాత్రమే అనుఘటకాలు ఉన్న ద్రావణాన్ని 'ద్విగుణాత్మక ద్రావణం' అంటారు. ద్రావణం ఏర్పడటం అనేది భౌతిక మార్పు. ఈ ప్రక్రియలో కొత్త పదార్థాలు ఏర్పడవు. ద్రావణంలోని అనుఘటకాలను వేరు చేయవచ్చు.

భార జలం

సాధారణ నీటి అణువులో హైడ్రోజన్ పరమాణువుల స్థానంలో డ్యుటీరియం పరమాణువులను ఉంచితే భారజలం అణువు ఏర్పడుతుంది. దీనిని 'డ్యుటీరియం ఆక్సైడ్' అంటారు. దీని ఫార్ములాను D_2Oగా రాస్తారు. సాధారణ నీటిలో ప్రతి 6000 భాగాల్లో ఒక భాగం భారజలం ఉంటుంది. హిమాలయాల్లో మంచు కరగగా, మిగిలిన దానిలో కూడా భార జలం ఉంటుంది. మర్రి చెట్ల ఆకులపై, వర్షపు నీటిలోనూ స్వల్పంగా భారజలం ఉంటుంది. సాధారణంగా నీటిలాగే భార జలం కూడా రంగు, వాసన లేని ప్రవహించే గుణం ఉన్న ద్రవం. ఘనీభవన, బాష్పీభవన స్థానాలు; సాంద్రత, స్నిగ్ధత, విశిష్టోష్ణం, అత్యధిక సాంద్రత ఉండే ఉష్ణోగ్రత మొదలైన చాలా భౌతిక స్థిరాంకాలు భారజలానికి సాధారణ జలం కంటే ఎక్కువగా ఉంటాయి. న్యూక్లియర్ రియాక్టర్‌లో న్యూట్రాన్ల వేగాన్ని తగ్గించడానికి మితకారిణిగా, రసాయన సమ్మేళన విధానాలను అధ్యయనం చేయడానికి, ఫాస్ఫరస్, ఆక్సీ ఆమ్లాల నిర్మాణాలను తెలుసుకోవడానికి ఉపయోగిస్తారు.

ఉదా: ఉప్పు + నీరు → ఉప్పునీరు, అయోడిన్ + ఆల్కహాల్ → టింక్చర్ అయోడిన్

ద్రావితం: ఒక ద్విగుణాత్మక ద్రావణంలో తక్కువ పరిమాణంలో ఉండే అనుఘటకాన్ని 'ద్రావితం' అంటారు. ద్రావితం తన భౌతిక స్థితిని మార్చుకునే అవకాశం కలిగి ఉంటుంది.

జల ద్రావణం: నీరు ద్రావణిగా ఉండే ద్రావణాన్ని జలద్రావణం అంటారు. **ఉదా:** సముద్రపు నీరు

ఆల్కహాలిక్ ద్రావణం: ఆల్కహాల్ ద్రావణిగా ఉండే ద్రావణాన్ని ఆల్కహాలిక్ ద్రావణం అంటారు. **ఉదా:** టింక్చర్ అయోడిన్

ద్రావణీయత: నిర్దిష్ట ఉష్ణోగ్రత వద్ద ఒక సంతృప్త ద్రావణంలో కరిగి ఉన్న ద్రావిత పరిమాణాన్ని, ఆ ఉష్ణోగ్రత వద్ద దాని 'ద్రావణీయత' అంటారు. ద్రావణీయత మూడు అంశాలపై ఆధారపడుతుంది. అవి ద్రావిత స్వభావం, ద్రావణి స్వభావం, ఉష్ణోగ్రత.

* నీటిలో నాఫ్తలీన్ కరగదు, కానీ కిరోసిన్‌లో కరుగుతుంది. * నీటిలో ఉప్పు కరుగుతుంది, కానీ కిరోసిన్‌లో కరగదు. * కొన్ని సమ్మేళనాల ద్రావణీయత ఉష్ణోగ్రతకు అనులోమానుపాతంలో ఉంటుంది.

ద్రావణి: ఒక ద్విగుణాత్మక ద్రావణంలో ఎక్కువ పరిమాణంలో ఉండే అనుఘటకాన్ని ద్రావణి అంటారు. ద్రావణి తన నిజ భౌతిక స్థితిలోనే ద్రావణంలో కొనసాగుతుంది. **ఉదా:** చక్కెర ద్రావణంలో చక్కెర ద్రావితం, నీరు ద్రావణి.

ద్రావణం: ద్రావణి, ద్రావితాల మిశ్రమాన్ని 'ద్రావణం' అంటారు. **ఉదా:** చక్కెర ద్రావణం
* ఒక ద్రావణిలో ద్రావిత పరిమాణం తక్కువగా ఉంటే దానిని విలీన ద్రావణమని, ద్రావిత పరిమాణం ఎక్కువగా ఉంటే గాఢ ద్రావణం అంటారు.



కొల్లాయిడ్‌లు: జిగురు (Glue), గుడ్డులోని తెల్ల భాగం (Albumen), జిలాటిన్ లాంటి పదార్థాలు సరంధ్ర పొర ద్వారా చాలా నెమ్మదిగా వ్యాపిస్తాయి.



ఇలాంటి పదార్థాలను కొల్లాయిడ్స్ అంటారు. ఒక కొల్లాయిడ్‌లో క్రమరూపంలో ఉన్న పదార్థాన్ని విక్షిప్త ప్రావస్థ అని, అలాంటి కణాలను విక్షేపణం చేసే పదార్థాన్ని 'విక్షేపణ యానకం' అంటారు. **ఉదా:** పొగమంచు - ఇది వాయువులో ద్రవపదార్థానికి ఉదాహరణగా చెప్పవచ్చు.

* ఆభరణాల పూతకు సోల్స్ ఉపయోగిస్తారు. సోల్ అంటే ద్రవపదార్థంతో విక్షేపణం చేసిన ఘనపదార్థ కణాలు.

టిండాల్ ప్రభావం: కొల్లాయిడ్స్ కాంతిని పరిక్షేపణం చేస్తాయి. వీటి ద్వారా కాంతిని పంపి లంబదిశ నుంచి చూసినప్పుడు చిన్న కణాలు కాంతిని పరిక్షేపించిన కారణంగా కాంతి మండలం అంటే ద్రవంలో తేలియాడుతున్న చిన్నచిన్న కణాలు కాంతిని చెదరగొట్టడం. దీనినే 'టిండాల్ ప్రభావం' అంటారు.



ఉదా: * వంట గదిలో ఓవెన్ నుంచి వచ్చే పొగపై సూర్యకాంతి పడినప్పుడు టిండాల్ ప్రభావాన్ని గమనించవచ్చు.
* ఇంటి పైకప్పు నుంచి సన్నని రంధ్రం ద్వారా సూర్యరశ్మి పడినప్పుడు చిన్నచిన్న ధూళి కణాలు కాంతి మండలంగా కనపడటం. * దట్టమైన అడవుల్లో సూర్యకాంతి ప్రసరిస్తే టిండాల్ ప్రభావాన్ని గమనించవచ్చు.

మాదిరి ప్రశ్నలు

1. తాగడానికి ఉపయోగపడే నీటిని ఏమని పిలుస్తారు?
   1) నిర్మలమైన నీరు 2) పరిశుభ్రమైన నీరు
   3) పోటబుల్ నీరు 4) స్వేదన జలం
2. సబ్బు నీటి నమూనాతో నురగను త్వరగా ఇస్తే దాన్ని ఏమని పిలుస్తారు?
   1) స్వాదు జలం 2) కఠిన జలం
   3) భార జలం 4) స్వేదన జలం
3. న్యూక్లియర్ రియాక్టర్‌లో న్యూట్రాన్ల వేగాన్ని తగ్గించడానికి దేన్ని ఉపయోగిస్తారు?
   1) భారజలం 2) మితకారి
   3) బోరాన్ కడ్డీలు 4) కార్బన్ కడ్డీలు
4. ద్రవంలో వాయువు ఉన్న ద్రావణాన్ని గుర్తించండి.
   1) సోడానీరు 2) తడిగాలి
   3) గాలిలో కర్పూరం 4) ఎమాల్గం
5. వాయువులో ఘనం ఉన్న ద్రావణాలను గుర్తించండి.
   1) సారాయి నీరు 2) తడినీరు
   3) గాలిలో కర్పూరం 4) ఇత్తడి
6. నీటి స్వచ్ఛమైన రూపం?
   1) వర్షపు నీరు 2) భార జలం
   3) పంపు నీరు 4) స్వేదన జలం
7. నీటి శాశ్వత కాఠిన్యతను తొలగించడానికి ఏ పద్ధతిని ఉపయోగించరు?
   1) సోడియం కార్బొనేట్ కలపడం 2) స్వేదనం
   3) కాస్టిక్ సోడా కలపడం 4) బాష్పీభవనం
8. టింక్చర్ అయోడిన్ ద్రావణంలో ద్రావణిని గుర్తించండి.
   1) నీరు 2) ఆల్కహాల్ 3) టింక్చర్
   4) కార్బన్‌డైఆక్సైడ్

సమాధానాలు: 1-3, 2-1, 3-2, 4-1, 5-3, 6-1, 7-4, 8-2.



రచయిత: చంటి రాజుపాలెం

ఎత్తయిన ఎవరెస్ట్.. లోతైన బైకాల్!

ప్రపంచం భౌతికంగా, నైసర్గికంగా ఉన్న తీరు, సహజ పర్యావరణ వ్యవస్థలు, వాటి ప్రయోజనాలను, ప్రభావాలను అర్థం చేసుకోవాలంటే భూగోళశాస్త్రాన్ని అధ్యయనం చేయాలి. మహా సముద్రాలు, ఖండాల వారీగా ప్రత్యేక పర్వతాలు, నదులు, సరస్సులు, ఎడారులు తదితర భూస్వరూపాలు, లభించే సహజవనరులు, స్థానిక వాతావరణ పరిస్థితులు, వివిధ దేశాల సామాజిక, ఆర్థిక స్థితిగతులు, రాజధానులు, ముఖ్యమైన నగరాలు, జనసాంద్రత వివరాలపై పోటీ పరీక్షార్థులు అవగాహన పెంచుకోవాలి. ప్రపంచ వాణిజ్యం కోసం తవ్విన కాలువలు, ప్రకృతి విపత్తులు ఎక్కువగా సంభవిస్తున్న ప్రాంతాలు, కీలకమైన అక్షాంశ, రేఖాంశాల గురించి పరిజ్ఞానాన్ని పెంచుకోవాలి.


ప్రపంచ భూగోళశాస్త్రం

మాదిరి ప్రశ్నలు

1. ప్రపంచంలో అత్యంత సజీవంగా ఉన్న అగ్నిపర్వతం?
   1) మౌనా లోవా (హవాయి)
   2) ఎట్నా (ఇటలీ)
   3) కిలావియా (హవాయి)
   4) ఫుజి (జపాన్)
2. భూమిపై నీరు ఎక్కువగా ఉన్న ఖండం?
   1) ఆస్ట్రేలియా 2) దక్షిణ అమెరికా
   3) ఉత్తర అమెరికా 4) అంటార్కిటికా
3. సహారా ఎడారి ఏ ఖండంలో ఉంది?
   1) ఆసియా 2) ఆఫ్రికా
   3) ఉత్తర అమెరికా 4) దక్షిణ అమెరికా
4. ప్రపంచంలో అతిపెద్ద ద్వీపం?
   1) మడగాస్కర్ 2) న్యూజిలాండ్
   3) గ్రీన్‌లాండ్ 4) శ్రీలంక
5. ప్రపంచంలో పొడవైన నది?



   1) నైలు 2) అమెజాన్
   3) మిస్సిసిపీ 4) గంగా
6. కిందివాటిలో అత్యధిక జనసాంద్రత ఉన్న దేశం?
   1) చైనా 2) భారత్
   3) బంగ్లాదేశ్ 4) జపాన్
7. అన్ని ఖండాల్లో అతి చిన్న ఖండం ఏది?
   1) అంటార్కిటికా 2) ఆస్ట్రేలియా
   3) దక్షిణ అమెరికా 4) యూరప్
8. ప్రపంచంలో ఎత్తయిన పర్వత శ్రేణి?
   1) ఆండీస్ 2) హిమాలయాలు
   3) రాకీ పర్వతాలు 4) ఆల్ప్స్
9. గ్రీన్‌విచ్ గమ్యాంకం (ప్రైమ్ మెరీడియన్) ద్వారా వెళ్లే నగరం?
   1) లండన్ 2) ప్యారిస్
   3) గ్రీన్‌విచ్ 4) న్యూయార్క్
10. ప్రపంచంలో అతిపెద్ద మహాసముద్రం?
    1) అట్లాంటిక్ మహాసముద్రం
    2) హిందూ మహాసముద్రం
    3) ఆర్కిటిక్ మహాసముద్రం
    4) పసిఫిక్ మహాసముద్రం
11. జనాభా పరంగా రెండో పెద్ద ఖండం?
    1) ఉత్తర అమెరికా 2) ఆఫ్రికా
    3) దక్షిణ అమెరికా 4) యూరప్
12. అత్యధిక దేశాలున్న ఖండం?
    1) ఆసియా 2) ఆఫ్రికా
    3) యూరప్ 4) దక్షిణ అమెరికా
13. ఉత్తర, దక్షిణార్ధ గోళాలను విడగొట్టే రేఖ?
    1) ప్రైమ్ మెరీడియన్ 2) భూమధ్యరేఖ
    3) రేఖాంశ రేఖలు 4) గమ్యాంక రేఖలు
14. సంతులిత వాతావరణం ఉన్న ఖండం?
    1) యూరప్ 2) ఆఫ్రికా
    3) ఆసియా 4) దక్షిణ అమెరికా
15. 'యూరో' కరెన్సీని ప్రధానంగా ఉపయోగించే ఖండం?
    1) ఆసియా 2) యూరప్
    3) ఆఫ్రికా 4) ఉత్తర అమెరికా
16. 'బ్రసీలియా' ఏ దేశానికి రాజధాని?
    1) అర్జెంటీనా 2) బ్రెజిల్
    3) చిలీ 4) మెక్సికో
17. ప్రపంచంలో అతిపెద్ద ఉప్పునీటి సరస్సు?
    1) బైకాల్ సరస్సు 2) అరల్ సరస్సు
    3) కాస్పియన్ సముద్రం
    4) విక్టోరియా సరస్సు
18. ప్రపంచంలో అత్యంత లోతయిన సరస్సు?
    1) బైకాల్ సరస్సు 2) అరల్ సరస్సు
    3) టిటికాకా సరస్సు
    4) విక్టోరియా సరస్సు
19. ప్రపంచంలో అత్యంత ఎత్తయిన పర్వత శిఖరం?



    1) కాంచన గంగా 2) మౌంట్ ఎవరెస్ట్
    3) కే2 4) మాకిన్లీ
20. ప్రపంచంలో రెండో ఎత్తయిన శిఖరం?
    1) మౌంట్ ఎవరెస్ట్ 2) కే2
    3) కాంచన గంగా 4) మాకిన్లీ
21. సూయజ్ కాలువ ఏ రెండు సముద్రాలు/ మహాసముద్రాలను కలుపుతుంది?
    1) ఎర్ర సముద్రం - పసిఫిక్ మహాసముద్రం
    2) ఎర్ర సముద్రం - మధ్యధరా సముద్రం
    3) అట్లాంటిక్ - హిందూ మహాసముద్రాలు
    4) బాల్టిక్ సముద్రం - నార్వే సముద్రం
22. భూమధ్యరేఖ ప్రాంతంలో ఎక్కువగా కనిపించే వాతావరణం?
    1) వేడి ఎండలు
    2) పొడి ఎడారి వాతావరణం
    3) తేమతో కూడిన ఉష్ణమండల వర్షపాతం
    4) మంచుతో కూడిన శీతల వాతావరణం
23. రుతుపవన దేశాలు ప్రధానంగా ఏ ఖండంలో ఉంటాయి?
    1) ఉత్తర అమెరికా 2) ఆఫ్రికా
    3) ఆసియా 4) ఆస్ట్రేలియా
24. ఎక్కువగా అగ్నిపర్వతాలున్న, భూకంపాలు వచ్చే ప్రాంతాన్ని ఏమంటారు?
    1) పసిఫిక్ రింగ్ ఆఫ్ ఫైర్
    2) అట్లాంటిక్ ఫైర్ బెల్ట్
    3) సహారా ఫాల్ట్ జోన్
    4) మెడిటేరియన్ లైన్
25. భూకంప తీవ్రతను కొలిచే పరికరం?
    1) బారోమీటర్ 2) సిస్మోగ్రాఫ్
    3) హైడ్రోమీటర్ 4) థర్మోమీటర్
26. అత్యల్ప జనాభా ఉన్న ఖండం?
    1) ఆస్ట్రేలియా 2) అంటార్కిటికా
    3) దక్షిణ అమెరికా 4) యూరప్
27. భూమధ్యరేఖ ఎన్ని ఖండాలమీదుగా వెళ్తుంది?
    1) 2 2) 3 3) 4 4) 5
28. భూమధ్యరేఖ వెంబడి ఉండే ప్రధాన వాతావరణం?
    1) తేమతో కూడిన ఉష్ణమండల వర్షపాతం
    2) పొడి ఎడారి వాతావరణం
    3) మంచుతో కూడిన శీతల వాతావరణం
    4) శీతల పర్వత వాతావరణం
29. కాన్‌బెర్రా ఏ దేశానికి రాజధాని?
    1) ఆస్ట్రేలియా 2) న్యూజిలాండ్
    3) బ్రెజిల్ 4) దక్షిణాఫ్రికా
30. ఖండాలను విడగొట్టే పెద్ద సముద్ర తీరరేఖ పేరు?
    1) ఫ్రెడరిక్ రేఖ
    2) ఇంటర్నేషనల్ డేట్ లైన్
    3) భూమధ్యరేఖ
    4) లిథోస్ఫెరిక్ ప్లేట్ బౌండరీ
31. అత్యధిక భూభాగం ఉన్న దేశం?
    1) చైనా 2) కెనడా
    3) యూఎస్‌ఏ 4) రష్యా
32. 'యువాన్' కరెన్సీ ఉపయోగించే దేశం?
    1) జపాన్ 2) దక్షిణ కొరియా
    3) చైనా 4) వియత్నాం
33. కిందివాటిలో అత్యంత పొడవైన కాలువ?
    1) సూయజ్ కాలువ 2) పనామా కాలువ
    3) గ్రాండ్ కాలువ (చైనా)
    4) స్ట్రెయిట్ ఆఫ్ జిబ్రాల్టర్
34. ఆండీస్ పర్వతాలు ఏ ఖండంలో ఉన్నాయి?
    1) ఆసియా 2) ఉత్తర అమెరికా
    3) దక్షిణ అమెరికా 4) ఆఫ్రికా
35. ప్రపంచంలో అతిపెద్ద ఎడారి?



    1) సహారా (తేమ ఎడారి)
    2) అంటార్కిటికా (మంచు ఎడారి)
    3) గోబి ఎడారి
    4) కలహరి ఎడారి
36. బోర్నియో ద్వీపం ఏ ఖండానికి చెందింది?
    1) ఆసియా 2) ఆస్ట్రేలియా
    3) ఆఫ్రికా 4) దక్షిణ అమెరికా
37. అట్లాంటిక్ సముద్రాన్ని పసిఫిక్ సముద్రంతో కలిపే కాలువ?
    1) సూయజ్ కాలువ 2) బేరింగ్స్ స్ట్రెయిట్
    3) పనామా కాలువ 4) జిబ్రాల్టర్ స్ట్రెయిట్
38. భూమి ఉపరితల ఉష్ణోగ్రత ఎక్కువగా ప్రభావితమయ్యే కారకం ఏమిటి?
    1) వర్షపాతం 2) గాలి ఒత్తిడి
    3) సూర్యరశ్మి కోణం 4) గాలి వేగం
39. భూమిపై ఉష్ణోగ్రత తగ్గే రేటు ఎంత?
    1) ప్రతి 1000 మీటర్లకు 3° సెంటిగ్రేడ్
    2) ప్రతి 1000 మీటర్లకు 6.5° సెంటిగ్రేడ్
    3) ప్రతి 500 మీటర్లకు 1° సెంటిగ్రేడ్
    4) ప్రతి 1000 మీటర్లకు 9° సెంటిగ్రేడ్
40. సంవత్సరంలో అత్యధిక ఉష్ణోగ్రత కలిగిన మాసం సాధారణంగా ఏది?
    1) డిసెంబరు 2) జూన్
    3) సెప్టెంబరు 4) ఫిబ్రవరి
41. ఉష్ణరేఖకు సమీపంలో ఉష్ణోగ్రత ఎక్కువగా ఉండటానికి కారణం ఏమిటి?
    1) తక్కువ వర్షపాతం
    2) అధిక పర్వతాలు
    3) సూర్యుడి కాంతి నేరుగా పడటం
    4) అధిక గాలి ఒత్తిడి
42. ఐసోథర్మ్స్ అంటే ఏమిటి?
    1) వర్షపాతం రేఖలు
    2) గాలి ఒత్తిడి రేఖలు
    3) సమ ఉష్ణోగ్రతలు కలిగిన ప్రాంతాలను సూచించే రేఖలు
    4) సమ ఉచ్ఛ్వాసం ఉన్న ప్రాంతాలు
43. జలమండలానికి సమీపంలో ఉష్ణోగ్రతలు ఎలా ఉంటాయి?
    1) అతి వేడిగా
    2) ఎక్కువ మార్పులతో
    3) స్థిరంగా ఉంటాయి
    4) ఎప్పుడూ తక్కువగా ఉంటాయి
44. భూమిపై అత్యధిక ఉష్ణోగ్రత నమోదైన ప్రదేశం ఏది?
    1) డెత్ వ్యాలీ 2) సహారా ఎడారి
    3) అమెజాన్ అడవి 4) అంటార్కిటికా
45. సముద్ర స్థాయికి దగ్గరగా ఉన్న ప్రాంతాల్లో ఉష్ణోగ్రత ఎలా ఉంటుంది?
    1) తక్కువ 2) ఎక్కువ
    3) స్థిరంగా 4) వేగంగా మారుతుంది
46. ప్రపంచంలో అత్యధిక జల ప్రవాహం కలిగిన నది ఏది?
    1) నైలు 2) అమెజాన్
    3) గంగా 4) డాన్యూబ్
47. ప్రపంచంలో నదుల పరంగా అత్యధిక దేశాల ద్వారా ప్రవహించే నది ఏది? (ఈ నది 10 దేశాల ద్వారా ప్రవహిస్తుంది.)
    1) నైలు 2) డాన్యూబ్
    3) అమెజాన్
    4) మెకాంగ్



రచయిత: సక్కరి జయకర్

సమాధానాలు

1-3; 2-4; 3-2; 4-3; 5-1; 6-3; 7-2; 8-2; 9-3; 10-4; 11-2; 12-2; 13-2; 14-1; 15-2; 16-2; 17-3; 18-1; 19-2; 20-2; 21-2; 22-3; 23-3; 24-1; 25-2; 26-2; 27-4; 28-1; 29-1; 30-4; 31-4; 32-3; 33-3; 34-3; 35-2; 36-1; 37-3; 38-3; 39-2; 40-2; 41-3; 42-3; 43-3; 44-1; 45-3; 46-2; 47-2.

జాతీయ జెండా దత్తత దినోత్సవం

జులై 22
చరిత్రలో ఈనాడు

రెపరెపలాడే జాతీయ జెండాను చూస్తే హృదయం ఉప్పొంగుతుంది. మన మువ్వెన్నల జెండా ప్రతి భారతీయుడిలో నింపిన స్ఫూర్తి.. దేశానికి బానిస సంకెళ్ల నుంచి విముక్తి కల్పించడంతోపాటు సమస్త భారతావని ఏకతాటిపైకి వచ్చేలా చేసింది. దేశ సమగ్రతను, సార్వభౌమత్వాన్ని ప్రతిబింబింపజేసే త్రివర్ణ పతాకాన్ని 1947, జులై 22న జరిగిన సమావేశంలో రాజ్యాంగ సభ ఆమోదించింది. ఈ కారణంగానే ఏటా ఆ తేదీన మన దేశంలో 'జాతీయ జెండా దత్తత దినోత్సవాన్ని' (National Flag Adoption Day) నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా భారత జాతీయ జెండా పుట్టుక, ఆవిష్కరణ గురించి ముఖ్య విషయాలను తెలుసుకుందాం..!

✦ తెలుగువారైన పింగళి వెంకయ్య రూపొందించిన త్రివర్ణ పతాకమే ఇప్పటి జాతీయ జెండాకు మాతృక. మన దేశానికి ప్రత్యేక పతాకం ఉండాలనే ఆలోచన ఆయనకు 1906లో కలిగింది. ఆ ఏడాది కోల్‌కతాలో జరిగిన 22వ అఖిల భారత కాంగ్రెస్ సభలో సమావేశ ప్రారంభానికి ముందు బ్రిటిష్ వారి పతాకమైన యూనియన్ జాక్‌ను ఎగురవేశారు. ఇది వెంకయ్యకు నచ్చలేదు. దీంతో ఒక జాతికి, అది నిర్వహించే ఉద్యమానికి పతాకం అవసరమని భావించి, జెండా తయారీకి పూనుకున్నారు.

✦ జాతీయ జెండా ఆవశ్యకత వివరిస్తూ వెంకయ్య 1916లో 'భారత దేశానికి ఓ జాతీయ పతాకం' అనే ఓ ఆంగ్ల పుస్తకాన్ని రచించారు. అదే ఏడాది లఖ్‌నవూలో జరిగిన భారత జాతీయ కాంగ్రెస్ సమావేశంలో పింగళి వెంకయ్య ఎరుపు, ఆకుపచ్చ రంగులతో తయారు చేసిన జెండాను ఎగురవేశారు. తర్వాత మహాత్మా గాంధీ సూచన మేరకు ఎరుపు, ఆకుపచ్చ, తెలుపు రంగుల మధ్యలో రాట్నం గుర్తుతో జెండాను తయారు చేశారు. నాటి నుంచి అన్ని జాతీయోద్యమాలు, కార్యక్రమాల్లో ఈ పతాకాన్నే ఉపయోగించారు.



✦ 1931లో కరాచీలో జరిగిన కాంగ్రెస్ మహాసభలో కాషాయం, తెలుపు, ఆకుపచ్చ రంగులతో ఉన్న పతాకంపై రాట్నం ఉండేలా వెంకయ్య రూపొందించిన జెండాలో మార్పులు చేశారు. దీన్ని కాంగ్రెస్ జాతీయ మహాసభ ఆమోదించింది.

✦ 1947 జులై 22న భారత రాజ్యాంగ సభలో జాతీయ జెండా గురించి జవహర్‌లాల్ నెహ్రూ ఓ తీర్మానం చేస్తూ మునుపటి త్రివర్ణ పతాకంలో రాట్నం స్థానంలో అశోకుడి ధర్మ చక్రాన్ని ఇమిడ్చారు. అదే నేటి త్రివర్ణ పతాకం.

మన జాతీయ జెండాలోని రంగులు, చిహ్నం సూచించేవి:

- కాషాయం - ధైర్యం, త్యాగం
- తెలుపు - శాంతి, సత్యం, స్వచ్ఛత
- ఆకుపచ్చ - శ్రేయస్సు
- అశోక చక్రం - ధర్మాన్ని సూచిస్తుంది.

పింగళి వెంకయ్య గురించి..


❖ వెంకయ్య కృష్ణా జిల్లా మొవ్వ మండలం భట్లపెనుమర్రులో 1876 ఆగస్టు 2న జన్మించారు.

❖ 1895లో సైన్యంలో చేరి బోయర్ యుద్ధంలో పాల్గొనేందుకు దక్షిణాఫ్రికా వెళ్లారు. అక్కడే గాంధీజీతో ఆయనకు పరిచయమైంది.

❖ 1906 నుంచి 1922 వరకు భారత జాతీయోద్యమంలో పాల్గొన్నారు.

❖ 1963 జులై 4న విజయవాడలో తుదిశ్వాస విడిచారు.

వినికిడి అనుభూతిని కలిగించే ఒక శక్తి రూపం ధ్వని. కంపించే వస్తువులు ధ్వనిని ఉత్పత్తి చేస్తాయి. ధ్వని తరంగాలు యాంత్రిక తరంగాలు. ఇవి యానకం ద్వారా మాత్రమే ప్రయాణిస్తాయి. శూన్యంలో ధ్వని ప్రయాణించలేదు. మానవుల్లో స్వరతంత్రుల కంపనాలతో ధ్వని ఉత్పత్తి అవుతుంది. ఈ ప్రకంపనలను చెవిలోని కర్ణభేరి గ్రహించి, మెదడుకు సంకేతాలు పంపుతుంది. ఈ ప్రక్రియనే వినికిడి అంటారు. ధ్వని లక్షణాలను అధ్యయనం చేసే భౌతికశాస్త్ర విభాగాన్ని అకౌస్టిక్స్ అంటారు.



ధ్వని లక్షణాలు

ధ్వని తరంగాలు యాంత్రిక తరంగాలు. ఇవి శూన్యం ద్వారా ప్రయాణించలేవు. సాధారణ ఉష్ణోగ్రత, పీడనాల వద్ద గాలిలో ధ్వని వేగం సుమారు 330 మీ/సె. ఇది గాలి ఉష్ణోగ్రత, సాంద్రత, గాలి వేగం, ఆర్ద్రతపై ఆధారపడి ఉంటుంది. గాలిలో కంటే ద్రవాల్లో ధ్వని వేగం ఎక్కువ, ఘన పదార్థాల్లో అత్యధికంగా ఉంటుంది.

◆ గాలిలో ధ్వని వేగాన్ని ప్రభావితం చేయని అంశాలు: కంపన పరిమితి, పౌనఃపున్యం, తరంగదైర్ఘ్యం, వాయు పీడనం.

◆ వాయు పీడనంలో హెచ్చుతగ్గులు వచ్చినప్పుడు వెంటనే దాని సాంద్రతలో కూడా మార్పు వస్తుంది. ఈ రెండింటి విలువలూ (P/d) ఎల్లప్పుడూ స్థిరంగా ఉంటాయి. గాలిలో ధ్వని అనుదైర్ఘ్య తరంగాల రూపంలో ప్రయాణిస్తుంది. కానీ ఘన పదార్థాలు, ద్రవ పదార్థాల ఉపరితలాలపై తిర్యక్ తరంగాల రూపంలో లేదా అనుదైర్ఘ్య తరంగాల రూపంలో ప్రయాణిస్తుంది.

◆ సాధారణంగా తరంగాల వేగం = పౌనఃపున్యం × తరంగదైర్ఘ్యం

◆ వాయువుల్లో ధ్వని తరంగాల వేగం కనుక్కునే సూత్రాన్ని న్యూటన్ ప్రతిపాదించగా, లాప్లాస్ దానికి సవరణ చేసి కింది సూత్రాన్ని ప్రతిపాదించారు.

$$V = \sqrt{\gamma \frac{P}{d}}$$

ధ్వని

ఏపీపీఎస్సీ పరీక్షల ప్రత్యేకం
ఫిజిక్స్

తరంగాలను స్వీకరించి.. జలాంతర్గాముల ఉనికి పసిగట్టి!

పౌనఃపున్యం

ఒక సెకనులో చేసే డోలనాలు లేదా కంపనాల సంఖ్యను పౌనఃపున్యం అంటారు. దీన్ని హెర్ట్జ్ (Hz)లలో కొలుస్తారు. సాధారణంగా మానవులు వినగలిగే ధ్వని పౌనఃపున్యం 20-20000 Hz వరకు ఉంటుంది. 20 హెర్ట్జ్ కంటే తక్కువ పౌనఃపున్యం ఉన్న ధ్వనులను 'పరశ్రావ్యాలు' అని, 20,000 హెర్ట్జ్ కంటే ఎక్కువ పౌనఃపున్యం ఉన్న ధ్వనులను 'అతిధ్వనులు' అని అంటారు.

అతిధ్వనుల ఉపయోగాలు:

ఆల్ట్రాసౌండ్ స్కానింగ్ ద్వారా మానవ శరీరంలోని అంతర్గత అవయవాలను పరిశీలించడానికి, గర్భస్థ శిశువుల ఎదుగుదలను తెలుసుకునేందుకు ఉపయోగిస్తారు.

- ద్రవాలను క్రిమిరహితం చేయడంలో, పాలను శుద్ధి చేయడానికి ఉపయోగిస్తారు.
- డిష్ వాషర్ పరికరాలు, సమాచార ప్రసారంలో వీటిని ఉపయోగిస్తారు.
- సముద్రాల లోతు, జలాంతర్గాముల ఉనికి తెలుసుకునేందుకు ఉపయోగించే సోనార్ పరికరంలో వినియోగిస్తారు.
- ప్రకృతిలో సహజసిద్ధంగా డాల్ఫిన్‌లు అతిధ్వనులు ద్వారానే సమాచారాన్ని మార్పిడి చేసుకుంటాయి.
- అతిధ్వనుల సహాయంతోనే గబ్బిలాలు చీకటిలోనూ వేగంగా సంచరిస్తుంటాయి.
- కుక్కలకు 40 వేల హెర్ట్జ్ వరకు ఉన్న ధ్వనులను వినే శక్తి ఉంటుంది. అందుకే వీటికి ప్రత్యేక శిక్షణనిచ్చి అతిధ్వనులకు స్పందించేలా చేస్తారు.

ధ్వని పరావర్తనం - అనువర్తనాలు

ధ్వని తరంగాలు దృఢమైన నునుపు తలాలను తాకినప్పుడు ఇతర యాంత్రిక తరంగాలు, కాంతి తరంగాల మాదిరిగానే పరావర్తనం చెందుతాయి. ధ్వని తరంగాలు కూడా పరావర్తన సూత్రాలను పాటిస్తాయి.

మెగాఫోన్ లేదా లౌడ్ స్పీకర్: ప్రత్యేక ఆకారం కలిగిన గొట్టంలోకి ప్రవేశించే ధ్వని తరంగాలు బహుళ పరావర్తనాలకు గురై అధిక తీవ్రతతో బయటకు వస్తాయి. ఇలా వచ్చే తరంగాలు చాలా దూరం వరకు ప్రయాణిస్తాయి.

వినికిడి పరికరాలు: సన్నటి ద్వారం ద్వారా లోపలికి ప్రవేశించే ధ్వని తరంగాలు బహుళ పరావర్తనాలకు గురై వెడల్పైన ద్వారం ద్వారా అధిక కంపన పరిమితితో బయటకు వస్తాయి. దీంతో వినికిడి లోపం ఉన్నవారికి ధ్వని తరంగాలు స్పష్టంగా వినిపిస్తాయి.

ధ్వని బోర్డులు: పుటాకార పరావర్తకం నాభి వద్ద ధ్వని జనకాన్ని ఉంచితే, అవి ధ్వని తరంగాలను పరావర్తనం చెందించి సమాంతర తరంగాలుగా వ్యాపింపజేస్తాయి.

సోనార్: సోనార్ అంటే సౌండ్ నావిగేషన్ అండ్ రేంజింగ్. ఈ పరికరంలో అతిధ్వనులను ఉత్పత్తి చేసే జనకాన్ని నౌకకు కింది భాగంలో బిగించి ధ్వని తరంగాలను సముద్రపు అడుగు దిశలోకి పంపిస్తారు. అవి పరావర్తనం చెంది వెనక్కి వచ్చే తరంగాలను మరొక గ్రాహకం స్వీకరిస్తుంది. ఇలా నీటిలో ధ్వని వేగం విలువ ఆధారంగా సముద్రపు లోతు, సముద్రం అడుగున రహస్యంగా ప్రయాణించే జలాంతర్గాముల ఉనికిని ఈ పరికరం తెలియజేస్తుంది.

ప్రతిధ్వని: ధ్వని జనకం ఉత్పత్తి చేసిన ధ్వని ఎదురుగా ఉన్న దృఢమైన, ఎత్తైన నునుపు తలానికి తగిలి, వెనక్కి తిరగడంతో మళ్లీ అదే ధ్వని వినిపిస్తుంది. దీన్నే ప్రతిధ్వని అంటారు.

ఉదా: ఒక పెద్దగోడ ఎదురుగా నిల్చుని చప్పట్లు కొడితే, అవి తిరిగి ఆ వ్యక్తికే వినిపించడం.

☛ సాధారణ పరిస్థితుల్లో ప్రతిధ్వని సంభవించడానికి ధ్వని జనకం, అడ్డంకి మధ్య దూరం కనీసం 16.5 మీటర్లు ఉండాలి. ధ్వనికి ప్రతిధ్వనికి మధ్య కనీసం 0.1 సెకన్ల తేడా ఉండాలి.

రివర్బరేషన్: ధ్వని జనకం నుంచి ఉత్పత్తి ఆగిపోయిన తర్వాత పరావర్తన ధ్వని తిరిగి వినిపించే ప్రక్రియను రివర్బరేషన్ అంటారు.

ఉదా: పెద్దపెద్ద ఆడిటోరియాల్లో వ్యక్తి మాట్లాడిన ధ్వని ఆగిపోయినప్పటికీ పరావర్తన ధ్వని తిరిగి వినిపిస్తుంది. దీంతో ఆ వ్యక్తి సంభాషణలో స్పష్టత లోపించి వినేవారికి గందరగోళంగా ఉంటుంది. దీన్ని నివారించేందుకు పెద్దపెద్ద థియేటర్లు, ఆడిటోరియాల్లో పైకప్పులు, గోడలను ధ్వనిని శోషించుకునే పదార్థాలైన స్పాంజి, తెరలు మొదలైన వాటితో తయారుచేస్తారు. గోడలు నునుపుగా లేకుండా గరుకుగా ఉండేలా జాగ్రత్తలు తీసుకుంటారు.

ధ్వని - అర్థం చేసుకునే లక్షణాలు

స్థాయి (Pitch): పౌనఃపున్యం ధ్వని కీచుదనం లేదా పిచ్‌ను నిర్ణయిస్తుంది. కంపన పౌనఃపున్యం ఎక్కువ ఉంటే ధ్వని ఎక్కువ పిచ్‌ను, తక్కువ ఉంటే తక్కువ పిచ్‌ను కలిగి ఉంటుంది.

ఉదా: అధిక పౌనఃపున్యం కలిగిన విజిల్ ఎక్కువ పిచ్ ఉన్న ధ్వనిని ఉత్పత్తి చేస్తుంది. తక్కువ పౌనఃపున్యం కలిగిన డ్రమ్ తక్కువ పిచ్‌తో ఉన్న గంభీర ధ్వనిని ఉత్పత్తి చేస్తుంది.

☛ సాధారణంగా స్త్రీల స్వరం కీచుగా ఉంటుంది. ఎందుకంటే పురుషుల కంటే ఎక్కువ స్వర పౌనఃపున్యం కలిగి ఉండటమే ఇందుకు కారణం.

ధ్వని తీవ్రత: ధ్వని తీవ్రత కంపన పరిమితి వర్గానికి (A^2) అనులోమానుపాతంలో ఉంటుంది. కంపన పరిమితిని 3 రెట్లు పెంచితే, ధ్వని తీవ్రత 9 రెట్లు పెరుగుతుంది. ధ్వని తీవ్రతను డెసిబెల్ (dB) ప్రమాణంలో కొలుస్తారు. **ఉదా:** సాధారణ సంభాషణ 60 dB ఉంటుంది.

☛ 80 dB కంటే ఎక్కువ తీవ్రత ఉన్న శబ్దం అసహనానికి, ఇబ్బందికి గురిచేస్తుంది. దీన్నే ధ్వని కాలుష్యం అంటారు.

నాణ్యత లేదా టింబర్: ఒకే స్థాయి, తీవ్రత ఉన్నప్పటికీ ఒక ధ్వనిని మరొక ధ్వనితో వేరుపర్చడానికి ఉపయోగపడే లక్షణాన్ని నాణ్యత లేదా టింబర్ అంటారు.

ఉదా: రేడియోలో వస్తున్న పాటను ఎవరు పాడారో చూడకుండానే వారిని గుర్తించడం, పక్క గదిలో ఎవరు మాట్లాడుతున్నారో చెప్పడం.

మాక్ సంఖ్య (M): ప్రయాణిస్తున్న ధ్వని జనకం వేగం, పరిసర యానకంలో ధ్వని వేగాల మధ్య నిష్పత్తిని మాక్ సంఖ్య అంటారు. ఆస్ట్రియా దేశపు భౌతిక శాస్త్రవేత్త ఎర్నెస్ట్ మాక్ గౌరవార్థం దీనికి ఈ పేరు పెట్టారు.

❖ M విలువ ఒకటి కంటే ఎక్కువ ఉంటే ఆ ధ్వని జనకాన్ని సూపర్‌సోనిక్ అంటారు. ఒకటి ఉంటే ట్రాన్స్‌సోనిక్ అని, ఒకటి కంటే తక్కువ ఉంటే సబ్‌సోనిక్ అని పిలుస్తారు. ఒకవేళ M విలువ అయిదు కంటే ఎక్కువ ఉండే ధ్వని జనకాన్ని హైపర్ సోనిక్ అంటారు. ప్రకృతిలో మనం గమనించే ఉరుములు సోనిక్ బూమ్‌కు ఉదాహరణ.

❖ సాధారణంగా ఖండాంతర క్రూయిజ్ క్షిపణులు, అంతరిక్ష నౌకలు హైపర్ సోనిక్ వేగంతో ప్రయాణిస్తాయి.

❖ రక్షణ రంగంలోని యుద్ధ విమానాలు, కాంకర్డ్ లాంటి పెద్ద జెట్ విమానాలు సూపర్ సోనిక్ వేగంతో ప్రయాణిస్తాయి.



రచయిత
వట్టిపల్లి కృష్ణ కిశోర్
విషయ నిపుణులు

718 Word of the Day

Unintended

Telugu meaning: అనాలోచిత, యాదృచ్ఛిక

English meaning: The word unintended (అన్‌ఇంటెండెడ్) is an adjective that describes something not planned or meant to happen.

Synonyms: Accidental, Inadvertent

Antonyms: Intentional, Deliberate

Usage: **1.** His remarks caused unintended offense among the audience.

2. The chemical reaction had some unintended consequences.

Current Affairs



Star Indian long jumper Murali Sreeshankar clinched the gold medal in the men's long jump at the Meeting Maia Cidade do Desporto 2025 in Maia, Portugal, on 20 July 2025. He claimed the title with a best jump of 7.75 m.


The government of India has initiated the formulation of the Automotive Mission Plan 2047 (AMP 2047), a strategic roadmap aligned with the 'Viksit Bharat @2047' vision. The plan aims to establish India as a global leader in the automotive sector, focusing on innovation, sustainability, and increasing the country's share in global automotive trade, the ministry of heavy industries.

The National Institute for Empowerment of Persons with Intellectual Disabilities (Divyangjan) (NIEPID) and the Jai Vakeel Foundation (JVF) in Mumbai signed a Memorandum of Understanding (MOU) to roll out structured and uniform education for Children with Intellectual Disabilities (CwID) across the country on 19 July 2025. With signing this MoU, NIEPID DISHA Curriculum is set to become a comprehensive education model for the holistic development for all CwDs across India.

For more Current Affairs: Scan QR code

జనరల్ స్టడీస్ - భారతదేశ సమాజం

వివాహాలు - రకాలు



భారత సమాజంలోని విభిన్న జాతులు, తెగల్లో అనేక రకాలుగా వివాహాలు జరుగుతాయి. కొందరు కన్యాశుల్కం చెల్లిస్తారు. ఇంకొందరు వధువు కుటుంబానికి సేవలు చేసి మెప్పిస్తారు. కొందరు యువతులు నచ్చిన యువకుడి ఇంట్లోకి ప్రవేశించి, చివరికి ఆ ఇంట కోడలిగా మారిపోతారు. యువకులు జాతరలు, సంతల్లో కాపుకాసి నచ్చిన యువతి నుదుటిపై బొట్టు పెడతారు. చేయి పట్టి పరిణయమాడతారు.

వివాహం ఒక జీవన అవసరం. రెండు జీవితాలను కలిపి ఉంచే పవిత్ర బంధం. సమాజ నిర్మాణంలో మూలస్తంభం. ఇందులో నిర్దిష్ట నియమాలను అనుసరించి జీవిత భాగస్వామిని ఎంచుకుంటారు. ఆచార వ్యవహారాలను పాటిస్తారు. సంప్రదాయాల ప్రకారం ఏకమవుతారు. ఇది అనేక రకాలుగా జరుగుతుంది. అవి:

- ✦ సంప్రదింపుల వివాహం ✦ ఓలి చెల్లించడం ద్వారా వివాహం
- ✦ సేవా వివాహం ✦ వినిమయ వివాహం ✦ అనాహూత వివాహం
- ✦ పరీక్షావధి వివాహం ✦ అపహరణ పద్ధతి ద్వారా వివాహం
- ✦ సహపలాయనం ద్వారా వివాహం ✦ భౌతిక పరిగ్రహణ వివాహం
- ✦ ప్రయోగ వివాహం

ప్రజనన సిద్ధాంతం, కుటుంబ చీలికా సిద్ధాంతం, సహకార సిద్ధాంతం మొదలైన అంశాలతో సహా పూర్తి సమాచారం ఈనాడు ఈప్రతిభ వెబ్‌సైట్‌లో 'జనరల్ స్టడీస్ ఈ-బుక్స్' కోర్సులో ఈ-బుక్ రూపంలో అందుబాటులో ఉంది. మరిన్ని వివరాలకు క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.

Latest Updates

Faculty Posts

All India Institute of Medical Sciences (AIIMS), Guwahati, is inviting applications to fill faculty posts on a direct recruitment basis. The total no. of posts is 64. The application fee is Rs.1500. Eligible candidates can apply offline before 30 July 2025.

Technician Posts

East Coast Railway Head Office, Bhubaneswar, is inviting applications for the recruitment of various levels of Technician posts on a temporary basis. The total no. of posts is 18. The last date for online applications is 4 August 2025.

PGIMER Group 'B' & 'C' Recruitment 2025

Postgraduate Institute of Medical Education & Research (PGIMER), Chandigarh, has released a recruitment notification for Group 'B' & 'C' posts for its Chandigarh campus and PGI Satellite Centre, Sangrur, Punjab. The total no. of posts is 114. Eligible candidates can apply online before 4 August 2025.

Did You Apply..?

Today (July 22) is the last date for the following jobs/ Apprentice posts

☛ Stenographer posts in CSMCRI. ***Eligibility:*** B.Sc, BE/B.Tech, M.Sc, Ph.D.

☛ 32 posts in Balmer Lawrie Company Limited. ***Qualification:*** Diploma in Engineering.

☛ 13 Counsellor posts in TISS. ***Eligibility:*** PG.

For more information and other notifications - scan QR code

Mensuration

1. If the base of a parallelogram is (x + 7) units and altitude to the base is (x – 5) units. If the area is $(x^2 - 9)$ sq. units, then find the area of the parallelogram.

A) 144 sq. units B) 160 sq. units
C) 169 sq. units D) 135 sq. units
E) 155 sq. units

2. A Parallelogram and a triangle are constructed on the same base such that their areas are equal. If the altitude of the triangle is 78 cm then the altitude of the parallelogram is...

A) 48 cm B) 117 cm
C) 156 cm D) 39 cm
E) 93 cm

3. If the two diagonals of a parallelogram are 40 cm and 42 cm respectively, then find its perimeter:

A) 116 sq. cm B) 164 sq. cm
C) 160 sq. cm D) 121 sq. cm
E) 150 sq. cm

4. If one diagonal of a parallelogram is 58 cm and the perpendicular distance of this diagonal from either of the out lying vertices is 17 cm. Find the area of the parallelogram.

A) 968 sq. cm B) 869 sq. cm
C) 986 sq. cm D) 896 sq. cm
E) 698 sq. cm

Bank Exams

Quantitative Aptitude

5. The area of a parallelogram is 54 cm^2 and its altitude is $\frac{2}{3}$ rd of the corresponding base. The length of base is:

A) 18 cm B) 9 cm C) 11 cm
D) 8 cm E) 10 cm

6. In a parallelogram, the length of adjacent sides are 13 cm and 15 cm respectively. If the length of one diagonal is 18 cm, then find the length of the another diagonal. (approx)

A) 21.5 cm B) 28 cm C) 23.5 cm
D) 22.5 cm E) 12.5 cm

7. The base of a triangle is 13 cm and its height is 18 cm. The height of another triangle whose area is $1\frac{1}{2}$ times of first triangle area having the base 26 cm is..

A) $13\frac{3}{4}$ cm B) $13\frac{1}{4}$ cm
C) $13\frac{2}{3}$ cm D) $13\frac{1}{2}$ cm
E) $13\frac{2}{4}$

8. The sides of a triangle are in the ratio of $\frac{1}{2} : \frac{2}{3} : \frac{3}{4}$. If the perimeter is 92 cm, then the length of the largest side is...

A) 32 cm B) 24 cm C) 36 cm
D) 28 cm E) 35 cm

9. The area of a big triangle is equal to 6 times the area of a small triangle. If the base of the big triangle is equal to the base of the small triangle and the height of the big triangle is 19 cm. What is the height of the small triangle?

A) $3\frac{1}{6}$ cm B) $3\frac{1}{3}$ cm C) $3\frac{1}{4}$ cm
D) $3\frac{2}{3}$ cm E) $3\frac{2}{4}$ cm

10. A ladder is placed so as to reach a window 45 cm height. The ladder is then turned over to the opposite side of the street and is found to reach a point 43 cm height. If the ladder is 53 cm long, then the width of the street is... (approx)

A) 58.78 cm B) 59.88 cm
C) 58.98 cm D) 55.98 cm
E) None

11. The height of a triangle is equal to the perimeter of a square whose diagonal is $9\sqrt{2}$ cm and the base of the same triangle is equal to the side of a square whose area is 841 sqcm. What is the area of the triangle?.

A) 484 sq cm B) 500 sq cm
C) 532 sq cm D) 522 sq cm
E) None

12. The sides of a triangle are 14 cm, 17 cm, 19 cm. One more triangle is formed by joining the mid points of the sides. The perimeter of the second triangle is how much?

A) 27 cm B) 25 cm
C) 30 cm D) 28 cm
E) 31 cm

13. One of the diagonal of a rhombus is 65% of the other diagonal. What is the ratio of area of rhombus to the square whose side is same as the length of the larger diagonal?

A) 19 : 13 B) 13 : 19
C) 13 : 20 D) 20 : 13
E) None

14. The diagonals of rhombus are 36 cm and 48 cm respectively. Find the perimeter of the rhombus?

A) 120 cm B) 168 cm
C) 140 cm D) 152 cm
E) 118 cm

Scan the QR code for Key

These model questions were prepared by
Dr.Vangala Srinivas
Asst. Prof. of Mathematics.

ఇంటర్న్‌షిప్స్

వర్క్ ఫ్రమ్ హోమ్

హ్యూమన్ రిసోర్సెస్

సంస్థ: సీబీడీఎస్ఎస్ నైపుణ్యాలు: ఎంఎస్-ఎక్సెల్, ఎంఎస్-ఆఫీస్, ఎంఎస్-వర్డ్
స్టైపెండ్: రూ.2,000
☛ https://shorturl.at/7UOLY

టెలిసేల్స్

సంస్థ: ఓపెన్‌హౌస్ నైపుణ్యాలు: ఎఫెక్టివ్ కమ్యూనికేషన్, సేల్స్
స్టైపెండ్: రూ.13,000-25,000
☛ https://shorturl.at/XcDNV

సాఫ్ట్‌వేర్ డెవలప్‌మెంట్ ఇంజినీరింగ్ (వెబ్)

సంస్థ: మైఫాజిర్ ఐటీ సొల్యూషన్ ప్రై.లి. నైపుణ్యాలు: ఎక్స్‌ప్రెస్.జేఎస్, జావాస్క్రిప్ట్, మాంగోడీబీ, పైతాన్, రియాక్ట్, రెస్ట్ ఏపీఐ
స్టైపెండ్: రూ.8,000
☛ https://shorturl.at/50tQK

గేమ్ డెవలప్‌మెంట్

సంస్థ: ఫెర్మీ ఇంటారాక్టివ్ ఎల్ఎల్‌పీ
నైపుణ్యాలు: బ్లెండర్ 3డీ, యూనిటీ ఇంజిన్
స్టైపెండ్: రూ.5,000
☛ https://shorturl.at/1ohp0

బిజినెస్ డెవలప్‌మెంట్ (సేల్స్)

సంస్థ: హ్యాపీలీ, ఇంక్. నైపుణ్యాలు: అమెరికన్ ఇంగ్లిష్, ఎఫెక్టివ్ కమ్యూనికేషన్, ఇంగ్లిష్ మాట్లాడటం, రాయడం, ఎంఎస్-ఎక్సెల్ స్టైపెండ్: రూ.18,000-20,000
☛ https://shorturl.at/TjkLa

లీడ్ జనరేషన్

సంస్థ: ద డిజైనర్ అమ్మ
నైపుణ్యాలు: క్లయింట్ ఇంటరాక్షన్, కస్టమర్ అక్విజిషన్, ఇంగ్లిష్ రాయడం, మార్కెటింగ్ స్ట్రాటజీ స్టైపెండ్: రూ.5,000
☛ https://shorturl.at/lx3YD

వీటన్నిటికీ దరఖాస్తు గడువు: ఆగస్టు 15

ఆండ్రాయిడ్ యాప్ అండ్ పీహెచ్‌పీ డెవలపర్

సంస్థ: హ్యాష్ఏఐ టెక్నాలజీ నైపుణ్యాలు: ఆండ్రాయిడ్, జావా, మైఎస్‌క్యూఎల్, పీహెచ్‌పీ
స్టైపెండ్: రూ.6,000-8,000
☛ https://shorturl.at/wON4X

సాఫ్ట్‌వేర్ ఇంజినీర్

సంస్థ: వెరిలింక్ నైపుణ్యాలు: సీఎస్ఎస్, ఎక్స్‌ప్రెస్.జేఎస్, హెచ్‌టీఎంఎల్, జావాస్క్రిప్ట్, నోడ్.జేఎస్, రియాక్ట్ స్టైపెండ్: రూ.15,000
☛ https://shorturl.at/uFF0P

హ్యూమన్ రిసోర్సెస్

సంస్థ: లెర్న్‌పడ్డీ నైపుణ్యాలు: ఇంగ్లిష్ మాట్లాడటం, ఎంఎస్-ఆఫీస్, రిక్రూట్‌మెంట్, రెజ్యూమె స్క్రీనింగ్ స్టైపెండ్: రూ.5,000
☛ https://shorturl.at/fecxX

మెడికో జర్నలిజం

సంస్థ: దిరైట్‌డాక్టర్స్ నైపుణ్యాలు: క్రియేటివ్ రైటింగ్, ఇంగ్లిష్ రాయడం
స్టైపెండ్: రూ.5,000-10,000
☛ https://shorturl.at/KFSE0

వీటన్నిటికీ దరఖాస్తు గడువు: ఆగస్టు 8

తీర రక్షక దళంలో.. మీరూ చేరతారా?



భారతీయ తీర రక్షకదళం 170 అసిస్టెంట్ కమాండెంట్ జనరల్ డ్యూటీ, టెక్నికల్ పోస్టుల భర్తీకి ప్రకటన విడుదల చేసింది. డిగ్రీతో దరఖాస్తు చేసుకోవచ్చు. మహిళలూ అర్హులే. పరీక్ష, ఇంటర్వ్యూ, మెడికల్ టెస్టులతో నియామకాలుంటాయి. ఎంపికైనవాళ్లు గ్రూప్- ఎ గెజిటెడ్ ఆఫీసర్ హోదాతో, ఆకర్షణీయ వేతనం, ప్రోత్సాహకాలూ అందుకోవచ్చు.

తీర రక్షక దళంలో అసిస్టెంట్ కమాండెంట్ పోస్టులకు దాదాపు ఏటా ప్రకటన వెలువడుతుంది. అర్హతలు, ఆసక్తి ఉన్నవారు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి. వీరికి స్టేజ్-1లో భాగంగా ఆప్టిట్యూడ్ టెస్టు ఆబ్జెక్టివ్ తరహాలో ఆంగ్ల మాధ్యమంలో నిర్వహిస్తారు. ప్రశ్నపత్రానికి 400 మార్కులు. ప్రతి ప్రశ్నకు 4 మార్కులు చొప్పున వంద ప్రశ్నలు వస్తాయి. తప్పు సమాధానానికి ఒక మార్కు తగ్గిస్తారు. ఇంగ్లిష్, రీజనింగ్ అండ్ న్యూమరికల్ ఎబిలిటీ, జనరల్ సైన్స్ అండ్ మ్యాథమెటికల్ ఆప్టిట్యూడ్, జనరల్ నాలెడ్జ్ ఒక్కో విభాగంలోనూ 25 ప్రశ్నలు అడుగుతారు. పరీక్ష వ్యవధి 2 గంటలు. అర్హత సాధించినవారికి స్టేజ్-2 పరీక్షలు నిర్వహిస్తారు. ఇందులో కంప్యూటరైజ్డ్ కాగ్నిటివ్ బ్యాటరీ టెస్ట్ (సీసీబీటీ), పిక్చర్ పర్సెప్షన్ అండ్ డిస్కషన్ టెస్టు (పీపీఅండ్‌డీటీ) ఉంటాయి.

సీసీబీటీ ఆంగ్ల మాధ్యమంలో, ఆబ్జెక్టివ్ తరహాలో నిర్వహిస్తారు. పీపీఅండ్‌డీటీ కోసం ఆంగ్లం/ హిందీలో మాట్లాడాలి. స్టేజ్-2 అర్హత పరీక్ష మాత్రమే. ఇందులో ఎంపికైనవారికి స్టేజ్-3లో భాగంగా.. సైకలాజికల్ పరీక్షలు, గ్రూప్ టాస్క్, ఇంటర్వ్యూ ఉంటాయి. వీటిలో మెరిస్తే స్టేజ్-4లో మెడికల్ పరీక్షలు నిర్వహిస్తారు. అందులోనూ విజయవంతమైతే స్టేజ్-5లో భాగంగా స్టేజ్-1, 3ల్లో సాధించిన మార్కుల ప్రకారం మెరిట్ లిస్టు తయారు చేసి, ఖాళీలకు అనుగుణంగా అర్హులను శిక్షణకు తీసుకుంటారు.

ఉద్యోగంలో...

వీరికి జనవరి, 2027 నుంచి శిక్షణ నిర్వహిస్తారు. దాన్ని విజయవంతంగా పూర్తిచేసుకున్నవారిని అసిస్టెంట్ కమాండెంట్ హోదాతో విధుల్లోకి తీసుకుంటారు ఈ సమయంలో రూ.56,100 మూలవేతనం చెల్లిస్తారు. డీఏ, హెచ్‌ఆర్ఏ, ఇతర అలవెన్సులతో తొలి నెల నుంచే రూ.లక్షకు పైగా జీతం అందుకోవచ్చు. తక్కువ వ్యవధిలోనే డిప్యూటీ కమాండెంట్, కమాండెంట్ హోదాలు పొందవచ్చు. భారత సముద్ర తీరాన్ని కాపాడటం వీరి ప్రాథమిక విధి. అక్రమ చొరబాట్లను అడ్డుకోవాలి. ప్రమాదంలో చిక్కుకున్న మత్స్యకారులనూ రక్షించాలి. కింది స్థాయి ఉద్యోగులకు దిశానిర్దేశం చేయాలి.



ముఖ్య వివరాలు

అసిస్టెంట్ కమాండెంట్లు (గ్రూప్-ఎ గెజిటెడ్ ఆఫీసర్)

1) జనరల్ డ్యూటీ

ఖాళీలు: 140

అర్హత: కనీసం 60 శాతం అగ్రిగేట్ మార్కులతో బ్యాచిలర్స్ డిగ్రీ. ఇంటర్మీడియట్‌లో మ్యాథమెటిక్స్, ఫిజిక్స్ సబ్జెక్టుల్లో 55 శాతం మార్కులు అవసరం.

2) టెక్నికల్ (మెకానికల్, ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్)

ఖాళీలు: 30

అర్హత: కనీసం 60 శాతం అగ్రిగేట్ మార్కులతో నిర్దేశిత బ్రాంచీల్లో బీఈ/బీటెక్. ఇంటర్ ఎంపీసీ లేదా డిప్లొమాలోనూ 55 శాతం మార్కులు ఉండాలి.

వయసు: పై రెండు పోస్టులకూ జులై 1, 2026 నాటికి 21 నుంచి 25 ఏళ్ల లోపు ఉండాలి. అంటే 01.07.2001 - 30.06.2005 మధ్య జన్మించి ఉండాలి. ఎస్సీ, ఎస్టీలకు ఐదేళ్లు, ఓబీసీలకు మూడేళ్లు గరిష్ఠ వయసులో సడలింపులు వర్తిస్తాయి.

157 సెం.మీ. ఎత్తు, అందుకు తగ్గ బరువు ఉండాలి.

ప్రస్తుతం చివరి ఏడాది కోర్సులు చదువుతోన్నవారూ దరఖాస్తు చేసుకోవచ్చు.

ఆన్‌లైన్ దరఖాస్తులు: 27.07.2025 వరకు స్వీకరిస్తారు.

పరీక్ష ఫీజు: రూ.300. ఎస్సీ, ఎస్టీలకు లేదు.


పరీక్షలు: స్టేజ్-1: 18.09.2025, స్టేజ్-2 నవంబరులో, స్టేజ్-3 జనవరి 2026, స్టేజ్-4 మార్చి-ఏప్రిల్ 2026, స్టేజ్-5 డిసెంబరు 2026లో.

వెబ్‌సైట్: https://joinindiancoastguard.cdac.in/cgcat/

అభిరుచికి తగిన కోర్సు ఏది?



ఇంటర్ సెకండియర్ (ఎంపీసీ) చదువుతున్నాను. కొత్త ప్రాంతాలకు వెళ్లడమంటే చాలా ఇష్టం. నా ఆసక్తికి తగ్గట్టుగా డిగ్రీలో ఏ కోర్సు చేయొచ్చు? **- అల్తాఫ్**



■ మీకు కొత్త ప్రాంతాలకు వెళ్లడంపై ఆసక్తి ఉంటే ట్రావెల్, టూరిజం, హాస్పిటాలిటీ రంగంలో సర్టిఫికెట్/ డిప్లొమా/ డిగ్రీ/ పీజీ చేస్తే.. తగిన ఉపాధి అవకాశాలు ఉంటాయి.

టూరిజం, హాస్పిటాలిటీ రంగంలో ముఖ్యమైన కోర్సులు:

✦ **మూడేళ్ల వ్యవధి గల బీఏ / బీబీఏ టూరిజం అండ్ ట్రావెల్ మేనేజ్‌మెంట్:** ఈ ప్రోగ్రాంలో టూరిజం నిర్వహణ, ప్రయాణ సంస్థల నిర్వహణ, టూరిజం మార్కెటింగ్ మొదలైనవి నేర్చుకోవచ్చు.

✦ **మూడేళ్ల వ్యవధి గల బీఎస్సీ హాస్పిటాలిటీ అండ్ హోటల్ అడ్మినిస్ట్రేషన్:** ఈ ప్రోగ్రాంలో హోటల్ నిర్వహణ, రెస్టారెంట్ మేనేజ్‌మెంట్, ఫుడ్ ప్రొడక్షన్, ఫ్రంట్ ఆఫీస్ నిర్వహణ, గెస్ట్ సర్వీసెస్‌పై శిక్షణ ఇస్తారు.

✦ **మూడు/ నాలుగు సంవత్సరాల వ్యవధి గల బ్యాచిలర్ ఆఫ్ హోటల్ మేనేజ్‌మెంట్:** పూర్తి స్థాయి హోటల్ మేనేజ్‌మెంట్, టూరిజం, రెస్టారెంట్, రిసార్ట్, క్రూయిజ్ లైన్స్, ఎయిర్‌లైన్‌లలో అవకాశాలు.

✦ **ఒకటి/ రెండు సంవత్సరాల వ్యవధి గల డిప్లొమా ఇన్ టూరిజం మేనేజ్‌మెంట్:** టూరిజం రంగంలో మొదటి స్థాయి ఉద్యోగాలకు అనుకూలం.

✦ **ఏవియేషన్ అండ్ ఎయిర్‌పోర్ట్ మేనేజ్‌మెంట్‌ల్లో డిప్లొమా/ డిగ్రీ ప్రోగ్రాంలు:** ఎయిర్‌లైన్ సర్వీసులు, గ్రౌండ్ స్టాఫ్, క్యాబిన్ క్రూ, టికెట్ బుకింగ్ రంగాల్లో అవకాశాలుంటాయి.

మూడు/ నాలుగేళ్ల డిగ్రీ తరువాత ఆసక్తి ఉంటే, పీజీ కూడా చేయవచ్చు. రెండేళ్ల వ్యవధి గల ఎంబీఏ/ ఎంఏ టూరిజం మేనేజ్‌మెంట్ చదివి, టూరిజం రంగంలో ఉన్నత స్థాయి ఉద్యోగాలకూ, అధ్యాపక ఉద్యోగాలకూ ప్రయత్నం చేయవచ్చు.

టూరిజం, ట్రావెల్, హాస్పిటాలిటీ రంగాల్లో రాణించాలంటే.. కమ్యూనికేషన్, టీమ్ వర్కింగ్, ప్రాబ్లం సాల్వింగ్ స్కిల్స్ చాలా అవసరం. ఇంగ్లిష్, హిందీలతో పాటు ఏదైనా విదేశీ భాష కూడా నేర్చుకుంటే మెరుగైన ఉపాధి అవకాశాలు లభిస్తాయి. ఇవే కాకుండా సేల్స్, మార్కెటింగ్, ఆర్కియాలజీ, ఈవెంట్ మేనేజ్‌మెంట్, ఫొటోగ్రఫీ రంగాల్లో కూడా నూతన ప్రదేశాలకు తరచుగా వెళ్లాల్సివుంటుంది. మీకు ఆసక్తి ఉన్న రంగాన్ని ఎంచుకొని, అందుకు సంబంధించిన సబ్జెక్టులతో డిగ్రీ పూర్తిచేసి ఉద్యోగ ప్రయత్నాలు చేయవచ్చు.

– ప్రొ. బెల్లంకొండ రాజశేఖర్, కెరియర్ కౌన్సెలర్

నోటీస్ బోర్డు

ఉద్యోగాలు

పోర్టులో అసిస్టెంట్ మేనేజర్లు

కోల్‌కతాలోని శ్యాంప్రసాద్ ముఖర్జీ పోర్టు ఒప్పంద ప్రాతిపదికన 5 అసిస్టెంట్ మేనేజర్ (ఆపరేషన్స్) పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

అర్హత: గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి బీటెక్ (మెకానికల్ ఇంజినీరింగ్)తో పాటు పని అనుభవం.

గరిష్ఠ వయసు: 29.08.2025 నాటికి 45 ఏళ్లు మించకూడదు. **వేతనం:** నెలకు రూ.57,000.

ఆఫ్‌లైన్ దరఖాస్తు స్వీకరణకు చివరి తేదీ: 29.08.2025

చిరునామా: సీనియర్ డిప్యూటీ మేనేజర్ (పీ & ఐఆర్), హల్దీడాక్ కాంప్లెక్స్, జవహర్ టవర్, పీవో: హల్దీయా టౌన్‌షిప్, పూర్బమెదీన్‌పూర్ జిల్లా, పశ్చిమ్‌బెంగాల్ - 721607.

ఎంపిక: రాత పరీక్ష, ఇంటర్వ్యూలతో.

వెబ్‌సైట్: https://smp.smportkolkata.in/

టీఐఎఫ్ఆర్‌లో వర్క్ అసిస్టెంట్లు

ముంబయిలోని టాటా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫండమెంటల్ రిసెర్చ్ (టీఐఎఫ్ఆర్).. 23 పోస్టుల భర్తీకి ప్రకటన విడుదలచేసింది.

- సైంటిఫిక్ ఆఫీసర్- 01
- అసిస్టెంట్ సెక్యూరిటీ ఆఫీసర్(ఏ)- 01
- అడ్మినిస్ట్రేటివ్ అసిస్టెంట్- 01
- క్లర్క్: 06
- ల్యాబొరేటరీ అసిస్టెంట్: 04
- వర్క్ అసిస్టెంట్: 04
- సెక్యూరిటీ గార్డ్: 03
- ప్రాజెక్ట్ సైంటిఫిక్ ఆఫీసర్(సి): 01
- ప్రాజెక్ట్ ల్యాబొరేటరీ అసిస్టెంట్ (బి): 02

అర్హత: పోస్టును అనుసరించి టెన్త్, సంబంధిత విభాగంలో ఐటీఐ ట్రేడ్ సర్టిఫికేట్, బీఈ/ బీటెక్, హెచ్ఎస్సీ, ఏదైనా డిగ్రీతో పాటు ఉద్యోగానుభవం.

స్టైపెండ్: నెలకు సైంటిఫిక్ ఆఫీసర్‌కు రూ.93,640; అసిస్టెంట్ సెక్యూరిటీ ఆఫీసర్, అసిస్టెంట్ సెక్యూరిటీ ఆఫీసర్లకు రూ.71,070; వర్క్ అసిస్టెంట్, సెక్యూరిటీ గార్డ్‌లకు రూ.35,393; క్లర్క్, ల్యాబొరేటరీ అసిస్టెంట్‌లకు రూ.45,725; ప్రాజెక్ట్ ల్యాబొరేటరీ అసిస్టెంట్‌కు రూ.40,000; ప్రాజెక్ట్ సైంటిఫిక్ ఆఫీసర్‌కు రూ.1,00,600.

వయసు: 28 ఏళ్లు మించకూడదు.

ఎంపిక: రాత పరీక్ష, ఇంటర్వ్యూలతో.

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ తేదీ: 09.08.2025.

వెబ్‌సైట్: https://www.tifr.res.in/

ప్రాజెక్ట్ టెక్నికల్ సపోర్ట్ సిబ్బంది

ముంబయిలోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ రిసెర్చ్ ఇన్ రిప్రొడక్టివ్ అండ్ చైల్డ్ హెల్త్.. తాత్కాలిక ప్రాతిపదికన 4 ప్రాజెక్ట్ టెక్నికల్ సపోర్ట్-III/II పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

అర్హత: సంబంధిత విభాగంలో ఇంటర్మీడియట్, డిప్లొమా, డిగ్రీతో పాటు ఉద్యోగానుభవం.

వయసు: ప్రాజెక్ట్ టెక్నికల్ సపోర్ట్-IIకు 35 ఏళ్లు; ప్రాజెక్ట్ టెక్నికల్ సపోర్ట్-IIIకు 30 ఏళ్లు మించకూడదు.

వేతనం: నెలకు ప్రాజెక్ట్ టెక్నికల్ సపోర్ట్-IIకు 36,400, ప్రాజెక్ట్ టెక్నికల్ సపోర్ట్-IIIకు రూ.26,000.

ఇంటర్వ్యూ తేదీ: 25.07.2025.

ఉద్యోగ స్థలం: ఐసీఎంఆర్-నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ రిసెర్చ్ ఇన్ రిప్రొడక్టివ్ అండ్ చైల్డ్ హెల్త్, జేఎం స్ట్రీట్, పరేల్, ముంబయి.

వెబ్‌సైట్: https://nirrch.res.in/

వాక్‌ఇన్

ఈఎస్ఐసీ చెన్నైలో బోధన పోస్టులు

చెన్నై కె.కె. నగర్‌లోని ఎంప్లాయీస్ స్టేట్ ఇన్స్యూరెన్స్ కార్పొరేషన్ (ఈఎస్ఐసీ) మెడికల్ కాలేజ్ & హాస్పిటల్ సూపర్ స్పెషాలిటీ విభాగాలలో ఒప్పంద ప్రాతిపదికన 47 మెడికల్ టీచింగ్ ఫ్యాకల్టీ ఖాళీల భర్తీకి ఇంటర్వ్యూలు నిర్వహిస్తోంది.

- ప్రొఫెసర్- 16 ● అసోసియేట్ ప్రొఫెసర్- 16
- అసిస్టెంట్ ప్రొఫెసర్- 15

విభాగాలు: బర్న్స్ అండ్ సర్జరీ, కార్డియాలజీ, ఎండోక్రైనాలజీ అండ్ మెటబాలిజమ్, హెమటాలజీ, నెఫ్రాలజీ, న్యూరాలజీ, మెడికల్ గ్యాస్ట్రో ఎంటరాలజీ, నెఫ్రాలజీ, మెడికల్ ఆంకాలజీ, పీడియాట్రిక్ సర్జరీ, యూరాలజీ, సర్జికల్ ఆంకాలజీ తదితరాలు.

అర్హత: ఎన్ఎంసీ-టీఈక్యూ ప్రకారం అర్హత ప్రమాణాలు, ఉద్యోగానుభవం.

వేతనం: నెలకు ప్రొఫెసర్‌కు రూ.2,52,405; అసోసియేట్ ప్రొఫెసర్‌కు రూ.1,67,844; అసిస్టెంట్ ప్రొఫెసర్‌కు రూ.1,44,201.

వయసు: 68 ఏళ్లు మించకూడదు.

దరఖాస్తు ఫీజు: రూ.500. ఎస్సీ/ ఎస్టీ/ దివ్యాంగులు/ ఎక్స్‌సర్వీస్‌మెన్‌కు ఫీజు లేదు.

ఇంటర్వ్యూ తేదీలు: 29.07.2025.

వేదిక: మెడికల్ కాలేజ్ అండ్ హాస్పిటల్, కె.కె నగర్, చెన్నై.

వెబ్‌సైట్: https://www.esic.gov.in/

గోవా షిప్‌యార్డ్‌లో నాన్-ఎగ్జిక్యూటివ్‌లు

గోవా షిప్‌యార్డ్ లిమిటెడ్ (జీఎస్ఎల్).. 102 నాన్-ఎగ్జిక్యూటివ్ పోస్టులను భర్తీచేయనుంది. ఒప్పంద ప్రాతిపదికన మూడేళ్లకు ఎంపిక చేస్తారు.



జూనియర్ సూపర్‌వైజర్-3, అసిస్టెంట్ సూపరింటెండెంట్-3, టెక్నికల్ అసిస్టెంట్-40, నర్స్-1, ఆఫీస్ అసిస్టెంట్-క్లరికల్ స్టాఫ్-14, షిప్‌రైట్ ఫిట్టర్-7, స్ట్రక్చరల్ ఫిట్టర్-10, వెల్డర్-8, మెషినిస్ట్-4, సేఫ్టీ స్టివార్డ్-4, పెయింటర్-8 ఖాళీలు ఉన్నాయి.

అన్ని పోస్టులకూ హిందీ, ఇంగ్లిష్‌తోపాటు కొంకణి/మరాఠీ తెలిసినవారికి ప్రాధాన్యమిస్తారు. డిప్లొమా కాకుండా ఉన్నత విద్యార్హతలు ఉన్నవారు దరఖాస్తుకు అనర్హులు.

◆ **టెక్నికల్ అసిస్టెంట్:** మూడేళ్ల మెకానికల్/ ఎలక్ట్రికల్/ ఎలక్ట్రానిక్స్/ షిప్ బిల్డింగ్/ ఫ్యాబ్రికేషన్ టెక్నాలజీ/ ఎరక్షన్ ఇంజినీరింగ్ డిప్లొమా. సంబంధిత రంగంలో ఐదేళ్ల అనుభవం, ఆటోక్యాడ్ పరిజ్ఞానం ఉండాలి.

◆ **ఆఫీస్ అసిస్టెంట్:** ఏదైనా డిగ్రీ, కంప్యూటర్ అప్లికేషన్స్‌లో ఏడాది సర్టిఫికెట్ కోర్సు, క్లరికల్ వర్క్‌లో మూడేళ్ల అనుభవం.

◆ **స్ట్రక్చరల్ ఫిట్టర్, వెల్డర్, మెషినిస్ట్:** స్ట్రక్చరల్ ఫిట్టర్/ ఫిట్టర్/ ఫిట్టర్ జనరల్/ షీట్ మెటల్ వర్కర్/ వెల్డర్/ మెషినిస్ట్ ట్రేడుల్లో ఐటీఐ. రెండేళ్ల అనుభవం ఉండాలి. నేషనల్ అప్రెంటిస్‌షిప్ సర్టిఫికెట్ (ఎన్ఏసీ) ఉన్నవారికి ప్రాధాన్యం.

◆ **సేఫ్టీ స్టివార్డ్:** పదోతరగతి, ఇండస్ట్రియల్ సేఫ్టీ/ ఫైర్ అండ్ సేఫ్టీ/ సేఫ్టీ మేనేజ్‌మెంట్‌లో ఏడాది డిప్లొమా. రెండేళ్ల అనుభవం ఉండాలి.

వయసు: 30.06.2025 నాటికి టెక్నికల్ అసిస్టెంట్‌కు 36 సంవత్సరాలు, ఆఫీస్ అసిస్టెంట్‌కు 35 ఏళ్లు, ఇతర ఉద్యోగాలకు 33 సంవత్సరాలు మించకూడదు. ఓబీసీ (ఎన్‌సీఎల్)లకు మూడేళ్లు, ఎస్సీ/ఎస్టీలకు ఐదేళ్ల సడలింపు ఉంటుంది. మాజీ సైనికోద్యోగులు, దివ్యాంగులకు ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా సడలింపులు వర్తిస్తాయి.

దరఖాస్తు ఫీజు: రూ.200. ఎస్సీ/ ఎస్టీ/ దివ్యాంగులు/ మాజీ సైనికోద్యోగులు/ సంస్థ ఉద్యోగులకు ఫీజు లేదు.

వేతనం: టెక్నికల్ అసిస్టెంట్‌కు మొదటి ఏడాది నెలకు రూ.36,300, రెండో ఏడాది నెలకు రూ.38,200, మూడో ఏడాది నెలకు రూ.40,200.

◆ ఆఫీస్ అసిస్టెంట్‌కు మొదటి ఏడాది రూ.32,600, రెండో ఏడాది రూ.34,300, మూడో ఏడాది రూ.36,100.

◆ ఫిట్టర్, వెల్డర్, మెషినిస్ట్‌లకు మొదటి ఏడాది రూ.28,700, రెండో ఏడాది రూ.30,200, మూడో ఏడాది రూ.31,800.

ఎంపిక ఎలా?

◆ రాత పరీక్ష, ధ్రువపత్రాల పరిశీలన, స్కిల్/ ట్రేడ్ టెస్టులతో ఎంపిక చేస్తారు.

◆ రాత పరీక్ష.. కంప్యూటర్ బేస్డ్ టెస్ట్ (సీబీటీ)/ పెన్ పేపర్ బేస్డ్ టెస్ట్ (పీబీటీ) విధానంలో 100 మార్కులకు ఉంటుంది. 25 శాతం జనరల్ ఆప్టిట్యూడ్, 75 శాతం సబ్జెక్ట్/ ట్రేడ్ సంబంధిత ప్రశ్నలు ఇస్తారు.

◆ రాత పరీక్షకు 40 శాతం, స్కిల్ టెస్టుకు 60 శాతం వెయిటేజీ ఉంటుంది.

◆ రాత పరీక్ష, స్కిల్ టెస్టుల్లో జనరల్ అభ్యర్థులు 40 శాతం, ఎస్సీ/ ఎస్టీ/ దివ్యాంగులు/ ఓబీసీలు 35 శాతం కనీసార్హత మార్కులు సాధించాలి.

◆ రాత పరీక్షలో అర్హత సాధించినవారి ధ్రువపత్రాలను పరిశీలించి స్కిల్ టెస్టుకు ఎంపిక చేస్తారు.

◆ స్కిల్ టెస్టుకు హాజరయ్యే వారికి స్లీపర్ క్లాస్ రైలు ఛార్జీలను చెల్లిస్తారు.

◆ ఎంపికైనవారిని గోవా షిప్‌యార్డ్ లిమిటెడ్‌లోనే కాకుండా జీఎస్ఎల్‌కు సంబంధించిన ఇతర యూనిట్లు/ ప్రాజెక్టులు/ ఆఫీసుల్లో ఎక్కడైనా నియమిస్తారు.

◆ ముందుగా మూడేళ్లకు ఎంపిక చేసినప్పటికీ.. సంస్థ అవసరాల నిమిత్తం మరో రెండేళ్లు పొడిగించే అవకాశం ఉంటుంది.

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: 11.08.2025

వెబ్‌సైట్: https://www.goashipyard.in/

సిరి చిన్నప్పటి నుంచి అన్ని తరగతుల్లో ఫస్ట్ ర్యాంకు సాధిస్తోంది. ఆమె సోదరుడు హరి మాత్రం అత్తెసరు మార్కులతో గట్టెక్కుతున్నాడు. నిజానికి ఆ కుర్రాడూ కష్టపడి చదువుతున్నాడు. ఎంత ప్రయత్నించినా మార్కులు రాకపోవడంతో విసిగిపోయాడు.

మరోవైపు తను సరిగ్గా చదవట్లేదని, సిరిని చూసి నేర్చుకోవాలని అమ్మ, నాన్న తిట్టేవారు. తీవ్ర ఒత్తిడికి గురికావడంతో ఆసుపత్రికి తీసుకెళ్లగా..డిస్‌లెక్సియాతో బాధపడుతున్నట్లు వైద్యులు గుర్తించి, చికిత్స చేస్తున్నారు.

ఓ విద్యార్థి ప్రవర్తన సరిగా లేదని తల్లిదండ్రులు.. ఆసుపత్రికి తీసుకెళ్లారు. పరిశీలించిన వైద్యుడు.. దేవుడు కలలో కనిపించి ఏం వరం కావాలో కోరుకోమంటే ఏం అడుగుతావని ప్రశ్నించారు.

ఆ అబ్బాయి ఆట వస్తువులు, సైకిల్, ఫోన్ అడగలేదు. చదివిన పాఠం అర్థమైతే చాలని బదులిచ్చాడు. దీన్ని బట్టి ఆ కుర్రాడు ఎంతగా ఒత్తిడికి గురవుతున్నాడో అర్థం చేసుకోవచ్చు.

విభిన్న అవసరాలకు ప్రత్యేక విద్య!



డిస్‌లెక్సియా... డిస్‌గ్రాఫియా... డిస్‌కాలిక్యులియా... ఇవన్నీ అభ్యసన సామర్థ్యానికి సంబంధించిన సమస్యలు. వీటిని సకాలంలో గుర్తిస్తే బాధితులకు మంచి శిక్షణ ఇచ్చేందుకు పలు సదుపాయాలున్నాయి. ఇలాంటి పిల్లలకు చదువులో, పరీక్షల్లో కొన్ని ప్రత్యేక అవకాశాలూ ఉన్నాయి.

అభ్యసన సామర్థ్యానికి సంబంధించిన సమస్యలున్న వారిలో కొందరు చదవడం, మరికొందరు రాయడంలో ఇబ్బందులు ఎదుర్కొంటారు. ఇంకొందరు లోతైన విశ్లేషణలు.. క్లిష్టమైన గణాంకాలు చేయాలంటే అవస్థ పడతారు. అలాంటి చిన్నారులకు నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఓపెన్ స్కూలింగ్ (ఎన్ఐఓఎస్), భవిత కేంద్రాల్లో సులువుగా చదువుకోవడానికి అవకాశాలున్నాయి. వారిక్కడ తమ ప్రజ్ఞకు తగ్గట్టుగా పాఠాలు నేర్చుకుని.. పరీక్షలు రాయొచ్చు. ఆ ధ్రువపత్రాలతో ఉన్నత విద్య, ప్రభుత్వ ఉద్యోగాలకూ వెళ్లొచ్చు.

ఎస్ఎల్‌డీ.. ఓ ముప్పు

- కొందరు పిల్లలు నిర్దిష్ట అభ్యసన వైకల్యం (స్పెసిఫిక్ లెర్నింగ్ డిజేబిలిటీ - ఎస్ఎల్‌డీ) బారిన పడతారు. తల్లిదండ్రులు ఈ లక్షణాలను ముందుగానే గుర్తిస్తే చాలావరకు నయం చేయవచ్చు.
- డిస్‌లెక్సియా బారిన పడిన చిన్నారులకు తెలివితేటలు బాగానే ఉన్నా.. పాఠాలను స్వయంగా చదవడానికి ఇబ్బంది పడతారు. ప్రాథమిక తరగతుల్లో పదాలు పలకడానికి కష్టపడతారు. ఎవరైనా వివరిస్తే మాత్రం చక్కగా నేర్చుకుంటారు. చదవాలని ఒత్తిడి చేస్తే విసుగు చెంది.. ఆడుకోవడానికి వెళ్లిపోతారు. తల్లిదండ్రులేమో సమస్యను అర్థం చేసుకోకుండా తమ పిల్లలకు చదువు అబ్బట్లేదని భావిస్తారు.
- డిస్‌గ్రాఫియా బాధితులు పుస్తకంలోని పదాలు చక్కగా చదువుతారు. కానీ రాయాలంటే మాత్రం ఇబ్బంది పడతారు.
- డిస్‌కాలిక్యులియా సమస్య ఉన్నవాళ్లు మిగిలిన సబ్జెక్టులన్నీ బాగానే చదివినా.. గణితం అంటే భయపడతారు. విశ్లేషణలు చేయలేరు.
- హైపర్ యాక్టివిటీ సమస్య ఉన్న చిన్నారులకు తెలివితేటలు బాగానే ఉన్న.. ఏకాగ్రత లోపించడంతో ఏ పనినీ ఎక్కువసేపు చేయలేరు.
- ప్రతి 100 పిల్లల్లో 10 మందికి ఈ సమస్యల్లో ఏదో ఒకటి ఉంటుందని అంచనా.
- ఈ సమస్యలు తీవ్ర స్థాయిలో ఉండి చదువు మధ్యలో ఆపేసిన విద్యార్థులు సార్వత్రిక విద్యాపీఠం (ఓపెన్ స్కూలింగ్)లో దరఖాస్తు చేసుకోవచ్చు.

ప్రాథమిక, ఉన్నత విద్య



- ఎన్ఐఓఎస్‌లో ఓపెన్ బేసిక్ ఎడ్యుకేషన్ (ఓబీఈ) కింద ప్రాథమిక, ఉన్నత విద్య అందిస్తారు. సంప్రదాయ పాఠశాలల మాదిరిగానే వీటికీ ప్రభుత్వ గుర్తింపు ఉంటుంది. ఈ ధ్రువపత్రాలతో ప్రభుత్వ ఉద్యోగాలకూ అర్హులే.
- ఏటా ఏప్రిల్ 1 నుంచి సెప్టెంబరు 15 వరకు ఇందులో ప్రవేశాలు పొందొచ్చు. మరిన్ని వివరాలను https://sdmis.nios.ac.in/ వెబ్‌సైట్‌లో చూడొచ్చు
- నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఓపెన్ స్కూలింగ్ (ఎన్ఐఓఎస్)లో వీరికి పదో తరగతిలో అయిదు సబ్జెక్టులే ఉంటాయి. 15 ఏళ్లు దాటితే ఫీజు చెల్లించి, పదో తరగతి పరీక్షలు రాసుకోవచ్చు. వృత్తి విద్య కోర్సులూ నేర్చుకోవచ్చు.
- 2025-26 విద్యా సంవత్సరానికి సంబంధించిన ప్రవేశాలకు ఇప్పటికే నోటిఫికేషన్ విడుదలైంది. దీనికి జులై 30 లోగా దరఖాస్తు చేసుకోవచ్చు. ఆలస్య రుసుముతో ఆగస్టు 15 వరకు అవకాశముంది.
- సార్వత్రిక విద్యా పీఠానికి సంబంధించి విశాఖలోని ప్రాంతీయ కేంద్రం పరిధిలో చిత్తూరు, కాకినాడ, గుంటూరు, విజయవాడ, కర్నూలు, ప్రకాశం, విశాఖపట్నంలో, తెలంగాణలో హైదరాబాద్ ప్రాంతీయ కేంద్రం పరిధిలో హైదరాబాద్, ఆదిలాబాద్, కామారెడ్డి, కరీంనగర్, మేడ్చల్, నాగర్‌కర్నూల్, రంగారెడ్డి తదితర ప్రాంతాల్లో స్టడీ సెంటర్లున్నాయి.

మినహాయింపులున్నాయ్

- అభ్యసన లోపాలున్న విద్యార్థులకు... దీర్ఘకాలిక నాడీ సంబంధిత, రక్త సరఫరా లోపాలతో బాధపడే వారికి కొన్ని ప్రత్యేక అవకాశాలున్నాయి.
- 6 నుంచి పదో తరగతి వరకు అటు మార్కుల్లో, ఇటు సబ్జెక్టుల్లో మినహాయింపు ఉంటుంది.
- రాష్ట్ర సార్వత్రిక విద్యా పీఠం (ఓపెన్ స్కూలింగ్)లోనూ ఇవి వర్తిస్తాయి.

సమస్య ఉంటే...

పిల్లలు చిన్నప్పట్నుంచి వయసుకు తగ్గట్టుగా పాకడం, నడవడం, మాట్లాడడం చేయలేకుంటే వారికి మెదడు ఎదుగుదలలో సమస్య ఉందని తల్లిదండ్రులు భావించాలి. వారిలో వినడం, మాట్లాడటం, చదవడం, రాయడం వంటి నైపుణ్యాలను గుర్తించాలి. అలా చేయకుండా చదవమని ఒత్తిడి చేయడం సరి కాదు. ఏదైనా సమస్య ఉంటే నిపుణులను సంప్రదించాలి. అవసరమైతే వైద్యులు స్పెషల్ ఎడ్యుకేషన్ శిక్షణకు పంపిస్తారు. మెదడు ఎదుగుదల తక్కువగా ఉన్నవారికి 2016 మానసిక వికలాంగుల చట్టం ప్రకారం రిజర్వేషన్ కల్పిస్తారు. ఉన్నత విద్య పూర్తిచేస్తే దివ్యాంగుల మాదిరిగా వీరికీ ప్రతి ఉద్యోగంలోనూ రిజర్వేషన్ ఇస్తారు.

– డా॥ ప్రసన్నకుమార్, పిల్లల మానసిక వైద్య నిపుణులు

భవిత కేంద్రాల్లోనూ..

- ఏపీలో సమగ్ర శిక్షాభియాన్ ఆధ్వర్యంలో 679 భవిత కేంద్రాలు నడుస్తున్నాయి. వీటిల్లో 13,580 మంది చదువుతున్నారు.
- అక్కడ స్పెషల్ ఎడ్యుకేటర్ ఉంటారు. సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో రాష్ట్రంలో విద్యార్థుల కోసం రిహాబిలిటేషన్ కేంద్రం ఏర్పాటుచేయాలనే ప్రతిపాదన ఉంది.

– ఈనాడు, అమరావతి, విశాఖపట్నం

అచ్యుతానందన్ మృతి పట్ల గవర్నర్ విచారం

ఈనాడు, అమరావతి: ప్రముఖ కమ్యూనిస్ట్ నాయకుడు, కేరళ మాజీ ముఖ్యమంత్రి, దశాబ్దాలుగా ప్రజాసేవకు అంకితమైన వీఎస్ అచ్యుతానందన్ మృతి పట్ల గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్ విచారం వ్యక్తం చేశారు. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.

ప్రజాసేవకే అంకితమైన నాయకుడు: చంద్రబాబు

కేరళ మాజీ సీఎం అచ్యుతానందన్ మృతిపై సీఎం చంద్రబాబు తీవ్ర విచారం వ్యక్తం చేశారు. ఆయన ఆత్మకు శాంతి కలగాలని ఆకాంక్షించారు. సుదీర్ఘ రాజకీయ జీవితాన్ని ప్రజాసేవకే అంకితం చేశారని ఎక్స్ వేదికగా కొనియాడారు.

అచ్యుతానందన్‌ది ప్రజా పక్షం

డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్

కేరళ మాజీ సీఎం వి.ఎస్.అచ్యుతానందన్ తుదిశ్వాస విడిచారని తెలిసి ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ సోమవారం ఓ ప్రకటనలో విచారం వ్యక్తం చేశారు. 'ఆయన ఆత్మకు శాంతి చేకూరాలి. కార్మిక హక్కుల పోరాటం మొదలు రాజకీయ జీవితమంతా ప్రజల ప్రక్షానే నిలిచారు. నిరాడంబర జీవితం గడిపిన నేతగా ఆయన ప్రజలకు గుర్తుండిపోతారు' అని పేర్కొన్నారు.

అచ్యుతానందన్ మృతికి వామపక్షాల సంతాపం

కేరళ మాజీ ముఖ్యమంత్రి వీఎస్ అచ్యుతానందన్ మృతి పట్ల సీపీఎం, సీపీఐ రాష్ట్ర కార్యదర్శులు వి.శ్రీనివాసరావు, రామకృష్ణ సంతాపం తెలిపారు. 'కేరళలోని వెనుకబడిన నిరుపేద కుటుంబంలో జన్మించిన ఆయన కార్మిక ఉద్యమాల ద్వారా ఎదిగారు. ఆ రాష్ట్ర సీఎంగా ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేశారు. కామ్రేడ్ కృష్ణపిళ్లై నాయకత్వంలో భూస్వాములకు వ్యతిరేకంగా అనేక పోరాటాల్లో పాల్గొన్నారు. కార్మికుల పోరాటాలకు ప్రత్యక్షంగా నాయకత్వం వహించారు. ఆయన మృతి పార్టీకి, ప్రజలకు తీరని లోట'ని పేర్కొన్నారు.

స్మార్ట్ సిటీ పథకానికి అదనంగా రూ.32 కోట్లు

ఈనాడు, అమరావతి: స్మార్ట్ సిటీ పథకంలో భాగంగా రాజధాని అమరావతిలోని పలు ప్రతిపాదిత పనుల నిర్వహణకు ప్రభుత్వం అదనంగా మరో రూ.32 కోట్లు కేటాయిస్తూ సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. అదనపు బడ్జెట్ కోసం అమరావతి స్మార్ట్, సస్టయినబుల్ సిటీ కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్ చేసిన ప్రతిపాదనలను ప్రభుత్వం ఆమోదించింది. స్మార్ట్ సిటీ పథకానికి సంబంధించిన పనులకే వీటిని ఖర్చు చేయాలని ఆదేశించింది.

టీచర్ల జీతాల చెల్లింపులో జాప్యం చేయొద్దు: యూటీఎఫ్, ఏపీటీఎఫ్

ఈనాడు, అమరావతి: ఉపాధ్యాయుల జీతాల చెల్లింపులో జాప్యం చేయొద్దని ఏపీ ఐక్య ఉపాధ్యాయ సమాఖ్య (యూటీఎఫ్), ఏపీ ఉపాధ్యాయ సమాఖ్య (ఏపీటీఎఫ్-1938) కోరాయి. 'ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులు, పోస్టుల హేతుబద్ధీకరణ కారణంగా పాఠశాలల్లో కొత్త క్యాడర్ స్ట్రెంత్ వచ్చింది. దీనికి అనుగుణంగా పొజిషన్ ఐడీలు రాకపోవడంతో ఉపాధ్యాయులకు జీతాల సమస్య ఏర్పడింది. ఆర్థిక శాఖ నుంచి జీఓ విడుదల చేసి, జీతాలు చెల్లించేందుకు చర్యలు తీసుకోవాలి. ఉన్నత పాఠశాలల్లోని ఒక తరగతిలో 50 మంది విద్యార్థులకు మించితే రెండో సెక్షన్ ఏర్పాటు చేయాలని తీసుకున్న నిర్ణయానికి క్యాబినెట్ ఆమోదం కావాలని అధికారులు అంటున్నారు' అని పేర్కొన్నాయి.

విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం డీజీగా డీజీపీ గుప్తాకు అదనపు బాధ్యతలు

ఈనాడు, అమరావతి: రాష్ట్ర విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం డైరెక్టర్ జనరల్ (డీజీ), ఎక్స్ అఫీషియో ప్రిన్సిపల్ సెక్రటరీగా డీజీపీ హరీష్‌కుమార్ గుప్తాకు పూర్తి అదనపు బాధ్యతలు అప్పగిస్తూ ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది.

రాయితీ ఎరువులకు ఇతర ఉత్పత్తులకు లింకు పెట్టొద్దు

గుంటూరు(కలెక్టరేట్), న్యూస్‌టుడే: రైతులకు రాయితీపై అందించే యూరియా, డీఏపీ తదితర ఎరువులు కావాలంటే.. రాయితీ లేని కొన్ని కంపెనీల ఉత్పత్తులు కొనుగోలు చేయాలని ఇబ్బంది పెడితే అధికారులు చర్యలు తీసుకోవాలని కేంద్ర ఎరువులు, పురుగు మందుల శాఖ అదనపు కార్యదర్శి అనీత సీ మెష్రం ఉత్తర్వులు జారీ చేశారు. రైతుల నుంచి పెద్ద ఎత్తున ఫిర్యాదులు వస్తున్నాయని, ఇటువంటి అమ్మకాలను పర్యవేక్షించాలన్నారు. ఎరువులకు ఇతర ఉత్పత్తులకు లింకు పెట్టి అమ్మకాలు చేయడం ఈసీఏ నిబంధనలు ఉల్లంఘించడమేనని తెలిపారు.

రెండేళ్లకు ఆయిల్‌పామ్ ధరల నిర్ణయం

ఈనాడు, అమరావతి: రాష్ట్రంలో ఆయిల్‌పామ్‌కు సంబంధించి గత రెండేళ్లకు ప్రభుత్వం ధరలు నిర్ణయించింది. 2023-24 సంవత్సరానికి 2023 నవంబరు 1 నుంచి 2024 అక్టోబరు 31 వరకు ఆయిల్ ఎక్స్‌ట్రాక్షన్ రేషియో పర్సంటేజి(ఓఈఆర్) 19.17%, గింజలకు 10.25% చొప్పున ఇవ్వనున్నారు. 2024-25 సంవత్సరంలో ఇదే కాలానికి ఓఈఆర్‌గా 19.42%, గింజలకు 10.15% చొప్పున చెల్లించాలని ప్రభుత్వం ఆదేశించింది. ఈ మేరకు వ్యవసాయ, సహకారశాఖ ఎక్స్‌అఫిషియో ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రాజశేఖర్ సోమవారం ఉత్తర్వులు ఇచ్చారు.

జిల్లాస్థాయి ఎంపిక కమిటీలో జేసీకి స్థానం

ఈనాడు, అమరావతి: వయోజన విద్య విభాగంలో సూపర్‌వైజర్లుగా టీచర్ల ఎంపికకు ఏర్పాటు చేసే జిల్లా స్థాయి కమిటీలో సంయుక్త కలెక్టర్(జేసీ)ను నియమిస్తూ ప్రభుత్వం సవరణ ఉత్తర్వులు జారీ చేసింది. ఇప్పటి వరకు అదనపు సంయుక్త కలెక్టర్ ఉండగా.. ఆయన స్థానంలో జేసీని నియమించింది. వయోజన విద్యలో సూపర్‌వైజర్ల నియామకం కోసం జిల్లా స్థాయి కమిటీ అర్హులైన ఎస్జీటీ, పీఈటీ, గ్రేడ్-2 భాషా పండితుల నుంచి దరఖాస్తులు స్వీకరించనుంది.

పోలవరం నాణ్యత నియంత్రణ

మాన్యువల్ ఎప్పుడు?

- పనులు ప్రారంభించి 6 నెలలు
- ఇంకా ముందుకు పడని అడుగులు
- నాణ్యత నియంత్రణపై మూడో పక్షం ఎంపిక పూర్తి



ఈనాడు, అమరావతి: పోలవరం ప్రధాన ప్రాజెక్టు పనుల్లో నాణ్యత విషయంలో విదేశీ నిపుణుల బృందం అనేక సిఫార్సులు చేసినా, అమలు దిశగా ఇంకా అడుగులు పడడంలేదు. కేంద్ర జలశక్తిశాఖ కూడా ఈ విషయంలో పట్టుపడుతున్నా చలనం లేదు. ఇప్పటికే రూ.వందల కోట్ల విలువ చేసే పాత డయాఫ్రం వాల్ ధ్వంసమైంది. మరో వైపు సుమారు రూ.100 కోట్ల విలువ చేసే గైడ్‌బండ్ దెబ్బతింది. ఎగువ, దిగువ కాఫర్ డ్యాంలు పరిమితికి మించిన సీపేజీతో సృష్టించిన నష్టం చాలా ఎక్కువే. ఆ నీళ్లు తోడిపోసేందుకే రూ.కోట్ల వ్యయం చేయాల్సి వస్తోంది. కొత్త డయాఫ్రం వాల్ పనులు ప్రారంభమై ఆరు నెలలైంది. పనులు 30 శాతం మేర పూర్తయ్యాయి. ఇన్నాళ్లకు మూడో పక్షం నాణ్యత నియంత్రణ ఏజెన్సీ ఎంపిక పూర్తయినా, ఇంకా మాన్యువల్ రూపకల్పనకు, అమలుకు అడుగులు పడలేదు.

6 నెలల తర్వాత మూడో పక్షానికి బాధ్యతలు

పోలవరం ప్రాజెక్టులో ఇంతకాలం గుత్తేదారు సంస్థ, రాష్ట్ర ప్రభుత్వం తరఫున నాణ్యత నియంత్రణ విభాగం వివిధ పరీక్షలు జరిపి పనుల్లో నాణ్యతను మదింపు చేస్తోంది. కేంద్ర జలశక్తిశాఖ తరఫున పోలవరం విదేశీ నిపుణుల బృందం ప్రాజెక్టును పరిశీలించినప్పుడు నాణ్యతపై కీలక సిఫార్సులు చేసింది. స్వతంత్ర నాణ్యత నియంత్రణ వ్యవస్థ అవసరమని తేల్చి చెప్పింది. ప్రతి అంశంలోనూ గుత్తేదారు పాత్ర కీలకమవుతోందని, ఆకృతులు రూపొందిస్తున్నదీ.. అమలు తీరును పరిశీలిస్తున్నదీ వారేనని పేర్కొంది. ప్రభుత్వం తరఫున పక్కా పర్యవేక్షణతో పాటు నాణ్యతపై మూడో పక్షం బాధ్యత వహించాలని సిఫార్సు చేసింది. మూడో పక్షాన్ని నియమించేందుకు ఆరు నెలలు పట్టింది. తిరుపతి ఐఐటీతో పాటు నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ బిల్డింగ్ కన్‌స్ట్రక్షన్‌తో సంప్రదింపులు జరిపారు. వీరిలో ఎవరో ఒకరికి బాధ్యతలు అప్పగించాలని భావించినా కేంద్ర జలశక్తిశాఖ అందుకు అంగీకరించలేదు. దీంతో టెండర్లు పిలిచారు. ఫలితంగా 45 ఏళ్ల అనుభవం ఉన్న దిల్లీ సంస్థ అడ్కో ఎంపికైంది. ఈ సంస్థకు బాధ్యతలు అప్పగించనున్నారు. పోలవరం ప్రాజెక్టు వద్దే ప్రత్యేక ల్యాబ్ ఏర్పాటు చేసి అవసరమైన పరీక్షలు ఎప్పటికప్పుడు పూర్తి చేయాల్సి ఉంటుంది.

నాణ్యతా ప్రమాణాల ముసాయిదా ఎప్పుడు?

ఈ ప్రాజెక్టులో వివిధ నిర్మాణాలకు సంబంధించిన నాణ్యతను నిర్ధారించేలా ఒక ముసాయిదా సిద్ధం చేయాల్సి ఉంది. దీనికి కేంద్ర జలశక్తి శాఖ, కేంద్ర జల సంఘం, పోలవరం అథారిటీ, ఏపీ జలవనరులశాఖ, ఇతర సంస్థలు ఆమోదం తెలపాలి. అఫ్రి రూపొందించిన ముసాయిదాపై కొన్ని సంస్థలు అభ్యంతరాలు తెలియజేసినట్లు సమాచారం. నాణ్యత విషయంలో కచ్చితంగా ఎవరో ఒకరిని ఆయా పనులకు బాధ్యులను చేయాలని గతంలోనే సిఫార్సులు ఉన్నాయి.

- ◆ నాణ్యత విషయంలో ఎవరి పాత్ర ఏమిటో ముందే నిర్ధారించాలి. ఏయే నాణ్యత పరీక్షలు చేయాలో ముందే తేల్చాలి.
- ◆ ఏ పనికి ఎవరు బాధ్యులో వారి హోదాతో సహా స్పష్టంగా మాన్యువల్‌లో పేర్కొనాల్సి ఉంటుంది.
- ◆ మూడో పక్షం స్వతంత్ర ల్యాబ్‌ను ఏర్పాటు చేయాలి.

ఎయిడెడ్ టీచర్ల నియామకాలకు ఆన్‌లైనా? ఆఫ్‌లైనా?

- పోస్టుల భర్తీకి చేపట్టే విధానంపై సందిగ్ధత

ఈనాడు, అమరావతి: ఎయిడెడ్ పాఠశాలల్లో ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి పాఠశాల విద్యాశాఖ చర్యలు చేపట్టింది. ఈ నియామకాలకు కంప్యూటర్ ఆధారిత పరీక్ష నిర్వహిస్తారా? పాత విధానంలో ఉన్నట్లు ఆఫ్‌లైన్‌లో రాతపరీక్ష నిర్వహిస్తారా? అనే దానిపై సందిగ్ధత నెలకొంది. రాష్ట్రవ్యాప్తంగా 10 పాఠశాలల్లో టీచర్ నియామకాలకు ఈ నెల 27న పరీక్ష నిర్వహించేందుకు షెడ్యూల్ విడుదలైంది. అన్ని పాఠశాలల్లో కలిపి 40కు పైగా ఖాళీలు ఉన్నాయి. పోస్టుల భర్తీలో పాటించాల్సిన విధానాలపై ప్రభుత్వం ఈ నెల 11న సవరించిన ఉత్తర్వులను జారీ చేసింది. దీని ప్రకారం మైనారిటీయేతర విద్యాసంస్థల్లో పోస్టుల భర్తీకి కంప్యూటర్ ఆధారిత పరీక్ష నిర్వహించాల్సి ఉంటుంది. ఈ మేరకు అభ్యర్థులకు కంప్యూటర్లు ఏర్పాటు చేయాలి. అయితే పాఠశాల విద్యాశాఖ ఇప్పటివరకు ఇలాంటి ఏర్పాట్లు చేయలేదు. క్షేత్రస్థాయిలో మాత్రం ఆఫ్‌లైన్‌లోనే పరీక్ష నిర్వహించబోతున్నట్లు అధికారులు పేర్కొంటున్నారు. మైనారిటీ విద్యాసంస్థలకు వచ్చేసరికి పాత విధానాన్నే అమలు చేయనున్నారు.

● ఎయిడెడ్ టీచర్ పోస్టుల భర్తీకి 80 మార్కులకు ఆన్‌లైన్ పరీక్ష, టెట్‌కు 20 మార్కుల వెయిటేజీ ఉంటుందని ప్రభుత్వం ఉత్తర్వుల్లో పేర్కొంది. ఎయిడెడ్‌లో పనిచేసే టీచర్లకు గరిష్ఠంగా ఐదు మార్కులు వెయిటేజీ ఇవ్వనున్నట్లు పేర్కొంది. ప్రస్తుత పరీక్షలకు ఈ విధానం పాటిస్తారా? లేదా? అనేదానిపై కూడా అస్పష్టత నెలకొంది.

నేర నియంత్రణలో సాంకేతికతను వినియోగించుకోవాలి

డీజీపీ హరీష్‌కుమార్ గుప్తా

ఈనాడు, అమరావతి: నేర నియంత్రణ, నేరాల ఛేదనలో సాంకేతికతను విస్తృతంగా వినియోగించుకునే అంశంపై యువ ఐపీఎస్ అధికారులు దృష్టిసారించాలని డీజీపీ హరీష్‌కుమార్ గుప్తా అన్నారు. హైదరాబాద్‌లోని సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ జాతీయ పోలీసు అకాడమీలో శిక్షణ పొందుతున్న 28 మంది ప్రొబేషనరీ ఐపీఎస్ అధికారులు స్టడీ, కల్చరల్ పర్యటనలో భాగంగా.. సోమవారం పోలీసు ప్రధాన కార్యాలయంలో డీజీపీ, ఇతర సీనియర్ అధికారులతో మర్యాదపూర్వకంగా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా యువ ఐపీఎస్ అధికారులకు డీజీపీ పలు సూచనలు చేశారు. విశాఖపట్నంలో ఇటీవల ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించిన యోగాంధ్ర కార్యక్రమం విజయవంతానికి తీసుకున్న చర్యలు, అస్త్రం యాప్, ఏఐ హ్యాకథాన్ తదితరాలను వివరించారు. యువ అధికారులు వారు పోస్టింగ్ పొందిన ప్రాంతాల్లోని స్థానిక భాషల మీద పట్టు సాధించాలన్నారు.

కోనేరు హంపి ఘనత స్ఫూర్తిదాయకం

సీఎం చంద్రబాబు

ఈనాడు, అమరావతి: ఫిడే మహిళల చెస్ ప్రపంచకప్ సెమీ ఫైనల్‌కు చేరిన తొలి భారత క్రీడాకారిణిగా గ్రాండ్‌మాస్టర్ కోనేరు హంపి చరిత్ర సృష్టించారని ముఖ్యమంత్రి చంద్రబాబు కొనియాడారు. తెలుగుబిడ్డగా ఆమె సాధించిన ఘనత స్ఫూర్తిదాయకమని, ఎందరికో ప్రేరణగా నిలిచిందని 'ఎక్స్' వేదికగా సోమవారం పేర్కొన్నారు. చదరంగంలో ఆమె మరిన్ని విజయాలు సాధించాలని సీఎం ఆకాంక్షించారు.

● ఫిడే మహిళల చెస్ ప్రపంచకప్ సెమీ ఫైనల్ చేరిన తొలి భారత క్రీడాకారిణిగా కోనేరు హంపి చరిత్ర సృష్టించడం భారత చెస్ రంగానికి గర్వకారణమని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ 'ఎక్స్' వేదికగా ఆమెకు అభినందనలు తెలిపారు.

యువ ప్రతిభావంతులకు నిజమైన స్ఫూర్తి హంపి: జగన్

'ఫిడే మహిళల చెస్ ప్రపంచ కప్ సెమీఫైనల్‌కు చేరుకున్న భారత తొలి మహిళగా నిలిచిన గ్రాండ్ మాస్టర్ కోనేరు హంపికి అభినందనలు. దేశవ్యాప్తంగా ఉన్న యువ ప్రతిభావంతులకు మీరు నిజమైన స్ఫూర్తి. రాబోయే రోజుల్లో విజయపరంపరను కొనసాగిస్తూ మరిన్ని కీర్తి పతాకాలు సాధించాలి' అని మాజీ ముఖ్యమంత్రి జగన్ సోమవారం 'ఎక్స్'లో పోస్ట్ చేశారు.

ట్రిపుల్ ఐటీ ప్రవేశాల్లో బాలికలదే పైచేయి

- రికార్డు స్థాయిలో 68% సీట్లు పొందిన అమ్మాయిలు
- 23న మూడో విడత కౌన్సెలింగ్

ఈనాడు, అమరావతి: ఈనాడు-ఏలూరు, నూజివీడు రూరల్-న్యూస్‌టుడే: రాజీవ్‌గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయం (ఆర్జీయూకేటీ) పరిధిలోని ట్రిపుల్ ఐటీల్లో ఈ ఏడాది అత్యధికంగా బాలికలు ప్రవేశాలు పొందారు. నూజివీడు, ఒంగోలు, శ్రీకాకుళం, ఇడుపులపాయలో కలిసి నాలుగు ట్రిపుల్ ఐటీలు ఉండగా.. పీయూసీ ప్రవేశాలకు ఇప్పటికే రెండు విడతల కౌన్సెలింగ్ పూర్తయింది. మొత్తం 4,400 సీట్లకు రెండు విడతల్లో కలిపి 4,072 సీట్లు భర్తీ అయ్యాయి. ప్రవేశాలు పొందిన వారిలో అత్యధికంగా 2,763 (67.85 శాతం) మంది అమ్మాయిలు కాగా.. అబ్బాయిలు 1,309 మంది ఉన్నారు. అమ్మాయిలు ఇంత పెద్ద మొత్తంలో సీట్లు పొందటం ట్రిపుల్ ఐటీలు ఏర్పాటైన నాటి నుంచి చూస్తే ఇదే ప్రథమంగా చెబుతున్నారు. పదో తరగతిలో వచ్చిన అత్యుత్తమ మార్కుల ఆధారంగా ఇందులో ప్రవేశాలు కల్పిస్తారు. 2024-25 విద్యా సంవత్సరంలో పదో తరగతి ఉత్తీర్ణతలోనూ బాలికలే పైచేయి సాధించారు. అత్యుత్తమ మార్కులు వారే పొందారు. దీంతో సీట్లు వారినే వరించాయి. ఎక్కువ మంది బాలికలు చేరటంతో నూజివీడు ట్రిపుల్ ఐటీ ప్రాంగణంలో వారికి వసతిగృహాలు కేటాయించటానికి ఓ పరిపాలన భవనాన్ని ఖాళీ చేయాల్సి వచ్చింది. పదో తరగతిలో మొదటి పది ర్యాంకులు సాధించిన బాలికలు ట్రిపుల్ ఐటీలను ఎంచుకున్నారు. మరోవైపు ట్రిపుల్ ఐటీల్లో మిగిలిన సీట్లకు ఈ నెల 23న మూడో విడత కౌన్సెలింగ్ నిర్వహించనున్నారు.

ట్రిపుల్ ఐటీల్లో సీట్లు పొందిన వారి వివరాలు ఇలా..

ప్రాంగణం	బాలికలు	బాలురు	మొత్తం
నూజివీడు	741	330	1071
ఒంగోలు	626	306	932
ఇడుపులపాయ	679	377	1056
శ్రీకాకుళం	717	296	1013

70 శాతం కొలువులు

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కళాశాల విద్య బలోపేతానికి బాగా ప్రాధాన్యమిస్తోంది. నాణ్యమైన చదువులు బోధించేలా చర్యలు తీసుకోవటంతో పాటు ప్రాంగణ నియామకాలకు కంపెనీలు వచ్చేలా చర్యలు చేపట్టింది. అలాగే గేట్‌లో శిక్షణ ఇచ్చి ఎంటెక్‌లో సీట్లు పొందేలా, పోటీ పరీక్షలకు హాజరయ్యే వారికి అన్ని రకాల పుస్తకాలను, డిజిటల్ రూపంలో విలువైన కంటెంట్‌ను అందుబాటులో ఉంచుతోంది. ఫలితంగా 2025లో ట్రిపుల్ ఐటీ కోర్సులు పూర్తి చేసుకుని బయటకు వెళ్లిన వారిలో 70 శాతం మంది విద్యార్థులు కొలువులు దక్కించుకున్నారు.

శ్రీవారి సేవకు దేశీ ఆవుపాలే వినియోగించాలన్న పిటిషన్ తిరస్కరణ

ఈనాడు, దిల్లీ: తిరుమలలో శ్రీవారి సేవకు కేవలం స్వదేశీ ఆవుపాలు, నెయ్యినే వినియోగించేలా ఉత్తర్వులివ్వాలని కోరుతూ యుగతులసి ఫౌండేషన్ దాఖలు చేసిన రిట్ పిటిషన్‌పై విచారణకు సుప్రీంకోర్టు విముఖత వ్యక్తం చేసింది. ఈ మేరకు జస్టిస్ ఎంఎం సుందరేష్, జస్టిస్ ఎన్.కోటీశ్వర్‌సింగ్‌తో కూడిన ధర్మాసనం ఉత్తర్వులు జారీ చేసింది. "ఇంతకంటే ముఖ్యమైన అంశాలు చాలా ఉన్నాయి. సాటి ప్రాణులకు సేవ చేయడమే దేవుడిపై మనకున్న నిజమైన ప్రేమ అవుతుంది తప్పితే.. ఇది కాదు. మీ మీద గౌరవంతో ఈ మాటలు చెబుతున్నాం. ఆవు ఏదైనా ఆవే" అని జస్టిస్ సుందరేష్ పేర్కొన్నారు. పిటిషనర్ తరఫు న్యాయవాది స్పందిస్తూ.. ఆగమశాస్త్రం ప్రకారం అందులో తేడాలున్నాయని చెప్పగా, ఆ వాదనతో న్యాయమూర్తి విభేదించారు. "భాష, ప్రాంతం, కులం, మతం, రాష్ట్రం ఆధారంగా తేడాలున్నది కేవలం మనుషులకు మాత్రమే. దేవుడు అందరికీ ఒక్కటే. అది ప్రాణులైనా, ఇంకెవరైనా.. దేవుడికి చేసే ఏ సేవ అయినా మన కున్న భక్తికి చిహ్నం మాత్రమే. అంతకు మించేమీ లేదు' అని న్యాయమూర్తి స్పష్టం చేశారు. దేశీ ఆవుపాలు వినియోగించడం తప్పనిసరి అని న్యాయవాది వాదించగా.. అలా ఎక్కడైనా చట్టంలో ఉందా? అని జస్టిస్ సుందరేష్ ప్రశ్నించారు. లోగడ రెండు రాజ్యాంగ ధర్మాసనాలు ఇచ్చిన తీర్పుల ఆధారంగా తాను ఇది చెబుతున్నట్లు న్యాయవాది పేర్కొన్నారు. ఆ వాదనతో న్యాయమూర్తి ఏకీభవించలేదు. "అలాగైతే మీరు ఇకపై తిరుపతి లడ్డూ కూడా దేశీయంగానే ఉండాలి అంటారు" అని వ్యాఖ్యానిస్తూ విచారణ ముగించారు. పిటిషన్‌ను తిరస్కరిస్తున్నట్లు వెల్లడించారు. దీనిపై హైకోర్టుకు వెళ్లేందుకు వీలు కల్పిస్తూ రిట్ పిటిషన్‌ను ఉపసంహరించుకోవడానికి అనుమతివ్వాలని న్యాయవాది కోరగా.. అందుకు ధర్మాసనం అంగీకరించింది.

సమాచార కమిషనర్ల పోస్టులకు నోటిఫికేషన్

ఈనాడు, అమరావతి: రాష్ట్ర ముఖ్య సమాచార కమిషనర్, సమాచార కమిషనర్ పోస్టుల భర్తీకి ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేసింది. న్యాయ, శాస్త్ర సాంకేతిక, సామాజిక సేవ, పాత్రికేయం, మాస్ మీడియా, ప్రభుత్వ పాలనా తదితర రంగాల్లో విశేష పరిజ్ఞానం, అనుభవం ఉన్నవారు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపింది. ఔత్సాహికులు తమ వివరాల్ని ఆగస్టు నాలుగో తేదీ సాయంత్రం 5:30 లోపు రిజిస్టర్ పోస్టు ద్వారా 'ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి, సాధారణ పరిపాలన శాఖ, రాష్ట్ర సచివాలయం, వెలగపూడి, అమరావతి' చిరునామాకు పంపాలని సూచించింది. లేదా వివరాలను ఈ-మెయిల్ ఐడీ gad.arsection@gmail.com ద్వారా కూడా పంపొచ్చుంది.

జగన్ దోచుకున్న రూ.3,500 కోట్లు వసూలు చేయాలి: యనమల

ఈనాడు, అమరావతి: మద్యం కుంభకోణంలో మాజీ సీఎం జగన్ దోచుకున్న రూ.3,500 కోట్లను రెవెన్యూ రికవరీ చట్టాన్ని అమలు చేసి వసూలు చేయాలని తెదేపా పొలిట్‌బ్యూరో సభ్యుడు యనమల రామకృష్ణుడు సోమవారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. 'ఆర్థిక నేరస్థులు అత్యంత ప్రమాదకరం. జగన్ దోపిడీతో రాష్ట్రం అప్పులపాలైంది. వైకాపా వాళ్లు మాత్రం రూ.కోట్లకు పడగలెత్తారు' అని దుయ్యబట్టారు.

అదనపు ఎస్పీకి డీఎస్పీగా డిమోషన్

ఈనాడు-అమరావతి: వైకాపా హయాంలో నిబంధనలకు విరుద్ధంగా అడ్డదారుల్లో డీఎస్పీ నుంచి అదనపు ఎస్పీగా యాక్సిలరేటెడ్ పదోన్నతి పొందిన సి.నరేంద్రనాథ్‌రెడ్డిని డిమోట్ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. గతంలో మాదిరిగా ఆయన్ను డీఎస్పీగానే కొనసాగించనుంది.

తితిదే విద్యాలయాలు, ఆసుపత్రుల్లో హిందూయేతరులను తొలగించకూడదు: సీపీఎం

ఈనాడు, అమరావతి: తితిదే యాజమాన్యంలో నిర్వహిస్తున్న విద్యాలయాలు, ఆసుపత్రులు తదితర సంస్థల్లో పనిచేస్తున్న హిందూయేతరులను తొలగించడం రాజ్యాంగ విరుద్ధమని, వారికి రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగ భద్రత కల్పించాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. 'ఈ ఏడాది జనవరి 24న రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన మెమోకు ఈ చర్య భిన్నంగా ఉంది. హిందూ దేవాలయాల నిర్వహణ, ఆ దేవాలయాల సౌజన్యంతో నడిచే విద్య, వైద్య వంటి సంస్థల నిర్వహణ వేర్వేరుగా చూడాలి. దేవాలయాల్లో అర్చకులు తదితర ఆధ్యాత్మిక స్థానాల్లో తప్ప మిగతా సంస్థల్లో ప్రభుత్వ సాధారణ నిబంధనలకు అనుగుణంగా ఉద్యోగుల్ని తీసుకోవాలి' అని కోరారు.

పీఆర్సీని ఏర్పాటు చేయాలి

ఏపీ ఐకాస

ఈనాడు, అమరావతి: ప్రభుత్వ ఉద్యోగులకు సంబంధించి పీఆర్సీని నియమించాలని, మధ్యంతర భృతి చెల్లించాలని ఏపీ ఐకాస ఛైర్మన్ విద్యాసాగర్, ప్రధాన కార్యదర్శి కేవీఎస్ ప్రసాద్ కోరారు. ఈ మేరకు సోమవారం రాష్ట్ర సచివాలయంలో సీఎస్ విజయానంద్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. 'పెండింగ్‌లో ఉన్న మూడు డీఏల్లో కనీసం రెండు డీఏలైనా మంజూరు చేయాలి. ఉద్యోగుల సరెండర్ లీవ్ బకాయిలు తదితరాలపై దృష్టి సారించాలి. 2019-24 మధ్య నిరసనలు, ఆందోళనలు చేసిన ఉద్యోగులపై ఉన్న పెండింగ్ కేసులన్నీ ఎత్తివేయాలి. జాయింట్ స్టాఫ్ కౌన్సిల్ సమావేశాన్ని నిర్వహించాలి. ప్రభుత్వరంగ గురుకుల ఉద్యోగులకు పదవీ విరమణ వయసును 60 నుంచి 62 ఏళ్లకు పెంచాలి. ఒప్పంద ఉద్యోగుల క్రమబద్ధీకరణ, పెన్షనర్లకు అదనపు క్వాంటమ్ పునరుద్ధరించాలి. 2003లో విడుదల చేసిన నోటిఫికేషన్ ద్వారా నియమితులైన ఉద్యోగులకు పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలి. పొరుగు సేవల ఉద్యోగులకు ప్రభుత్వ పథకాలను వర్తింపజేయాలి' అని కోరారు. ఉద్యోగ సంఘాల నాయకులు డీవీ రమణ, హృదయరాజు, చెన్నుపాటి మంజుల తదితరులు పాల్గొన్నారు.



ఏపీలో భూసేకరణ దశలోనే 4 ఈఎస్ఐ ఆసుపత్రుల నిర్మాణం

లోక్‌సభలో వెల్లడించిన కేంద్ర ప్రభుత్వం

ఈనాడు, దిల్లీ: ఆంధ్రప్రదేశ్‌కు మొత్తం 13 ఈఎస్ఐ ఆసుపత్రులు మంజూరు చేసినట్లు కేంద్ర కార్మికశాఖ సహాయమంత్రి శోభా కరంద్లాజే తెలిపారు. అందులో ఇప్పటికే ఐదు పనిచేస్తున్నాయని, 4 నిర్మాణ దశలో, మరో నాలుగు భూసేకరణ దశలో ఉన్నాయని చెప్పారు. సోమవారం లోక్‌సభలో ఒంగోలు తెదేపా సభ్యుడు మాగుంట శ్రీనివాసులురెడ్డి అడిగిన ప్రశ్నకు ఆమె ఈ మేరకు సమాధానమిచ్చారు. కాకినాడ, విశాఖపట్నం, రాజమహేంద్రవరం, తిరుపతి, విజయవాడ ఆసుపత్రులు ప్రస్తుతం వైద్యసేవలు అందిస్తున్నట్లు తెలిపారు. వీటిల్లో మొత్తం 131 పోస్టులు ఖాళీగా ఉండగా, వాటిలో 93 పోస్టులు కాంట్రాక్ట్ పద్ధతిలో భర్తీచేసినట్లు చెప్పారు. ఈ ఐదు ఆసుపత్రుల్లో గత ఐదేళ్లలో 10.29 లక్షల మంది ఓపీ, 43,205 మంది ఐపీ రోగులకు వైద్యసేవలు అందించినట్లు తెలిపారు. మరోవైపు విజయనగరం ఆసుపత్రి 50%, విశాఖపట్నం ఆసుపత్రి 56%, అచ్యుతాపురం ఆసుపత్రి 25% నిర్మాణ పనులు పూర్తయినట్లు వివరించారు. నెల్లూరు ఆసుపత్రి నిర్మాణ బాధ్యతలు కాంట్రాక్టర్‌కు అప్పగించినట్లు వెల్లడించారు. మిగిలిన గుంటూరు, కర్నూలు, శ్రీకాకుళం, శ్రీసిటీలకు మంజూరుచేసిన ఆసుపత్రులు భూసేకరణ దశలో ఉన్నట్లు తెలిపారు.

ప్రధానమంత్రి శ్రమయోగి మాన్‌ధన్ కింద ఏపీ నుంచి తక్కువ మంది నమోదు

దేశంలో 60 ఏళ్లు నిండిన అసంఘటిత రంగ కార్మికులకు వారు కట్టే చందా ఆధారంగా నెలకు రూ.3 వేల పింఛను అందించే ప్రధానమంత్రి శ్రమయోగి మాన్‌ధన్ పథకం కింద ఏపీ నుంచి తక్కువ మంది నమోదైనట్లు మంత్రి శోభా కరంద్లాజే తెలిపారు. మచిలీపట్నం జనసేన ఎంపీ వల్లభనేని బాలశౌరి అడిగిన ప్రశ్నకు ఆమె ఈ మేరకు సమాధానమిచ్చారు. గత నాలుగేళ్లలో దేశవ్యాప్తంగా ఈ పథకం కింద 5,94,074 మంది నమోదుకాగా ఆంధ్రప్రదేశ్‌లో ఆ సంఖ్య 20,275 (3.41%)కే పరిమితమైనట్లు తెలిపారు. ఇందులో 88%మంది కేవలం 2022-23లో నమోదయ్యారని, మిగిలిన సంవత్సరాల్లో రిజిస్ట్రేషన్లు చాలా తక్కువగా ఉన్నాయని చెప్పారు.

పదేళ్లలో 78.9% పెరిగిన తలసరి నికర ఉత్పత్తి

ఆంధ్రప్రదేశ్‌లో తలసరి నికర ఉత్పత్తి పదేళ్లలో 78.9% పెరిగినట్లు కేంద్ర ఆర్థిక శాఖ సహాయమంత్రి పంకజ్‌చౌదరి లోక్‌సభలో ఒక ప్రశ్నకు సమాధానంగా తెలిపారు. ఇది 2014-15లో రూ.79,174 మేర ఉండగా, 2024-25 నాటికి రూ.1,41,609కి చేరి 78.9% వృద్ధిని నమోదు చేసిందన్నారు. తెలంగాణలో ఇది రూ.1,01,424 నుంచి రూ.1,87,912 (85.3%)కి చేరినట్లు చెప్పారు.

● ఏపీలో ఈ ఏడాది మార్చి 31 నాటికి రూ.3,08,716 కోట్ల వ్యవసాయ రుణాలు బకాయి ఉన్నట్లు పంకజ్‌చౌదరి లోక్‌సభలో ఓ ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. 1.42 కోట్ల ఖాతాల ద్వారా రైతులు ఈ మేరకు వ్యవసాయ రుణాలు తీసుకున్నట్లు వివరించారు. ఇది దేశవ్యాప్తంగా ఉన్న వ్యవసాయ రుణాల్లో (రూ.28.50 లక్షల కోట్లు) 10.82% అని చెప్పారు.

పీఎంశ్రీ కింద ఏపీలో 935 స్కూళ్ల ఎంపిక

పీఎంశ్రీ పథకం కింద ఆంధ్రప్రదేశ్‌లోని 26 జిల్లాల నుంచి మొత్తం 935 పాఠశాలలను ఎంపికచేసినట్లు కేంద్ర విద్యాశాఖ సహాయమంత్రి (స్వతంత్ర హోదా) జయంత్ చౌదరి తెలిపారు. లోక్‌సభలో విజయవాడ తెదేపా ఎంపీ కేశినేని శివనాథ్ అడిగిన ప్రశ్నకు బదులిచ్చారు. ఇందులో అత్యధికంగా కర్నూలు జిల్లాలో 54, ప్రకాశంలో 50, వైఎస్సార్ కడపలో 45, అనంతపురం, నంద్యాల, తిరుపతి జిల్లాల్లో 44 చొప్పున ఉన్నట్లు తెలిపారు. విశాఖపట్నం జిల్లా నుంచి అతితక్కువగా 6 పాఠశాలలు మాత్రమే ఎంపికైనట్లు చెప్పారు. ఎన్టీఆర్ జిల్లాలో ఎంపికైన 29 పాఠశాలలకు రూ.34 కోట్లు కేటాయించగా ఇప్పటివరకు రూ.16.28 కోట్లు విడుదల చేశామని, అందులో రూ.16.20 కోట్లు ఖర్చయ్యాయని తెలిపారు. ఏపీలోని 15 జిల్లాల్లోని జవహర్ నవోదయ విద్యాలయాల్లో 149 బోధన, 102 బోధనేతర సిబ్బంది పోస్టులు ఖాళీగా ఉన్నట్లు తెదేపా ఎంపీలు నాగరాజు, లక్ష్మీనారాయణలు అడిగిన మరో ప్రశ్నకు కేంద్ర మంత్రి సమాధానంగా చెప్పారు.

కేంద్ర ప్రభుత్వ రక్షణలో 135 పురాతన స్మారక కేంద్రాలు

కేంద్ర ప్రభుత్వ రక్షణలో ఆంధ్రప్రదేశ్‌లో 135 పురాతన స్మారక కేంద్రాలు ఉన్నట్లు కేంద్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి గజేంద్రసింగ్ తెలిపారు. ఆయన లోక్‌సభలో తెదేపా సభ్యుడు జీఎం హరీష్ మాథుర్ అడిగిన ప్రశ్నకు బదులిచ్చారు. వీటికోసం గత నాలుగేళ్లలో రూ.36 కోట్లు కేటాయించగా, అందులో రూ.35 కోట్లు ఖర్చయినట్లు వెల్లడించారు.

ఏపీ నుంచి వారానికి 1,194 విమానాల రాకపోకలు

- కుప్పం ఎయిర్‌పోర్టు స్థలానుమతికోసం దరఖాస్తు
- 11 చోట్ల నుంచి సీప్లేన్ నిర్వహణకు ఎల్‌ఓఐల జారీ
- రాజ్యసభలో వెల్లడించిన కేంద్ర ప్రభుత్వం

ఈనాడు, దిల్లీ: ఆంధ్రప్రదేశ్ నుంచి ప్రస్తుతం వారానికి 1,194 విమానాలు రాకపోకలు సాగిస్తున్నట్లు కేంద్ర విమానయానశాఖ సహాయమంత్రి మురళీధర్ మొహోల్ తెలిపారు. సోమవారం ఆయన రాజ్యసభలో తెదేపా సభ్యుడు బీద మస్తాన్‌రావు అడిగిన ప్రశ్నకు ఈ మేరకు బదులిచ్చారు. రాష్ట్రంలో 2021లో ఓర్వకల్లు విమానాశ్రయం అందుబాటులోకి వచ్చిందని, ప్రస్తుతం భోగాపురం విమానాశ్రయ నిర్మాణం పురోగతిలో ఉందన్నారు. దగదర్తి విమానాశ్రయం నిర్మాణం కోసం 2018లో కుదుర్చుకున్న కన్సెషన్ అగ్రిమెంట్‌ను ఆ తర్వాత రాష్ట్ర ప్రభుత్వం రద్దుచేసిందని పేర్కొన్నారు. 2008 గ్రీన్‌ఫీల్డ్ ఎయిర్‌పోర్ట్స్ పాలసీ ప్రకారం ఈ ప్రాజెక్టును అమలుచేయాలంటే కొత్త ఎయిర్‌పోర్ట్ డెవలపర్‌ను ఎంచుకోవడంతోపాటు భూసేకరణ, చట్టబద్ధమైన అనుమతులు, ఆర్థిక వనరులను సమకూర్చుకోవాల్సి ఉంటుందన్నారు. కుప్పంలో గ్రీన్‌ఫీల్డ్ ఎయిర్‌పోర్టు అభివృద్ధికి అవసరమైన స్థలానుమతి కోసం రాష్ట్ర ప్రభుత్వం గత జూన్‌లో దరఖాస్తు పంపిందని చెప్పారు. ఉడాన్ 5.5 కింద అరకు, గండికోట, కాకినాడ, కోనసీమ, లంబసింగి, నర్సాపుర్, ప్రకాశం బ్యారేజీ, రుషికొండ, శ్రీశైలం, తిరుపతి, నాగార్జునసాగర్‌ల నుంచి సీప్లేన్‌ల నిర్వహణకు అవసరమైన బిడ్డింగ్‌లు దాఖలు చేసుకోవడానికి వీలుగా ఎయిర్‌లైన్ ఆపరేటర్లకు లెటర్ ఆఫ్ ఇంటెంట్ (ఎల్‌ఓఐ)లు జారీచేసినట్లు వైకాపా సభ్యుడు వైవీ సుబ్బారెడ్డి అడిగిన మరో ప్రశ్నకు సమాధానంగా తెలిపారు. సీప్లేన్‌ల నిర్వహణ కోసం డీజీసీఏ భద్రతా నిబంధనల్లో సవరణలు చేసిందని, దీని ప్రకారం శిక్షణ అవసరాలు, అనుమతుల ప్రక్రియ, స్థల ఎంపిక సరళంగా ఉంటుందన్నారు.

చిట్టీల పేరుతో రూ.5 కోట్లు వసూలు చేసిన మహిళపై చర్యలు తీసుకోండి

తెదేపా కేంద్ర కార్యాలయంలో బాధితుల వినతి

ఈనాడు, అమరావతి: చిట్టీల పేరుతో 200 మంది నుంచి సుమారు రూ.5 కోట్ల మేర వసూలు చేసి మోసం చేసిన కోటేశ్వరమ్మ అనే మహిళపై చర్యలు తీసుకోవాలని విజయవాడకు చెందిన పలువురు బాధితులు డిమాండ్ చేశారు. తమ డబ్బులు తిరిగి ఇప్పించాలని కోరుతూ మంగళగిరిలోని తెదేపా కేంద్ర కార్యాలయంలో సోమవారం ఫిర్యాదు చేశారు. వివిధ సమస్యలతో తరలివచ్చిన బాధితుల నుంచి ఆర్టీసీ ఛైర్మన్ కొనకళ్ల నారాయణ, ఏపీ ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్ డేగల ప్రభాకర్ వినతులు, ఫిర్యాదులు స్వీకరించారు. తనకు రావాల్సిన నగదు అడుగుతుంటే చంపుతామని బావమరుదులు బెదిరిస్తున్నారని గుంటూరు జిల్లా అడవి తక్కెళ్లపాడుకు చెందిన దీపక్ ఫిర్యాదు చేశారు. తన భూమిలో అక్రమంగా ఇసుక తవ్వకాలు చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని బాపట్లకు చెందిన పరమేశ్వరరావు వినతిపత్రం సమర్పించారు.